శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము

వివరణ

శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు

తెలుగు అనువాదం – కాజ సుధాకర బాబు

10వ భాగము

Sri Vishnu Sahasra Nama Stotram

Annotated commentary by : Sri Narasimhan Krishnamachari

Telugu Translation by : Kaja Sudhakara Babu

Volume-10

శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము వివరణ

శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు

తెలుగు అనువాదం – కాజ సుధాకర బాబు

Sri Vishnu Sahasra Nama Stotram

Annotated commentary by : Sri Narasimhan Krishnamachari

Telugu Translation by : Kaja Sudhakara Babu

This work is published under

Creative Commons Non-Commercial License

The above license applies only to my translation, which is done with permission from the original author, Sri N. Krishnamachari.

Excerpts from other works reproduced in this work are not covered in the above license. Main examples of such reproductions are

(a) Telugu Translation of Bhagavdgitha Slokas, which are taken from the publication of Gita Press, Gorakhpur

(b) Excerpts from book of Sri Pemmaraju Rajarao (Especially translation of Purva Peethika)

(c) Excerpts from the book of Dr. Krovi Partha Saradhi

(d) Excerpts from other works which are mentioned in appropriate places.

All Photographs and pictures are by me (Kaja Sudhakara Babu) or taken from free sources such as Wikipedia.

Cover Photo:

Sculpture at Dwaraka Thirumala, West Godavari District, Andhra Pradesh.

భారభృత్కథితో యోగీ యోగీశః సర్వకామదః |

ఆశ్రమః శ్రమణః క్షామః సుపర్ణో వాయువాహనః || (91)

851. భారభృత్

భారమును మోసేవాడు. జీవులకు ముక్తినొసగే భారమును మోసేవాడు. భక్తుల యోగక్షేమములు వహించేవాడు. అనంతాది రూపములలో జగత్తును మోసేవాడు.

ఓం భారభృతే నమః

'భార', 'భృత్' అనే రెండు పదములు ఒకే ధాతువునుండి వచ్చాయి. భృ - ధారణ పోషణయో - పట్టుకొనుట, నిలుపుట. **భారం బిభర్తి ఇతి భారభృత్**. భారమును మోసేవాడు భారభృత్తు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు జీవులకు సంబంధించిన అర్థంలో తమ వ్యాఖ్యను కొనసాగించారు. **స్వధృతః, స్వాస్యః, ప్రాగ్వంశః** అనే ఇంతకు ముందటి నామాలను కూడా శ్రీ భట్టులు జీవులపరంగా వ్యాఖ్యానించారు.
శ్రీ విశిష్టాద్వైత సంప్రదాయం ప్రకారం జీవులు మూడు విధాలు.

(1) బద్ధ జీవులు – సంసారబంధంలో చిక్కుకొన్నవారు.
(2) ముక్త జీవులు – బద్ధజీవులు మోక్షాన్ని పొంది ముక్తులవుతారు. వారు అప్పుడు శ్రీవైకుంఠంలో ఉండి భగవంతునికి నిత్యకైంకర్యం చేస్తారు.
(3) నిత్య జీవులు – వీరెప్పుడూ బద్ధులు కాలేదు. అనాదిగా పరమపదంలోనే ఉన్నారు.

బద్ధజీవులు ఆత్మజ్ఞానం ద్వారా భగవంతుని పొంది ముక్తులుగా అయ్యే భారాన్ని భగవంతుడే వహిస్తాడు గనుక భగవంతుడు 'భారభృత్' అని శ్రీ భట్టుల వ్యాఖ్య.

ముక్తానాం బంధ మోక్షాది భారస్య భరణాద్ధి సః

భారభృత్ సప్తవర్ణస్యాత్ కార్యనిర్వాహ శక్తిదః

ముక్తిమార్గంలో ప్రయాణించేవారిని సంసారబంధనాలనుండి వేరు చేస్తాడు. వారికి స్వస్వరూప జ్ఞానము కలుగజేస్తాడు. ఇటువంటి భారం వహిస్తాడు కాబట్టి 'భారభృత్' అనబడుతున్నాడు. ఈ నామము సప్తాక్షరీ మంత్రము. కార్యనిర్వాహక శక్తినిస్తుంది. ఓం భారభృతే నమః. (శ్రీ కైవల్య సారధి).

శ్రీ వి.వి. రామానుజన్ గీత (9.22)నుండి ఉదాహరించారు.

అనన్యాశ్చింతో మాం యే జనాః పర్యుపాసతే

తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్

పరమేశ్వరుడనైన నన్ను నిరంతరము అనన్య భక్తితో చింతన చేయుచు, నిష్కామభావముతో సేవించువారి యోగక్షేమములను నేనే వహించుదును.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **భారమ్ భక్తరక్షాయా బిభర్తి ఇతి భారభృత్.** భక్తుల రక్షణాభారమును వహించువాడు భారభృత్.

శ్రీ వి.వి. రామానుజన్ – ఒక్కసారి మనం 'నమః' అంటే చాలు. ఇంక భగవంతుడు మన పనిని పెద్దభారంగా పరిగణించి దానిని ఎలాగోలా సఫలం చేస్తాడు. ఇందుకు శ్రీ రామానుజన్ ఉదాహరించినది: శ్రీ నమ్మాళ్వారు. తిరువైమోళి 3.3.6 – తిరువేంకటత్తాన్ కు 'నమః' అని చెప్పడమే మన బాధ్యత. మిగిలి బాధ్యత అంతా ఆయన భుజాలపైనుంది.

ద్రౌపది వస్త్రాపహరణ సమయంలో తనను కాపాడమని ఆమె శ్రీకృష్ణుని వేడుకుంది. అప్పటికి ఆయన ఆమెను కాపాడాడు గాని ద్రౌపది ఆక్రందన జీవితాంతం శ్రీకృష్ణుని వెంటాడుతూనే ఉంది. తన భక్తురాలికి తగినంత సహాయం చేయలేకపోయానని, ఆమె ఋణం తీర్చుకోలేకపోయాని ఆయన భావిస్తూనే ఉన్నాడు. తనకు శరణాగతులైనవారిపట్ల భగవంతుడు ఇంతటి బాధ్యత నెత్తిన పెట్టుకుంటాడన్నమాట.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **అనంతాది రూపేణ భువో భారమ్ బిభర్తి ఇతి భారభృత్.** అనంతుడు, (ఆదిశేషుడు)వంటి రూపాలలో భువనముల భారాన్ని భరించేవాడు భారభృత్.

శ్రీ సత్యసంధ తీర్థ – **భారమ్ భారభూతమ్ బ్రహ్మాండమ్ కూర్మరూపేణ బిభర్తి ఇతి భారభృత్**. ఆదికూర్మం రూపంలో బ్రహ్మాండాన్ని మోసేవాడు భారభృత్.

శ్రీ చిన్మయానంద – ఇక్కడ 'భరించడం' అంటే ఒక మనిషి తన తలపై బరువును మోయడం అనుకోరాదు. సకల జగత్తుకు కారణము, దానిని నడిపేవాడు భగవంతుడు. ఈ విధంగా ఆయన భారభృత్.

852. కథితః

వేదములు, పురాణములు సకల శాస్త్రములు, నారదాదులు ఎవనిగురించి చెప్పారో మరియు కీర్తించారో ఆయన.

ఓం కథితాయ నమః

కథ్ - వాక్య ప్రబంధే - చెప్పుట, వినిపించుట. కథితుడు - చెప్పబడినవాడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **కథితః ఉక్తః వక్ష్యమాణ గుణవత్తయా సర్వశాస్త్రేషు**. ఇప్పటివరకూ చెప్పినవి, ఇంక చెప్పబోయేవి అయిన అన్ని గుణమలందును ఆయన పరిపూర్ణత్వము గురించి సకల శాస్త్రములందును చెప్పబడినది గాన ఆయన కథితుడు. ఇందుకు శ్రీ భట్టులు 'జితంతే స్తుతి' (1.7)నుండి ఉదాహరించారు. **వచసమ్ వాచ్యమ్ ఉత్తమన్.** సకల పదాలు (శ్రుతులు, స్మృతులు) ఆ ఉత్తముని గురించే కీర్తిస్తున్నాయి.

శ్రీ తిరుమళిశయాళ్వారు. తిరుచ్చంద. 11 – వేదముల పరమ గమ్యము నీవే. పరబ్రహ్మమని వేదములు చెప్పింది నీ గురించే. మాటలలో చెప్పరాని దివ్యప్రకాశము నీవే. నీవు సృష్టించిన బ్రహ్మయే వేదముల సాయంతో సృష్టికార్యాన్ని నిర్వహిస్తున్నాడు. ఆ బ్రహ్మ కూడా నిన్ను మాటలలో ఏమాత్రం వర్ణించలేడు.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమోళి 3.1.10 – నాస్తికులకు అగుపించనివి, నీ భక్తులకు తెరచియున్నవి అయిన నాలుగు వేదముల సారము నీవే.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **వేదాదిభిః అయమేక ఏవ పరత్వేన కథిత ఇతి కథితః; సర్వైర్వేదైః కథిత ఇతి వా కథితః.** ఆయనే పరబ్రహ్మమని వేదాదులు చెబుతున్నాయి. మరియు వేదములు ఆయననే కీర్తిస్తున్నాయి. కనుక ఆయన కథితుడు. ఇందుకు శ్రీ శంకరులు అనేక ప్రమాణములు ఉదాహరించారు.

కఠోపనిషత్తు 2.15 – **సర్వే వేదా యత్పదమ్ ఆమనన్తి**. సకల వేదములు ఆయన పదమును (పరమపదమని) చెబుతున్నాయి.
గీత 15.15 – **వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః వేదాన్తకృత్ వేదవిదేవచాహమ్**. వేదముల ద్వారా తెలిసికోదగినవాడను, వేదాంతకర్తను, వేదజ్ఞుడను కూడా నేనే.
భవిష్యత్ పురాణము 132.95 – **వేదే రామాయణే పుణ్యే భారతే భరతర్షభ అదౌ మధ్యే తథాచాऽంతే విష్ణుః సర్వత్ర గీయతే.** ఓ భరతవంశ శ్రేష్ఠుడా! వేదములు, పవిత్ర రామాయణము, భారతము, వీటన్నింటిలో అన్నింటా అంతటా శ్రీమహావిష్ణువే కీర్తింపబడ్డాడు.

కఠోపనిషత్తు 3.9 – **సోధ్వనః పరమాప్నోతి తద్ విష్ణోః పరమం పదమ్**. (సూక్ష్మమైన బుద్ధియే సారథిగా కలిగి, కళ్ళెమువలె మనస్సును అదుపులో ఉంచుకొన్న) అతను మార్గం చివరివరకూ చేరుకుంటాడు. అదే విష్ణువుయొక్క పరమపదము.

ఇతర వ్యాఖ్యాతలు 'కథితః' అనగా 'ఫలానివారిచే కీర్తింపబడినవాడు' అనే అర్థంలో వ్యాఖ్యానించారు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **నారద వాల్మీకి ప్రభృతిభిః సంకీర్తత యశో విస్తారత్వాత్ కథితః**. నారదుడు, వాల్మీకి వంటివారిచే కీర్తింపబడిన విస్తారమైన యశస్సు కలవాడు కథితుడు.

శ్రీ సత్యసంధ తీర్థ – **కథితః సద్-ఆగమైః ప్రతిపాదితః**. ఆగమములచే చెప్పబడినవాడు కథితుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ –

విష్ణుర్హి లోకే కథితః పురాణః తస్యాన్తమ్ ఆప్నోతి న వాగ్ వచోభిః

తస్మాత్ సనాదేన చ వర్తమానా వాగస్తి వక్తుమ్ ప్రతిజన్తు నిష్ఠా

భగవంతుని మాటలలో చెప్పలేము. వేదాదులు కూడా ఆయనను పూర్తిగా వర్ణించలేకపోతున్నాయి. ఆయనను స్తుతించడానికే మనకు మాట్లడే శక్తి ఉన్నది. ఆయనే కథితుడు (చెప్పదగినవాడు), దర్శతుడు (అంతా చూసేవాడు. అంతటా అయనను చూసేందుకే మనకు చూపు ఉన్నది), శ్రవణుడు, స్పర్శనుడు, రూపుడు, ఘ్రాణుడు....

853. యోగీ

- అసాధారణ, అతిమానుష శక్తులు, అష్టైశ్వర్యములు సమృద్ధిగా, పరిపూర్ణముగా గలవాడు.
- యోగసాధనద్వారా ఎరుగదగినవాడు.
- ఘటనాఘటన సమర్థుడు. పరస్పర వ్యతిరేకమైనవానిని కూడా జోడించే యోగీశ్వరుడు.
- తన చిత్తంపై సంపూర్ణమైన నియంత్రణ గలవాడు.
- భక్తుల కోరికలను తీర్చి వారిని ఏకం చేసేవాడు.

ఓం యోగినే నమః

3వ శ్లోకములో '**యోగః**' నామము, ఈ శ్లోకంలో '**యోగీ**' నామము వచ్చాయి.

3వ శ్లోకము. 18వ నామము. యోగః – **యోగో యోగవిదాంనేతా ప్రధానపురుషేశ్వరః**

91వ శ్లోకము. 853వ నామము. యోగీ – **భారభృత్ కథితో యోగీ యోగీశః సర్వకామదః**

ఈ నామముల పదములకు మూలధాతువు 'యుజ్' అనగా కలయిక, ఏకమగుట. అమరకోశములో 'యోగః' అన్న పదమునకు (3.3.22) **'యోగః సన్నాహః ఉపాయ ధ్యాన సంగతి ముక్తిషి'** అని అనేక అర్థాలు చెప్పారు. 18వ నామము వివరణలో చెప్పిన అర్థాల సారాంశము ఇక్కడ మళ్ళీ ఇవ్వబడింది.

యోగః - ఉపాయము (శ్రీ భట్టులు) – ముక్తి ప్రాప్తికి ఏకైక స్వతంత్ర సాధనము భగవంతుడు.
యోగః - ఉపాయము (శ్రీ సత్యసంధ తీర్థ) – భవతరణోపాయము భగవంతుడే.
యోగః - ఉపాయము (శ్రీ కృష్ణదత్త భర్వాజ) – కోర్కెలు తీరుటకు తిరుగులేని ఉపాయము భగవంతుడే.
యోగః - ఏకమగుట (శ్రీ శంకరులు) – యోగసాధనవలన పొందబడువాడు భగవంతుడు.
యోగః - ధ్యానము, సమైక్యత (శ్రీ బలదేవ విద్యాభూషణ) – యోగధ్యానమువలన భక్తులు భగవంతునిలో లీనమవుతారు.
యోగః - ధ్యానము (శ్రీ సత్యసంధ తీర్థ) – యోగులచే ధ్యానింపబడువాడు భగవంతుడు.
యోగః - ధ్యానము (శ్రీ చిన్మయానంద) – ధ్యానమువలన, సమత్వభావమువలన తెలియబడువాడు భగవంతుడు.

ఇక ప్రస్తుత నామమ 'యోగీ' గురించి –

శ్రీ భట్టుల వ్యాఖ్య –
యుజ్యతే అనేనేన ఇతి యోగః, అఘటితార్థ ఘటనమ్ మహాప్రభావః
స అస్య అతిశయేన నిత్యయోగేన, సర్వమ్ ఏతత్ సంభావయతి ఇతి యోగీ
'యోగము' అంటే కలుపుట. జరుగనివానిని జరిపించేవాడు యోగి. కూడనివానిని కూర్చడము, లేనివానిని పొందడము – ఇలాంటివానిని అతిశయంగా సంభవింపజేసే గుణము కలవాడు యోగి.

ఇంతకుముందు నామములు పరిశీలిస్తే భగవానుని ఘటనాఘటన సామర్థ్యం అవగతమవుతుంది. కూడనివానిని కూర్చగల సంపూర్ణశక్తిమంతుడు ఆయన. ఆయనలో అష్టైశ్వర్యములు సంపూర్ణంగా ఉన్నాయి. కనుకనే ఆయన **అణువు** (చిన్నవాడు), **బృహత్** (పెద్దవాడు), **కృశః** (సన్ననివాడు), **స్థూలుడు** (లావైనవాడు), **గుణభృత్, నిర్గుణుడు, మహాత్ముడు**. ఇలా కనుక భగవానుని 'యోగి' అని కీర్తిచవచ్చును.

యోగోహ్యఘటితార్థస్య ఘటనం తేన సర్వా
యస్యాస్తి నిత్యసంబంధః స యోగీ పరికీర్తితః
'యోగము' అంటే కూడనివానిని కూర్చడము, లేనివానిని పొందడము. అటువంటి గుణముతో ఎడతెగని (నిత్యమైన) సంబంధము కలవాడు యోగి. (శ్రీ కైవల్యసారధి).

శ్రీ శంకరుల వ్యాఖ్య – **యోగః జ్ఞానమ్, తేనైవ గమ్యత్వాత్ యోగీ**. యోగము అనగా జ్ఞానము. జ్ఞానము ద్వారా మాత్రమే పొందబడువాడు యోగి. ఈ వ్యాఖ్య అద్వైత సిద్ధాంతానికి అనుగుణంగా ఉన్నదని గ్రహింపవచ్చును. విశిష్టాద్వైతంలో మాత్రం భగంతుని భక్తియోగము లేదా ప్రపత్తి ద్వారా పొందవచ్చును. ఇందుకు జ్ఞానము, కర్మలు సాధనములు మాత్రమే.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – వివిధ విషయాలపై తగులుకొనే చిత్తాన్ని అంతర్ముఖం చేసే ప్రక్రియయే యోగము. అలా చిత్తవృత్తి నిరోధం ద్వారా భగవంతుని పొందవచ్చును.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **యుజ్యతే సంబంధ్యతే ఇతి యోగీ**. కలిపి ఉంచేవాడు యోగి. **యోగైర్యుక్తమ్ చ ఇదమ్ శరీరమ్ యోగీ. సకలమ్ చ విశ్వమ్ పరస్పరమ్ బద్ధమ్ యోగీ. ఏష చ యోగరూపో గుణో భగవతో విష్ణురేవ సర్వత్ర వ్యాప్తః**. విశ్వములో అన్నింటిని ఒకటిగా కలిపియుంచగలవాడు విష్ణువొక్కడే గనుక ఆయన యోగి.

శ్రీ శంకరులు చెప్పిన మరొక వ్యాఖ్య – **యోగః సమాధిః, స హి స్వాత్మని సర్వదా సమాధత్తే స్వాత్మానమ్ తేన వా యోగీ**. యోగమనగా సమాధి. తన ఆత్మను పూర్తిగా తన అధీనంలో ఉంచుకొన్నవాడు యోగి.

శ్రీ చిన్మయానంద – యోగమనగా చిత్తవృత్తి నిరోధము. భగవంతుడు తన మనసును పూర్తిగా తన అధీనంలో ఉంచుకొన్న యోగి.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **యోజయతి స్వజనాన్ తదభీష్టేన ఇతి యోగీ**. భక్తులు కోరినవాటిని ప్రసాదించి వారిని ఏకం చేసేవాడు యోగి.

854. యోగీశః

- యోగులందరికి ప్రభువు.
- యోగమును నెరవేర్చువాడు.
- అంతటినీ కలిపి ఉంచేవాడు.

ఓం యోగీశాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు '**స్వధృతః**' (847వ) నామమునుండి మూడు రకాల జీవులుపరంగా వ్యాఖ్యానించారు. ఈ నామము '**యోగీశః**' వ్యాఖ్య కూడా అలాగే కొనసాగించారు. భగవానుడు యోగులందరికీ ప్రభువు. బద్ధజీవులమధ్య నున్నవారిలోను. సనకాది మహాత్ములలోను కూడా యోగసాధనను సఫలం చేసి వారికి శ్రీవైకుంఠము ప్రాప్తించేలా చేస్తాడు. **యోగీశః సనకాదీనాం యోగినాం ధుర్య ఉచ్యతే**. ఇందుకు శ్రీ భట్టులు విష్ణుపురాణంనుండి ఉదాహరించారు. **సనందాదీన్ అప-కల్మషాన్ మునీన్ చకార భూయః అతి పవిత్రమ్**

పదమ్. కల్మషరహితులైన సనకసనందనాది మునులకు అతిపవిత్ర పరమపదమును (శ్రీ వైకుంఠమును) ప్రాప్తింపజేసినవాడు యోగీశుడు.

శ్రీ వి.వి. రామానుజన్ శ్రీ నమ్మాళ్వారు తిరువైమోళి పాశురము (8.3.10)ను ఉదాహరించారు. నిజమైన తపస్సు, భక్తి కారణంచేత జ్ఞానదృష్టిని సాధించిన సనక సనందనాది మునులు, భగవంతుని అపరిమిత దివ్యమంగళ గుణాలను తనివితీరా అనుభవించి ఆనందించిన ముక్తులు, సంసారభయం ఇసుమంతైనా లేని నిత్యులు – వీరందరూ ఆయనను ఆనందపరవశులై సేవిస్తారు. ఇక్కడ ముముక్షువులు, ముక్తులు, నిత్యులు అనే మూడు విధాల జీవులగురించి చెప్పబడింది.

శ్రీ శంకరుల వ్యాఖ్య – యోగులలో శ్రేష్ఠుడు యోగీశుడు. సామాన్యయోగులు కొందరు విఘ్నముల కారణంగా తమ యోగసాధననుండి ఎడబాటు చెందుతుంటారు (యోగభ్రష్టులవుతుంటారు). కాని ఆత్మతత్వమును పరిపూర్ణముగా నెరిగిన శ్రీహరి తన స్వరూపానందమునందే నిమగ్నుడైయుండును. కనుక ఆయన యోగీశుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – కర్మయోగులు, జ్ఞానయోగులు, భక్తియోగులు – అందరూ ఆయననే ధ్యానింతురు, పూజింతురు. కనుక భగవంతుడు యోగీశుడు. గీత (6.47)నుండి శ్రీ భరద్వాజ ఉదాహరించారు.

యోగినామపి సర్వేషామ్ మద్గతేనాంతరాత్మనా
శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః

యోగులందరిలోను శ్రద్ధాళువై, అంతరాత్మను నాయందే లగ్నమొనర్చి, అనగా భక్తి విశ్వాసములతో నిశ్చలమైన, దృఢమైన అనన్యభావముతో నాయందే స్థిరమైయున్న మనోబుద్ధిరూప అంతఃకరణమును గలిగి నిరంతరము నన్నే భజించువాడు నాకు పరమశ్రేష్ఠుడు. (యోగులలో ఉత్తమమైనవారు ఆయననే ధ్యానిస్తారు అని ఇక్కడ గ్రహించాలి).

శ్రీ చిన్మయానంద – యోగి అనగా సంసారమధ్యంలో ఉండి కూడా ఐహికములైన బంధాలకు అతీతంగా ఉండేవాడు. ఈ విధంగా చూస్తే భగవానుడే యోగీశ్వరుడౌతాడు.

శ్రీ సత్యసంధతీర్థ చెప్పిన అర్థం కొంత భిన్నంగా ఉంది. **యోగినామ్ సమ్ (సుఖమ్) యస్మాత్ ఇతి యోగీశః.** ఎవని వలన (ఎవరిని ధ్యానించడం వలన) యోగులు పరమసుఖం అనుభవిస్తారో అతడే యోగీశుడు.

శ్రీ వాసిష్ఠ 'యోగము' అంటే 'కలయిక' అన్న అర్థంలో వ్యాఖ్యానించారు. అంతటినీ కలిపి ఉంచేవాడు యోగీశుడు. ఉదాహరణకు అనేక భాగాలను కలిపి శరీరంగా పనిచేయించువాడు. గ్రహనక్షత్రాది బ్రహ్మాండములను కలిపి జగత్తును నిలిపియుంచేవాడు యోగీశుడు.

855. సర్వకామదః

అన్ని కోరికలను తీర్చేవాడు.

ఓం సర్వకామదాయ నమః

సర్వాన్ కామాన్ దదాతి ఇతి సర్వకామదః. కోరినవానినన్నింటినీ ప్రసాదించేవాడు సర్వకామదుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – అణిమాది సిద్ధులు మోక్షప్రాప్తికి అవరోధాలు అగుగాక. అయినా సరే అలాంటివానిని కూడా యోగులకు ప్రసాదించేవాడు సర్వకామదుడు. అనగా భక్తులు ముక్తిమార్గంనుండి చలించి, సామాన్యమైన సుఖాలు, సిద్ధులు కోరుకుంటే గనుక వానినికూడా భగవంతుడు ప్రసాదిస్తాడు.

అణిమాదీన్ సర్వకామాన్ యోగస్ఖలిత యోగినామ్

అన్తరాయతయా ముక్తేః దదత్ స్యాత్ సర్వకామదః

ఏ కారణంచేతనయినా యోగభ్రష్టులయినప్పటికీ వారికికూడా యోగఫలంగా అణిమవంటి సిద్ధులను ప్రసాదించేవాడు గనుక భగవానుడు సర్వకామదుడు. ఇందుకు శ్రీ భట్టులు గీత (6.41)నుండి ఉదాహరించారు.

ప్రాప్యపుణ్యకృతాం లోకానుషిత్వా శాశ్వతీః సమాః

శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే

యోగభ్రష్టుడు పుణ్యాత్ములు పొందు లోకములను, అనగా స్వర్గాది ఉత్తమ లోకములను పొంది, ఆయా లోకములలో పెక్కు సంవత్సరములు గడపి, పిదప పవిత్రులైన సంపన్నుల గృహమున జన్మించును.

శ్రీ శంకరుల వ్యాఖ్య – బ్రహ్మసూత్రము (3.2.38)లో '**ఫలమత ఉపపత్తేః**' అని ఉంది. ఏ విధమైన యోగమునకు కానీ, ప్రయత్నానికి కానీ తగు ఫలములు ఇచ్చేవాడు భగవంతుడు మాత్రమే. కనుక ఆయన సర్వకామదుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ భాగవతము (2.3.10)నుండి ఉదాహరించారు.

అకామః సర్వకామో వా మోక్షకామ ఉదారధీః

తీవ్రేణ భక్తియోగేన యజేతా పురుషమ్ పరమ్

ఏ విధమైన కోర్కెలు లేనివాడు, అనేక కోర్కెలున్నవాడు కూడ, మరియు తగు జ్ఞానము సాధించి మోక్షముపై ఇష్టమున్నవాడు కూడ, తీవ్రమైన భక్తితో పరమపురుషుని పూజింపవలెను. అనగా, ధర్మార్థకామమోక్షాలలో వేనిని ఆశించినాగాని మనం సర్వకామదుడైన ఆ దేవదేవునే పూజింపవలెను. సామాన్య ఫలాలకోసం అన్యదేవతలను పూజించడం గురించి శుకమహర్షి పరీక్షిత్తునకు వివరించిన పిదప చివరలో ఇలా చెప్పాడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి ఛాందోగ్యోపనిషత్తు (4.5.3)నుండి ఉదాహరించారు.

ఏష ఉ ఏవ వామనీరేష సర్వాణి వామాని నయతి

సర్వాణి వామాని నయతి య ఏవం వేద

తననాశ్రయించినారికి సకల శుభాలను ప్రసాదించే ఆయనే వామని. ఇక్కడ 'వామని' అనే పదము వామనీత్వము (**స్వ ఆశ్రితేషు శోభన ప్రాపకత్వమ్** - ఆశ్రితులకు శుభములనిచ్చే గుణము)ను సూచించునని శ్రీ ఎన్.ఎస్. అనంతరంగాచార్య వివరించారు. 'సర్వాణీ వామాని నయతి' అని రెండుమార్లు వచ్చింది. ఒక విషయాన్ని మరింత దృఢంగా చెప్పడానికి వేదపరిభాషలో ఇలా రెండుమార్లు చెబుతారు.

32వ శ్లోకం 299వ నామము '**కామప్రదః**' కూడా '**సర్వకామదః**'లాంటి భావాన్నే కలిగి ఉంది – **కామహా కామకృత్ కాన్తః కామః కామప్రదః ప్రభుః.**

856. ఆశ్రమః

విశ్రాంతినొసగువాడు. ఆశ్రయమిచ్చువాడు.

ఓం ఆశ్రమాయ నమః

శ్రము - తపసి ఖేదేచ - కష్టపడుట, అలసిపోవుట; ఆశ్రమ - విశ్రాంతి పొందుట, విరామము పొందుట.

శ్రీ భట్టుల వ్యాఖ్య – ఇంతకుముందు '**సర్వకామదః**' వివరణలో శ్రీ భట్టులు యోగభ్రష్టులైనవారిని కూడా భగవానుడెలా అనుగ్రహిస్తాడో చెప్పారు. ఈ నామం '**ఆశ్రమః**' వివరణకూడా అదే భావంలో సాగింది. **తతో వివృత్య సుభిక్ష పరవిద్యేషు వైష్ణవ గృహేషు తేషామ్ విశ్రాంతి హేతుః ఆశ్రమః.**

తేషాంతు యోగభ్రష్టానాం హేతుర్వైష్ణవ సద్మసు
సుభిక్ష పరవిద్యేషు విశ్రాంతేరాశ్రమ స్మృతః

యోగభ్రష్టులైనవారు ఆ విధంగా సుఖాలు అనుభవించి, అనంతరం ఆధ్యాత్మికవిద్యావేత్తలైన వైష్ణవుల గృహాలలో మళ్ళీ జన్మిస్తారు. అంటే ఇక్కడ ఉత్తమజన్మవలన వారికి భోగలాలసతనుండి విరామం లభించి, తిరిగి యోగసాధనను కొనసాగించే అవకాశం లభిస్తుంది. ఇదే వారికి ఆశ్రయము. భగవంతుని పావన దివ్య చరణాలను ధ్యానించుటే ఆశ్రమము.

శ్రీ నమ్మాళ్వారు తిరువైమోళి పాశురం (10.1.2)లో ఇదే భావం చెప్పబడింది.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **ఆశ్రమత్వాత్ సర్వేషామ్ సంసార అరణ్యే భ్రమతామ్ విశ్రమ స్థానత్వాత్ ఆశ్రమః.** సంసారమనే అరణ్యంలో దారితప్పి తిరుగుతూ దుఃఖానికి లోబడిన జీవులకు విశ్రాంతినొసగువాడు గనుక భగవానుడు 'ఆశ్రమః'.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ కూడా ఇదే అర్థం చెప్పారు. **భవాటవ్యామ్ భ్రమతామ్ సర్వేషామ్ భక్తానామ్ విశ్రమ దాయిత్వాత్ ఆశ్రమః.**

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – సంసారమనే అడవిలో పీడితులైనవారికి వివిధదశలలో వానప్రస్థము, సన్యాసము, నిద్ర, సమాధి, చివరకు మోక్షము వంటి విశ్రామములను ప్రసాదించువాడు 'ఆశ్రమః'.

శ్రీ సత్యసంధ తీర్థ – **న విద్యతే శ్రమో ఏషామ్ తే అ-శ్రమా ముక్తాః, తేషామ్ అయమ్ స్వామి ఇతి ఆశ్రమః.** శ్రమ లేనివారికి ప్రభువు 'ఆశ్రమః'. అనగా భగవంతుని దాసులకు శ్రమయుండదు.

శ్రీ రఘునాథ తీర్థ – తత్వసారము (బృహత్ సహస్ర ఆధారంగా) **అ-సంయక్, శ్రమ్యతే-తప్యతే, గూహ్యతే ఇతి ఆ-శ్రమః.** తనను తాను చక్కగా మరుగుపరచుకొనియుండువాడు (అనగా తెలియరానివాడు) 'ఆశ్రమః'.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **ఆశ్రమ్యన్తే కర్మానురూపమ్ యోనిమ్ ప్రాపయ ఏన ఇతి ఆశ్రమః.** ఎవని కారణంగా జీవులు తమ కర్మానుసారము జన్మాది కష్టములు అనుభవిస్తారో, ఎవని కారణంగా తాపసులు అనేక శ్రమలకోర్చి ధ్యానాదులు కొనసాగిస్తారో అతడు 'ఆశ్రమః'. మిగిలిన వ్యాఖ్యాతలు 'ఆ' అనే ప్రత్యయాన్ని 'శ్రమ'కు వ్యతిరేకమైన భావాన్ని ఇచ్చేలా వ్యాఖ్యానించారు. కాని శ్రీ వాసిష్ఠ మాత్రం 'ఆ' అనే ప్రత్యయాన్ని 'శ్రమ'కు మరింత బలాన్ని చేకూర్చే అనే అర్థంలో వ్యాఖ్యానించారు.

857. శ్రమణః

- అంతరాయం వలన ఆగిపోయిన యోగాన్ని మరుజన్మలో కొనసాగించేలా చేసేవాడు.
- వివేకహీనులకు (సంసార) తాపము కలిగించేవాడు.
- నరనారాయణావతారంలో లోకహితంకోసం తపస్సును ఆచరించినవాడు.
- సన్యాసులకు ఆధారమైనవాడు.
- స్తుతుల మూలంగా తెలియవచ్చేవాడు.

ఓం శ్రమణాయ నమః

శ్రమ్యతే ఇతి శ్రమణః. శ్రమించేవాడు లేదా శ్రమింపజేసేవాడు శ్రమణుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – యోగసాధకులకు భగవంతుడు చేసే సహాయం పరంగా 853వ నామం **'యోగీ'**నుండి శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. **యోగీ, యోగీశః. సర్వకామదః, ఆశ్రమః.** ప్రస్తుత నామము **'శ్రమణః'** వ్యాఖ్యను కూడా శ్రీ భట్టులు అదే రీతిలో కొనసాగించారు. **అనాయాసేన శ్రమ్యతే ఇతి శ్రమణః.** ఒక జన్మలో ఆగిపోయిన యోగసాధనను మరొక జన్మలో కొనసాగించడానికి అవకాశం కలిగించేవాడు శ్రమణుడు.

అక్షీణ పూర్వ సంస్కారైః జన్మానుభవేన చ

శ్రమ్యతేఽభ్యస్యతేఽత్రేతి శ్రమణః పరికీర్తితః

ఈ రకంగా (యోగమునకు అంతరాయం కలిగి) మరొక జన్మనెత్తిన భక్తులకు పూర్వజన్మ సంస్కారం ఉంటుంది. గతజన్మలో వదిలివేసిన యోగమును ఈ జన్మలో అభ్యసిస్తారు (శ్రీకైవల్య సారధి). ఇలా సాధ్యమయ్యేలా చేసేవాడు గనుక భగవంతుని శ్రమణుడని కీర్తిస్తారు.

ఇందుకు శ్రీ భట్టులు గీత (6.43)నుండి ఉదాహరించారు.

తత్ర సంబుద్ధి సంయోగం లభతే పౌర్వదేహికమ్

య తతే చ తతో భూయః సంసిద్ధౌ కురునందన

అచట (యోగి కుటుంబమున పుట్టిన పిదప) పూర్వదేహమున సాధించిన బుద్ధిసంయోగమును అనగా సమబుద్ధిరూప యోగసంస్కారములను అతడు సులభముగనే పొందును. ఓ కురునందన! ఆ బుద్ధి సంయోగ ప్రభావమున అతడు మరల పరమాత్మ ప్రాప్తి సిద్ధించుటకై మనుపటికంటెను అధిక సాధన చేయును.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **అవివేకినః సర్వాన్ సంతాపయతి ఇతి శ్రమణః.** వివేకము లేనివారిని (సంసార) తాపము అనుభవించేలా చేయువాడు శ్రమణుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి వివరణ – ముక్తికొరకు సరైన మార్గము కనిపిస్తున్నాగాని చాలామంది ఆ మార్గాన్ని అనుసరించకుండా విషయలోలులు అవుతారు. అలాంటివారికి జన్మ, కర్మ, కర్మఫలమువంటి సంసారతాపాలు తప్పవు. ఇలా వారిని (అవివేకులను) తపింపజేసేవాడు శ్రమణుడు.

శ్రీ చిన్మయానంద వివరణ – ఆశ, మోహము, విషయలోలత వంటి వానికి లోబడే జనులకు చివరికి భంగపాటు, అశాంతి, దుఃఖము కలుగుతాయి. ఇలాంటి న్యాయాన్ని అమలుపరచే శ్రీమన్నారాయణుడు శ్రమణుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ 'శ్రమ' అనే గుణాన్ని భగవానునికే వర్తించేలా వ్యాఖ్యానించారు. **శ్రామయతి తపస్ చరతి నరనారాయణ రూపేణ లోకసంగ్రహాయ ఇతి శ్రమణః.** లోకరక్షణార్థమై నరనారాయణావతారంలో తీవ్రమన తపస్సును (శ్రమను) ఆచరించినవాడు శ్రమణుడు.

శ్రీ సత్యసంధ తీర్థ – **శ్రమణాః సన్యాసినః అస్య దాసత్వేన సన్తి ఇతి శ్రమణః.** శ్రమణులనగా సన్యాసులు. వారు భగవంతుని దాసులై ఉందురు. అలా కాకుంటే సన్యాసులకు ఉనికి లేదు. కనుక భగవంతుడు శ్రమణుడు.

శ్రీ రఘునాధతీర్థ (తత్వసారము) –

శ్రమన్తి జానన్తి అనేన ఇతి శ్రమణమ్ స్తుతిః

స్తుతిమాన్ స్తుతి విషయః శ్రమణః.

స్తుతులు అయన గురించే చెబుతున్నవి. ఆయన స్తుతులద్వారా తెలియవచ్చుచున్నాడు. కనుక ఆయన అనగా భగవంతుడు శ్రమణుడు.

58. క్షామః

- క్షయమైన రూపం గలవాడు. భూమ్యాదులు అంతమయ్యే సమయంలో ఒంటరిగా, దూరంగా ప్రకాశిస్తున్న ధ్రువనక్షత్రము.
- మళ్ళీ యోగాభిముఖులైన యోగభ్రష్టులను క్షమించి, వారికి సాఫల్యతను కలుగజేసేవాడు.
- ప్రళయకాలంలో క్షయించి (ఒంటరిగా మిగిలి) ఉన్నవాడు.
- ప్రళయకాలంలో జగత్తును క్షీణం చేసి మూలస్థితికి తీసికొని వెళ్ళేవాడు.
- భగవంతుడు విశ్వంలోను, విశ్వం భగవంతునిలోను అంతర్లీనంగా దాగియుండెను.
- అంత్య (ప్రళయ) కాలంలో సకలమునకు నివాసస్థానము (క్షాయతి - నివసించును).
- విశ్వమును అన్ని హంగులతోను సృజించినవాడు (క్షా+మానే = భూమి+శబ్దము).
- రాక్షస స్వభావము కలవారిని అదుపులో పెట్టువాడు (క్షా+మువతే).
- శ్రీవరాహావతారములో భూమిని (క్షమను) ధరించినవాడు.
- గోవుల దారిలో అవరోధములను తొలగించువాడు (క్షమ్+ఆమ).
- ఎంతో ఓపికతో సహించువాడు (క్షమ - సహనము).

ఓం క్షామాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

47వ శ్లోకము. 444వ నామము. క్షామః – **నక్షత్రనేమిః నక్షత్రీ క్షమః క్షామః సమీహనః**

91వ శ్లోకము. 858వ నామము. క్షామః – **ఆశ్రమః శ్రమణః క్షామః సుపర్ణో వాయువాహనః**

ఈ నామమును అనేక మూలశబ్దాలపరంగా వ్యాఖ్యాతలు వివరించారు.

క్షి –క్షయే – క్షీణించుట, తగ్గుట.

క్షి – హింసాయామ్ – బాధించుట, నాశనం చేయుట.

క్షి – నివాస గతయోః – నివసించుట, వెళ్ళుట.

క్షమ్ – సహనే – అనుమతించుట, ఓర్పు వహించుట.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు 'క్షి - క్షియే - క్షీణించుట' అనే అర్థంలో 444వ నామాన్ని, 'క్షమ్ - సహనే - ఓర్పు' అనే అర్థంలో 858వ నామాన్ని వ్యాఖ్యానించి, పునరుక్తి లేకుండా చూపారు.

444వ నామము 'క్షామః'ను ధ్రువనక్షత్రపరంగా వ్యాఖ్యానించారు.

అవాంతర లయే కైశ్చిత్ క్షీణ స్తారాగణై స్మృతః

క్షామో ధ్రువ సమీవస్థః చతుర్నక్షత్ర సంయుతః

అవాంతర ప్రళయంలో శింశుమార చక్రమునకు సంబంధించిన నాలుగు నక్షత్రములు మాత్రమే మిగిలియుండును. భూమి, పంచభూతములు మొదలైనవన్నీ లయించును. మిగిలిన నక్షత్రాలన్నీ కొరవడగా ఆ నాలుగు నక్షత్రాలతో కలిసి ధ్రువమండలమునకు సమీపంలో ఉంటాడు కనుక భగవంతుడు 'క్షామః'.

యావన్మాత్రే ప్రదేశే తు మైత్రేయావస్థితో ధ్రువః

క్షయమాయాతి తావత్ తు భూమేరాభూత సంప్లవే – విష్ణుపురాణము 2.8.92

ప్రస్తుత 858వ నామము 'క్షామః'ను శ్రీ భట్టులు 'సహనము' అన్న అర్థంలో వివరించారు. (క్షమ్ - సహనే - ఒప్పుకొనుట, ఓర్పు). 855వ నామంనుండి 861వ నామంవరకు యోగసాధనపరంగా, ప్రత్యేకించి అంతరాయం కలిగిన యోగులకు తగు సహకారం భగవంతునినుండి లభిస్తుందని, శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు.

స్వ యోగాభిముఖ్య మాత్రేణ తే యోగభ్రష్టా అపి

దుర్గమ్ తరితుమ్ క్షమస్తే అస్మాత్ ఇతి క్షామః

గతంలో యోగభ్రష్టులయినప్పటికీ ఇప్పుడు మళ్ళీ యోగాభిముఖులు అయినారు కాబట్టి అలాంటివారిని క్షమించి, వారు సంసార సాగరాన్ని తరింపగలిగే శక్తినిస్తాడు గనుక భగవానుడు 'క్షామః' (శ్రీకైవల్యసారధి). ఇందుకు శ్రీ భట్టులు గీత (6.40)నుండి ఉదాహరించారు.

పార్థ నైవేహ నాముత్ర వినాశస్తస్య విద్యతే

న హి కళ్యాణకృత్ కశ్చిద్దుర్గతిం తాత గచ్ఛతి

ఓ పార్థా! అట్టి (యోగభ్రష్టుడైన) పురుషుడు ఈ లోకమున గాని, పరలోకమునగాని అధోగతి పాలుగాడు. ఏలనన, నాయనా! ఆత్మోద్ధరణమునకు, అనగా భగవత్ప్రాప్తికై కర్తవ్యకర్మలను ఆచరించువాడెవ్వడును దుర్గతి పాలుగాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – 47వ శ్లోకములోని 'క్షామః' నామమును శ్రీ శంకరులు 'క్షయ' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. **సర్వ వికారేషు క్షపితేషు స్వాత్మనా అవస్థిత ఇతి క్షామః.** ప్రళయకాలంలో అంతా అంతరించిపోగా (క్షయింపగా) తాను మాత్రం మిగిలి ఉండేవాడు 'క్షామః'.

ప్రస్తుత 'క్షామః' నామమునుకూడా శ్రీ శంకరులు ప్రళయంపరంగానే వ్యాఖ్యానించారు కాని ఇందులో భగవానుని మరొక గుణం తెలియవస్తున్నది. **క్షామాః క్షీణాః సర్వాః ప్రజాః కరోతి ఇతి క్షామః.** సకల జీవులను వాని మూలస్థితికి క్షీణింపజేసేవాడు 'క్షామః'.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **క్షామాన్-క్షీణాన్ కరోతి దుర్జనాన్ ఇతి క్షామః.** దుర్జనులను నాశనం చేసేవాడు 'క్షామః'.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – క్షయ - దాగియుండుట. **య ఏతస్మిన్ విశ్వే అంతర్లీనః తిష్ఠతి సర్వమ్ వ్యాప్య, యస్మిన్ వా ఇదమ్ విశ్వమ్ ప్రలీయతే.** ఎవనియందు అంతర్లీనంగా ఈ విశ్వము దాగియుంటుందో, ఎవడు ఈ విశ్వంలో నెలకొనికూడా కనుపించడో అతడు 'క్షామః'. మన మధ్యలో ఉన్నాగాని కనుపించడు.

శ్రీ వాసిష్ఠ చెప్పిన మరొక అర్థము – క్షి - నివాస గతయోః - నివసించుట, ఉండుట. **క్షాయతి-నివాసయతి, గమయతి ఇతి క్షామః.** అంతిమ సమయంలో (ప్రళయకాలంలో) భగవానుడే అన్నింటికీ నివాసస్థానము గనుక ఆయన 'క్షామః'.

శ్రీ వాసిష్ఠ మరొక అనుభవము – క్షా - పృథీ - భూమి లేదా విశ్వము. మాంగ్ - మానే శబ్దే - కొలుచుట, ధ్వనించుట. **క్షా ఇతి విశ్వ ఉపలక్షణమ్, ఏవమ్ చ విశ్వమ్ ఇదమ్ య ఇయత్తయా నిబధ్నాతి, గతి దానేన శబ్దవచ్చ కరోతి ఇతి క్షామః.** భగవంతుడు జగత్తును ఇలా ఇలా సృష్టించాడు. దానికి ఇలా వర్తించే స్వభావాన్ని, శబ్దాది లక్షణాలను ఏర్పరచాడు. కనుక ఆయన 'క్షామః'.

శ్రీ సత్యసంధ తీర్థ – క్షా - నరకాః - రాక్షసులు. మా - మవతే - బంధనే హింసాయాంచ - కట్టివేయుట, బాధించుట. **క్షా-నరకాః, తాన్ మతతే-బధ్నాతి ఇతి క్షామః.** రాక్షసులను అదుపులో ఉంచేవాడు 'క్షామః'.

శ్రీ సత్యసంధ తీర్థ మరొక వివరణ – క్షమ - భూమి. **క్షమాయా అయం ధారకో వరాహాది రూపేణ ఇతి క్షామః.** శ్రీవరాహమూర్తిగా భూమిని ధరించినవాడు 'క్షామః'.

శ్రీ రఘునాథ తీర్థ –
47వ శ్లోకంలోని 'క్షామః' – (క్షమ్-ఆమ) **క్షమ్ గవామ్ సంరోధ విశేషమ్ ఆమినోతి కృన్తతి ఇతి క్షామః.** క్షమ అనగా ఆవులు. ఆవుల మార్గంలో అవరోధాలను తొలగించేవాడు 'క్షామః'.
ఈ 91వ శ్లోకంలో 'క్షామః' – **క్షమతే సహతే ఇతి క్షామః.** ఓర్పుతో సహించువాడు 'క్షామః'.

859. సుపర్ణః

- చక్కనైన రెక్కలు గలవాడు. హంస, గరుత్మంతుడు.
- యోగులు సంసారము దాటడానికి సహకరించేవాడు.
- ఏదైనా కదలడానికి శక్తినిచ్చేవాడు.
- వేద స్వరూపుడు (సంసారమనే అశ్వత్థ వృక్షానికి వేదములే ఆకులు – గీత).
- పచ్చని తులసి ఆకులచే అలంకృతుడైనవాడు.
- శ్రీలక్ష్మీదేవి సాన్నిహిత్యం కారణంగా పచ్చని రంగు గలవాడు.
- శుద్ధమైన భక్తిచే సంతోషించువాడు.
- పరమానంద నిలయుడు (సు-పర్-ణః).

- ప్రళయకాలంలో చక్కని మట్టియాకుపై శయనించినవాడు.
- విశ్వమంతా పూర్తిగా వ్యాపించియున్నవాడు.
- సుపర్ణుడైన గరుడుని వాహనంగా కల్గినవాడు.

ఓం సుపర్ణాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

21వ శ్లోకము. 194వ నామము. సుపర్ణః – **మరీచిః దమనో హంసః సుపర్ణో భుజగోత్తమః**

91వ శ్లోకము. 859వ నామము. సుపర్ణః – **ఆశ్రమః శ్రమణః క్షామః సుపర్ణో వాయువాహనః**

అమృతాన్ని తెస్తున్న శ్రీ గరుత్మంతుడు.
1825 కాలపు చిత్రం. వికిపీడియానుండి.

శ్రీ భట్టులు ఈ (194వ) నామమును రెండు విధాలుగా వ్యాఖ్యానించారు (1) చక్కని రెక్కలు గలవాడు (హంసావతారము కావచ్చును) (2) సంసార సాగరమును దాటుటకు యోగులకు సాయం చేసేవాడు. **శోభన పర్ణత్వాత్, సంసార నయనాత్ వా సుపర్ణః.** శ్రీ భట్టులు ప్రత్యేకంగా హంసావతారమును పేర్కొనలేదు. గరుత్మంతుని కూడా పేర్కొనలేదు. అయితే శ్రీ భట్టుల వ్యాఖ్యానాన్ని వివరించిన ఇతరులు 'సుపర్ణః' అనగా శోభనమైన పర్ణములు గలవాడు, అనగా చక్కని రెక్కలు గలవాడు, అనగా హంస లేదా గరుత్మంతుడు అని చెప్పారు.

శ్రీమద్భాగవతము (1.16.15) – **సిద్ధేశ్వరాణామ్ కపిలః సుపర్ణోऽహమ్ పతత్రిణామ్** – సిద్ధులలో నేను కపిల మహర్షిని. పక్షులలో నేను గరుత్మంతుడను.

భగవద్గీత (10.29) – **మృగాణామ్ మృగేంద్రోऽహమ్ వైనతేయశ్చ పక్షిణామ్** – మృగములలో రాజైన సింహమును నేను. పక్షులలో వినతాసుతుడగు గరుత్మంతుడను.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – సుపర్ణునిగా మూర్తీభవించిన భగవానుని రెండు రెక్కలు ఇవి (1) వేదములు ఒక రెక్క. ఇది సన్మార్గమును చూపించును (2) వేదానుష్ఠానము చేసే ఆచార్యుల సదాచారము రెండవ రెక్క.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఈ నామమును ముండకోపనిషత్తు (3.1) శ్లోకం పరంగా వ్యాఖ్యానించారు –

ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానమ్ వృక్షమ్ పరిష్వజాతే
తయోరన్యః పిప్పలమ్ స్వాదన్తి, అనశ్నమ్ అన్యో అభిచాకశీతి

ఒకే చెట్టుపై ఎంతో స్నేహం కలిగిన రెండు చక్కనైన పక్షులు (సుపర్ణములు) ఉన్నవి. అందు ఒక పక్షి (రావి)పండును భుజించుచున్నది. రెండవ పక్షి కేవలము చూచుచున్నది. ఇక్కడ శరీరమే వృక్షము. దానిపైన

మొదటి పక్షి 'జీవుడు' (భోగి). రెండవ పక్షి 'ఈశ్వరుడు' (యోగి). సంసారమునందలి కర్మఫలమే పండు. జీవాత్మ కర్మఫలమునను భవించును. పరమాత్మ (సుపర్ణుడు) సంగరహితుడు, సాక్షిమాత్రుడు.

ప్రస్తుత (859వ) నామమునకు శ్రీ భట్టులు చెప్పిన అర్థము – **ఏవమ్ ప్రత్యాపన్న సమాధీన్ సమాధి - విపాక - ద్వారా తమసః పారమ్ నయతి ఇతి సుపర్ణః.** యోగమార్గంనుండి విచలితులైన యోగులను కూడా మరల యోగమార్గంవైపు మళ్ళించి, వారు మరల సమాధి సాఫల్యము పొందేలా చేసి, వారిని అజ్ఞానాంధకారము (సంసారసాగరము)ను దాటేలా చేసేవాడు సుపర్ణుడు. ఇందుకు శ్రీ భట్టులు మౌలసంహితనుండి, గీతనుండి ఉదాహరించారు.

మౌల సంహిత – **స్వ-పారమ్ భగవాన్ నయతి.** భగవంతుడు వారిని ఒడ్డుకు చేరుస్తాడు.

ప్రయత్నాద్యతమానస్తు యోగీ సంశుద్ధ కిల్బిషః
అనేకజన్మ సంసిద్ధః తతో యాతి పరాంగతిమ్ – గీత 6.45
కాని, ప్రయత్నపూర్వకముగ యోగసాధన చేయు యోగి అనేక జన్మల సంస్కారప్రభావమున ఈ జన్మయందే సిద్ధినిపొంది, సంపూర్ణముగా పాపరహితుడై, తత్క్షణమే పరమపదమును పొందును.

శ్రీ వాసిష్ఠ ఇచ్చిన మరొక అనుభవము – సృష్టిలో సూర్యచంద్రాదులతో సహా సమస్తమూ కదలడానికి తగు శక్తినిచ్చేవాడు సుపర్ణుడు. ఆయనయొక్క చక్కని రెక్కలవల్లనే అవి కదులుతున్నాయి.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు 'పర్ణ' అంటే 'ఆకు' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. సంసారమనే వృక్షానికి వేదములు (ఛందములు) ఆకులు. భగవంతుడు వేదస్వరూపుడు గనుక సుపర్ణుడు.

ఊర్ధ్వమూలమధశ్శాఖమ్ అశ్వత్థమ్ ప్రాహురవ్యయమ్
ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్ – గీత 5.1
ఆదిపురుషుడైన పరమేశ్వరుడే మూలముగా, బ్రహ్మయే ముఖ్యశాఖ (కాండము)గా, వేదములే పర్ణములు (ఆకులు)గా గల ఈ సంసారరూప అశ్వత్థవృక్షము నాశరహితమైనది (శాశ్వతమైనది). ఈ సంసారవృక్షతత్వమును మూలసహితముగా తెలిసినవాడు నిజముగా వేదార్థములను ఎఱిగినవాడు.

శ్రీ రాధాకృష్ణ శాస్త్రి – జీవులు తమ కర్మశేషమును అనుభవించుటకై సంసారక్లేశమును అనుభవించక తప్పదు. అలాంటప్పుడు భగవంతుడు జీవులకు ఈ అఖండమైన రావిచెట్టుయొక్క చల్లని నీడ కల్పిస్తాడు గనుక ఆయన సుపర్ణుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **శోభనాని పర్ణాని తులసీదళాని యన్మూర్తౌ స సుపర్ణః.** చక్కని పచ్చని తులసీదళాలతో అలంకృతమైన మూర్తి గలవాడు సుపర్ణుడు.

శ్రీ విద్యాభూషణ – విలువైన ఆభరణాలకంటే కూడా భగవంతునికి పచ్చని తులసి ఆకులపైనే ప్రీతి. **శోభనాని పర్ణాని తులసీపత్రాణ్యేవ న తు కనక రత్నాని యస్మిన్ స సుపర్ణః**. కనుక ఆయన సుపర్ణుడు.

శ్రీ భరద్వాజ మరొక వివరణ – **శోభనః పర్ణో హరిత భావో యస్య శ్రీలక్ష్మీదేవీ సాన్నిధ్యాత్ ఇతి సుపర్ణః**. తన వక్షస్థలంపైన వేంచేసియున్న శ్రీలక్ష్మీదేవి సాన్నిధ్యం కారణంగా ఆయనకు పచ్చరంగు అబ్బింది గనుక భగవంతుడు సుపర్ణుడు.

శ్రీ భరద్వాజ మరొక వివరణ – **శోభనమ్ పర్ణమ్ ప్రీణనమ్ యస్య ఇతి సుపర్ణః**. భక్తితో సమర్పించిన ఆకువల్లనైనా ప్రీతిచెందేవాడు సుపర్ణుడు.

పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి
తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః – గీత 9.26
నిర్మల బుద్ధితో, నిష్కామ భావముతో పరమభక్తునిచే సమర్పింపబడిన పత్రమునుగాని, పుష్పమునుగాని, ఫలమునుగాని, జలమునుగాని నేను ప్రత్యక్షముగా (స్వయముగా) ప్రీతితో ఆరగింతును.

దళమైనను బుష్పమైనను
ఫలమైనను సలిలమైన బాయని భక్తిన్
గొలిచిన జనులర్పించిన
నెలమిన్ రుచిరాన్నముగనె యేను భుజింతున్ – పోతన. భాగవతము 10.10

శ్రీ టి.ఎస్. రాఘవేంద్రన్. శ్రీ విష్ణుసహస్రనామ సంగ్రహార్థః – **సు-శోభన, పర-ఉత్తమ, ణః-ఆనందః, తాని సన్తి ఇతి సుపర్ణః**. పరమానందమునకు నిలయమైనవాడు సుపర్ణుడు. శ్రీ రఘునాధతీర్థ తత్వసాగరంలో కూడా ఇంచుమించు ఇదే అర్థం చెప్పారు.

శ్రీ సత్యసంధ తీర్థ – **శోభనమ్ పర్ణమ్ వటపత్రమ్ శయ్యాత్వేన యస్య స సుపర్ణః**. ప్రళయకాలంలో చక్కని మఱ్ఱియాకుపై శయనించినవాడు సుపర్ణుడు.

శ్రీ రఘునాధ తీర్థ – **సు-సమ్యక్ భూమిన్ పూరయతి-వ్యాప్నోతి ఇతి సుపర్ణః**. భూమి అంతటా చక్కగా వ్యాపించియున్నవాడు సుపర్ణుడు.

860. వాయువాహనః

- జగత్తులో జీవనము నిలుపుటకై వాయువును సంచరింపజేసేవాడు.
- పతనమైనవారిని గరుత్మంతునిద్వారా వాయువేగంతో ఉద్ధరింపజేసేవాడు.
- వాయుసుతుడైన హనుమంతుని వాహనంగా కలవాడు.
- సప్తమారుతములను అన్ని మండలాంతరములందు చలింపజేయువాడు.

ఓం వాయువాహనాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

36వ శ్లోకము. 333వ నామము. వాయువాహనః – **స్కందః స్కందధరో ధుర్యో వరదో వాయువాహనః**

91వ శ్లోకము. 860వ నామము. వాయువాహనః – **ఆశ్రమః శ్రమణః క్షామః సుపర్ణో వాయువాహనః**

వాహ్ - గతి గంధనయోః - వెళ్ళుట, వీచుట; వాహ్ - ప్రాపనే - తీసుకెళ్ళుట, ప్రవహించుట. **వాయుః వాహ్యతే - ప్రవర్త్యతే అనేన ఇతి వాయువాహనః.** ఎవరిద్వారా గాలి ప్రవహిస్తుందో అతడు వాయువాహనుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య –

36వ శ్లోకంలో '**వాయువాహనః**' – సమస్త ప్రాణుల జీవనమునకు ఆధారము వాయువు. ఆ వాయువును ప్రవహింపజేయువాడు వాయువాహనుడు.

యో వాయౌ తిష్ఠాన్ వాయోరంతరో యమ్ వాయుర్న వేద యస్య వాయుః శరీరమ్ యో వాయురంతరో యమయతి ఏష త ఆత్మాఅంతర్యామి అమృతః – బృహదారణ్యకోపనిషత్తు 3.7.11

ఆయన వాయువు లోపల ఉంటాడు. కాని వాయువు ఆయనను ఎరుగదు. ఆయన శరీరము వాయువు. ఆయన లోనుండి వాయువును నియంత్రిస్తాడు. ఆయనే నాశరహితుడైన అంతరాత్మ.

శ్రీ తిరుమంగయాళ్వారు – జీవుని నిలిపే పంచభూతముల వెనుకనున్న శక్తివి నీవే.

91వ శ్లోకంలో '**వాయువాహనః**' – ఈ నామం వివరణలో శ్రీ భట్టులు 'వాయువు' అనగా 'గరుత్మంతుడు' అన్న అర్థం తీసుకొన్నారు. **తాన్ శ్చ ప్రబల హేతుభిః పతితానపి, వాయునా - అనుపమ గత్వరేణ పతగపతినా, వాహయతి ఉత్తారయతి ఇతి వాయువాహనః.**

వాయునా గత్వరేణైవ కర్మణా పతితాన్ సతః
గరుత్మతా వాహయతి యస్సాద్వాయువాహనః

తన భక్తులు ఒకవేళ పాపకర్మలు చేసి పతితులైనట్లయితే, వాయుగతితో సంచరించే గరుత్మంతుని పంపి వారిని ఉద్ధరించేవాడు వాయువాహనుడు (శ్రీకైవల్యసారధి).

ఇందుకు శ్రీ భట్టులు విష్ణుతత్వమునుండి ఉపరిచర వసువు వృత్తాంతమును ఉదాహరించారు. ఆ రాజు ఒక ముని శాపంవలన అధోగతి పాలయ్యాడు. అప్పుడు భగవంతుడు గరుత్మంతుని పంపి అతనిని ఉత్తమ లోకాలకు లేవనెత్తించాడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – గజేంద్రుని ఉద్ధరించే తొందరలో భగవంతునికి గరుత్మంతుని వేగం కూడా చాలలేదేమో. వాయువే వాహనంగా పరుగులిడి గజేంద్రుని కాపాడాడు ఆ వాయువాహనుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య –

36వ శ్లోకంలో '**వాయువాహనః**' – **వహతః సప్త అవహాదీన్ వాహయతి ఇతి వాయువాహనః.** సప్తమారుతములను చలింపజేయువాడు వాయువాహనుడు. కశ్యప, దితిల సంతానమైన సప్తమరుత్తులను వివిధ మండలములందు వ్యాపించిన వాయువులకు అధిపతిగా భగవంతుడు నియమించెను. ఈ వాయువుల ప్రభావము (ఒత్తిడి) వలన గ్రహ నక్షత్రాదులు తమ నిర్ణీత మార్గములందు సంచరించును. ఏడు విధములైన వాయువులు

(1) ఆవహ వయువు – మేఘమండలమునకు, భూమండలమునకు మధ్య ప్రసరించునది.
(2) ప్రవహ వాయువు – సూర్యమండలమునకు, మేఘమండలమునకు మధ్య ప్రసరించునది.
(3) అనువహ వాయువు – చంద్రమండలమునకు, సూర్యమండలమునకు మధ్య ప్రసరించునది.
(4) సంవహ వాయువు – నక్షత్ర మండలమునకు, చంద్రమండలమునకు మధ్య ప్రసరించునది.
(5) వివహ వాయువు – గ్రహమండలమునకు, నక్షత్రమండలమునకు మధ్య ప్రసరించునది.
(6) పరావహ వాయువు – సప్తర్షి మండలమునకు, గ్రహమండలమునకు మధ్య ప్రసరించునది.
(7) పరివహ వాయువు – ధ్రువ మండలమునకు, సప్తర్షి మండలమునకు మధ్య ప్రసరించునది.

శ్రీ చిన్మయానంద – వాయువులకున్న అసాధారణమైన శక్తి, జీవమును నిలిపే లక్షణము భగవంతునివలన లభించినవి.

91వ శ్లోకంలోని '**వాయువాహనః**' – వాయువును చలింపజేసి జీవమును నిలిపేవాడు గనుక భగవంతుడు వాయువాహనుడు. **భీషాస్మాద్ వాతః పవతే** (తైత్తరీయోపనిషత్తు 2.8) – పరమేశ్వరుడున్నాడన్న భయంతోనే వాయువు సరిగా వీచుచున్నది. దిక్పాలకులు వారి విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నారు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – వాయువువలె వేగంగా భగవంతుడు తన భక్తులను ఉద్ధరిస్తాడు గనుక ఆయన వాయువాహనుడు.

శ్రీ వాసిష్ఠ – భగవంతుడు ముందుగా వాయువును సృష్టించి, తరువాత జీవులను సృష్టించాడు. ఇలా ఆ జీవులు పీల్చడానికి గాలి సిద్ధంగా ఉంది. భగవానుని శక్తిని మనం ఊహించలేము. శ్రీ వాసిష్ఠ వేదములనుండి అనేక ఉదాహరణలిచ్చారు.

ఈశావాస్యోపనిషత్తు 4 – **తద్ ధావతోऽన్యాన్ అత్యేతి తిష్ఠత్ తస్మిన్ అపో మాతరిశ్వా దధాతి.** అది కదలదు. కాని వెంటాడేవాళ్ళకు అందదు. దాని శక్తివల్ల సకల జీవులు నిలుస్తున్నాయి.

అధర్వణ వేదము 10.7.2 – **కస్మాదంగాత్ దీప్యుతే అగ్నిరస్య కస్మాదంగాత్ పవతే మాతరిశ్వా.** ఆయన (శక్తి)వలన అగ్ని దీప్తిస్తింది. వాయువు చలిస్తుంది.
అధర్వణ వేదము 10.7.12 – **యత్రాగ్నిశ్చంద్రమాః సూర్యో వాతస్తిష్ఠన్త్యార్పితః. స్కంభమ్ తమ్ బ్రూహి కతమః స్విదేవ సః.** ఎవని ఆధారంగా భూమి, ఆకాశం తమ స్థానాలలో ఉన్నాయో, ఎవనిపై అగ్ని, చంద్రుడు, సూర్యుడు, గాలి ఆధారపడి ఉన్నాయో.
అధర్వణ వేదము 13.3.2 – **యస్మాద్ వాతా ఋతుధా పవన్తే యస్మాద్ సముద్రా అధి విక్షరన్తి.** ఎవనివలన గాలి ఋతువులకు అనుగుణంగా వీస్తుందో, ఎవనివలన సముద్రాలు అదుపులో ఉంటాయో..

శ్రీ అనంతకృష్ణశాస్త్రి – వాయువనగా వాయుపుత్రుడైన హనుమంతుడు. శ్రీరామావతారంలో భగవంతుడు హనుమంతుని భుజాలపై ఆసీనుడై రావణునితో యుద్ధం చేశాడు గనుక వాయువాహనుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **వాతి - గంధయతే సూచయతి శ్రీ మద్భగవద్ ఆగమమ్ ఇతి వాయుః, తద్వాహనమ్ గరుత్మదాఖ్యమ్ యస్య ఇతి వాయువాహనః, గరుత్మతః సంచాలనే సామగీతిరుద్భవతి, సా చ శ్రీమన్నారాయణస్య ఆగమనమ్ సూచయతి.** భగవంతుని వాహనము గరుత్మంతుడు. గరుడుడు చలించేటపుడు సామగానం ధ్వనిస్తుంది. ఇది భగవంతుని ఆగమనాన్ని సూచిస్తుంది. కనుక భగవంతుడు వాయువాహనుడు.

శ్రీ సత్యసంధ తీర్థ – (వాయువాహ-నః) **వాయుమ్ శ్వాసవాయుమ్ వహన్తి ఇతి వాయువాహ్ జీవః, తాన్ నయతి ఇతి వాయువాహ-నః.** ప్రాణవాయువును శ్వాసించు జీవులు 'వాయువాహ్'. వానిని నడిపించువాడు 'వాయువాహ-నుడు'.

శ్రీ సత్యసంధతీర్థ మరొక వివరణ – వాయువాహ్+వృతు - వర్తన - ఉండుట, జరుగుట, జీవించుట. అహ-వ్యాప్తౌ - వ్యాపించుట. వాయువును ఉండేలాగు, వ్యాపించేలాగు చేసేవాడు వాయువాహనుడు (వాయువః + అహనః). **వాయువశ్చ అసౌ అహనశ్చ ఇతి వాయువాహనః.**

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.
(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

ధనుర్ధరో ధనుర్వేదో దండో దమయితా దమః |

అపరాజితస్సర్వసహో నియంతా నియమో యమః || (92)

పాఠాంతరము

ధనుర్ధరో ధనుర్వేదో దండో దమయితా దమః |

అపరాజితస్సర్వసహో నియంతాऽనియమోऽయమః || (92)

861. ధనుర్ధరః

ధనుస్సును ధరించినవాడు.

ఓం ధనుర్ధరాయ నమః

ధన్ - శబ్దము చేయుట; ధన్ - ధాన్యే - ఫలమునొసగుట; ఈ నామమును శ్రీ శంకరులు, శ్రీ భట్టులు కూడ 'ధనుస్సును ధరించినవాడు' అని వ్యాఖ్యానించారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – యోగసాధన పరంగా శ్రీ భట్టుల వ్యాఖ్య కొనసాగింది. భగవత్ప్రాప్తి కొరకు యోగసాధన సాగించే భక్తులకు అవరోధములు తొలగించేందుకు శార్ఙ్గము అనే గొప్ప ధనుస్సును చేబట్టినవాడు ధనుర్ధరుడు.

ఉపాసకానాం భక్తేభ్యః ప్రత్యూహ వినివృత్తయే

ధనుషో ధారకో నిత్యం స్వయం స స్యాద్ధనుర్ధరః

భక్తులయొక్క ప్రతిబంధకాలను పారద్రోలడానికి ఎప్పుడూ ధనుస్సును ధరించియుండేవాడు ధనుర్ధరుడు. **ఏతదహమ్ హి లోకేఽస్మిన్ క్షత్రియైర్ధార్యతే ధనుః.** తన వనవాస కాలంలో ఋషులు తమ తపస్సులకు ఎదుర్కొంటున్న విఘ్నాలను తొలగించడంకోసం శ్రీరాముడు ధనుస్సును చేతబట్టాడు. **ధార్యతే క్షత్రియైః చాప న ఆర్త శబ్దో భవేదతి.** ఎక్కడా ఆర్తశబ్దం వినబడకుండా ఉండడానికి ధనుస్సును చేబట్టడం క్షత్రియధర్మము.

శ్రీ నమ్మాళ్వారు తిరువైమోళి (9.2.6)లో భగవంతుని ఆయుధాలను వ్యక్తులుగా వర్ణించారు. శత్రువులను చూడగానే ఆ ఆయుధాలు కోపం పూనుతాయట. తిరువైమోళి (8.8.1) – భగవంతుని ధనుస్సు శార్ఙ్గము మర్యాదతో వంగియున్నది.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **శ్రీమాన్ రామనామా మహద్ధనుర్ధారయామాస ఇతి ధనుర్ధరః.** (శిష్టరక్షణ కొరకు) శ్రీరామావతారంలో గొప్ప ధనుస్సును చేబట్టినవాడు ధనుర్ధరుడు.

ఇతరులు కూడా ధనుస్సును ధరించారుగాని వారెవరూ శ్రీరామునికి సాటిరారు. **రామః శస్త్రభృతామహమ్** – అని గీత (10.31)లో భగవంతుడు చెప్పాడు. శ్రీరాముడు ఒక గడ్డిపోచను కూడా బాణంగా చేసెనని కాకాసుర వృత్తాంతము ద్వారా తెలుస్తున్నది.

శ్రీ చిన్మయానంద ముండకోపనిషత్తు (2.2.3)శ్లోకాన్ని ఉదాహరించారు. ఇక్కడ 'ప్రణవము' అనే అర్థంలో 'ధనుస్సు' శబ్దాన్ని వాడారు –

ధనుర్గృహీత్వౌపనిషదమ్ మహాస్త్రమ్ శరమ్ హ్యుపాసానిశితమ్ సంధయీత్
ఆయమ్య తద్భావ గతేన చేతసా లక్ష్యమ్ తదేవాక్షరమ్ సోమ్యవిద్ధి

ఉపనిషత్తులలో చెప్పిన (ప్రణవము అనే) ధనుస్సును చేతబట్టి, అందు ధ్యానముచే పదునెక్కిన (ఆత్మ అనే) బాణమును సంధించి, బ్రహ్మముపై గురిపెట్టి బాణమును విడువవలెను. దాని లక్ష్యము అక్షరపరబ్రహ్మమే. (తరువాతి మంత్రములో **'ప్రణవో ధనుః, శరోహ్యాత్మా, బ్రహ్మ తల్లక్ష్యముచ్యతే'** అని స్పష్టంగా చెప్పారు).

శ్రీ బలదేవ విద్యాభూషణ గౌడీయ వైష్ణవ సంప్రదాయ పండితులు. వీరు 'ధనుర్ధరః' నామమును శ్రీకృష్ణపరంగా వ్యాఖ్యానించారు. **లక్షణా స్వయంవరే మత్స్యవేధాయ ధనుషో ధరణాత్ ధనుర్ధరః.** లక్షణాదేవి స్వయంవరంలో మత్స్యమును ఛేదించడానికి ధనుస్సును ధరించినవాడు ధనుర్ధరుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఋగ్వేద మంత్రాన్ని ఉదాహరించారు.

అహమ్ రుద్రాయ ధనురాతనోమి బ్రహ్మద్విషే హన్తవావు
అహమ్ జనాయ సమదమ్ కృణోమ్యహమ్ ద్వాయవా పృథ్వీ ఆవివేశ

నేను రుద్రుని కొరకు విల్లును వంచుతాను. అందువల్ల బాణము భగవద్వేషులను కొట్టి చంపుతుంది. నేను ప్రజలకొరకు యుద్ధాన్ని సిద్ధం చేస్తాను. నేను భూమి, ఆకాశం అంతా విస్తరించాను.

862. ధనుర్వేదః

- ధనుర్విద్యను తెలియజెప్పువాడు.
- ధనుర్విద్య సంపూర్ణముగా తెలిసినవాడు (శ్రీరాముడు).
- తన సృష్టిలోని జీవులన్నింటికీ ఆత్మరక్షణోపాయములు సమకూర్చినవాడు.
- ఆత్మసాక్షాత్కారము కోసము ప్రణవధ్యానమును ప్రసాదించినవాడు.

ఓం ధనుర్వేదాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య –

సురేంద్రాద్యాః ధనుశ్శాస్త్రం యస్మాద్విందంతి స శ్రుతః

ధనుర్వేదో హ్యష్టవర్ణో ధనుర్వేదప్రదాయకః

మహావీరులైన దేవేంద్రాదులు కూడా తన దగ్గర నేర్చుకొనవలసినంత ధనుర్విద్యా విశారదుడు గనుక ఆయన 'ధనుర్వేదః'. ఈ నామము అష్టాక్షరీమంత్రము. ధనుర్వేదాన్నిస్తుంది. ఓం ధనుర్వేదాయ నమః. (శ్రీకైవల్యసారధి).

శ్రీ శంకరుల వ్యాఖ్య – **స ఏవ దాశరధిః ధనుర్వేదమ్ వేత్తి ఇతి ధనుర్వేదః**. దశరధతనయుడైన ఆ రాముడే ధనుర్విద్యను సంపూర్ణముగా ఎఱిగినవాడు గనుక 'ధనుర్వేదః'. ఇంతకుముందు 'ధనుర్ధరః' నామవివరణలో 'మహత్' అనే పదానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఇవ్వాలి (మహత్ ధనుర్ధారః). అలాగే ఈ 'ధనుర్వేదః' నామ వివరణలో 'ఏవ' అనే పదాన్ని ప్రముఖంగా గమనించాలి. ధనుర్విద్య తెలిసినవారు చాలామంది ఉన్నాగాని రామునివంటివారు వేరెవరూ లేరు. రాముడు తన ఇష్టం వచ్చినట్లు బాణాన్ని ప్రయోగించగలడు. ఉపసంహరించగలడు. తన బాణాలతో ప్రకృతిని శాసించగలడు. అందుకే సముద్రంపై తన బాణాన్ని ఎక్కుపెట్టాడు.

శ్రీ వాసిష్ఠ రెండు అర్థాలు చెప్పారు.

(1) **ధనుర్విందతి లభత ఇతి.** ధనుస్సు కలిగినవాడు.

(2) **ధనుర్వేదయతి స్వరక్షణార్థమ్ సర్వేభ్య ఇతి ధనుర్వేదః.** ఇక్కడ ధనుస్సు అంటే 'ఆత్మరక్షణా సాధనము' అని శ్రీ వాసిష్ఠ గ్రహించారు. భగవంతుడు జీవులకు ఆత్మరక్షణాసాధనాలను ప్రసాదించాడు. ఉదాహరణకు ఆవులకు కొమ్ములు (**గవాధికానామ్ ధనురస్తి శృంగమ్**), పులులకు, సింహాలకు గోళ్ళు (**సింహాది హింస్రస్య నఖాది రూపమ్**),మనుషులకు బుద్ధి (**ధనుశ్చ మర్త్యస్య సు-బుద్ధిః**).

శ్రీ సత్యదేవో వాసిష్ఠ యజుర్వేదంనుండి ఉదాహరించారు.

అవతత్య ధనుష్వగ్ం సహస్రాక్ష శతేషుధే

నిశీర్య శల్యానామ్ శివో నః సుమనాభవః

శ్రీ చిన్మయానంద ఇంతకు ముందు నామము 'ధనుర్ధరః' వివరణలోలాగానే 'ధనుస్' అంటే 'ప్రణవం' అనే అర్థాన్ని గ్రహించారు. ఆత్మసాక్షాత్కారం కోసం ఓంకారాన్ని ధ్యానం చేసే విధానాన్ని ప్రసాదించినవాడు 'ధనుర్వేదః'.

శ్రీ రఘునాథ తీర్థ –

ధనూషి విదన్తి ఇతి ధనుర్వేదః అస్త్రజ్ఞః భృత్యః

తే అస్య భక్తానామ్ దాసాః సన్తి ఇతి ధనుర్వేదః

భగవంతుని భక్తులకు అస్త్రవిద్యా విశారదులు సేవకులగుదురు.

863. దండః

- దుష్టులను శిక్షింపజేసేవాడు.
- యమదండము వెనుకనున్న నిజమైన శక్తి.
- **అదండః** – ఎవరిచేతను నియమింప (శిక్షింప)బడనివాడు.
- జీవులను ధర్మం అనుసరింపజేసే నియమకర్త.

ఓం దండాయ నమః

దమ్ - ఉపశమే - అదుపులో ఉంచుట. **దుష్టాన్ దండయతి ఇతి దండః.** దుష్టులను శిక్షించేది దండము. దండము అంటే 'కర్ర' అని కూడా అర్థం ఉంది.

శ్రీ భట్టుల వ్యాఖ్య –

వేదధర్మారిష్ఠతాతి నృపాది ముఖతః ఖలాన్

దండనీత్యా దామ్యతీతి దండస్యాద్ధతువర్ణకః

వైదికధర్మాన్ని రక్షించడానికి దక్షులైన రాజులద్వారా దుష్టులను శిక్షించేవాడు 'దండః'. ఈ నామము షడక్షరీమంత్రము. దుష్టులను శిక్షిస్తుంది. ఓం దండాయ నమః. (శ్రీ కైవల్యసారధి).

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు గీత (10.38)నుండి ఉదాహరించారు. **దండో దమయతామస్మి నీతిరస్మి జిగీషతామ్.** (దుష్టులను) శిక్షించువారిలో దండము అనగా దమనశక్తిని నేనే. జయేచ్ఛ కలవారి నీతిని నేనే.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమోళి 6.10.4 – దుష్టులైన అసురులు జనులను బాధిస్తారు. అలాంటివారిపై కరుణ లేకుండా భగవంతుడు అగ్నిలాంటి బాణాలను వర్షిస్తాడు. ఖరదూషణాదులపై రాముడు ఇలానే బాణవర్షం కురిపించాడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – తిరుగులేని యమదండము వెనుక నిజమైన శక్తి భగవానుడే.

శ్రీ సత్యసంధ తీర్థ – దైత్యాన్ దండయతి ఇతి దండః. రాక్షసులను శిక్షించేవాడు 'దండః'.

శ్రీ సత్యసంధ తీర్థ **'అదండః'** అనే పాఠ్యాంతరాన్ని కూడా పరిగణించారు. **అన్య కర్తృక శిక్షణ రహితః అదండః.** ఎవరిచేతను శిక్షింపబడనివాడు 'అదండః'.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – దండ - దమన - నియమన - అదుపు. అందరినీ అదుపులో ఉంచి ఆయన నియమాల ప్రకారం వర్తించేలా చేసేవాడు 'దండః'.

864. దమయితా

- (తన భక్తుల శత్రువులను) దండించువాడు. దుష్టులను శిక్షించే స్వభావం కలవాడు.
- (తన భక్తుల కష్టాలను) తొలగించేవాడు.
- యమధర్మరాజు మున్నగువారి రూపంలో దుర్మార్గులను దండించేవాడు.

ఓం దమయిత్రే నమః

దమ - ఉపశమే - అదుపులో పెట్టుట. తృన్ - తాచ్ఛీల్య - అలాంటి గుణము కలిగియుండుట (పాణిని సూత్రము 3.2.125 ప్రకారము). **దమయతి - ఉపశమయతి తచ్ఛీలో దమయితా.** శిక్షించే స్వభావం కలవాడు దమయిత. ఇంతకు ముందునామము 'దండః' కూడా ఇదే మూలశబ్దంనుండి వివరింపబడింది. అయితే 'దండః' నామము శిక్షించే ఒక సాధనంగాను, 'దమయితా' నామము శిక్షించేవానిగాను భగవానుని సూచిస్తున్నాయి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **స్వయంచ రావణాదీన్ తాచ్ఛీల్యేన దమయితా.** రావణునివంటివారిని శిక్షించే స్వభావం కలవాడు దమయిత. (నిరుక్తి) **తాచ్ఛీల్యాత్ రావణాదీనామ్ హర్తా - దమయితా స్వయమ్**. ఇలాంటి స్వభావం ఉన్నందునే భగవంతుడు రాముడు, కృష్ణుడువంటి అవతారాలలో సంభవించి, భూమిలో దుష్టులను నాశనం చేసి, ధర్మాన్ని సంస్థాపిస్తుంటాడు.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమోళి 7.5.2 – భగవంతుడు మన మధ్య జన్మనెత్తి, (రామావతారంలో సీతాసమేతంగా లాగా) అనేక కష్టాలు అనుభవించి, దుష్టులను వెదకిపట్టుకొని, వారిని నాశనం చేస్తుంటాడు. ఎందుకోసం? భగవంతుని పాదాలను ఇసుమంతయినా తలచుకొనని ఈ మానవులకోసం.
ఈ విధమయిన భగవంతుని లక్షణమే 'దమయితా' నామంలో తెలుపబడింది.

శ్రీ శంకరుల వ్యాఖ్య – యమధర్మరాజు, మున్నగువారి రూపంలో భగవంతుడు దుర్మార్గులను వారి అకృత్యముల కారణంగా దండించును గనుక ఆయన దమయిత. ఇందుకు శ్రీ శంకరులు గీత (10.29)నుండి ఉదాహరించారు. **పితౄణామార్యమాచాస్మి యమం సంయమతామహమ్**. పితరులలో ఆర్యముడను (పితృగణ ప్రభువును). శాసకులలో యమధర్మరాజును నేను.

శ్రీ సత్యసంధ తీర్థ కూడా ఇదే అర్థం చెప్పారు. **దైత్యాన్ దమయతి ఇతి దమయితా**. దుష్టులైన రాక్షసులను శిక్షించేవాడు దమయిత.

శ్రీ వాసిష్ఠ – **జగతి జగదీశ కృతాయ జగద్వ్యవస్థాయా భంజకమ్ ఉపశమ్య స్వవశే స్థాపయతి**. ధర్మమును అతిక్రమించేవారిని శిక్షించేవాడు దమయిత.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **దమయతి ఉపశమయతి దైన్యమ్ స్వజనానామ్ ఇతి దమయితా.** తన భక్తుల కష్టాలను హరించేవాడు దమయిత.

21వ శ్లోకం 192వ నామము '**దమనః**'కు శ్రీ భట్టులు చెప్పిన వ్యాఖ్య ఇందుకు దగ్గరగా ఉన్నది. **కాంతి మందాకినీభిః భవతాపమ్ దమయతి ఇతి దమనః.** మందాకినివంటి తన కాంతితో సంసారతాపమును హరించేవాడు దమనుడు.
తన భక్తుల శత్రువులను శిక్షించేవాడు దమయిత.

శ్రీ చిన్మయానంద – దుష్టులను శిక్షించి, పాపులను నాశనం చేసి, జగత్తు అనే వనంలో ఆధ్యాత్మిక పుష్పాలను పూయించేవాడు దమయిత.

శ్రీ బలదేవ విద్యాభూషణ గౌడీయవైష్ణవ సంప్రదాయానికి చెందిన పండితులు. ఈయన దాదాపు అన్ని నామాలను శ్రీకృష్ణావతారపరంగా వ్యాఖ్యానించారు. ప్రస్తుత 'దమయతా' నామనకు ఆయన వ్యాఖ్య – **నాగ్నజితీ స్వయంవరే సప్తానాముక్షణామ్ దమనాత్ దమయితా.** నాగ్నజితి స్వయంవరంలో ఏడు ఎద్దులను అదుపుచేసినవాడు దమయిత.

865. అదమః

- ఎవరిచేతను దండింపబడనివాడు. ఎందుకంటే ఆయనకంటే ఎక్కువవారెవ్వరూ లేరు.
- (అద+మః) అందరికీ సంపదలు ప్రసాదించేవాడు.

దమః

- దుర్మార్గులను దండించు దండనక్రియాఫలము తానే అయినవాడు (దండనవలన కలిగే సత్ఫలితాలు).
- అన్నింటినీ (గ్రహాదులనూ, జీవులనూ వగైరా) నియమంలో పెట్టువాడు.

- (ద+మః) కల్పతరువువలె భక్తులకు సకలాభీష్టములు ప్రసాదించువాడు.

ఓం అదమాయ నమః

ఓం దమాయ నమః

శ్రీ పరాశరభట్టులు ఈ నామమును **'అదమః'** అని చెప్పగా, శ్రీ శంకరులు **'దమః'** అనే పాఠాన్ని చెప్పారు. ఇంతకుముందు రెండు నామములు **'దండః'**, **'దమయితా'** లాగానే ఈ 'దమః' నామము కూడా 'దమ్ - ఉపశమే - అదుపు చేయుట' అనే శబ్దంనుండి వివరింపబడింది.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **అదమః** – నిరుక్తిలో శ్రీ భట్టుల వ్యాఖ్యను ఇలా చెప్పారు. **కశ్చిత్ దమయితా నాస్తి యస్యాసౌ అదమః స్మృతః.** ఆయనను అణచువారెవ్వరూ లేరు గనుక ఆయనను 'అదముడు' అని ధ్యానిస్తారు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ వివరణ – **దామయతి ఇతి దమో దమనః పరాభవతా, న దమో యస్య కశ్చిత్ సః అదమః.** శ్రీ భట్టులు మహాభారతం ఉద్యోగపర్వము (67.8)నుండి ఉదాహరించారు –

భస్మకుర్యాత్ జగత్సర్వమ్ మనసైవ జనార్దనః
న తు కృత్స్నమ్ జగచ్ఛక్తమ్ కించిత్ కర్తుమ్ జనార్దనే

సంకల్పమాత్రాన జనార్దనుడు సకల జగత్తును భస్మము చేయగలడు. కాని జగత్తు అంతా కలసినా ఆయనను ఏమీ చేయలేదు.

శ్రీ సత్యసంధ యతిరాజ కూడా 'అదమః' అనే నామాన్ని పరిగణించారు (ఆద-మః). **సమ్యక్ దదాతి ఇతి ఆదః, తేషామ్ మా-సంపత్ యస్మాత్ ఇతి అదమః.** అందరికీ చక్కగా సంపదలు ఇచ్చేవాడు అదముడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **దమః** – **దమ్యేషు దండ కార్యమ్ ఫలమ్, తచ్చ స ఏవ ఇతి దమః.** భగవంతుడొనర్చే దండన కార్యమునకు ఫలం కూడా తానే అయినందున 'దమః' అనబడుచున్నాడు. అంటే శిక్షణ కారణంగా జరిగే మార్పు (సద్బుద్ధి కలుగుట, మోక్షము లభించుట వంటివి) కూడా భగవత్స్వరూపమే.

శ్రీ చిన్మయానంద – భగవంతుడు కలిగించే శిక్షణవల్ల సత్ఫలితమే జరుగుతుంది. ఆత్మ పరిశుద్ధమవుతుంది.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – దమనమునకు వాడే సాధనాలు, అనగా ఇంద్రియ నిగ్రహము వంటివి, కూడా దమములే.

శ్రీ వాసిష్ఠ –

దమోహి సర్వత్ర విరాజమానః, క్రియాసు సర్వమ్ స నియమ్య యంగ్తే
గ్రహాస్తమేవ దమమాత్ర విష్ణుమ్ నమన్తి సర్వే పరిధౌ భ్రమన్తః

భగవంతుని అదుపు (దమము)వలన అన్నీ తమతమ పనులు చేస్తున్నాయి. గ్రహములు తమ పరిధిలో చరిస్తున్నాయి. ఇంతకుముందు నామము 'దమయితా'ను దుష్టశిక్షణాపరంగాను, ఈ నామము 'దమః'ను కర్మపాలనాపరంగాను శ్రీ వాసిష్ఠ వివరించారు.

శ్రీ రఘునాథ తీర్థ – (ద-మః) **కల్పతరు శాఖా ఇవ భక్తానామ్ సర్వాభీష్టమ్ దదాతి ఇతి ద-మః.** కల్పతరువు కొమ్మలాగా భగవంతుడు భక్తులు అడిగినవన్నీ ఇస్తాడు. (శ్రీ సత్యసంధ తీర్థ 'అదమః' నామమునకు చెప్పిన అర్థం కూడా ఇలానే ఉంది.)

866. అపరాజితః

- ఎదురు లేనివాడు. అపజయమెరుగనివాడు.
- భగవంతుని రక్షణలోనున్నవారికి అపజయము లేదు.
- భగవంతుని శక్తి ఎన్నటికీ తరుగదు.

ఓం అపరాజితాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

76వ శ్లోకము. 721వ నామము. అపరాజితః – **దర్పహా దర్పదో దృప్తో దుర్ధరోऽథాపరాజితః**

92వ శ్లోకము. 866వ నామము. అపరాజితః – **అపరాజితస్సర్వసహో నియన్తాऽనియమోऽయమః**

జీ - జయే అభిభావే చ - జయించుట. **పరై ర్న పరాజీయతే, పరాభిభూయతే వా స అపరాజితో విష్ణుః.** భగవంతుడైన విష్ణువును ఎవరూ జయించలేరు. మరియు అవమానపరచలేరు. భగవంతుడు 'అపరాజితుడు' అన్న విషయాన్ని రెండు విధాలుగా అర్థం చేసుకోవచ్చును. (1) ఎవరూ, ఎప్పుడూ, ఎక్కడా భగవంతుని జయించలేరు. (2) భగవంతుని రక్షణలో ఉన్నవారికి అపజయం లేదు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు 721వ నామము 'అపరాజితః'ను మొదటి అర్థంలోను, 866వ నామము 'అపరాజితః'ను రెండవ అర్థంలోను వ్యాఖ్యానించి, పునరుక్తిదోషం లేకుండా చెప్పారు.

721వ నామము. అపరాజితః – **క్వచిత్, కదాచిత్, కుతశ్చిత్ అప్రతిహతః అపరాజితః.** లోకంలో ఎవరూ, ఎప్పుడూ, ఎక్కడా భగవంతుని నిరోధించలేదు (ఓడించలేదు). కనుక భగవంతుడు అపరాజితుడు.

శ్రీ భట్టులు ఆయుర్వేద చరకసంహితమునుండి ఉదాహరించారు –

యథాऽహమ్ నాభిజానామి వాసుదేవే పరాజయమ్
మాతుశ్చ పాణిగ్రహణమ్ సముద్రస్య చ శోషణమ్
ఏతేన సత్యవాక్యేన సిచ్యతామ్ అగదోహ్యయమ్

వాసుదేవుని పరాజయము జరుగదు. నా తల్లి వివాహము నేను చూడలేదు, సముద్రము ఎండిపోవుట నేనెరుగను. ఈ వాక్యములు ఎంత నిజమో ఈ ఆయుర్వేద శాస్త్రము కూడ అంతే నిజమగుగాక.

శ్రీ భట్టులు ఇంకా రామాయణ మహాభారతాలనుండి ఉదాహరించారు –
యుద్ధకాండ 114.15 – **అజయ్యః శాశ్వతో ధ్రువః**. అజేయుడు, శాశ్వతుడు, నిశ్చలుడు.
యుద్ధకాండ 120.14 – **అజితః ఖడ్గధృక్**. అజితుడు, ఖడ్గధారి
భారత. ఉద్యోగ. 6.79 – **యతో కృష్ణ స్తతో జయః**. (కృష్ణుడున్నచోట జయము ఉండును).
భారతము – **దాశార్హమ్ అపరాజితమ్**. కృష్ణుడు అపరాజితుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య –
76వ శ్లోకములో 'అపరాజితః' – **న అంతరై రాగాదిభిః పరాజిత ఇతి అపరాజితః**. అంతశ్శత్రువులైన రాగద్వేషాదులు భగవంతుని ఎన్నడూ జయించలేవు గనుక భగవంతుడు అపరాజితుడు.

92వ శ్లోకములో 'అపరాజితః' – **శత్రుభిః న పరాజిత ఇతి అపరాజితః**. (బాహ్య) శత్రువులు భగవంతుని ఎన్నడూ జయించలేరు గనుక భగవంతుడు అపరాజితుడు.

శ్రీ సత్యసంధ యతిరాజ చెప్పిన మరొక అర్థము – అ-పః-రాజితః – **న విద్యతే పః - పాలకో యస్య స అపః, స చాసౌ రాజితశ్చ ఇతి అపరాజితః**. భగవంతునికి పాలకుడు ఉండడు. మరియు భగవంతుడు ప్రకాశమానుడు. కనుక అపరాజితుడు. అంతే కాకుండా భక్తుడు కానివాడు ఆయనను చేరలేడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ 'పర' అనగా 'అత్యంత' అనే అర్థంలో కూడా వ్యాఖ్యానించారు. ఒక వ్యాఖ్య ఇంచుమించు శ్రీ భట్టుల వ్యాఖ్యతో సరిపోతుంది. మరొక వ్యాఖ్య అద్వైత సిద్ధాంతానికి దగ్గరగా ఉంది. భగవంతునికంటే వేరే ఏదీ లేదు. కనుక భగవంతుడు పరాజితుడు కావడం అనేది అసంభవం. **పర ఏవ కశ్చిన్నాస్తి, న ద్వితీయో న తృతీయః. ఇతి అథర్వ వచనాత్, తస్మాత్ పరాజిత్వస్య అసంభవాత్ భగవతః అపరాజితః ఇతి నామ్నా సంకీర్తనమ్ ఉపపద్యతే.**

శ్రీ చిన్మయానంద మరొక అనుభవము – తక్కినదంతా అంతరించినపుడు పరమాత్ముడు మాత్రమే ఉండును గనుక ఆయన అపరాజితుడు.

శ్రీ రఘునాథ తీర్థ – **పరాజీయతే కాలతః నశ్వరః విభూతయః, న విద్యన్తే నశ్వరాహ విభూతయః యస్య సః అపరాజితః**. అన్ని విభూతులూ (శక్తులూ) కాలంతో క్షీణిస్తాయి. కాని భగవద్విభూతి నాశనరహితమైనది. కనుక భగవంతుడు అపరాజితుడు.

867. సర్వసహః

- ఇతర దేవతలు కూడా తానే ఆధారమైనవాడు.

- తన శత్రువులను జయించువాడు.

- సర్వ సమర్థుడు, సకలశక్తి భాండారము.

- అందరి అపరాధములను మన్నించువాడు.

ఓం సర్వసహాయ నమః

గోపికలతో శ్రీకృష్ణుడు. 1775 కాలపు చిత్రం. వికీపిడియానుండి

'సహ' అనగా భరించుట, సహించుట, సమర్థత కలిగియుండుట. శ్రీ భట్టులు, శ్రీ వాసిష్ఠ 'భరించుట, ఆధారమగుట' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. శ్రీ శంకరులు 'సమర్థత కలిగియుండుట, శక్తి కలిగియుండుట, జయించుట, నిలుపుట' అనే అర్థాలు వాడారు. శ్రీ కృష్ణదత్త భరద్వాజ 'సహించుట, ఓర్చుకొనుట' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. శ్రీ శంకరులు 'సహస్' అనగా 'బలము' అనే అర్థం కూడా వాడారు. **సహతే అనేన శత్రుమ్ ఇతి సహః.** (అమరకోశము).

శ్రీ భట్టుల వ్యాఖ్య – **స్వ-శాసనేన సర్వమ్**
దేవతాంతరమపి మదాంధికారిణామ్ ఆరాధ్యతయా సహతే - బిభర్తి ఇతి సర్వసహః. నారాయణుడే పరమదైవము అని తెలియని మందమతులు ఇతర దేవతలను పూజిస్తారు. అయినా అలాంటి అన్యదేవతలకు కూడా తానే ఆధారమైనవాడు 'సర్వసహః'.

మదాంధకారిణాం సర్వం ఆరాధ్యత్వేన దైవతమ్
బిభర్తి సహతే యస్తు స సర్వసహ ఈరితః

మదాంధికారులచే ఆరాధింపబడే దేవతలను కూడా తనే భరించువాడు (భక్తులలో ఉత్తములు, మధ్యములు, మదాంధికారులు అని మూడు రకాలున్నారు. ఇందులో మూడవరకంవారు యక్షిణీ దేవతలను పూజిస్తారు..) (శ్రీ కైవల్యసారధి).

శ్రీ వాసిష్ఠ కూడా 'ఆధారమగుట, భరించుట' అనే అర్థాన్ని మరొకరకంగా చెప్పారు. భూమి, ఆకాశము, సకల చరాచరములకు ఆధారము, రక్షణ అయినందున భగవంతుడు 'సర్వసహః'.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు మూడు అర్థాలను చెప్పారు.

(1) **సర్వాన్ శత్రూన్ సహత ఇతి సర్వసహః.** సకల శత్రువులను జయించువాడు సర్వసహుడు.

(2) **సర్వ కర్మసు సమర్థ ఇతి సర్వసహః.** అన్ని కార్యములందు సమర్థుడు సర్వసహుడు.

(3) **పృథివ్యాది రూపేణ వా సర్వసహః.** భూమివంటి రూపములలో అన్నింటికి ఆధారమైనవాడు సర్వసహుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **సర్వేషామ్ స్వజన అపరాధానామ్ సహః ఇతి సర్వసహః.** తన భక్తులందరి అపరాధములను సహించువాడు సర్వసహుడు. శ్రీ రాధాకృష్ణశాస్త్రి ఈ అర్థాన్ని మరింత పొడిగించారు. శత్రువుల అపరాధములను కూడ మన్నించువాడు సర్వసహుడు.

శ్రీ వాసిష్ఠ 'సహించుట' అనే అర్థంలో మరొక వ్యాఖ్య చెప్పారు. ఎన్ని నీర్లు కలిసినా సముద్రం తన తత్వాన్ని కోల్పోదు. శరీరంలో ఉన్న జీవుడు అనేక కర్మలను ఎదుర్కొన్నా చివరకు ఆ శరీరాన్ని వదలి మరొక శరీరానికి వెళతాడు. ఇది భగవంతుని సర్వసహత్వమునకు సూచిక.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **సర్వాణి రుక్మ్యవజ్ఞా వదాంసి సహత ఇతి సర్వసహః.** రుక్మిణియొక్క సోదరుడు రుక్మి. రుక్మి, దుర్యోధనుడు, శిశుపాలుడు వంటివారి అనేక దుర్భాషలను సహించినవాడు సర్వసహుడు.

868. నియన్తా

- నియమించువాడు. అన్యదేవతలను ఆరాధించేవారికి ఆయా దేవతలపట్ల భక్తి శ్రద్ధలు కలుగజేసేవాడు.
- అందరిని (దేవతలను) ఆయా కార్యములందు నియమించువాడు.
- అనియంత – ఆయనకు పైన అధికారి (నియంత) లేడు.

ఓం నియన్త్రే నమః

యమ - ఉపరమే - లేవనెత్తుట, చూపుట, ప్రతిపాదించుట. ని (ఉపసర్గ) - ఆజ్ఞను సూచించును. తృచ్ - ఉప పదవిని సూచించును.

శ్రీ భట్టుల వ్యాఖ్య – ఇంతకు ముందలి నామము 'సర్వసహః'ను శ్రీ భట్టులు అన్యదేవతారాధనాపరంగా వ్యాఖ్యానించారు. ఈ 'నియన్తా' నామ వ్యాఖ్యను కూడా అదే భావంలో చెప్పారు. **తత్ర తత్ తత్ రుచీన్ ప్రరోచయన్ నియచ్ఛతి ఇతి నియన్తా.** అన్య దేవతలను ఆరాధించే భక్తులకు ఆయా దేవతలయందు భక్తి శ్రద్ధలు కలుగజేసి తద్వారా వారికి కామితార్థములను ప్రసాదించువాడు 'నియన్త'.

దైవతేషు చ సర్వేషు తత్తదిచ్ఛాం ప్రరోచయన్

మదాంధికారిణీ యోఽసౌ నియన్తాస్యాన్నియచ్ఛతి

భక్తులు ఆరాధించే దేవతలయందు వారికి ఆసక్తి, నమ్మకములను పెంచి, మదాంధికారులను కూడా నియంత్రించేవాడు నియంత. (శ్రీకైవల్యసారధి).

ఇందుకు శ్రీ భట్టులు గీత (7.21)నుండి ఉదాహరించారు.

యో యో యాంయాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి

తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్

సకామభక్తుడు ఏయే దేవతా స్వరూపమును భక్తి శ్రద్ధలతో పూజింప నిశ్చయించుకొనునో ఆయా దేవతయందే భక్తిశ్రద్ధలను స్థిరముగా కుదురుకొనునట్లు చేయుదును.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమోళి 1.1.5 – ప్రతివ్యక్తీ తన గుణము, స్థాయి, బుద్ధికి లోబడి ఒకో దేవతను ఆరాధించి కోరుకొన్న ఫలాలను పొందాలని యత్నించును. (మోక్షము కాకుండా) తగు ఫలములను వారి అర్హతను అనుసరించి ఆయా భక్తులు తాము ఆరాధించే దేవతలనుండి పొందుతారు. ఎందుకంటే ఆ దేవతలను నియమించినవాడు, వారి శక్తి, వారికి ఆదేశములిచ్చేవాడు భగవంతుడే (అనగా భగవంతుడు అన్యదేవతలకు నియంత.)

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సర్వాన్ స్వేషు స్వేషు కృత్యేషు వ్యవస్థాపయతి ఇతి నియన్తా.** (ఉదాహరణకు దిక్పాలకులను) ఆయా కార్యములందు నియమించు భగవంతుడు నియన్త.

శ్రీ వాసిష్ఠ – **నియచ్ఛతి - నిబధ్నన్తి సర్వమ్ వ్యవస్థిత వర్త్మనా గమనాయ ఇతి నియన్తా విష్ణుః.** సూర్యుడు, గ్రహములు, ఇలా అన్నీ విష్ణువు ఏర్పరచిన వ్యవస్థకు లోబడి వర్తిస్తున్నాయి. కనుక భగవంతుడు నియన్త.

శ్రీ చిన్మయ **'అనియన్తా'** అని గ్రహించారు. సూర్యాది గ్రహములను, పంచభూతములను, ఇలా అందరినీ నియమించిన భగవంతునికి పై అధికారి లేడు గనుక భగవంతుడు అనియన్త.

869. నియమః

అనియమః

- (మహాబలి వంటి) మహాబలురను కూడ అదుపులో పెట్టేవాడు. శాసించేవాడు.
- (అన్యదేవతారాధకులకు కూడ) తగు ఫలములు అందేలా నియమము చేసినవాడు.
- నియమము, యమము వంటి యోగసాధనలద్వారా లభించువాడు.
- అనియమః – ఆయనకంటె పైన శాసకులు (నియామకులు) ఎవ్వరూ లేరు.
- తనను గురించిన పవిత్రజ్ఞానమును భక్తులకు అందజేసేవాడు.
- అంతా వ్యాపించి, అంతనూ చుట్టి ఉండేవాడు.

ఓం నియమాయ నమః

ఓం అనియమాయ నమః

ఈ నామమ రెండు శ్లోకములలో వస్తుంది.

17వ శ్లోకము. 163వ నామము. 'నియమః' – **అతీంద్రః సంగ్రహః సర్గో ధృతాత్మా నియమో యమః**

92వ శ్లోకము. 869వ నామము. 'నియమః' లేదా 'అనియమః' – **'అపరాజితః సర్వసహో నియంతా నియమో యమః'** లేదా **'అపరాజితః సర్వసహో నియంతాऽనియమోऽయమః'**

'నియమము' అనగా అదుపులో పెట్టుట, ఏర్పాటు చేయుట, శాసించుట. ఈ నామమును శ్రీ భట్టులు **'నియమః'** అని చెప్పగా శ్రీ శంకరులు **'నియమః'** మరియు **'అనియమః'** అనే రెండు పాఠాలనూ పరిగణించారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య –

17వ శ్లోకము. 163వ నామము. **నియమః – బలి ప్రభృతయః అపి నియమ్యన్తే అనేన ఇతి నియమః.** బలివంటి బలవంతులను కూడా అపుచేయువాడు 'నియమః'. అంతే కాదు. సమస్త జగత్తు ఆయన శాసనానికి లోబడి ఉంటుంది. **నియమ్యతే జగత్ యేన నియమః స ఉదీరితః.** అని నిరుక్తి రచయిత చెప్పారు. శ్రీ వి.వి. రామానుజన్ భగవానుని ఆశ్రిత రక్షణాగుణాన్ని ప్రత్యేకంగా చెప్పారు.

92వ శ్లోకము. 869వ నామము. **నియమః** – ఇంతకుముందు వచ్చిన 'సర్వసహః', 'నియన్తా' నామములను శ్రీ భట్టులు అన్యదేవతారాధనా సంబంధంగా వ్యాఖ్యానించారు. ఈ 'నియమః' నామవ్యాఖ్య కూడా అదే విషయంలో చెప్పారు. **తత్ఫలమ్ చ జాతి, ఆయుః, భోగాదికమ్ నియమ్యతే అస్మిన్ ఇతి నియమః.** అన్యదేవతారాధన చేయువారికి తగు ఫలములు (జాతి, ఆయువు, భోగము వంటివి) లభించేలా నియమము చేసినవాడు 'నియమః'. శ్రీ భట్టులు 'నియన్తా' నామమునకు గీత 7.21 శ్లోకమును ఉదాహరించారు. 'నియమః' నామమునకు గీత 7.22 శ్లోకమును ఉదాహరించారు.

స తయా శ్రద్ధయా యుక్తః తస్యారాధనమీహతే
లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హితాన్

అట్టి సకామ భక్తుడు తగిన భక్తి శ్రద్ధలతో ఆ దేవతనే ఆరాధించును. తత్ఫలితముగ నా అనుగ్రహమువలననే ఆ దేవత ద్వారా తాను కోరుకొనిన భోగములను అతడు తప్పక పొందగలడు.

ఇక్కడ గమనింపవలసిన విషయం ఏమంటే – (1) వారి వారి స్థాయిని బట్టి భక్తులు ఏదో ఒక దేవతను పూజకొరకు ఎంచుకొనేలా భగవంతుడు అనుమతిస్తాడు. (2) అలా ఎంచుకొన్న తరువాత, ఆ ఆరాధనలో భక్తునికి భగవంతుడు సహకరిస్తాడు. భక్తిశ్రద్ధలు కలుగజేస్తాడు. (3) భక్తుని అర్హతకు తగినట్లుగా ఫలములను

ఆ దేవతద్వారా భక్తునికి లభించేటట్లు భగవానుడు ఏర్పరచాడు. ఈ మూడు విషయాలు 'సర్వసహః', 'నియన్తా', 'నియమః' అనే నామములద్వారా తెలియబరచబడినవి. జీవునికి ఇలా ఎంచుకొనే స్వాతంత్ర్యము శ్రీ రామానుజులవారి శ్రీభాష్యమునందు కూడా చెప్పబడింది. 2.3.41 సూత్రమునకు వ్యాఖ్యానము – **కృత ప్రయత్నాపేక్షతు విహిత ప్రతిషిద్ధా అపై యర్థాదిభ్యః.**

శ్రీ శంకరుల వ్యాఖ్య –

17వ శ్లోకము – **నియమః – స్వేషు స్వేషు అధికారేషు ప్రజా నియమతి ఇతి నియమః.** ఆయా అధికారముల (కార్యముల) యందు తగువారిని నియమించువాడు 'నియమః'. ఉదాహరణకు భగవంతుడు సూర్య చంద్ర నక్షత్ర గ్రహాదులను, దిక్పాలకులను నియమించి వారికి నియమిత కర్మలను శాసించి, పరిపాలనము చేయును.

92వ శ్లోకము – **నియమః** – నియమము, యమము అనే యోగసాధనలద్వారా లభించువాడు 'నియమః'. పతంజలి యోగసూత్రము 2.32 – **శుచ సంతోష తపః స్వాధ్యాయ ఈశ్వర ప్రణి ప్రధానాని నియమః.**
నియమములు అనగా – 1. సంతోషము (సుఖ దుఃఖాది ద్వంద్వములయందు సమత్వము). 2. శౌచము (శరీరము, మనస్సుల శుద్ధి). 3. తపస్సు (శారీరిక, వాచిక, మానసిక నియమము). 4. స్వాధ్యాయము (పుణ్యగ్రంథ పఠనము). 5. ఈశ్వర ప్రణిధానము (భగవంతుని యెడ అచంచలమైన భక్తి).
యమములు అనగా – 1. అహింస (ఏ ప్రాణికిని హింస చేయకుండుట). 2. సత్యము (నిజము పలుకుట). 3. అస్తేయము (దొంగతనము చేయకుండుట). 4. బ్రహ్మచర్యము (ఇంద్రియ నిగ్రహము). 5. అసంగ్రహము (ఇతరులనుండి స్వీకరింపకుండుట).

92వ శ్లోకము – **అనియమః – నియమః నియతి తస్య న విద్యుత ఇతి అనియమః, సర్వ నియన్తుః నియన్తర అభావాత్.** భగవంతుని నియమించేవారు, శాసించేవారు ఎవరూ లేరు. ఆయన సర్వనియన్త. కనుక ఆయన 'నియమః'.

శ్రీ రఘునాథతీర్థ – తత్వసారము – **స్వవిషయ జ్ఞానాని భక్తేభ్యో నియమయతి ప్రయచ్ఛతి ఇతి నియమః.** తనను గురించిన జ్ఞానమును భక్తులకు చక్కగా తెలియబరచువాడు 'నియమః'.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ రెండు అర్థాలను చెప్పారు –
(1) యమ - పరివేష్టనే - చుట్టుముట్టుట. **నియమాన్ శక్త్యా సకలమ్ విశ్వమ్ వ్యాప్నోతి తస్మాత్ స నియమః.** సకల విశ్వమునందు వ్యాపించి, చుట్టుముట్టి యుండేవాడు గనుక 'నియమః'.
(2) యమ్ - ఉపరమే - సరిచూచుట. సకల చరాచరాలు భగవంతునియందు, ఆయన అదుపులో ఉంటాయి. ఆయన కారణంగానే చలిస్తాయి.

870. యమః

అయమః

- అందరు దేవతలను శాసించువాడు. యమాదులను నియమించువాడు.
- యమము, నియమము అనే యోగసాధనలద్వారా పొందవచ్చువాడు.
- అయమః – మృత్యువు లేనివాడు.
- అయమః – అయనకు పై శాసకులు లేరు.
- ప్రళయకాలమున సకల జీవరాశులను అంతము చేయువాడు.
- తన భక్తులకు భగవదనుభవం అనే రుచికరమైన భోజనము తినిపించువాడు.
- అయ-మః – సద్గుణములను, సదాచారములను తెలిసినవాడు, నేర్పువాడు.

ఓం యమాయ నమ

ఓం అయమాయ నమః

17వ శ్లోకంలోని 163, 164 నామములు. 'నియమః, యమః' – **అతీంద్రః సంగ్రహః సర్గో ధృతాత్మా నియమో యమ:**

92వ శ్లోకంలోని 869, 870 నామములు. 'నియమః, యమః' లేదా 'అనియమః, అయమః' – **'అపరాజితః సర్వసహో నియంతా నియమో యమః'** లేదా **'అపరాజితః సర్వసహో నియంతాऽనియమోऽయమః'**

ఈ 92వ శ్లోకంలోని నామములను శ్రీ భట్టులు 'నియమః, యమః' అని చెప్పారు. శ్రీ శంకరులు 'అనియమః, అయమః' అనే పాఠంతోపాటు 'నియమః, యమః' అనే పాఠాంతరాన్ని కూడా చెప్పారు. అన్ని నామములూ 'యమ్' లేదా 'యమ' అనే ధాతువులనుండి వివరింపబడినవి. శ్రీ భట్టుల వ్యాఖ్య ప్రకారం ఈ నాలుగు నామముల అర్థాన్ని ఇలా క్లుప్తంగా చెప్పవచ్చును.

(163) నియమః – మహాబలివంటివారిని కూడా అదుపు చేయువాడు.

(164) యమః – అందరికీ అంతర్యామియై అందరినీ అదుపు చేయువాడు.

(869) నియమః – అన్యదేవతలను ఆరాధించే భక్తులకు తగు ఫలములు ప్రసాదింపజేయువాడు.

(870) యమః – అందరు దేవతలను నియమించి, శాసించువాడు.

ఈ నామములన్నీ అనంతగుణసంపన్నుడైన భగవంతుని కొన్ని గుణములను కీర్తించేవిగా శ్రీ భట్టులు వివరించారు. ఇక్కడ వరుసగా వచ్చిన **'నియన్తా, నియమః, యమః, అనియమః, అయమః'** నామములన్నింటినీ కలిపి శ్రీ వాసిష్ఠ ఒక చక్కని శ్లోకాన్ని కూర్చారు –

విష్ణుర్నియన్తా నియమో యమోऽసౌ
విష్ణుర్నియన్తా అనియమో అయమో సః

ప్రకాశతే విశ్వమిదమ్ సమస్తమ్
యమైర్నియామైశ్చ కృత వ్యవస్థమ్

శ్రీ భట్టుల వ్యాఖ్య –
17వ శ్లోకము. 164వ నామము. **యమః – యచ్ఛతీతి యమః. యమతీతి యమః.** అందరికీ అంతర్యామియై అందరినీ అదుపులో ఉంచువాడు యముడు.

92వ శ్లోకము. 870వ నామము. **యమః – తత్తత్ ఫల నియామకాన్ యమాదీన్ అపి యచ్ఛతి ఇతి యమః.** ఆయా ఫలములు ఇచ్చే యమాదులను అన్యదేవతలను శాసించువాడు యముడు. ఇందుకు శ్రీ భట్టులు విష్ణుపురాణమునుండి (3.7.13) యముని మాటలనే ఉదాహరించారు. **ప్రభవతి సంయమనే మమాపి విష్ణుః.** నన్ను కూడా శాసించువాడు విష్ణువే.

వాయుర్యమోగ్నిర్వరుణః శశాంకః ప్రజాపతిస్త్వమ్ ప్రపితామహశ్చ
నమోనమస్తేఽస్తు సహస్రకృత్వః పునశ్చ భూయోఽపి నమో నమస్తే – గీత 11.39
నీవే వాయుదేవుడవు. యముడవు. అగ్నివి. వరుణుడవు. చంద్రుడవు. ప్రజాపతియైన బ్రహ్మవు. బ్రహ్మకును జనకుడవు. నీకు వేలకొలది నమస్కారములు. మరల మరల నమస్కారములు. ఇంకను నమస్కారములు.
ఈశావాస్యోపనిషత్తు 16 – **పూషన్! ఏకర్షే! యమ! సూర్య! ప్రజాపత్య!**
శ్రీ నమ్మాళ్వారు. తిరువైమోళి 4.10.8 – తనకు శరణుజొచ్చిన మార్కండేయునికి పరమశివుడు శాశ్వతజీవనం ఇచ్చాడు. అది శ్రీమన్నారాయణుని సంకల్పంవల్లనే జరిగింది.

శ్రీ శంకరుల వ్యాఖ్య –
17వ శ్లోకము – **నియమః, యమః**
నియమః – సకల జీవులను (మరియు దేవతలను) ఆయా కార్యములలో నియమించువాడు.
యమః – అందరికీ అంతర్యామియై వారిని శాసించువాడు.

ఇక ఈ 92వ శ్లోకములోని నామములకు శ్రీ శంకరులు **'నియమః యమః'** మరియు **'అనియమః అయమః'** అనే రెండు పాఠాలనూ చెప్పారు. 'నియమః యమః' అనే పాఠం ప్రకారం భగవంతుడు **'అథవా యమ నియమౌ యోగాంగే, తద్గమ్యత్వాత్ స ఏవ నియమో యమః'**. నియమము, యమము అనే యోగాంగ సాధనలవలన లభించువాడు 'నియమః యమః'.
పతంజలి యోగసూత్రము 2.30 – **అహింసా సత్య అస్తేయ బ్రహ్మచర్యాపరిగ్రహాయ యమః.** అహింస, సత్యము, దొంగతనము చేయకుండుట, బ్రహ్మచర్యము, మోహము లేకుండుట (అపరిగ్రహము) అనునవి యమములు.

అయమః – స అస్య విద్యతే యమః మృత్యు ఇతి అయమః. భగవంతుడు ఆదిమధ్యాంతరహితుడు. యముని సృజించినవాడు భగవంతుడే. యముని శాసించువాడు భగవంతుడే. భగవంతునికి యముడు (మృత్యువు) లేడు గనుక భగవంతుడు అయముడు.

శ్రీ సత్యసంధ యతిరాజ –

(1) యమ్ - ఉపరమే - పాలించుట, సరిచూచుట. **న విద్యతే యమః - నియామకః, సదృశో వా యస్య సః అయమః.** భగవంతునికి శాసకులు (నియామకులు) లేరు గనుక ఆయన అయముడు.

(2) మా - మానే - కొలుచుట. అయమ్ - శుభావహవిధిమ్ మాతి - జానాతి ఇతి అయమః. శుభగుణములను తెలిసినవాడు, ప్రసాదించువాడు అయముడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – సకల జీవులను, వారి జీవనకాలమును నిర్ణయించువాడు అయముడు.

శ్రీ వాసిష్ఠ – **యచ్ఛతి - ఉపసంహరతి సర్వమ్ సర్గాన్తే ఇతి యమః.** ప్రళయకాలంలో సకలమును తనయందు లీనము చేసికొనువాడు యముడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – యమ - తినిపించుట (యమయతి బ్రాహ్మణాన్ - బ్రాహ్మణులకు తినిపించుట). యమ - పరివేషనే, పరివేషణమ్ - భోజనమ్. **యమయతి భోజయతి స్వాదుభిః అన్నైః భక్తాన్ ఇతి యమః.** భక్తులకు స్వాదిష్టమైన భోజనము (అనగా భగవదనుభవము) తినిపించువాడు యముడు.

ఈ భాగం ముగింపులో శ్రీ భట్టులు చెప్పిన మాట – ఇంతకుముందు (851 నుండి 870 వరకు?) నామములు భగవంతుని రజస్తమోగుణములను సూచించునవి. 871 నుండి 880వ నామము వరకు భగవంతుని సత్వగుణమును సూచించునవి.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

సత్త్వవాన్ సాత్త్వికః సత్యః సత్యధర్మపరాయణః |
అభిప్రాయః ప్రియార్హోఽర్హః ప్రియకృత్ ప్రీతివర్ధనః || (93)

871. సత్త్వవాన్

- మోక్షమునకు మార్గమును సుగమము చేసే సత్వగుణమునకు అధిష్టాన దేవత.
- శౌర్య, వీర్యాది దివ్యగుణములు సమృద్ధిగా గలవాడు.
- భక్తులను అనుగ్రహించే లక్షణము నిశ్చయముగా గలవాడు.

ఓం సత్త్వవతే నమః

'సత్త్వ' అనే పదమును సత్వగుణాన్ని గురించి వాడుతారు. అయితే ఈ పదానికి ఇతర అర్థాలు కూడా ఉన్నాయి. అమరకోశంలో ఇలా ఉంది.

ద్రవ్యే ప్రాణే బలే జంతౌ వ్యవసాయ స్వభావయోః

గుణే విత్తే సతోభావో సత్త్వమ్ గుణిని తు త్రిషు

మంచితనము, ద్రవ్యము, బలము, కృషి, పట్టుదల వంటి అర్థాలున్నాయి. ఈ 'సత్త్వవాన్' నామమునకు కొందరు వ్యాఖ్యాతలు ఈ అర్థాలలో కొన్నింటిని పరిగణించారు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఈ నామమునకు వ్యాకరణపరంగా వివరమైన అర్థం చెప్పారు.
'అస్ - భువి - ఉండుట' నుండి 'సత్' అనే శబ్దం వస్తుంది. పాణిని సూత్రము 5.1.119 **'తస్య భావస్-త్వ-తలౌ'** ప్రకారం 'సత్'కు 'త్వ' కలిపితే 'ఆ గుణం కలిగిన' అనే అర్థం వస్తుంది. అలా 'సత్త్వ' శబ్దం వస్తుంది. తరువాత పాణిని సూత్రము 5.2.94 **'తత్-అస్య-అస్మిన్-అస్తి ఇతి మతుప్'** ప్రకారం 'మతుప్' ప్రత్యయం కలిపితే 'ఎవరియందు ఉండునో' అనే అర్థం వస్తుంది. అలా 'సత్-త్వ-మత్' అయ్యింది. తరువాతి సూత్రం 8.2.9 **'మ ఆత్ ఉపధాయాః చ మతో ధః అయవాదిభ్యః'** ప్రకారం 'మ' బదులు 'వ' వస్తుంది. అప్పుడు 'సత్త్వమత్' అల్లా 'సత్త్వవత్' అయ్యింది. ఈ పదంనుండి 'సత్త్వవాన్' వచ్చింది. ఇది ఒక ఉదాహరణ

మాత్రమే. శ్రీ వాసిష్ఠ ప్రతి నామమునకూ ఇలాగే వ్యాకరణ వివరణ ఇచ్చారు. అంతేగాక ఆయన వ్యాకరణసూత్రాలనూ, శ్రుతులనూ విస్తారంగా ఉదాహరించారు సంస్కృత వ్యాకరణం తెలిసినవారికి శ్రీ వాసిష్ఠ వ్యాఖ్యానము ఒక అద్భుతమైన గ్రంథము.

శ్రీ భట్టుల వ్యాఖ్య – ఈ 871వ నామమునుండి 880వ నామమువరకు భగవానుని సత్వగుణ అధిష్ఠానమును సూచించేవిగా శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. సత్వ, రజస్, తమో గుణాలలో సత్వగుణము ప్రకాశమానమైనది. సుఖమును, ఆనందమును, చివరికి మోక్షమును కలిగించేది. **పరమ ప్రకాశ లాఘవ, సుఖ సంపదా మోక్షమూలమ్, సత్త్వమ్ సాక్షాత్ అధిష్ఠేయమ్ అస్య ఇతి సత్త్వవాన్.** అలాంటి సత్త్వగుణ సంపన్నుడు, దాని అధిష్ఠానదైవము అయినందున భగవంతుడు 'సత్త్వవాన్'. ఇందుకు శ్రీ భట్టులు శ్వేతాశ్వరోపనిషత్తు (3.12)నుండి ఉదాహరించారు.

మహాన్ ప్రభుర్వై పురుషః సత్త్వస్య ఏష ప్రవర్తకః
సు నిర్మలామ్ ఇమమ్ శాంతిమ్ ఈశానో జ్యోతిరవ్యయః

ఈ మహాపురుషుడే మోక్షమునిచ్చువాడు. సత్త్వగుణ ప్రవర్తకుడు. మోక్షరూపమైన అవ్యయజ్యోతి.

శ్రీ భట్టులు వరాహపురాణం (3.7.13)నుండి కూడా ఉదాహరించారు. **సత్త్వేన ముచ్యతే జంతుః సత్త్వమ్ నారాయణాత్మకమ్.** సత్వము నారాయణాత్మకము. దానివల్లనే జీవులు బంధములనుండి విముక్తులగుదురు.

లింగపురాణము. 14వ అధ్యాయము –

హిరణ్యగర్భో రజసా తమసా శంకరః స్వయమ్
సత్త్వేన సర్వగో విష్ణుః సర్వాత్మా సదసన్మయః

24వ అధ్యాయము –

త్వత్-కోప సంభవో రుద్రః తమసా సమావృతః
త్వత్-ప్రసాదాత్ జగద్ధాతా రజసా చ పితామహః
త్వత్-స్వరూపాత్ స్వయమ్ విష్ణుః సత్త్వేన పురుషోత్తమః

తరువాతి అధ్యాయంలో నందికేశ్వరుడిలా అన్నాడు –

పరమాత్మానమ్ ఈశానమ్ తమసా రుద్రరూపిణమ్
రజసా సర్వలోకానామ్ సర్గలీలా ప్రవర్తకమ్
సత్త్వేన సర్వభూతానామ్ స్థాపకమ్ పరమేశ్వరమ్
సర్వాత్మానమ్ మహాత్మానామ్ పరమాత్మానామ్ ఈశ్వరమ్
తే దృష్ట్వా ప్రాహవై బ్రహ్మా భగవంతమ్ జనార్దనమ్

పాంచరాత్రము-భగవచ్ఛాస్త్రము

సాత్త్వికైః సేవ్యతే విష్ణుః తామసైరేవ శంకరః
రాజసైః సేవ్యతే బ్రహ్మా సంకీర్ణైస్తు సరస్వతీ

శ్రీ రఘునాథ తీర్థ – బృహతి సహస్రము ఆధారంగా – **సతః సమీచీనస్య భావః సత్త్వమ్ విశిష్ట ప్రకృష్ట ఆనందాది గుణజాతమ్, తత్ అస్య అస్తి ఇతి సత్త్వవాన్.** ఆనందమువంటి విశిష్ట ఉత్తమ గుణములు కలిగినందున భగవంతుడు 'సత్త్వవాన్'.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు 'సత్త్వము' అనగా ధైర్యము, బలము అన్న అర్థంలో వ్యాఖ్యానించారు. **శౌర్య వీర్యాదికమ్ సత్త్వమ్ అస్య అస్తి ఇతి సత్త్వవాన్.** వీర్యము, బలము, తేజస్సు, సౌశీల్యము వంటి దివ్యగుణములు విశేషము కలవాడు సత్త్వవాన్.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – ఈ సత్వగుణములు సమృద్ధిగా కలిగినందున భగవానుడు చలించడు. యుద్ధములో భయమనునది ఆయనకు వర్తించదు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ 'సత్త్వము' అనగా 'వ్యవసాయః నిశ్చయః', అనగా 'స్థిరమైన గుణము' అన్న అర్థంలో వ్యాఖ్యానించారు. **సత్త్వమ్ వ్యవసాయః - నిశ్చయః భక్తానుగ్రహ సూచకో వర్తతే యస్మిన్ సః సత్త్వవాన్.** భక్తులను అనుగ్రహించే నిశ్చయమైన స్వభావము కలవాడు 'సత్త్వవాన్'.

872. సాత్త్వికః

- సత్వగుణమునకు తగు ఫలమునిచ్చేవాడు.
- ప్రధానముగా సత్వగుణమునందు స్థితుడైనవాడు.

ఓం సాత్త్వికాయ నమ

ఇంతకు ముందు నామము 'సత్త్వవాన్' వలెనే ఈ 'సాత్త్వికః' నామము కూడా 'సత్' అనే శబ్దంనుండి వివరింపబడింది. పాణిని సూత్రము 5.1.63 ప్రకారము తథిత ప్రత్యయము 'ఇక' చేరిస్తే 'తద్-అర్హతి' అనగా 'ఆ అర్హత కలిగియుండును' అనే అర్థం వస్తుంది.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **ధర్మ జ్ఞాన వైరాగ్య ఐశ్వర్య రూప ఫల నియమనేన చ సత్త్వమ్ అర్హత ఇతి సాత్త్వికః.**

విజ్ఞానైశ్వర్య వైరాగ్య ధర్మరూప ఫలం స్వయం
నియమ్యార్హతి సత్త్వం యః సాత్త్వికః పరికీర్తితః
సత్వగుణ ఫలములైన ధర్మము, జ్ఞానము, వైరాగ్యము, ఐశ్వర్యము వంటివానిని తన భక్తులకిచ్చేవాడు సాత్వికుడు. (శ్రీకైవల్య సారధి).

శ్రీ వాసిష్ఠ వివరణ – **తథా చ సర్వ మనుష్యాది వనస్పత్యాది వర్గశ్చ సత్త్వయుక్తః సత్త్వార్థః సత్త్వసంబంధీవా.** మనుష్యులు, మొక్కలు వంటివానికి సత్వగుణమును కలిగించేవాడు సాత్వికుడు.

శ్రీ రఘునాథ తీర్థ – తత్త్వటీక – **సత్వగుణ జన్యత్వాత్ సాత్త్వమ్ జ్ఞానమ్, తద్వాన్ సాత్త్వీ స్వభక్తమ్ సాత్త్వినమ్ కరోతి ఇతి సాత్త్వికః.** తన భక్తులకు సత్వగుణమునుండి జన్మించిన జ్ఞానమును ప్రసాదించినవాడు సాత్వికుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సత్త్వే గుణే ప్రాధాన్యేన స్థిత ఇతి సాత్త్వికః.** ప్రధానముగా సత్వగుణమునందు స్థితుడైయుండువాడు సాత్త్వికుడు.

873. సత్యః

- పవిత్రాత్ముల (సాధుపురుషుల) పట్ల ప్రియము కలిగినవాడు.
- ఉన్నతమైన విధంగా సత్పురుషుడు (మంచివాడు).
- సత్యమును స్థిరపరచినవాడు.
- తాను మాత్రమే నిజమైన ఉనికి గలవాడు (శ్రీ శంకరుల వ్యాఖ్య).
- ప్రాణము, అన్నము, సూర్యుడు అనే రూపంలో ఉండువాడు (సత్-తి-యమ్).

ఓం సత్యాయ నమః

ఈ నామము మూడు మార్లు స్తుతింపబడింది.

12వ శ్లోకము. 107వ నామము. సత్యః – **వసుః వసుమనా సత్యః సమాత్మా సమ్మితః సమః**

23వ శ్లోకము. 218వ నామము. సత్యః – **గురుర్గురుతరో ధామః సత్యః సత్యపరాక్రమః**

93వ శ్లోకము. 873వ నామము. సత్యః – **సత్త్వవాన్ సాత్త్వికః సత్యః సత్యధర్మపరాక్రమః**

'సత్' శబ్దమునకు తధిత ప్రత్యయము 'యత్' చేరిస్తే 'సత్య' అవుతుంది. పాణిని సూత్రము 4.4.98 'తత్ర సాధుః' ప్రకారం 'యత్' జత అయితే 'ఆ విషయంలో అత్యుత్తమం' అనే అర్థం వస్తుంది.

'గీత' 17.26, 17.27లో 'సత్' శబ్దం గురించి ఉంది –

సద్భావే సాధు భావే చ సదిత్యేతత్ప్రయుజ్యతే
ప్రశస్తే కర్మణి తథా సచ్ఛబ్దః పార్థ యుజ్యతే
యజ్ఞే తపసి దానే చ స్థితిః సదితి చోచ్యతే
కర్మ చైవ తదర్థీయం సదిత్యేవాభిధీయతే

ఓ పార్థ! 'సత్' అను పరమాత్మ నామము సత్య ప్రభావమునందును, శ్రేష్ఠ భావమునందును, అనగా పరమాత్మ నిత్యుడు, శ్రేష్ఠుడు అను భావమునందును ప్రయోగింపబడుచుండును. ఉత్తమ కర్మాచరణము

నందును 'సత్' అను శబ్దము ప్రయుక్తమగుచుండును. యజ్ఞ దాన తపః క్రియలయందలి నిష్ఠ, ఆస్తిక భావమును 'సత్' అని యందురు. పరమాత్మనుద్దేశించి చేయబడు నిశ్చయాత్మక కర్మలను కూడడ 'సత్' అనియందురు. (**శ్రీ జయదయాల్ గోయందకా** – శ్రీ మద్భగవద్గీత – తత్వవివేచనీ హిందీ వ్యాఖ్యకు తెలుగు అనువాదము – అనువాదకులు: డా. ఎమ్. కృష్ణమాచార్యులు, డా. గోలి వెంకటరామయ్య – గీతాప్రెస్, గోరఖ్ పూర్ ప్రచురణ – భగవద్గీత నుండి ఉదాహరించిన శ్లోకాలకు అన్నిచోట్లా తెలుగు అనువాదం ఈ పుస్తకంనుండి యథాతథంగా వ్రాశాను.)

సత్యమనగా ఉనికి, మంచితనము, సద్వర్తన, సదాచారము, భక్తి, నిష్ఠ, బహుమతి, మరియు వీనికి సంబంధించిన కార్యములు. వీనిలో శ్రేష్ఠమైనది, వీనికి తోడ్పడునది సత్యము.

శ్రీ భట్టుల వ్యాఖ్య –
12వ శ్లోకము. 107వ నామము. సత్యః – 'సత్' శబ్దము సాధుపురుషులను సూచించును. **తేషు సత్సు సాధుః.** ఆ విధంగా సాధువులయందు ఆదరము గలవాడు 'సత్యః'.

23వ శ్లోకము. 213వ నామము. సత్యః – ఇక్కడ 'సత్' అనగా మంచితనము. మేలు చేయువాడు 'సత్యః'. **మన్వాదిషు తత్కాల సమాశ్రితేషు సత్సు సాధుః.** (మత్స్యావతార పరంగా) మనువు వంటివారి ప్రార్థనలను మన్నించి వారికి హితమొనర్చువాడు 'సత్యః'.

తిరువైమోళి 9.10.6, 9.10.7 – తన భక్తులనెన్నడూ వీడని సత్యము ఆయన. నిజమైన భక్తితో కాంక్షారహితంగా భగవంతునికి కైకర్యం చేసే భక్తులకు ఆయన ఎల్లప్పుడూ తగు భక్తిని ప్రసాదిస్తాడు (కోరికలతో భగవంతుని ఆరాధించేవారికి కూడా ఆయన కామితార్థాలు ప్రసాదిస్తాడు. కాని వారిని అంటిపెట్టుకొని ఉండడు.)

93వ శ్లోకము. 873వ నామము. సత్యః – **సాత్త్విక శాస్త్ర ప్రతిపాద్యతయా యథార్థవైభవః సత్యః.** సాత్విక శాస్త్రములు ప్రతిపాదించిన నిజమైన వైభవము ఆయనే. ఆయనే అసలు సత్యము. శ్రీ భట్టులు మహాభారతం ఉద్యోగపర్వము (69.12)నుండి ఉదాహరించారు (సంజయుని పలుకులు) –

సత్యే ప్రతిష్ఠితః కృష్ణః సత్యమ్ అస్మిన్ ప్రతిష్ఠితమ్
సత్తా సత్తే చ గోవిందః తస్మాత్ సత్యః సతామ్ మతః

శ్రీకృష్ణుడు సత్యమునందు ప్రతిష్ఠితుడై యున్నాడు. సత్యము ఆయనయందున్నది. సత్తు, అసత్తు (ఉనికి, భ్రమ) రెండూ కూడా గోవిందునియందున్నవి. కనుక ఆయనను 'సత్యః' అంటారు.

శ్రీ వి.వి. రామానుజన్ – 'తిరుమెయ్యమ్' దివ్యక్షేత్రంలో భగవంతుని తిరునామము 'సత్యమూర్తి'.

శ్రీ తిరుమంగయాళ్వారు. పెరియతిరుమొళి 5.6.9 – ఐహికమైన క్షణిక భోగభాగ్యాలను వదిలివేసి, ఇంద్రియ లోలత్వమును త్యజించి భగవంతునే ధ్యానించువారికి ఆయన తన నిజతత్వమును తప్పక తెలియజేస్తాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు ఈ నామమునకు పలువిధాలుగా భావం చెప్పారు. వానిలో కొన్ని వివరణలు విశేషంగా అద్వైతసిద్ధాంతాన్ని వ్యక్తపరుస్తాయి.

భగవానుడు నిజము. కనుక సత్యము. ఆయన ఎన్నడూ అబద్ధం కాదు. **అవితథ రూపత్వాత్.** ఇందుకు శ్రీ శంకరులు తైత్తరీయ ఉపనిషత్తు (2.1) నుండి ఉదాహరించారు. **సత్యం జ్ఞానమ్ అనంతమ్ బ్రహ్మ.**

సత్-తి-యమ్ – 'సత్' అనగా ప్రాణము. 'తి' అనగా అన్నము. 'యమ్' అనగా సూర్యుడు. ప్రాణ, అన్న, సూర్య రూపములలో నున్నవాడగుటచే భగవానుడు 'సత్యము'. అని చెప్పబడెను. తైత్తరీయారణ్యకము 13 – **సదితి ప్రాణాస్తీత్యన్నమ్ యమిత్య సా వాదిత్యః.**

శ్రీ వాసిష్ఠ అధర్వ వేదము (14.1.1)నుండి ఉదాహరించారు. సత్యముపై భూమి ఆధారపడి (కూర్చుని) ఉన్నది. సూర్యునివలన ఆకాశము నిలిచియున్నది. నియమముల కారణంగా సూర్యుడు, చంద్రుడు దివియందు స్థిరముగానున్నారు.
సత్యేనోత్తభితా భూమిః సూర్యేణోత్తభితా చ ద్యౌః
ఋతేన ఆదిత్యాస్తిష్ఠన్తి దివి సోమో అధిశ్రితః

సత్సు సాధుత్వాత్. సాధుపురుషులలో సత్ స్వభావము భగవంతుడే.
సత్య వచన ధర్మరూపత్వాత్ సత్యః. భగవంతుని మాటలు ఎప్పుడూ సత్యమే.
మహానారాయణోపనిషత్తు (221) **తస్మాత్ సత్యమ్ ఇతి ప్రాణావై సత్యమ్ తేషామ్ ఏష సత్యమ్.** ప్రాణములు సత్యము. వానిలోని భగవంతుడు సత్యమే.

శ్రీ సత్యసంధ యతిరాజ – **సద్భావమ్ యాపయతి ఇతి సత్యః.** తన భక్తులను సద్భావముపైపు మళ్ళించేవాడు 'సత్యః'.

ఈ 93వ శ్లోకములోని 'సత్యః' నామమునకు శ్రీ వాసిష్ఠ వివరణ – **సత్సు సాధు స్వభావేషు పరమహితకారిత్వేన మహాపురుష పూజ్య నిత్య పరమ హితకారీచ ఇత్యర్థః.** ఆయన మహాపురుషులచే పూజింపబడుతాడు. ఆయన ఇతరులకు సహాయం చేసే స్వభావం కలవవాడు. కనుక సాత్విక స్వభావం కలిగినవారిలో అత్యుత్తముడు. సత్యః.

శ్రీ టి.ఎస్. రాఘవన్ ఈ నామమునకు 34 వివిధ వివరణలు లేదా ప్రమాణాలను సమీకరించారు. వాటిలో కొన్ని –
తైత్తరీయోపనిషత్తు – **తత్ సత్యమ్ ఇత్యాచక్షతే.** కనుక బ్రహ్మము సత్యము (సత్కార్యములు చేయునది) అనబడును.

సత్యేశమ్ సత్య సంకల్పమ్ సత్యమ్ సత్యవ్రతమ్ హరిమ్
సత్యచర్యమ్ సత్యయోనిమ్ సత్యశీర్షమహం భజే – ఆదిత్య పురాణము 3.5

శ్రీ మధ్వాచార్యులు. భాగవత తాత్పర్యము 1.1.1 – **సత్యమ్ నిర్దుఃఖ నిత్య నిరతిశయ ఆనంద అనుభవ స్వరూపమ్** (భగవంతుని వర్ణన). భగవంతుని రూపము సత్యము. దుఃఖము లేనిది. శాశ్వతమైనది. పరమానంద అనుభవమునిచ్చునది.
శ్రీ మధ్వాచార్యులు – **సత్యోహి భగవాన్ విష్ణుః సద్గుణత్వాత్ ప్రకీర్తితః**. అనంత సద్గుణ సంపన్నత వలన విష్ణుభగవానుని 'సత్యము' అని కీర్తిస్తారు.
శ్రీ జయతీర్థ. కర్మనిర్ణయ టీక – **సత్యః స్వతంత్రః**.

సత్యమేవ జయతి నాऽనృతమ్, సత్యేన కథాః వితతో దేవయానః
యనాక్రమన్తి ఋషయో హ్యాప్తకామాః యత్ర తత్సత్యస్య నిధానమ్ – అధర్వణ ఉపనిషత్తు మంత్రము 2.6

ఏషమ్ అతివదతి యః సత్యేనతివదతి సోऽహమ్ భగవః సత్యేనావదాన్తి
సత్యమ్ త్వేవ విజిజ్ఞాసితవ్యమ్ ఇతి సత్యమ్ భగవో విజిజ్ఞాస ఇతి – ఛాందోగ్యోపనిషత్తు మంత్రము 7.16.1

తత్ సత్యమ్ సత్ ఇతి ప్రాణః తి ఇతి అన్నమ్ యమ్ ఇతి అసౌ ఆదిత్యమ్ తద్ ఏతత్ త్రివృత్.....
య ఏవమ్ ఏతత్ సత్యస్య సత్యత్వమ్ వేద – ఐతరేయోపనిషత్తు మంత్రము 2.1.7

874. సత్యధర్మపరాయణః

- తన భక్తులు నిష్కామంగా ఆచరించే నిజమైన ధర్మమువల్ల మిక్కిలి ప్రసన్నమగువాడు.
- సత్యమునందు, శాస్త్రములలో చెప్పిన ధర్మమునందు ఆసక్తి కలిగినవానియందే స్థితమైనవాడు.
- ఉత్తమమైన ధర్మము నాచరించువారికి తోడై దారి చూపువాడు.
- సత్యమును, ధర్మమును ఆచరించే యదువు, తుర్వశుడు (?) వంటివారికి ఆశ్రయమైనవాడు.

ఓం సత్యధర్మపరాయణాయ నమః

సత్యశ్చ అసౌ ధర్మః సత్యధర్మః సచ్చిదానంద లక్షణః స ఏవ పరః అయనమ్ - ఆశ్రయః స్వరూపమ్ వా సత్యధర్పరాయణః. సత్యము, ధర్మము ప్రకారము నడచుకొనేవాడు మరియు మరియు సత్యమునకు, ధర్మమునకు నిలయమైనవాడు సత్యధర్మపరాయణుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – సత్యధర్మము - శాస్త్రములలో చెప్పిన సరియైన (నివృత్తి) ధర్మము. పరాయణమ్ - పరమ ప్రీణనమ్ - మిక్కిలి ప్రసన్నమగుట. సాత్విక శాస్త్రములలో చెప్పినట్లు నివృత్తిధర్మము పాటించువారి చర్యలకు

భగవంతుడు మిక్కిలి సంతోషించును. అనగా ఇతర ప్రయోజనములను ఆశించక, సర్వమును **"శ్రీ భగవదాజ్ఞాయ శ్రీమన్నారాయణ ప్రీత్యర్థమ్"** ఆచరించవలెను.

ఉపాధిరహితస్సత్యముఖో ధర్మపరాయణమ్

పరమప్రీణనమ్ యస్య సత్యధర్మపరాయణః

ఇతరమైన ఫలితాలు అపేక్షించని సత్వగుణ ప్రధానమైన ధర్మాచరణముతో మిక్కిలి ప్రసన్నమయ్యేవాడు సత్యధర్మపరాయణుడు. (శ్రీకైవల్య సారధి).

శ్రీ చిన్మయానంద – **కర్తవ్య అకర్తవ్య విధిరేవ ధర్మః.** శాస్త్రానుసారము చేయదగినవి, చేయకూడనివి అయిన కర్మల గురించిన నియమములే ధర్మము.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సత్యే యథాభూతార్థ కథనే ధర్మ చ, చోదనా లక్షణే నియత ఇతి సత్యధర్మపరాయణః.** సత్యమునందు, శాస్త్రవిధానముననుసరించు ధర్మమునందును నియతుడైనవాడు (అందు శ్రద్ధ కలిగి ఆచరించువాడు) సత్యధర్మపరాయణుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **సత్యః సమీచీనో ధర్మాచారో ఏషామ్ తే సత్యధర్మాణః, తేషామ్ పరమ పరమమ్ అయనమ్ గతిః ఆధారో వా యః సత్య ధర్మ పరాయణః.** సత్యమును, ధర్మమును ఆచరించువారికి తోడుండి వారికి తగు దారి చూపువాడు సత్యధర్మ పరాయణుడు.

శ్రీ రఘునాథ తీర్థ – సత్య-ధర్మ-పర-అయనః.

సత్సు భవః సత్యః, స చ అసౌ ధర్మశ్చ సత్యధర్మః

సత్య-ధర్మేషు సాత్త్విక ధర్మేషు పరమ్ తాత్పర్యమ్

యేషామ్ తే సత్యధర్మపరాః, యదు, తుర్వశ ఆది భక్తజనాః

తేషామ్ అయనమ్ ఆశ్రయః ఇతి సత్యధర్మపరాయణః.

సాత్విక ధర్మమునాచరించేవారు సత్యధర్మపరులు. యదువు, తుర్వశుడు వంటి సత్యధర్మపరులకు అయనము (ఆశ్రయము) అయినవాడు సత్యధర్మపరాయణుడు.

ఇలాంటివే మరి రెండు నామములు:

31వ శ్లోకము. 290వ నామము. **సత్యధర్మపరాక్రమః**

56వ శ్లోకము. 532వ నామము. **సత్యధర్మః**

875. అభిప్రాయః

- సత్యధర్మనిష్ఠ గల సాత్వికులచే కోరబడువాడు.
- ప్రళయకాలంలో సకలజీవులు ఆయనకు అభిముఖంగా వెళ్ళి ఆయనలో కలిసిపోతాయి.

- పురుషార్థములు వాంఛించువారిచేత కోరబడువాడు.

- అందరి కార్యములకు ప్రేరణ అయినవాడు.

ఓం అభిప్రాయాయ నమః

'అభిప్రాయము' అంటే సాధారణమైన అర్థము – ఉద్దేశ్యము, లక్ష్యము, కోరిక. **అభిప్రీయతే కామయతే స్వజనహితో యేన ఇతి అభిప్రాయః.** తన భక్తుల హితము కోరేవాడు 'అభిప్రాయః'.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **సత్యధర్మనిష్ఠేన స్వచ్ఛేన నిరుపాధిక ఉద్దేశ్యతయా అభిప్రేతః ఇతి అభిప్రాయః.** సత్యధర్మనిష్ఠాపరులు, సాత్విక పరాయణులు అయినవారు ఎవరిని ఉద్దేశించి కోరుకుంటారో ఆయన 'అభిప్రాయః'.

స్వచ్ఛేన ధర్మనిష్ఠేన సత్యేన చ విశేషతః
నిరుపాధికోద్దేశ్యత్వాదభితః ప్రేయతే చ యః
అభిప్రాయ స్స విజ్ఞేయః వస్వర్ణో మనురుత్తమః

ధర్మముతోను, సత్యనిష్ఠలతోను, సర్వకాల సర్వావస్థలయందును, అందరిచేత సేవింపబడువాడు, అందరిచేతను పరమప్రయోజనము కొరకు కోరబడువాడు 'అభిప్రాయః'. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. ఉత్తమ సాధనము. ఓం అభిప్రాయాయ నమః. (శ్రీకైవల్యసారధి).

పెరియతిరుమొళి 2.3.2 –ఉత్తమ సాధువులు ఆస్వాదించే తీయని, పిప్పిలేని పండు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **అభిప్రేయతే పురుషార్థ కాంక్షిభిః.** ధర్మార్థకామమోక్షములనే పురుషార్థములను కోరేవారు ఇతనిని కోరుకుంటారు.

శ్రీ శంకరుల మరొక వ్యాఖ్య – **అభిముఖ్యేన ప్రళయే అస్మిన్ ప్రైతి ఇతి వా అభిప్రాయః.** ప్రళయకాలంలో ఈయనకు అభిముఖంగా వెళ్ళి (ప్రైతి) జీవులు ఈయనలో లీనమవుతాయి గనుక ఆయన 'అభిప్రాయః'

శ్రీ రఘునాథ తీర్థ – తత్వసారము – **అభి అభితః ప్రకర్షేణ ప్రాయః ప్రేరణక్రియా యస్య ఇతి అభిప్రాయః.** నేరుగా అందరి కార్యములను ప్రేరేపించువాడు 'అభిప్రాయః'.

876. ప్రియార్హః

- తన భక్తుల ప్రేమ పొందడానికి యోగ్యుడు. వారి ప్రేమను పొంది వారిపట్ల కృతజ్ఞత చూపువాడు.

- మనకిష్టమైనవానిని సమర్పించడానికి అర్హుడైనవాడు. వానిని స్వీకరించువాడు.

ఓం ప్రియార్హాయ నమః

ప్రీ - తర్పణే, కాంతౌచ - సంతోషపెట్టుట, సంతోషించుట. అర్హ - పూజాయామ్, యోగ్యత్వే చ - పూజించుట, తగియుండుట (యోగ్యత కలిగియుండుట). **ప్రియమ్ అర్హతి ఇతి ప్రియార్హః**. ప్రేమను పొందడానికి యోగ్యమైనవాడు. **ప్రియేషు అర్హ-యోగ్యః ప్రియార్హః**. ప్రేమించడానికి అందరికంటే యోగ్యుడు ప్రియార్హుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతుడు భక్తులను ఎంతో గాఢంగా ప్రేమిస్తాడు. భక్తులు తమ భక్తిని భగవంతునికి సమర్పించి, తమ అవుసరాలకోసం ఆయనపై ఆధారపడతాడు. ఇలాంటి భక్తుల ప్రవర్తన ఎంతో ఉదారమైనదని భగవంతుని ఉద్దేశ్యము. ఎందుకంటే అలాంటి భక్తులు తమ సర్వస్వాన్నీ భగవంతునికి అర్పించుతారు. ఆ భక్తులపట్ల భగవానుడు ఎంతో కృతజ్ఞుడైయుంటాడు. ఈ విధంగా భక్తుల ప్రేమను పొందానికి అర్హుడు గనుక భగంతుడు ప్రియార్హుడు.

ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీత్వాత్మైవ మే మతమ్
ఆస్థితః స హి యుక్తాత్మా మామేవా నుత్తమాం గతిమ్ – గీత 7.18
ఈ చతుర్విధ భక్తులందరును ఉదారులే (ఆనగా భగవంతునియందు విశ్వాసమునుంచి ఎల్లప్పుడు అతనినే సేవించుచు ఉండువారు). కాని జ్ఞానియైనవాడు నా స్వరూపమే. ఇది నా అభిప్రాయము. ఏలనన అట్టి భక్తుడు తన మనస్సును, బుద్ధిని నాయందే స్థిరముగానుంచి, నన్నే పరమప్రాప్యునిగా భావించును. విధముగా అతడు నాయందే స్థితుడు. ఇలా భక్తులు తమ సర్వస్వమును తనకు అర్పించినందున వారు 'ఉదారులు' (అనగా దాతృత్వము కలవారు) అని భగవంతుడు భావించును. అంతగా ఆయన తన భక్తులను గౌరవించును. కనుక ఆయన భక్తుల ప్రేమకు అర్హుడు.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమోళి 7.5.11 – అనన్యభక్తితో తనను శరణుజొచ్చిన భక్తులకు కృష్ణభగవానుడు తన దివ్యపాదపద్మములపట్ల నిత్యశ్రద్ధను ప్రసాదిస్తాడు. అయినాగాని తన భక్తులకు ఇంకా తగు ప్రతిఫలం ఇవ్వలేదని ఆయన భావిస్తాడు. (అందుకే ద్రౌపది ఆర్తనాదానికి తగినంతగా స్పందింపలేకపోయానని శ్రీకృష్ణుడు తన వైకుంఠగమనకాలంలో కూడా అన్నాడు).
భక్తులపట్ల ఇంత ప్రేమ ఉన్న భగవానుడు భక్తులకు ప్రియార్హుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – ప్రియమైనవి అనగా మనకు అత్యంత ఇష్టమైనవి. అలా మనకు అత్యంత ప్రియమైనవానిని ఎవరికైనా సమర్పించాలంటే అందుకు అర్హుడు భగవంతుడే. కనుక ఆయన ప్రియార్హుడు.

లోకమునందు తనకు మిక్కిలి ఇష్టమైన వస్తువును, దానియొక్క అక్షయఫలము కొరకు అర్హుడగువానికి ఆ వస్తువులను దానము చేయవలెనని శాస్త్రము చెబుతున్నది. అలాంటి వస్తువును స్వీకరించే అర్హత కలవాడు పరమేశ్వరుడే గనుక ఆయన ప్రియార్హుడు. ఇందుకు శ్రీ శంకరులు విష్ణుధర్మోత్తరమునుండి ఉదాహరించారు.
యద్యత్ ఇష్టతమమ్ లోకే యచ్చాస్య దయితుమ్ గృహే
తత్తత్ గృణవతే దేయమ్ తదేవ అక్షయమ్ ఇచ్ఛతా – మహాభారతము 13.58.7, విష్ణుధర్మోత్తరము 55.3

అక్షయ ఫలమును (బ్రహ్మమును) కోరేవారు తమకిష్టమైన వస్తువులను, మరియు ఇంటిలోని మంచి వస్తువులను తగు యోగ్యత కలవారికి సమర్పించాలి (ఇది భగవంతునికి సమర్పించినట్లగును.)

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – బృహదారణ్యక మంత్రము. **ఆత్మనస్తు కామాయ సర్వమ్ ప్రియమ్ భవతి.** ఎవరికైనా ఇష్టమైన వస్తువులలో అన్నింటికంటె ప్రధానమైనది ఆత్మయే.

శ్రీ వైష్ణవసంప్రదాయంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన ప్రపత్తి అనగా ఆత్మసమర్పణమునకు ఈ నామవివరణతో సంబంధము చెప్పవచ్చును.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **ప్రియాణి స్రక్-చందనాని అర్హతి ఇతి ప్రియార్హః.** చక్కని పూలదండలతోను, చందనాదులోను పూజలందుకొనుటకు అర్హుడైనవాడు ప్రియార్హుడు.
యజుర్వేద మంత్రము 23.19 – **ప్రియాణామ్ ప్రియపతిమ్ హవామహే.**

877. అర్హః

పూజింపదగినవాడు.

ఓం అర్హాయ నమః

అర్హతే - ప్రాప్తుమ్ యుజ్యత ఇతి అర్హః. పొందడానికి యోగ్యుడైనవాడు అర్హుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **అనన్య స్పృహాణామ్ తేషామపి అయమేవ యోగ ఇతి అర్హః.** (మోక్షము తప్ప) ఇతర కాంక్షలు లేనివారిచే కోరబడుటకు అర్హుడు. ఇందుకు శ్రీ భట్టులు గీత (7.18)నుండి ఉదాహరించారు. **ఆస్థితః స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్.** (జ్ఞానియైన) భక్తుడు తన మనస్సును, బుద్ధిని నాయందే స్థిరముగానుంచి, నన్నే పరమప్రాప్యునిగా భావించున. ఈ విధముగా అతడు నాయందే స్థితుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **స్వాగత, ఆసన, ప్రశంసా, అర్ఘ్య, పాద్య, స్తుతి, నమస్కార ఆదిభిః పూజా సాధనైః పూజనీయ ఇతి అర్హః.** స్వాగతము, ఆసనము, ప్రశంస, అర్ఘ్యము, పాదప్రక్షాళనము, స్తుతి, నమస్కారము మున్నగు షోడశోపచారములతో పూజింపదగినవాడు గనుక శ్రీహరి అర్హుడు.

అన్నమయ్య కీర్తన

షోడశకళానిధికి షోడశోపచారములు - జాడతోడ నిచ్చలును సమర్పయామి

అలరు విశ్వాత్మకున కావాహన మిదె సర్వ - నిలయున కాసనము నెమ్మి నిదే
అలగంగా జనకున కర్ఘ్యపాద్యాచమనాలు - జలధి శాయికిని మజ్జనమిదే

వరపీతాంబరునకు వస్త్రాలంకారమిదె - సరి శ్రీమంతునకు భూషణము లివే
ధరణీధరునకు గంధపుష్ప ధూపములు - తిర మిదె కోటిసూర్యతేజునకు దీపము

అమృతమథనునకు నదివో నైవేద్యము - గమి(రవి)జంద్రునేత్రునకు కప్పురవిడెము
అమరిన శ్రీవేంకటాద్రి మీది దేవునికి - తమితో ప్రదక్షిణాలు దండములు నివిగో

శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఈ నామములోని భావమును ఇలా చక్కగా చెప్పారు – **సర్వాంతర్గతాన్ సర్వాన్ భోగాన్ విహాయ శ్రేయోర్థినామ్ విదుషామ్ సర్వప్రకారైః సాధనైః సోపకరణైః పూజావిధానైః సర్వకర్మార్పణేన నిష్కామకర్మభిశ్చ స ఏవ ప్రాప్తుమ్ యోగ్య ఇతి అర్హః.** విద్వత్తు కలిగినవారు అన్ని భోగములను పరిత్యజించి, పరమానందమును మాత్రమే ఆశించి, తమ సమస్త సాధనలను, పూజాది క్రియలను, ఆయా పనులవలన కలగే ఫలాలను, ఇలా అన్నింటినీ ఆ భగవానునికే సమర్పిస్తారు. కనుక భగవానుడే పూజార్హుడు. ఇక్కడ గమనించవలసిన విషయం ఏమంటే ఇతర కోరికలు లేనివారు విష్ణువును పూజించుదురు. వారికి విష్ణువు పూజార్హుడు.

ఋగ్వేద మంత్రము 1.94.1

ఇమామ్ స్తోమమ్ అర్హతే జాతవేదసే రథమైవ సమ్ మహేమా మనీషయా
భద్రాహి నః ప్రమతిరస్య సంసద్యగ్నే సఖ్యే మా రిషామా వయమ్ తవ

ఇంకా శ్రీ వాసిష్ఠ ఇలా చెప్పారు – భగవానుని అర్హత్వము మనందరిలోనూ ఎంతోకొంత ప్రతిబింబిస్తుంది. కనుక ఎంతో కొంత అర్హులమే.

శ్రీ రఘునాథ తీర్థ **'అర్హః'**, **'ప్రియకృత్'** అనే రెండు నామాలనూ కలిపి **'అర్హప్రియకృత్'** అనే పాఠ్యాంతరాన్ని చెప్పారు.

ఓం అర్హప్రియకృతే నమః

అర్హేభ్యః - యోగేభ్యః భక్తేభ్యః ప్రియమ్ కరోతి ఇతి అర్హప్రియకృత్. యోగ్యులైన తన భక్తులపట్ల రక్షణాది ప్రియమైన కార్యములను నిర్వర్తించేవాడు **'అర్హప్రియకృత్'**.

878. ప్రియకృత్

భక్తులకు ప్రియమును కూర్చువాడు. మోక్షమును మాత్రమే కాక అన్య కామితార్థములను కూడ ప్రసాదించువాడు.

ఓం ప్రియకృతే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **అన్య పరానపి భజతః తచ్ఛందానువర్తనేన ప్రియాన్ కరోతి ఇతి ప్రియకృత్.** (మోక్షమే కాకుండా) ఇతర కోరికలు కోరే భక్తుల కోరికలు కూడా తీర్చువాడయ ప్రియకృత్.

భజతోऽప్యన్య భక్తాన్యః స్వప్రియాన్ కురుతే సదా
చందానువర్తనేనేతి ప్రియకృత్ స చ కథ్యతే
ఇతర ప్రయోజనాలనాశ్రయించి తననాశ్రయించినవారిని కూడా, చివరకు తననే కోరునట్లు చేసేవాడు. అనగా ఒకవేళ భక్తుడు సిరిసంపదలు, భోగభాగ్యాలకోసం భగవంతుని ఆశ్రయించినప్పటికీ, ముందుగా వాటిని ఇచ్చి, చివరకు ఆ భక్తుని మోక్షంవైపు ఆకర్షించేవాడు ప్రియకృత్. (శ్రీకైవల్య సారధి).

శ్రీ శంకరుల వ్యాఖ్య – **న కేవవలమ్ ప్రియార్హ ఏవ, కిన్తు స్తూయాదిభిః భజతామ్ ప్రియమ్ కరోతి ఇతి ప్రియకృత్.** భగవంతుడు కేవలం 'ప్రియార్హుడు' (876వ నామము) మాత్రమే కాదు. స్తుతివంటి కార్యాలద్వారా తనను ఆరాధించే భక్తుల కోరికలు తీర్చి వారికి ప్రియము చేకూర్చేవాడు.

శ్రీ వాసిష్ఠ భగవంతునికి ప్రీతి కలిగించేవిగా కొన్ని వైదిక మంత్రాలను ఉదాహరించారు. వానివల్ల సంతుష్టుడై భగవానుడు భక్తుల కోరికలను తీరుస్తాడు.
వషట్ తే విష్ణవాస అకృనోమి తన్ మే జుషస్వ శిపివిష్ట హవ్యమ్
వర్ధన్తు త్వా సుష్టుతయో గిరోమే యూయమ్ పాతవస్తిభిః సదా నః – ఋగ్వేదము 7.99.7
ఈ స్తుతి వాక్యములు నిన్ను సంతుష్టుని చేయుగాక. మాకు మరిన్ని దీవెనలనిమ్ము.
ఋగ్వేదము 1.189.1 – సన్మార్గంలో మమ్ములను సంపన్నులను చేయుము. మమ్మల్ని పెడత్రోవ పట్టించే పాపాలను తొలగించుము.
ఋగ్వేదము 3.62.10 – అంతనూ సృష్టించే భగవానుని దివ్యతేజస్సును మేము ధ్యానిస్తున్నాము. అది మమ్మల్ని చైతన్యులను చేయుగాక.

శ్రీ రఘునాధ తీర్థ **'అర్హప్రియకృత్'** అనే ఒకే నామమును పరిగణించారు. భక్తులకు రక్షణను, ప్రేమను ప్రసాదించేవాడు అర్హప్రియకృత్.

879. ప్రీతివర్ధనః

- తన భక్తులలో సంతోషమును, భక్తిని వృద్ధి చేసేవాడు.
- తన భక్తుల ప్రేమను పూరించేవాడు.

ఓం ప్రీతివర్ధనాయ నమః

వృద్ - వృద్ధౌ - పెంచుట. వర్ధ్ - పూరణ - నింపుట.
శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతుడు తన గుణముల అతిశయంతో తన భక్తులలోని ఆనందమును పెంపొందించును. కనుక ఆయన ప్రీతివర్ధనుడు.

గుణావిష్కరణాన్నిత్యం ఉత్తరోత్తరతోऽధికమ్

యస్తు ప్రీతమ్ వర్ధయతి ప్రీతివర్ధన ఈరితః.

ఈ రకంగా ఇతరదేవతల నారాధించే భక్తులకు తన మహిమలు చూపిస్తూ, వారికి తనయందు భక్తిని పెంపొందింపజేయువాడు ప్రీతివర్ధనుడు (శ్రీకైవల్యసారధి).

శ్రీ భట్టులు గీత (10.10)నుండి ఉదాహరించారు.

తేషామ్ సతతయుక్తానామ్ భజతాం ప్రీతిపూర్వకమ్

దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే

అట్లు నిరంతరము ధ్యానాదులద్వారా నాయందే లగ్నమనస్కులై నన్నే భజించువారికి నేను బుద్ధియోగమును, అనగా తత్వజ్ఞానరూపయోగమును ప్రసాదించెదను. దానిద్వారా వారు నన్నే పొందుదురు.

శ్రీ భగవద్రామానుజులు తమ గీతాభాష్యం ప్రవేశికలో శ్రీకృష్ణభగవానుని గురించి ఇలా చెప్పారు – శ్రీకృష్ణభగవానుడు తన నిరతిశయ (అంతులేని) సౌందర్య శీలాది గుణములచే అక్రూరుడు, మాలాకారుడు వంటివారిని కూడా పరమభాగవతులుగా చేశాడు. ఇలా భగవంతుడు భక్తుల ప్రీతి (భక్తి, ఆనందము)ను వర్ధిల్లజేయును గనుక ఆయన ప్రీతివర్ధనుడు.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమోళి (1.10.10) – భగవంతుడు తన సుందర నయన పద్మాల సహాయంతో నమ్మాళ్వారు హృదయంలో తిష్ఠ వేశాడు. కనుక ఆళ్వారు భగవంతుని మరచిపోలేదు.

శ్రీ చిన్మయానంద – భగవంతుని గరించి అలోచించినకొద్దీ ఆయనపట్ల మన ప్రీతి వర్ధమానమవుతోంది. కనుక భగవంతుడు ప్రీతివర్ధనుడు.

శ్రీ సత్యసంధ తీర్థ – **ప్రీతిమ్ భక్తేషు వర్ధయతి ప్రీత్వా భక్తాన్ వర్ధయతి ఇతి వా ప్రీతివర్ధనః**. భగవంతుడు భక్తులలో ప్రేమను పెంపొందించును. మరియు ప్రేమతో భక్తులను వృద్ధి చేయును. కనుక ఆయన ప్రీతివర్ధనుడు.

శ్రీ వాసిష్ఠ చెప్పిన మరొక అర్థము – వర్ధ్ - ఛేదన పూరణయోః - ఖండించుట, నిలుపుట. **ప్రీతిమ్ వర్ధయతి పూరయతి ఇతి ప్రీతివర్ధనః**. తన భక్తుల ప్రేమను సఫలము చేయువాడు ప్రీతివర్ధనుడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

విహాయసగతిర్జ్యోతిః సురుచిర్హుతభుగ్విభుః |
రవిర్విరోచనః సూర్యః సవితా రవిలోచనః || (94)

శ్రీ భట్టులు ఈ శ్లోకములో 'జ్యోతి' మొదలుకొని నామములను, మరియు తరువాతి శ్లోకములోని మొదటి నామమును అర్చిరాది మార్గములోని వివిధ దశలను సూచించునవిగా వ్యాఖ్యానించారు. అర్చిరాది మార్గములు అనగా ముక్తజీవుడు పరబ్రహ్మమును చేరుకొనే ప్రయాణంలో తారసపడే వివిధ సోపానములు (లోకములు). ఈ మార్గదశల పేర్లు వివిధ ఉపనిషత్తులలో కొంచెం తేడాగా ఉన్నాయి.

ఛాందోగ్యోపనిషత్తు (4.15.5, 4.15.6, 5.10.1, 5.10.2) ప్రకారం
అర్చిస్ (అగ్ని), అహః (పగలు), శుక్లపక్షము, ఉత్తరాయణము, సంవత్సరము, ఆదిత్య, చంద్ర, విద్యుత్.
కౌషీతకి ఉపనిషత్తు (1.2.1) ప్రకారం
అగ్నిలోకము, వాయులోకము, వరుణలోకము, ఆదిత్యలోకము, ఇంద్రలోకము, ప్రజాపతి లోకము.
బృహదారణ్యకోపనిషత్తు (8.2.15, 7.10.1) ప్రకారం
అర్చిస్, అహః, శుక్లపక్షము, ఉత్తరాయణము, దేవలోకము, ఆదిత్య, వైద్యుత.

ఛాందోగ్యోపనిషత్తులోని మంత్రము (5.10.1)
తద్య ఇత్థమ్ విదుః
యే చేమేऽరణ్యే శ్రద్ధా తప ఇత్యుపాసతే - తేऽర్చిషమ్
అభిసంభవన్తి, అర్చిషోऽహః
అహ్నో ఆపూర్యమాణ పక్షమ్
ఆపూర్యమాణ పక్షాత్ యాన్ షడుదన్నేతిమాసాన్స్తాన్

పంచాగ్నులగురించి తెలిసినవారు, అరణ్యాలలో బ్రహ్మమును గురించి శ్రద్ధతో తపస్సు చేసేవారు అగ్నిలో ఏకమౌతారు. అగ్నినుండి పగలుదేవత వద్దకు, అక్కడినుండి శుక్లపక్షదేవత వద్దకు, అక్కడినుండి ఉత్తరాయణదేవత వద్దకు వెళతారు.

ఛాందోగ్యోపనిషత్తు (5.10.2)

మాసేభ్యః సంవత్సరమ్, సంవత్సరాత్ ఆదిత్యమ్,

ఆదిత్యాత్ చంద్రమాసమ్, చంద్రమాసో విద్యుతమ్,

తత్ పురుషో అమానవః, స ఏవాన్ బ్రహ్మగమయతి

ఏష దేవపథో బ్రహ్మపథః

ఏతేన ప్రతిపద్యమానా ఇమామ్ ఆవర్తమ్ నావర్తన్తే నావర్తన్తే

ఉత్తరాయణమునుండి ఆ జీవుడు సంవత్సరమునకు, అక్కడినుండి ఆదిత్య లోకమునకు, అక్కడినుండి చంద్రమాస లోకమునకు, అక్కడినుండి విద్యుత్ లోకమునకు వెళ్ళును. అక్కడినుండి అమానవుడు ఆ జీవిని బ్రహ్మమార్గమునకు కొనిపోవును. ఇలా ఈ మార్గంలో వెళ్ళిన జీవుడు మరల సంసారమునకు తిరిగిరాడు.

శ్రీ భగవద్రామానుజులు శ్రీభాష్యము (4.3.1 సూత్రము)లో ఈ మార్గము గురించి విపులంగా చర్చించారు. ఆయన చెప్పిన ప్రకారం ఈ మూడు ఉపనిషత్తులలోను చెప్పిన దశలు ఆయా వర్ణనల ప్రకారం సరిగా అర్థం చేసుకొంటే ఒకే క్రమంలో చెప్పవచ్చును. ఆ 12 దశలు ఇలా ఉన్నాయి.

1. అర్చిస్ (అగ్ని)
2. అహః (పగలు)
3. శుక్లపక్షము (పూర్వపక్షము)
4. ఉత్తరాయణము
5. సంవత్సరము
6. వాయువు
7. ఆదిత్య
8. చంద్ర
9. వైద్యుత్
10. వరుణ
11. ఇంద్ర
12. ప్రజాపతి

ఈ 12 దశలు, వాని పేర్లు ఏదో ఒకటి అన్న పద్ధతిలో చెప్పబడినవి కావు. వివిధ ఉపనిషత్తులను క్షుణ్ణంగా విశ్లేషించి శ్రీ భగవద్రామానుజులు ఈ 12 పేర్లను ఈ క్రమంలో చెప్పారు. శ్రీభాష్యము 4.3.2లో ఈ విషయం గురించి మరిన్ని వివరాలున్నాయి. ముక్తులు ఈ భౌతికజీవనంనుండి పరమపదము చేరుకొనే మార్గంలో ఈ పన్నెండుగురు అధిష్టానదేవతలు దారిని సుగమం చేస్తారు. వారిని 'అతివాహికలు' అని కూడా అంటారు.

శ్రీ భట్టులు చెప్పిన వివిధ నామములు, వానికి అర్చిరాది మార్గము దశలతో ఉన్న సంబంధము క్రింది జాబితాలో ఇవ్వడమైనది.

880. **విహాయసగతిః** – ముక్తజీవుని భగవంతుడు స్వయంగా తోడ్కొనిపోవునని సారాంశము.

881. **జ్యోతిః** – అగ్ని.

882. **హుత-భుగ్-విభుః** – శుక్లపక్షమునకు అధిష్టాన దేవత.

883. **రవిః** – ఉత్తరాయణకాలపు అధిష్టాన దేవత.

884. **విరోచనః** – సంవత్సరమునకు అధిష్టాన దేవత.

885. **సూర్యః** – వాయువు.

886. **సవితా** – సూర్యుడు.

887. **రవిలోచనః** – చంద్రుడు, మెరుపు మరియు వరుణుని సూచించును.

888. **అనంత హుతభుగ్ భోక్తా** – ఇంద్రలోకము, ప్రజాపతి లోకము.

ముక్తజీవుడు ఈ లోకంనుండి శ్రీవైకుంఠమును చేరుకునే విధాన్ని, ఆ మార్గంలో అతివాహికలు ఇచ్చే చేయూతను శ్రీ నమ్మాళ్వారు అతిమధురంగా, సుందరంగా వర్ణించారు –

ముందుగా వైద్యుత దేవుడు (దేవత) ముక్తజీవుని ఆగమనం గురించి ఉరుము ద్వారా తక్కిన అతివాహికలకు ప్రకటిస్తాడు. వరుణుడు ఆకాశాన్నంతటినీ బంగారుకుండలలోని నీటితో నింపిన మేఘాలు పరుస్తాడు. సముద్రాలు సంతోషించి తరంగాలతో ఎగసి ఎగసి పడుతున్నాయి. ఈ 12 అతివాహికలు మాత్రమే కాక, అన్ని లోకాలలోని అతివాహికలు మరియు తపోధ్యానులైన మునులు కూడా వరుసలో నిలబడి ముక్తజీవుని స్వాగతించి గౌరవిస్తారు.

తులసిమాలాలంకృతుడైన శ్రీ భగవానుడు శ్రీ అమ్మవారితో కలసి, చిరకాలంగా తమనుండి దూరమైన భక్తునికోసం ఎదురు చూస్తున్నారు. తన మార్గంలో ముక్తజీవుడు విశ్రమించడంకోసం సకల లోకాలలోని దేవతలు అందమైన పర్ణశాలలను నిర్మిస్తున్నారు. వరుణుడు, ఇంద్రుడు, ప్రజాపతి తమ తమ లోకాల ప్రవేశద్వారాలవద్ద నిలుచుండి ముక్తజీవుని స్వాగతిస్తూ, అతనినుండి ఆశీస్సులు పొందాలని కోరుకొంటున్నారు. సనక నారదాదులు వేదాలను గానం చేస్తూ ముక్తజీవుని ఆహ్వానిస్తున్నారు. దారి అంతటా పండుగ వాతావరణం నెలకొన్నది. మంగళవాయిద్యాల ఘోషలు అంతటా వినబడుతున్నాయి. శ్వేతోన్నతమూర్తులైన నిత్యసూరులు పరమపదము ద్వారంవద్ద నిలబడి ముక్తజీవుని స్వాగతిస్తున్నారు. ఈ శుభసందర్భంలో భగవంతుడుకూడా విశేషంగా ప్రకాశిస్తున్నాడు.

ఆ జీవుడు ఎట్టకేలకు తన శాశ్వత నిలయాన్ని చేరుకొన్నాడని నిత్యసూరులు సంతోషంతో పులకించిపోతున్నారు. ముక్తజీవుని వారు ఇంటింటా పాద్యోపచారాలతో సేవిస్తున్నారు. ముక్తుని వైకుంఠంలోనికి స్వాగతించడంకోసం భగవానుడు, అమ్మవారు ఎదురుచూస్తున్నారు.

880. విహాయస గతిః

- పరమపదమును పొందుటకు సాధనమైనవాడు.

- సూర్యుడై ఆకాశమున (అంతరిక్షంలో) సంచరించేవాడు.

- గరుడుని వాహనంగా చేసుకొని ఆకాశంలో సంచరించేవాడు.

- తాపసులు తమ తపస్సుద్వారా ఆయనను పొందుతారు.

ఓం విహాయస గతయే నమః

వి (ఉపసర్గ). హా - గతౌ - వెళ్ళుట, పొందుట, సాధించుట. హా - త్యాగే - వదలివేయుట. అసున్ (ప్రత్యయము)

విహాయస – దేనిద్వారా ప్రయాణిస్తామో అది, అనగా ఆకాశము, అంతరిక్షము.

విహాయస – త్యాగము, తపస్సు ఆచరించే సాత్వికులు.

అమరకోశము ప్రకారము – **విహాయస - వియద్ విష్ణుపదమ్ విహాయసీ,** అనగా ఆకాశము, పక్షి, విష్ణువు నివాసస్థానము అనే అర్థాలున్నాయి.

గతి - పొందునది, లక్ష్యము.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు 'విహాయసము' అంటే 'విష్ణుపదము' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. **తథా నిరూఢ భక్తి పరకోటిభిః విహాయసమ్ - పరమవ్యోమ పదమేవ గమ్యతే అస్మాత్ ఇతి విహాయస గతిః.** ఆయన ద్వారానే పరమభక్తులు పరమపదమును చేరుకుంటారు కనుక భగవంతుడు 'విహాయస గతి'.

నిరూఢ భక్తియుక్తైర్హి నిత్యం యస్మాత్తు గమ్యతే

విహాయసం పరంవ్యోమ విహాయసగతిస్తు సః

భక్తిలో పరాకాష్ఠను చేరినవారికి పునరావృతి లేని పరమాకాశమనే పరమపదాన్ని ఇచ్చేవాడు విహాయసగతి. (శ్రీకైవల్య సారధి).

శ్రీ భట్టులు విష్ణుపురాణము (5.19.26)నుండి ఉదాహరించారు.

భుక్త్వాంచ విపులాన్ భోగాన్ తమంతే మత్ప్రసాదాదజమ్

మమానుస్మరణమ్ ప్రాప్య దివ్యమ్ లోకమవాప్స్యసి

నా దయవల్ల అనేక భోగములు అనుభవించి, అనంతరం అవసానసమయంలో నన్ను స్మరిస్తావు. అలా దివ్యమైన పరమపదమును పొందుతావు.

మరియు బ్రహ్మసూత్రములు (4.2.16)కూడా ఉదాహరించారు.

తదోకః అగ్రజ్వలనమ్ తత్ప్రకాశితద్వారో విద్యా సామర్థ్యాత్ తచ్

ఛేషగత్యనుస్మృతి యోగాచ్చహార్దానుగృహీతః శతాధీకయా

తాను నిష్టతో ఆచరించిన భక్తియోగమువలనను, భగవంతుని పరంధామమును గురించి తదేకదృష్టితో సాగించిన ధ్యానమువలనను భక్తుడు తన అవసాన సమయములో తాను శరీరమును విడచి వెళ్ళవలసిన ద్వారమును చూడగలడు. మరియు మూర్ధాయనాడి లేదా సుషుమ్నానాడి ద్వారా జీవుడు శరీరమును వదలినచో ఆ మార్గము భగవంతుని పరంధామమునకు తీసికొని వెళ్ళును.

పెరియతిరుమొళి 5.8.5 – భగవంతుడు ముందుగా భక్తుడు ఇహలోక సౌఖ్యములు అనుభవించేలా చేస్తాడు. అనంతరం తన లోకానికి తీసికొని వెళతాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు 'గతి' అనగా 'నివాసము' లేదా 'నిలయము' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. **విహాయసః - విహాయసమ్ గతిః - ఆశ్రయః అస్య ఇతి విహాయసగతిః, విష్ణుపదమ్ ఆదిత్యో వా.** విహాయసము (ఆకాశము లేదా అంతరిక్షము) తన ఆశ్రయము (నిలయము)గా గలవాడు. ఈ అర్థము శ్రీమహావిష్ణువునకు లేదా సూర్యదేవుని రూపంలో ఉన్న శ్రీమహావిష్ణువునకు కూడ వర్తించును.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **విహాయసే అంతరిక్షే గతిః గమనమ్ యస్య స విహాయస గతిః - సూర్యః.** సూర్యునిరూపంలో అంతరిక్షంలో సంచరించేవాడు విహాయసగతి.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి కూడా 'విహాయసము' అనగా 'ఆకాశము' అన్న భావాన్ని మరింత విపులీకరించారు. అడ్డంకులు లేని, ఆధారం అవుసరంలేని, అంతులేని ఆకాశమే తన దారిగా కలిగినవాడు శ్రీసూర్యనారాయణమూర్తియైన భగవానుడు. తన సృష్టిపైనున్న మక్కువతో భగవంతుడు సూర్యరూపుడై దానిని సంరక్షించును. కనుక ఆయన ప్రియకృత్, ప్రీతివర్ధనుడు. తరువాతి 10 నామములను కూడా శ్రీసూర్యనారాయణ పరంగా శ్రీ రాధాకృష్ణశాస్త్రి వ్యాఖ్యానించారు.

శ్రీ కృష్ణత్త భరద్వాజ 'విహాయసము' అంటే 'ఆకాశము', 'పక్షి' అనే రెండు అర్థాలను గ్రహించారు. **విహాయసే - వ్యోమ్ని విహాయః పతినా గతిః యస్య ఇతి విహాయసగతిః.** విహాయసము (అంతరిక్షము)నందు విహాయపతి (గరుడుని)పై సంచరించేవాడు విహాయసగతి. శ్రీ సత్యసంధ తీర్థ కూడా ఇంచుమించు ఇదే అర్థం చెప్పారు. **విహాయసో - గరుడః, తేన తేన గతిః యస్య స విహాయసగతిః.**

శ్రీ వాసిష్ఠ చెప్పిన మరొక అర్థము – విహాయస - తపస్వి (హ్యా-త్యాగే). **విహాయసైః తపస్విభిః, అభిగమ్యతే ప్రాప్యత ఇతి విహాయసగతిః విష్ణుః.** తాపసులు తమ తపస్సుద్వారా ఎవరిని పొందుతారో ఆ శ్రీమహావిష్ణువే విహాయసగతి.

881. జ్యోతిః

- శ్రీవైకుంఠమునకు దారి చూపే కాంతి.

- స్వయంప్రకాశమానుడైన పరమాత్మ.
- సూర్యచంద్రాదులను కూడా వెలిగించే కాంతి.

ఓం జ్యోతిషే నమః

ఈ నామము మొదలు తరువాతి కొద్ది నామములను అర్చిరాది మార్గములో దశలను సూచించేవిగా శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. పరమపదమును చేరుటకు ముక్తులు ప్రయాణించే మార్గమే అర్చిరాది మార్గము.

ద్యుత్ - దీప్తౌ - వెలుగుట. **ద్యుతేరిసిన్ ఆదేశ్చ జః**, అనే ఉనాదిసూత్రం (2.110) ప్రకారం మొదట్లో జకారం వస్తుంది. అలా ఈ 'ద్యుత్' ధాతువునుండి 'జ్యోతి' అనే పదం వస్తుంది. **ద్యోతతే అస్మాత్ ఇతి జ్యోతిః**. ఆయన కారణంగా అన్నీ వెలుగుతాయి గనుక ఆయన జ్యోతి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – జీవుడు పరమపదమునకు వెళ్ళే మార్గంలో మొదటిదశను ఈ నామం సూచిస్తుంది. ఈ అర్చిరాది మార్గంలో మొదటి దేవత 'అర్చిః'. అనగా మొదటి అతివాహిక. ఈ దేవత జీవుని 'పగలు అధిష్టాన దేవత' వరకు తోడ్కొని పోవును.

స్వప్రాప్తే స్సాధనత్వాధ్యః స్వయం నిత్యం విశేషతః
అర్చిరాదిగతేర్జ్యోతిః ప్రథమం సర్వకథ్యతే

తన భక్తులు సాయుజ్యం పొందడానికి సాధనమైన అర్చిరాది మార్గానికి ప్రథమ సోపానమైన 'అర్చిస్సు' అనగా అగ్నిని నియమించువాడు 'జ్యోతి'. ఆ మార్గాన్ని పరమేశ్వరునివల్లనే భక్తులు చూడగలుగుతారు. (శ్రీకైవల్య సారధి).

శ్రీ భట్టులు ఛాందోగ్యోపనిషత్తు మరియు బ్రహ్మసూత్రములనుండి ఉదాహరించారు..
ఛాందోగ్యోపనిషత్తు 5.10.10 – **తే అర్చిషామ్ అభిసంభవన్తి.** అక్కడ వారు అర్చిస్సు (అగ్ని)తో ఏకమౌతారు. అగ్నినుండి పగటి దేవతవద్దకు, అక్కడినుండి శుక్లపక్షమునకు వెళతారు.
బ్రహ్మసూత్రములు 4.3.1 – **అర్చిరాదినా తత్ ప్రథితే.** కాంతి (అర్చిస్సు)తో ప్రారంభమయ్యే ఈ మార్గము సుపరిచితము. అనగా ముక్తజీవులు ప్రయాణించే ఈ అర్చిరాది మార్గము ఉపనిషత్తులలో విపులముగా చెప్పబడినది.
బ్రహ్మసూత్రములు 4.3.4 –**అతివాహికాః తల్లింగాత్.** అతివాహికలు అనగా దారి చూపే దేవతలు. వారు ధ్యానయోగులను బ్రహ్మమువద్దకు తీసికొని పోవుదురు, అనే సూచనలు లభిస్తున్నాయి. వారే ముక్తజీవులను పరంధామమునకు తీసికొని వెళతారు.

శ్రీ వి.వి. రామానుజన్ గీత శ్లోకములు 8.24 నుండి 8.27 వరకు ఉదాహరించారు. బ్రహ్మజ్ఞానమును పొందినవారు బ్రహ్మము వద్దకు పోయే మార్గము ఈ శ్లోకాలలో వర్ణింపబడినది.

గీతోపదేశము. 18వ శతాబ్దపు చిత్రం. వికీపిడియానుండి

అగ్నిర్జ్యోతిరహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్

తత్ర ప్రయాతా గచ్ఛన్తి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః (8.24)

బ్రహ్మవేత్తలైన యోగులు జ్యోతిర్మయ మార్గము ద్వారా బ్రహ్మపదప్రాప్తి నందుదురు. ఈ జ్యోతిర్మయ మార్గమునకు అధిదేవత అగ్ని. దేహత్యాగము చేసిన ఈ యోగులను క్రమముగా దిన (పగలు), శుక్లపక్ష, ఉత్తరాయణ అభిమాన దేవతలు కొనిపోయి పరమపదమునకు చేర్చుదురు (ఇది అర్చిరాది మార్గము).

ధూమో రాత్రిస్తథా కృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్

తత్ర చాన్ద్రమసం జ్యోతిర్యోగీ ప్రాప్య నివర్తతే (8.25)

అట్లే సకామకర్మయోగులు ధూమ్రమార్గముద్వారా స్వర్గాదిలోకములను చేరుదురు. దేహత్యాగము చేసిన ఈ సకామకర్మయోగులను క్రమముగా రాత్రి, కృష్ణపక్ష, దక్షిణాయన అభిమాన దేవతలు కొనిపోయి, స్వర్గాది లోకములను చేర్చుదురు. వారు అచట చాంద్రమస జ్యోతిని పొంది, అనగా తమ శుభకర్మ ఫలములను అనుభవించి, తిరిగి భూలోకమును చేరుదురు.

శుక్లకృష్ణే గతీ హ్యేతే జగతః శాశ్వతే మతే

ఏకయా యాత్యనావృత్తిమన్యయావర్తతే పునః (8.26)

ఈ రెండు మార్గములకును శుక్ల, కృష్ణ మార్గములనియు, లేక దేవయాన, పితృయాన మార్గములనియు వ్యవహారప్రసిద్ధి గలదు. ఇవి సనాతనములు. దేవయాన మార్గమున వెళ్ళువారు పరమగతిని పొంది తిరిగిరారు. పితృయాన మార్గములో వెళ్ళువారు తిరిగివచ్చి జననమరణ చక్రములో పడుదురు.

ఇవి రెండూ (అర్చిరాది మార్గము, ధూమయాన మార్గము) కాక నరకమునకు పోవువారు యామయ మార్గంలో వెళతారని శాస్త్రాలలో చెప్పారు.

(ఈ రచన మొత్తంలో భగవద్గీత నుండి ఉదాహరించిన శ్లోకాలకు తెలుగు అనువాదం ఈ పుస్తకంనుండి యథాతథంగా వ్రాశాను. **శ్రీ జయదయాల్ గోయందకా** – శ్రీ మద్భగవద్గీత – తత్వవివేచనీ హిందీ వ్యాఖ్యకు తెలుగు అనువాదము – అనువాదకులు: డా. ఎమ్. కృష్ణమాచార్యులు, డా. గోలి వెంకటరామయ్య గీతాప్రెస్, గోరఖ్ పూర్ ప్రచురణ.)

భగవద్గీతలో చెప్పిన ఈ అర్చిరాది మార్గమును ఆళ్వారులు తమ దివ్యప్రబంధాలలో సుందరంగా వర్ణించారు. శ్రీ నమ్మాళ్వారు తిరువైమొళి (10.9)లోని పది పాశురాలలో ముక్తజీవుని వైకుంఠయాత్ర, అతనికి మార్గంలో లభించే స్వాగత ఆదరణలు వర్ణింపబడినాయి.

శ్రీ బలదేవ విద్యాభూషణ కూడా శ్రీ భట్టులలాగానే వ్యాఖ్యానించారు. **ద్యోతతే సుషుమ్నయా నిర్గతః తద్భక్తః అర్చిః ప్రాప్య యస్మాత్ స జ్యోతిః.** సుషుమ్నానాడిద్వారా దేహాన్ని వదలిన భక్తునికి దారి చూపే కాంతియే జ్యోతి.

శ్రీ శంకరుల వ్యాఖ్య – నారాయణుడు స్వయముగా (ఇతరులతో నిమిత్తము లేకుండా) ప్రకాశించువాడు గనుక 'జ్యోతి'. ఇందుకు శ్రీ శంకరులు మహానారాయణోపనిషత్తునుండి ఉదాహరించారు. **నారాయణ పరో జ్యోతిరాత్మా నారాయణః పరః.**

ఇతర శ్రుతి వాక్యాలు –

బృహదారణ్యకోపనిషత్తు 4.3.9 – **అత్ర అయం పురుషః స్వయం జ్యోతిః.**

గీత 13.18 – **జ్యోతిషామపి తద్ జ్యోతిః.**

ముండకోపనిషత్తు 2.2.10 – **తమేవ భాన్తమ్ అనుభాతి సర్వమ్ తస్య భాసా సర్వమిదమ్ విభాతి**. తాను మాత్రము స్వయముగా ప్రకాశించును. మరియు అన్నింటిని ప్రకాశింపజేయును. ఆయన కాంతివల్లనే తక్కినవన్నీ ప్రకాశించును.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **ద్యోతతే దీప్యతి కాన్త్యా ఇతి జ్యోతిః.** తన కాంతి ద్వారా అన్నింటినీ వెలిగించేది 'జ్యోతి'.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – సూర్యుని, అగ్నిని వెలిగించేవాడు భగవంతుడే. వేదాలలో సూర్యుని, అగ్నిని కూడా 'జ్యోతి' అని ప్రస్తావించారు. కనుక భగవంతుడు జ్యోతులకు జ్యోతి.

యజుర్వేదము 3.9 – **అగ్నిర్జ్యోతిః జ్యోతిరగ్నిః స్వాహా. సూర్యో జ్యోతిః జ్యోతిః సూర్యః స్వాహా.**

882. సురుచిః

- సుందరమైన కాంతి గలవాడు. అర్చిరాది మార్గములో దినాభిమాన దేవతగా ఉండువాడు.
- జగత్తును రక్షించుటయందు కాంక్ష గలవాడు.
- అన్నింటిలోని కాంతికిని కారణమైనవాడు.
- తన భక్తులయెడ ఎంతో అనురాగము కలవాడు.

ఓం సురుచయే నమః.

రుచ్ - దీప్తావభి ప్రీతౌ - వెలుగుట, అందముగానుండుట, సంతోషించుట. **సుష్ఠు రోచత ఇతి సురుచిః.** చక్కగా ప్రకాశించువాడు సురుచి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు అర్చిరాదిమార్గం పరంగా వ్యాఖ్యను కొనసాగించారు. కాంతి (జ్యోతి) తరువాత పగలు (దినాభిమాన దేవత) ముక్తజీవునికి శ్రీవైకుంఠమువైపు దారి చూపును. ఆ పగలు దేవతయే సురుచి. **సూర్యోదయాత్ రోచతే ఇతి రుచిః. సా అస్య శోభనా ఇతి సురుచిః.** సూర్యోదయమునుండి ప్రకాశించునది రుచి. మరియు సుందరమైనది సురుచి (పగలు). ఇందుకు శ్రీ భట్టులు ఛాందోగ్యోపనిషత్తు (5.10.1)నుండి **'అర్చిషో అహః'** అని ఉదాహరించారు. అగ్ని తరువాత పగలు దేవత బ్రహ్మమునకు పోవు దారి చూపును.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **శోభనో రుచిః దివసః యస్మాత్ స సురుచిః.** ఎవనివల్లనైతే చక్కని పగలు సంభవిస్తుందో ఆయన సురుచి.

శ్రీ శంకరుల వ్యాఖ్య –

(1) ఆయన కాంతి అందమైనది. మంగళప్రదమైనది. ఆకర్షణీయమైనది.

(2) ఆయన ఇష్టము (సంకల్పము) అందమైనది, మంగళప్రదమైనది, ఆకర్షణీయమైనది.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి 'రుచి' అంటే 'ఇష్టము' (కోరిక) అనే అర్థంలో వ్యాఖ్యానించారు. జగత్తును రక్షించే చక్కని సంకల్పము కలవాడు సురుచి.

శ్రీ వాసిష్ఠ – అన్ని కాంతులకూ కారణమైన భగవానుడు సురుచి.

శ్రీ చిన్మయానంద – మంగళప్రదమైన వైభవము, సంకల్పము కలవాడు సురుచి.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – అమరకోశము (3.3.29). **అభిష్వంగే స్పృహాయామ్ చ గభస్తౌ చ రుచిః త్రియమ్.** 'రుచి' అనగా అభిష్వంగము (దృఢమైన అనుబంధము) అనే అర్థం ఉన్నది. **శోభనా రుచిః అభిష్వంగః అనురాగః యస్మిన్ భక్తానామ్ ఇతి సురుచిః.** భక్తులయెడ గాఢమైన అనురాగము కలవాడు సురుచి.

883. హుతభుగ్విభుః

హుతభుక్

విభుః

శ్రీ భట్టులు **'హుతభుగ్విభుః'** అనే ఒకే నామమును పరిగణించారు. శ్రీ శంకరులు, శ్రీ సత్యసంధ తీర్థవంటివారు **'హుతభుక్', 'విభుః'** అనే రెండు నామములను పరిగణించారు.

హుతభుగ్విభుః

శుక్లపక్షముగా ఉండేవాడు.

ఓం హుతభుగ్విభవే నమః

హు - దానాదనయోః - ఇచ్చుట, యజ్ఞము చేయుట, తినుట. భుజ్ - పాలన - అభ్యవహారియోః - రక్షించుట, భుజించుట. 'హు'నుండి 'హుతమ్' అనే పదము, 'భుజ్'నుండి 'భుక్' అనే పదము వచ్చాయి. **హుతమ్ భుంక్తే హుతభుక్.** నివేదించినదానిని భుజించువాడు హుతభుక్. **వివిధో భవతి ఇతి విభుః.** అనేక విధాలుగా (రూపాలుగా) వ్యక్తమగువాడు విభువు. (భూః - సత్తాయామ్ - ఉండుట).

శ్రీ భట్టుల వ్యాఖ్య – **హుతమ్ భుంజనః సోమః.** హుత - యజ్ఞములో సమర్పించినదానిని, భుక్ - భుజించును, మరియు, విభుః - పూర్ణో భవతి - నిండుగా అగును (శుక్లపక్ష చంద్రుడు).

హుతమ్ సుధా పరిణతమ్ భుంజానశ్చంద్రమాస్తథా

విభుః పూర్ణో భవేత్ యస్మిన్ స వై స్యాత్ హుతభుగ్విభుః

హోమంలో వేసిన ద్రవ్యాలన్నీ అమృతంగా మారతాయి. ఆ అమృతాన్ని ఆరగించేవాడు చంద్రుడు. అతడు పూర్ణుడుగా ఉండే శుక్లపక్షమునకు అభిమానిగా ఉండేవాడు 'హుతభుగ్విభుః' (శ్రీకైవల్య సారధి). అర్చిరాది మార్గంలో మూడవ దశను ఈ నామము సూచించును. ఇందుకు కూడ శ్రీ భట్టులు ఛాందోగ్యోపనిషత్తు (5.10.1)నుండి ఉదాహరించారు. **అర్చిషః అహః అహ్నో అపూర్యమాణ పక్షమ్...** అగ్నినుండి పగలు, పగటినుండి శుక్లపక్షము.....

శ్రీ బలదేవ విద్యాభూషణ వ్యాఖ్య శ్రీ భట్టుల వ్యాఖ్యకు సమాంతరంగా, చంద్రునిపరంగా సాగింది. **హుతభుక్ - చంద్రః, విభుః - పూర్ణః, యత్ర స హుతభుగ్విభుః శుక్లపక్షః.** భగవంతుడు శుక్లపక్ష చంద్రునివలె సదా తన భక్తుల జీవితంనుండి అంధకారమును దూరము చేయును.

హుతభుక్ (శ్రీ శంకరుల వ్యాఖ్య ప్రకారము)

- యజ్ఞములందు హోమము చేయబడు ద్రవ్యములను స్వీకరించువాడు.
- యజ్ఞములను రక్షించువాడు.

ఓం హుతభుజే నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

94వ శ్లోము. 883వ నామము. హుతభుక్ – **విహాయసగతిః జ్యోతిః సురుచిః హుతభుక్ విభుః**

95వ శ్లోకము. 889వ నామము. హుతభుక్ – **అనంతో హుతభుక్ భోక్తా సుఖదో నైకదోగ్రజః**

ఈ రెండు శ్లోకాలలోను శ్రీ శంకరుల వ్యాఖ్య ప్రకారము 'హుతభుక్' నామము వచ్చుచున్నది. శ్రీ భట్టుల వ్యాఖ్య ప్రకారము ఆయా నామములు 'హుతభుగ్విభుః' మరియు 'అనంతో హుతభుక్ భోక్తా' నామములలో కలిసియున్నవి.

శ్రీ శంకరుల వ్యాఖ్య. 94వ శ్లోకములో. హుతభుక్ – **సమస్త దేవతోద్దేశేన ప్రవృత్తేష్వపి కర్మసు హుతమ్ భుంక్తే భునక్తి ఇతి వా హుతభుక్.** యజ్ఞాలలో వివిధ దేవతలనుద్దేశించి నివేదనలు చేసినప్పటికీ, ఆయా దేవతల రూపంలో చివరకు భగవంతుడే ఆ హోమద్రవ్యములను స్వీకరించును కనుక ఆయన 'హుతభుక్'.

శ్రీ శంకరుల వ్యాఖ్య. 95వ శ్లోకములో. హుతభుక్ – **హుతమ్ యజ్ఞమ్ భునక్తి ఇతి హుతభుక్.** యజ్ఞమును రక్షించువాడు 'హుతభుక్'.

శ్రీ వాసిష్ఠ వివరణ – **హుతమితి అగ్నౌ ప్రక్షిప్తమ్ స-మంత్రమ్.** మంత్రసహితముగా అగ్నియందు సమర్పించేది హుతము. యజుర్వేదము 17.79 – **సప్త తే అగ్నే సమిధః సప్తజిహ్వాః.** అగ్నికి ఏడు నాల్కలున్నవి (ఏడు విధములైన అగ్నులున్నవి). ఇవి 'సప్తజిహ్వాః' నామ వివరణలో వర్ణింపబడినవి.

ప్రాణస్వరూపుడైన భగవానుడే మనము ఆరగించిన అన్నమును కూడ భుజించుచున్నాడు. ఇది కూడ భగవంతుని 'హుతభుక్' లక్షణమును సూచించును.

విభుః

- అంతటా వ్యాపించియున్నవాడు. అన్ని జగములకు ప్రభువు.
- ఆయన కారణంగా సకల వస్తువులు విడివిడిగా (విభజించి) వ్యక్తమవుతాయి.
- అనేక రూపములలో వ్యక్తమయ్యేవాడు.

ఓం విభవే నమః

26వ శ్లోకము. 241వ నామము. విశ్వభుగ్-విభుః – **సుప్రసాదః ప్రసన్నాత్మా విశ్వదృగ్ విశ్వభుగ్ విభుః**
(శ్రీ భట్టులు 'విశ్వభుగ్విభుః' అనీ, శ్రీ శంకరులు 'విశ్వభుక్' మరియు 'విభుః' అనీ చెప్పారు).
94వ శ్లోము. 883వ నామము. హుతభుక్-విభుః – **విహాయసగతిః జ్యోతిః సురుచిః హుతభుక్ విభుః**
(శ్రీ భట్టులు 'హుతభుగ్విభుః' అనీ, శ్రీ శంకరులు 'హుతభుక్' మరియు 'విభుః' అనీ చెప్పారు.)

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సర్వత్ర వర్తమానత్వాత్ త్రయాణమ్ లోకానామ్ విభుత్వాత్ విభుః.** అంతటా ఉన్నవాడు, మరియు ముల్లోకములకు ప్రభువు అయినవాడు విభుడు.

శ్రీ చిన్మయానంద – సర్వవ్యాపియైన నారాయణుడే విభుడు. కాలము చేతను, స్థలము చేతను పరిమితము కానివాడు. ఎలాంటి హద్దులు లేనివాడు.

శ్రీ సత్యసంధ యతిరాజ తీర్థ – **విశిష్టా భవన్తి అస్మాత్ విభుః.** ఆయన కారణంగా సకల చరాచరములు విశిష్టములు (వేరు వేరు) అగును గనుక ఆయన విభుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **వివిధో భవతి ఇతి విభుః.** అనేక రూపములలో వ్యక్తమగువాడు విభుడు.

884. రవిః

- ఉత్తరాయణ పుణ్యకాలంలోని సూర్యుడు. ఉత్తరాయణ దేవతద్వారా స్తుతింపబడే సూర్యుడు.
- రసములను గ్రహించే సూర్యుని రూపం దాల్చినవాడు.
- సకల చేతన, అచేతనములకు శబ్దము కలిగించే శక్తినిచ్చువాడు.
- తన భక్తులచే స్తుతింపబడువాడు.

ఓం రవయే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – రూ - శబ్దే, ధ్వని చేయుట. రూయతే - ప్రశస్యత ఇతి రవిః - ప్రశంసింపబడువాడు. ఉత్తరాయణ పుణ్యకాలంలో స్తుతింపబడు సూర్యుడు. సూర్యుడు మకరరాశిలో ప్రవేశించినప్పటి (జనవరి 14) నుండి కర్కాటక రాశిలో ప్రవేశించే (జూలై 7) వరకు ఉత్తరాయణ పుణ్యకాలము. ఈ కాలంలో దేవతలు మేల్కొంటారు. అర్చిరాది మార్గంలో 4వ దశ అయిన ఉత్తరాయణంతో ఈ నామమును శ్రీ భట్టులు అనుసంధించారు.

యశ్చోత్తరాయణ ద్వారా రూయతేఽత్ర ప్రకాశ్యతే
స వై రవిస్సమాఖ్యాతః ప్రాశస్త్య ఫలదో మనుః

ఉత్తరాయణ దేవత ద్వారా స్తుతింపబడే సూర్యుడు. ప్రకాశించేవాడు. ఈ నామమంత్రము ప్రశస్తమైన గొప్ప ఫలితాన్నిస్తుంది. ఓం రవయే నమః (శ్రీకైవల్యసారధి).

శ్రీ బలదేవ విద్యాభూషణ చెప్పిన అర్థం కూడా షుమారుగా శ్రీ భట్టులు చెప్పిన అర్థంతో సరిపోతుంది. రు - గతి రేషణయోః - వెళ్ళుట, బాధించుట.

రవతే గచ్ఛతి ఉత్తరాయణేన యస్మాత్ రవిః
యదనుకంపయా ఉత్తరాయేణ యాతి ఇతి అర్థః

ఎవని కృపవల్ల సూర్యుడు ఉత్తరాయణ మార్గంలో పయనిస్తాడో అతడు రవి.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు 'రవి' అనగా ఆదిత్యునకు (సూర్యునకు) అధిష్టాన దేవత (ఆదిత్య ఆత్మా) అని వ్యాఖ్యానించారు. **రసాన్ ఆదిత్త ఇతి రవిః.** అన్ని రసములను గ్రహించేవాడు రవి. ఇందుకు శ్రీ శంకరులు విష్ణుధర్మోత్తరము (1.30.16)నుండి ఉదాహరించారు. **రసానామ్ చ తథా ఆదానాత్ రవిః ఇత్యభిధీయత.**

భగవద్గీత (10.21)లో ఇలా ఉంది. **ఆదిత్యానామ్ అహమ్ విష్ణుః జ్యోతిషామ్ రవిరంశుమాన్.** అదితియొక్క ద్వాదశపుత్రులైన ఆదిత్యులలో విష్ణువును నేను. జ్యోతిర్మయ స్వరూపులలో నేను రవిని (సూర్యుడను).

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – రు - శబ్దే - ధ్వని చేయుట, అరచుట, ఝుమ్మనుట. ఉనాదిసూత్రము (4.139) 'అచా ఇహ్' ప్రకారము 'ఇ' ప్రత్యయం చేరిస్తే 'రవి' అవుతుంది. 'ఇ' ప్రత్యయం వల్ల 'అలా చేసేవాడు, చేయుంచేవాడు' అనే అర్థం వస్తుంది (కర్తరి కరణే వా). కనుక 'రవి' అనగా శబ్దమునకు కారణమైనవాడు. ఆయన కారణంగానే సమస్తజీవరాసులు శబ్దమును చేయగలుగుచున్నాయి.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **రూయతే స్తూయతే భక్తజనైః ఇతి రవిః.** భక్తజనులచేత స్తుతింపబడువాడు రవి.

885. విరోచనః

- ప్రకాశమానమైనవాడు. ఉత్తరాయణ దక్షిణాయణ కాలములలో సూర్యుని ప్రకాశింపజేయువాడు.
- అనేక విధములుగా ప్రకాశించు వైభవము కలవాడు. సూర్యుడు, చంద్రుడు, పగలు, రాత్రి వంటివి.
- తన భక్తుల మనస్సులలో విశేషముగా ప్రకాశించుచున్నవాడు.
- 'విలోచనః' – అర్జునుడు, సంజయుడు వంటివారికి దివ్యనేత్రములను ఇచ్చినవాడు.

ఓం విరోచనాయ నమః

ఓం విలోచనాయ నమః

రుచ్ - దీప్తావభి ప్రీతౌ - ప్రకాశించుట, ఇష్టపడుట, సుందరముగ నుండుట. వి - ఉపసర్గ. వి-రుచ్-యుచ్ - విలోచనః. 'యుచ్' ప్రత్యయము చేర్చుటవలన పాణిని సూత్రము (3.2.149) **'అనుదాత్తేత్తః చ హలాదేః'** ప్రకారము 'ఆ విధమైన లక్షణము కలవాడు' అనే అర్థం వస్తుంది. కనుక ప్రకాశించే, ప్రకాశింపజేసే సహజమైన స్వభావం కలవాడు విరోచనుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **ద్వాభ్యామ్ అయన-గతిభ్యామ్ సంవత్సరో రథేన విరోచయతి ఇతి విరోచనః.** రెండు అయనములమధ్య రథంపై ప్రయాణించే సూర్యుని ప్రకాశింపజేసేవాడు విరోచనుడు. ఈ నామము సంవత్సర అధిష్టాన దేవతను తెలియజేయును. అర్చిరాది మార్గంలో ఇది ఐదవ దశ.

అయన ద్వయ గత్యాऽర్కం యో విరోచయతి స్వయం
విరోచన ఇతి ఖ్యాతః ప్రకాశ ఫలదో మనుః

ఉత్తరాయణ, ధక్షిణాయన మార్గాలలో రథాన్ని నడిపి ఇతనిని (సూర్యుని) ప్రకాశింపజేయువాడు, సంవత్సరాభిమాని అయినవాడు విరోచనుడు. ఈ నామజపము అమిత ప్రకాశమును ఇస్తుంది.
ఓం విరోచనాయ నమః (శ్రీకైవల్య సారధి).

శ్రీ బలదేవ విద్యాభూషణ వ్యాఖ్య కూడా శ్రీ భట్టుల వ్యాఖ్యకు సమాంతరంగా సాగింది.

విరోచయతి సంవత్సరేణ గచ్ఛన్తమ్ స్వోపాసనమ్

అభిప్రాతమ్ దీప్రంచ కరోతి ఇతి విరోచనః

సంవత్సరమంతా సూర్యుని ప్రకాశింపజేసేవాడు విరోచనుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **వివిధమ్ రోచత ఇతి వి-రోచనః.** అనేక విధములుగా ప్రకాశములు (వైభవములు) కలవాడు విరోచనుడు. సూర్యచంద్రాదుల రూపంలో ప్రకాశించేవాడు విరోచనుడు. వృక్షాదుల వృద్ధికి కిరణములు అందించేవాడు విరోచనుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **విశేషేణ రోచతే భక్తేభ్యః ఇతి విరోచనః.** భక్తుల మనస్సులలో విశేషముగా ప్రకాశించువాడు విరోచనుడు. **నమో రుచాయ బ్రహ్మయే** (యజుర్వేద మంత్రము 31.20).

శ్రీ చిన్మయానంద – భక్తులు ఏ రూపంలో భగవంతుని ధ్యానిస్తే ఆ రూపంలో వారికి అందివచ్చి వారికి సంతోషం కలుగజేసేవాడు విరోచనుడు. గీత 4.11 – **యే యథా మాం ప్రతిపద్యన్తే తాం స్తథైవ భజామ్యహమ్.**

శ్రీ వాసిష్ఠ శ్రుతులనుండి చెప్పిన ఉదాహరణలు –

అధర్వ వేదము 9.10.2 – **తస్యా విరోచనః ప్రాహ్లాదిర్వత్స ఆసీదయస్పాత్రమ్.**

ఋగ్వేదము 5.44.2 – **శ్రియే సుదృశీ రూపరస్య యాః స్వర్విరోచమానః కకుభామచోదతే.**

ఋగ్వేదము 9.86.21 – **అయమ్ పునాత్ ఉషసో విరోచయత్.**

శ్రీ సత్యసంధ యతిరాజ **'విలోచనః'** అనే పాఠాన్ని గ్రహించారు. **దివ్యమ్ లోచనమ్ పార్థస్య యస్మాత్ స విలోచనః.** అర్జునుడు, సంజయుడు వంటివారికి దివ్యదృష్టిని ఇచ్చినవాడు విలోచనుడు. ఇందుకు ఆయన గీత (11.8)నుండి ఉదాహరించారు. **దివ్యమ్ దదామి తే చక్షుః.**

886. సూర్యః

- వాయురూపములో చలనమునకు కారణమైనవాడు.
- ఏ దివ్యశక్తినుండి సమస్తము జనించుచున్నదో అట్టి శక్తినిధి.
- సూర్యునియందు, అగ్నియందు శ్రీ (తేజస్సు)నకు కారణమైనవాడు.
- జ్ఞానమునకు కారణమైనవాడు.

ఓం సూర్యాయ నమః

శ్రీ వాసిష్ఠ వివరణ – సృ - గతౌ - వెళ్ళుట; సూ - ప్రేరణే - ప్రేరేపించుట. పాణిని సూత్రము 3.1.114 **రాజ సూర్య సూర్య.... సరతి గచ్ఛతి ఇతి సూర్యః.** చలించువాడు సూర్యుడు. **సువతి కర్మాణి ప్రేరయతి లోకాన్ ఇతి సూర్యః.** సకల కర్మలను ప్రేరేపించువాడు సూర్యుడు.

శ్రీ చిన్మయానంద – వ్యాకరణపరంగా మూలకారణమైన శక్తియే సూర్యుడు. సాధారణంగా ఈ పదము ఆకాశంలోని సూర్యుని (రవి, ఆదిత్యుడు) సూచించును. ఎందుకంటే అందరికీ శక్తిని ప్రసాదించేవాడు సూర్యుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – సృ - చలించుట. 'కృత్' లేదా 'క్విప్' ప్రత్యయమువల్ల అనేక అర్థాలు వస్తాయి. ఇక్కడ సందర్భానుసారం 'వాయువు' అనే అర్థం తీసికొనవచ్చును. ఎందుకంటే వాయువు సదా భగవంతుని కారణంగా చలించును. **వాయుః సదా సరతి యస్మాత్ ఇతి సూర్యః.** ఇలా ఈ నామమును శ్రీ భట్టులు అర్చిరాది మార్గంలో ఆరవ దశయైన వాయుదేవుని సూచిస్తూ వ్యాఖ్యానించారు.

వాయుస్సరతి యస్మాద్ధి తస్మాచ్ఛూర్య షడక్షరి. సూర్యుడు అంటే అంతా సంచరించే వాయువు అంతర్యామి. ఈ నామము షడక్షరి. ఓం సూర్యాయ నమః (శ్రీకైవల్యసారధి).

శ్రీ బలదేవ విద్యాభూషణ కూడా ఇంచుమించు ఇదే అర్థం చెప్పారు. **వాయుమ్ సరతి స్వోపాసకమ్ నీత్వా ఇతి సూర్యః.**

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – ఆకాశములో సర్పమువలె చరించేది (సరతి) సూర్యుడు. ఈ వివరణ కూడా వాయువును సూచించవచ్చును.

కౌషీతకీ ఉపనిషత్తు (1.3)లో వాయువును సంవత్సరం తరువాతి దశగా (అర్చిరాది మార్గాన్ని) చెప్పారు. **స వాయు లోకమ్.** అక్కడినుండి జీవుడు వాయులోకానికి వెళతాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సూతే సర్వమ్ ఇతి సూర్యః. సూతే శ్రియమ్ ఇతి సూర్యః.** అన్నింటికీ కారణమైనవాడు సూర్యుడు. ఏ దివ్యశక్తినుండి సమస్తము జనించుచున్నదో అట్టి శక్తినిధి సూర్య శబ్దముతో సూచింపబడుచున్నది. సర్వ చైతన్యమూర్తి, సర్వపోషణకర్తయునైన భగవానుడు 'సూర్య' నామమున భజనీయుడగును (శ్రీ పెమ్మరాజు రాజారావు). సూర్యునియందును, అగ్నియందును శ్రీ (ప్రకాశము) ఎవని కారణముగా కలుగుచున్నదో అతడే సూర్యుడు.

శ్రీ సత్యసంధ తీర్థ – **సూరి గమ్యత్వాత్ సూర్యః.** ఎవనివలన జ్ఞానము లభించునో అతడు సూర్యుడు.

శ్రీ రఘునాధ తీర్థ – **సూరిభిః జ్ఞానిభిః ప్రాప్యతే ఇతి సూర్యః.** జ్ఞానులైన మునులు ఎవరిని పొందుదురో అతడు సూర్యుడు.

887. సవితా

- సూర్యుని రూపములో వర్షమును, పంటలను కలుగజేయువాడు.
- సర్వజగత్తు సృష్టికి కారణమైనవాడు

ఓం సవిత్రే నమః

సూ - ప్రాణి గర్భవిమోచనే - జన్మనిచ్చుట, ఉత్పాదన చేయుట. **సూతే ఇతి సవితా.**
ఈ నామము రెండుమార్లు వస్తుంది.
94వ శ్లోకము. 887వ నామము. సవితా – **రవిర్విరోచనః సూర్యః సవితా రవిలోచనః**
104వ శ్లోకము. 969వ నామము. సవితా – **భూర్భువస్స్వస్తరుస్తారః సవితా ప్రపితామహః**

శ్రీ భట్టుల వ్యాఖ్య – **సూర్య ద్వారా వృష్టి సస్యాదికమ్ సూతే ఇతి సవితా.** సూర్యునిద్వారా వర్షమును, పంటలు మున్నగువానిని కలుగజేయువాడు సవిత లేదా ఆదిత్యుడు. అర్చిరాది మార్గములో ఇది ఏడవ దశ.

104వ శ్లోకంలో 'సవితా' నామమునకు శ్రీ భట్టుల వ్యాఖ్య – **సర్వేషామ్ సాక్షాత్ జనయితా సవితా.** అంతటిని (సూర్యుని కూడ) సృష్టించువాడు సవిత.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సర్వస్య జగతః ప్రసవితా సవితా.** సకల జగత్తునకు జన్మనిచ్చినవాడు సవిత. ఇందుకు శ్రీ శంకరులు విష్ణుధర్మోత్తరము (1.30.15)నుండి ఉదాహరించారు.
రసానామ్ చ తథాదానాత్ రవిః ఇతి అభిధియతే
ప్రజానామ్ తు ప్రసవనాత్ సవితా ఇతి నిగద్యతే
ఛాందోగ్యోపనిషత్తు (1.12.5) – **దేవో వరుణః ప్రజాపతిః సవితా.**
మైత్రాయణి (5.7) – అతడు తేజస్సుతో వెలుగును. వర్షములు కురిపించును. ప్రజలను రక్షించును. అతడే సవిత.

శ్రీ అనంతకృష్ణశాస్త్రి ఇదే అర్థం ఇచ్చే 'సపితా' అనే పాఠాంతరాన్ని గ్రహించారు. అందరికీ తండ్రియైనవాడు 'స-పితా'.

శ్రీ వాసిష్ఠ – **సూర్య ద్వారా వృష్టి సస్యాదికమ్ ఉత్పాదయ జగత్ జనయతి ఇతి సవితా.** సూర్యునిద్వారా వర్షములను, పంటలను కలిగించి, జగత్తులోని జీవనమునకు ఆధారమైనవాడు సవిత.

888. రవిలోచనః

- తన (సూర్య)కాంతి ద్వారా (చంద్ర, విద్యుత్, వరుణులను) ప్రకాశింపజేయువాడు.
- సూర్యుడే తన కన్నుగా కలవాడు.
- అయన కన్నులనుండి సూర్యుడు ఉద్భవించెను.
- స్తుతివల్ల ప్రీతి చెందువాడు.

ఓం రవిలోచనాయ నమః

రవినా - తత్ ప్రకాశేన. లోచయతి - దర్శయతి ఇతి రవిలోచనః. తన ప్రకాశంవల్ల తెలియవచ్చేవాడు రవిలోచనుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **రవి రశ్మి సంక్రాంత్యాది ముఖేన చంద్ర - విద్యుత్ - వరుణాన్ లోచయతి ఇతి రవిలోచనః.** సూర్యకాంతి ద్వారా చంద్రుని, విద్యుత్ (ఇంద్రుడు)ను, వరుణుని ప్రకాశింపజేయువాడు రవిలోచనుడు. ఈ నామము అర్చిరాది మార్గములో ఎనిమిదవ, తొమ్మిదవ, మరియు పదవ దశలైన చంద్ర, ఇంద్ర, వరుణ లోకములను తెలియజేయును.

సూర్యరశ్మి సంబంధాత్ విద్యుద్వరుణ చంద్రకాన్
నిరంతరం లోచయతి రవిలోచన ఈరితః

సూర్య కిరణముల ద్వారా ప్రకాశించునట్టి విద్యుత్తు, వరుణ, చంద్రులకు అంతర్యామియైన అభిమాన దేవత. (శ్రీకైవల్య సారధి).

ఛాందోగ్యోపనిషత్తు – **అదిత్యాత్ చంద్రమసమ్, చంద్రమసో విద్యుతమ్.**
కౌషీతకీ పనిషత్తు (1.3) – **స వరుణమ్ లోకమ్.**

శ్రీ శంకరుల వ్యాఖ్య – **రవిః లోచనమ్ - చక్షుః అస్య ఇతి రవిలోచనః.** సూర్యుడే తన కన్నుగా కలవాడు రవిలోచనుడు. ఇందుకు శ్రీ శంకరులు ముండకోపనిషత్తు (2.1.4)నుండి ఉదాహరించారు. **అగ్నిర్మూర్ధా చక్షుషీ చంద్ర సూర్యౌ.** అగ్నియే ఆయన కిరీటము. సూర్యచంద్రులేకన్నులు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **రవిః భాస్కరః లోచనాద్ యస్య ఇతి రవిలోచనః.** ఎవని కన్నులనుండి సూర్యుడు ఉద్భవించాడో ఆయన రవిలోచనుడు.
పురుష సూక్తము – **చక్షో సూర్యో అజాయత** (ఋగ్వేదము 10.90.13)

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **రవినా లోచయతి సర్వస్వమ్ ఇతి రవిలోచనః.** సూర్యునిద్వారా సర్వమును వెలిగించేవాడు రవిలోచనుడు.

లోచయతే అనేన ఇతి లోచనః, రవిః లోచనమ్-చక్షుః యస్య స రవిలోచనః. ఆయన కన్నులే సూర్యుడు. వానిద్వారానే మనం చూస్తాము.

శ్రీ రఘునాథ తీర్థ – రు - శబ్దే - ధ్వని చేయుట, రవి - స్తుతించుట, లోచ్ - వెలుగుట, లోచనః - సంతోషించువాడు. రవిః **స్తుతిః, లోచనీయత్వాత్ లోచనమ్ ప్రియమ్. రవిః స్తుతిః, లోచనమ్ ప్రియమ్ యస్య సః రవిలోచనః.** స్తుతివల్ల సంతోషించువాడు రవిలోచనుడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

అనంతో హుతభుగ్భోక్తా సుఖదో నైకదోऽగ్రజః (నైకజోऽగ్రజః)|
అనిర్విణ్ణః సదామర్షీ లోకాధిష్ఠానమద్భుతః || (95)

889. అనంత హుతభుగ్భోక్తా

అనంతః

హుతభుక్

భోక్తా

శ్రీ భట్టులు '**అనంత హుతభుగ్భోక్తా**' అనే ఒకే నామముగా పరిగణించగా, శ్రీ శంకరులు '**అనంతః**', '**హుతభుక్**', '**భోక్తా**' అనే మూడు నామములుగా పరిగణించారు.

అనంత హుతభుగ్భోక్తా

- ఇంద్రుడు, బ్రహ్మలకు అంతర్యామియైనవాడు.
- అంతము లేనివాడు, మరియు అగ్నియందు సమర్పించిన హవ్యములను స్వీకరించువాడు.

ఓం అనంత హుతభుగ్భోక్త్రే నమః

శ్రీ భట్టులు ఈ నామమును అర్చిరాది మార్గములో చివరి రెండు దశలను (పదకొండవ, పన్నెండవ దశలను) సూచించునవిగా వ్యాఖ్యానించారు. అర్చిరాది మార్గం చివరి దశలలో ఇంద్రుడు, బ్రహ్మ ముక్తజీవుని పరమపదమునకు చేర్చుదురు. (**స ఇంద్రలోకమ్, స ప్రజాపతి లోకమ్** – కౌషీతకీ).

హుతభుక్ – ఇంద్రుడు; భోక్తా – బ్రహ్మ. **సప్త తంతుషు హుతమ్ భుంక్తే ఇతి ఇంద్రో హుతభుక్.** ఏడు విధాలైన యజ్ఞాలలో సమర్పించిన హవ్యమును స్వీకరించువాడు ఇంద్రుడు హుతభుక్. **ప్రజాః భునక్తి పాలయతి ఇతి ప్రజాపతి భోక్తా**. ప్రజను (జన్మించువానిని, విస్తరించువానిని) రక్షించువాడు, పాలించువాడు ప్రజాపతి బ్రహ్మ భోక్తా. భగవానుని అధీనంలో వీరిద్దరూ అమితమైన మహత్తు కలిగినవారు గనుక 'అనంత హుతభుగ్భోక్తా'.

మరుత్వాన్ హుతభుక్ భోక్తా భునక్తీతి ప్రజానిధిః

సోऽనంత హుతభుక్ భోక్తా మహాంతౌ యస్య తౌ సదా

హోమము చేసిన హవిస్సును భుజించేవాడు ఇంద్రుడు. ప్రజలను కాపాడేవాడు బ్రహ్మ. వీరి లోకాలను – అనగా ఇంద్రలోకాన్ని, ప్రజాపతి లోకాన్ని పొందజేసేవాడు 'అనంతోహుతభుగ్భోక్తా' (శ్రీకైవల్య సారధి).

శ్రీ బలదేవ విద్యాభూషణ ఈ (అర్చిరాదిమార్గం) సందర్భంలోని నామాలకు ఇంచుమించు శ్రీ భట్టులవలెనే వ్యాఖ్యానం చెప్పారు. ఈ నామాన్ని శ్రీ బలదేవ **'అనంతః'**, **'హుతభుగ్భోక్తా'** అనే రెండు నామములుగా పరిగణించారు. 'హుతభుగ్భోక్తా'కు ఇద్దరి వ్యాఖ్య ఒకేవిధంగా ఉంది.

హుతభుగ్భిహిః అమృత పరిణామరూపమ్ హుతమ్ భుంజానైః

విద్యుత పర్యంత ఆగతేన అమానవేన పురుషేణ సహితైః

వరుణ ఇంద్ర ప్రజాపతిః స్వపదగామినమ్ భక్తమ్ భునక్తి పాలయతి ఇతి హుతభుగ్ భోక్తా.

అమానవ పురుషులచేత ఇంద్రలోకాదులద్వారా ముందుకు నడిపింపబడే భక్తులను రక్షించేవాడు. ఇక్కడ వరుణుడు, ఇంద్రుడు వంటివారు వెంటరాగా ముక్తజీవుడు పరమపదం చేరుకునే మార్గం చివరి దశలో ఉంటాడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ 'అనంతహుతభుగ్భోక్తా'ను ఒకే నామంగా పరిగణించి, రెండు భాగాలుగా వ్యాఖ్యానించారు. **న అంతః యస్య ఇతి అనంతః**. అంతము లేనివాడు అనంతుడు. **హుత-భుజా పావకేన భుంక్తే ఇతి హుతభుగ్భోక్తా**. అగ్నియందు సమర్పించినదానిని భుజించువాడు 'హుతభుగ్భోక్తా'.

ఇప్పుడు **'అనంతః'**, **'హుతభుక్'**, **'భోక్తా'** అనే మూడు వేరువేరు నామములుగా వ్యాఖ్యలను పరిశీలించుదాము.

అనంతః

- అంతము లేనివాడు.
- దేశకాలాదుల చేత, మరి దేనిచేతను పరిచ్ఛిన్నుడు కానివాడు.
- ఎవరికీ అంతు తెలియని గుణసంపన్నుడు.
- పరిశుద్ధమైన మనసు లేనివారికి అందరానివాడు.

- ఆదిశేషుడు.

ఓం అనంతాయ నమః

70వ శ్లోకము. 665వ నామము. అనంతః – **అనిర్దేశ్యవపుః విష్ణుః వీరః అనంతో ధనంజయః**

95వ శ్లోకము. 889వ నామము. అనంతః (శ్రీ శంకరుల వ్యాఖ్య ప్రకారము) – **అనంతః హుతభుక్ భోక్తా సుఖదో నైకదోఽగ్రజః**

న అంతమ్ యస్య స అనంతః. అంతము లేనివాడు అనంతుడు.

శేషరూపో వా. ఆదిశేషుని రూపంలో ఉన్నవాడు అనంతుడు.

దేశము, కాలము, వస్తువు వంటి అవధులు లేనివాడు అనంతుడు. ఆయన విభూతులకు అంతము లేదు. ఎవరైనా ఆయన గుణగణముల అంతమునుచూడలేదు. కనుక అవ్యయుడైన భగవంతుడు అనంతుడు. అన్నింటికంటే ఆద్యుడు. నిత్యుడు. సర్వవ్యాపి.

అక్రూరునికి రామకృష్ణుల దివ్యదర్శనానుభూతి కలుగుట. 1760 కాలపు చిత్రం. వికీపీడియానుండి.

శ్రీమద్భాగవతము. దశమ స్కంధము. అక్రూరునికి భగవద్దర్శనం.

శ్రీ ఏల్చూరి మురళీధరరావు రచననుండి.

రాజేంద్రా! కృష్ణుని రథం వాయువేగాన ప్రయాణించి యమునాతీరం చేరుకొన్నది. భగవానుడు రథం ఆపి రామునితోపాటు దిగి కాళిందీ నిర్మల మధుతోయాలను ఆచమించి, జలాలను గ్రోలి చేరువనున్న వృక్షమూలాన

కొంతసేపు కూర్చుండి రామునితో మళ్ళీ రథం ఎక్కాడు. అక్రూరుడు వారు రథంలో కూర్చున్న తర్వాత వారి అనుమతి గొని స్నానార్థం నదివద్దకు వెళ్ళాడు.

రాజేంద్రా! అక్రూరుడా విధంగా నదీజలాలను సమీపించి వేదమంత్రాలు జపిస్తూ నీటిలో మునిగాడు. అక్కడతనికి రామకృష్ణులు కానవచ్చారు. అక్రూరుడది చూసి, 'ఏమిటిది? రామకృష్ణులను రథంలో కూర్చుండబెట్టి కదా ఇక్కడికి వచ్చాను. ఇంతలో వారిక్కడికి ఎప్పుడు వచ్చారు?' అని ఆశ్చర్యపడుతూ నీటినుంచి లేచి రథంవంకకు చూశాడు. వారు రథంలో సుఖోపవిష్టులై ఉన్నారు. అతని ఆశ్చర్యం ఇనుమడించింది. అదంతా భ్రాంతి కాబోలునని అతను భావించి మళ్ళీ నీట మునిగాడు.

అక్రూరుడు నీట మునిగినంతనే, వేయి తలల వేయి పడగలు కలిగి, బిసశ్వేతశృంగాలతో కైలాసగిరిని తలపించుతున్న అనంతుడు, అతని ఉత్సంగాన కూర్చున్న మేఘశ్యామమూర్తి అతనికి కనిపించారు. ఆ దివ్యమూర్తి పీతాంబరం ధరించి, చారుప్రసన్నవదనంతో, పద్మదీర్ఘనేత్రాలతో, చతుర్భుజాలతో, శోభాయమానభ్రూయుగంతో, సమున్నత నాసికతో, చారుకర్ణసుకపోలారుణాధరంతో వెలుగొందుతూ దరహాసనిరీక్షణాలను ప్రసరింపజేస్తున్నాడు. అతని ఉదరం రావి ఆకును మరపిస్తూ వళిత్రయంతో సొంపారుతున్నది. ఆ దివ్యమంగళ విగ్రహునికి కంబుకంఠం, నిమ్ననాభి, బృహత్కటితటశ్రోణితాలు, కరభసదృశోరుద్వయం, ఈషదున్నత గుల్ఫాలు, కోమలాంగుళ్యంగుష్ఠదళారుణ నఖాంచిత పాదపద్మాలు పెట్టని భూషలై చెలువారుతున్నాయి. అతని కరకమలాలలో శంఖచక్రగదాపద్మాలు ఉల్లసిల్లుతున్నాయి. త్రైలోక్యవందితుడైన ఆ మహానుభావుని సునంద నందనాది పార్షదులు, సనక సనందన సనత్కుమార సనత్సుజాతాది మహాయోగులు, బ్రహ్మాది గీర్వాణులు, మరీచ్యాది ప్రజాపతులు, ప్రహ్లాద నారదాది మహాభాగవతులు పరివేష్ఠించి ప్రస్తుతులు కావిస్తున్నారు. శ్రీ పుష్టి వాక్కు కీర్తి కాంతి తుష్టి ఇల ముక్తి సంసృతి హేతువులైన విద్యావిద్యలు, మాయ, మాయకు కారణమైన శక్తి ఆయనను చుట్టుకొని సేవిస్తున్నారు.

ఆ దివ్యమూర్తిని చూచినంతనే అక్రూరునికి నిలువెల్లా గగుర్పొడిచింది. అతని ధైర్యం సన్నగిల్లింది. అతను మెల్లమెల్లగా నెమ్మదివహించి, ఆ దివ్యమూర్తి భగవంతుడే అని నిశ్చయించి, సాష్టాంగప్రమాణం చేసి, నిటలతటఘటిత హస్తయుగుడై గద్గదస్వరంతో స్తుతించాడు.

.....

దేవా! నీ లీలావతార చర్యలు అనేకం. కారణమత్స్యరూపాన్ని ధరించి ప్రళయాబ్ధిని చరించావు. హయగ్రీవుడవై మధుకైటభులను సంహరించావు. కూర్మావతారం ధరించి మంథరగిరిని మూపున వహించి క్షీరసాగరమథన కార్యాన్ని కొనసాగించావు. వరాహానివై భూమినుద్ధరించి నిలిపావు. నరసింహమూర్తివై హిరణ్యకశిపుని హరించి సాధులోకభయాన్ని తొలగించావు. వామనుడవై మూడడుగులతో ముల్లోకాలను ఆక్రమించావు. పరశురాముడవై మదోన్మత్త క్షత్రియులను తునిమావు. రఘురాముడవై రావణాసురుని వధించావు. దుష్టశిక్షణ శిష్టరక్షణార్థం ఇప్పుడు యదుకులంలో వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధ రూపాలలో అవతరించావు. దైత్యదానవులకు మోహాన్ని కలిగింపగోరి బుద్ధరూపంలో అవతరింపనున్నావు. మ్లేచ్ఛప్రాయులైన రాజులు ప్రబలి ధర్మాన్ని అణచిపెట్టి అధర్మాన్ని పోషిస్తారు. అప్పుడు కల్కిరూపం దాల్చి ఆ దుష్టులను రూపుమాపి జన్మమంగళం కావిస్తావు. ఇట్టి దశావతారమూర్తికి నీకు సాష్టాంగం.

.....

విజ్ఞానమూర్తీ! సమస్తజ్ఞానకారణా! సుఖదుఃఖప్రాపక కాలకర్మస్వభావాధీశ్వరా! పరిపూర్ణా! ప్రకృతిపురుష కాలాత్మకా! చిత్తాధిష్ఠాత అయిన వాసుదేవుడనే పేరుతోను, సర్వభూతక్షయకారి అయిన అహంకారానికి అధిష్ఠాతగా సంకర్షణుడనే పేరుతోను, బుద్ధ్యాద్యధిష్ఠాత అతయిన ప్రద్యుమ్నుడనే పేరుతోను, మనోధిష్ఠాత అయిన అనిరుద్ధుడనే పేరుతోను అలరారుతున్న సర్వప్రత్యయ హేతువునకు నీకు నమస్కారం. ప్రపన్నుని రక్షించు. అని సాగిలబడ్డాడు.

రాజేంద్రా! అక్రూరుడా విధంగా జలాంతరమందు తనకు సాక్షాత్కరించిన భగవత్స్వరూపాన్ని ప్రస్తుతిస్తుండగా ఆ రూపం తటాలున మాయమయింది. అతను విస్మయచకితుడై నీటిబయటికి వచ్చి మధ్యాహ్నిక క్రియలు ముగించుకొని వడివడిగా వచ్చి రథం ఎక్కి సారథ్యం వహించాడు. భగవానుడతనిని చూసి, 'అయ్యా! నీ ముఖలక్షణాలలో మార్పు కనిపిస్తున్నది. కారణమేమిటి? ఏదైనా వింత నీ బుద్ధిని ఆకర్షించి నిన్నింతసేపు నిలిపగందా?' అని అడిగాడు. అక్రూరుడా మాటలు విని, 'పరమేశ్వరా! సర్వాద్భుతాలకు స్థానమైన నిన్ను కన్నారా చూస్తుండగా భూనభోంతరాళాలలో కనుపించే చిత్రాలూ చిత్రాలేనా?' అని రథాన్ని కదిలించాడు.

హుతభుక్

- యజ్ఞములను రక్షించువాడు.
- యజ్ఞములోని హవ్యమును భుజించువాడు.

ఓం హుతభుజే నమః

94వ శ్లోకంలో శ్రీ భట్టులు **'హుతభుగ్విభుః'** అనే ఒకే నామమును పరిగణించగా, శ్రీ శంకరులు **'హుతభుక్'**, **'విభుః'** అనే రెండు నామాలను పరిగణించారు. 95వ శ్లోకంలో శ్రీ భట్టులు **'అనంతో హుతభుగ్భోక్తా'** అనే ఒకే నామముగా పరిగణించగా, శ్రీ శంకరులు **'అనంతః'**, **'హుతభుక్'**, **'భోక్తా'** అనే మూడు నామములుగా పరిగణించారు. ఇలా శ్రీ శంకరుల పాఠము ప్రకారము ఈ నామము రెండుమార్లు వస్తుంది.

హు – దానాదానయోః – అర్పించుట, యజ్ఞము చేయుట, భుజించుట.

భుజ్ – పాలనాభ్యవహారయోః – రక్షించుట.

భుజ్ – అనవనే – భుజించుట, వాడుట.

95వ శ్లోకంలోని 'హుతభుక్' – **హుతమ్ భునక్తి ఇతి హుతభుక్**. యజ్ఞములను రక్షించువాడు హుతభుక్.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – యజ్ఞనిర్వహణలో అనివార్యంగా ఏవైనా లోపాలు జరిగినా గాని విజయవంతంగా యజ్ఞం ముగింపు కావడం కూడా యజ్ఞరక్షణలో భాగమే.

యస్య స్మృత్యా చ నామోక్త్యా తపో యాగ క్రియాదిషు
న్యూనమ్ సంపూర్ణతామ్ యాతి సత్యో వందే తమచ్యుతమ్.

94వ శ్లోకంలోను 'హుతభుక్' – **హుతమ్ భుంక్తే ఇతి హుతభుక్.** యజ్ఞములో సమర్పించినదానిని భుజించువాడు హుతభుక్.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – యజ్ఞములో వివిధ దేవతలకు సమర్పణలు చేసినపుడు వానిని ముందుగా అగ్ని చేకొని సూర్యునకిచ్చును. సూర్యుడు ఆయా దేవతలకందజేయును. అందరు దేవతలు కడకు వానిని భగవానునికే సమర్పింతురు. ఇలా ఆయన 'హుతభుక్'.

భోక్తా

- భక్తులు ప్రేమతో సమర్పించినవానిని గైకొని ఆదరించేవాడు.
- అన్ని యజ్ఞములందును అర్పించిన హవ్యములను స్వీకరించేవాడు.
- పితృదేవతలకు సమర్పించినవానిని స్వీకరించేవాడు.
- అగ్ని, సూర్యుడు, కాలము వంటి రూపములలో చివరకు అన్నింటినీ అంతము చేసేవాడు.
- అంతటినీ రక్షించే, పాలించేవాడు.

ఓం భోక్త్రే నమః

16వ శ్లోకము. 145వ నామము. భోక్తా – **భ్రాజిష్ణుః భోజనం భోక్తా సహిష్ణుః జగదాదిజః**
53వ శ్లోకము. 502వ నామము. భోక్తా – **శరీరభూతభృత్ భోక్తా కపీంద్రో భూరిదక్షిణః**
95వ శ్లోకము. 888వ నామము. భోక్తా (శ్రీ శంకరుల పాఠము)– **అనన్తో హుతభుక్ భోక్తా సుఖదః నైకదోగ్రజః**

'భుక్', 'భోక్తా' అనే పదాలకు ధాతువు 'భుజ్' అనగా రక్షించుట, భుజించుట అనే అర్థాలున్నాయి. **భునక్తి ఇతి భోక్తా.** రక్షించేవాడు భోక్త. **భుంక్తే ఇతి భోక్తా.** అనుభవించేవాడు భోక్త. (ఆస్వాదించేవాడు). **రక్షణో భక్షణశ్చ.** భగవంతుడు జగత్తును సృజిస్తాడు, రక్షిస్తాడు మరియు ప్రళయకాలంలో దానిని లయం చేసుకొంటాడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య –
145వ నామము 'భోక్తా' –
భక్తులు ప్రేమతో నివేదించినవానిని అమృతమువలె ఆస్వాదించి సంతోషించువాడు భోక్త.
పత్రమ్ పుష్పమ్ ఫలమ్ తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి
తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః – గీత 9.26
నిర్మల బుద్ధితో, నిష్కామభావముతో పరమభక్తునిచే సమర్పింపబడిన పత్రమునుగాని, పుష్పమును గాని, ఫలమును గాని, జలమును గాని నేను ప్రత్యక్షముగా (స్వయముగా) ప్రీతితో ఆరగింతును.

శ్రీ భట్టులు చెప్పిన మరొక వివరణ – ఏ దేవతకు నివేదించినాగాని, అవన్నీ చివరికి ఆయనకే చెందుతాయి గనుక ఆయన భోక్త.

భోక్తారం యజ్ఞ తపసాం సర్వలోక మహేశ్వరమ్

సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతిమృచ్ఛతి – గీత 5.29

భగవంతుడు యజ్ఞములకును, తపస్సులకును భోక్త. సమస్త లోకములకును, లోకేశ్వరులకును అధిపతి. సమస్త ప్రాణులకును ఆత్మీయుడు. అనగా అవ్యాజ దయాళువు. పరమప్రేమస్వరూపుడు. ఈ భగవత్తత్త్వమును ఎఱిగిన భక్తునకు శాంతి లభించును.

అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవచ

న తు మామభిజానంతి తత్త్వేనా తశ్చ్యవంతి తే – గీత 9.24

ఏలనన, సకల యజ్ఞములకును భోక్తను, స్వామిని కూడా నేనే. వారు నా పరమేశ్వరతత్త్వమును ఎఱుంగరు. కావున పతనమగుదురు. అనగా పునర్జన్మను పొందుదురు.

502వ నామము 'భోక్తా' –

ఈ నామము వివరణలో శ్రీ భట్టులు భగవంతుని భోక్తృత్వ గుణమును మరింత విస్తరించి చెప్పారు. భగవంతుడు సమస్త హవ్యములకు (దేవతలకు అర్పించినవానికి) మాత్రమే కాక, సమస్త కవ్యములకు (పితరులకు అర్పించినవానికి) కూడా భోక్త.

మహాభారతము. శాంతిపర్వము 348.3 – **హవ్య కవ్య భుజో విష్ణోః ఉదకపూర్వే మహోదధౌ**. భగవంతుడు ఈశాన్యసాగరంలో స్థితుడై, నిష్ఠతో సమర్పించిన సమస్త హవ్య కవ్యములను భుజించును.

అహమన్నమ్ అహమన్నమ్ అహమన్నమ్

అహమన్నాదోऽహమన్నాదోऽహమన్నాదః – తైత్తరీయోపనిషత్తు

నా భక్తులు ఆస్వాదించే భోజనము నేను. నా భక్తులు సమర్పించేదానిని ఆస్వాదించేది కూడా నేనే.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమోళి 9.6.10 – ఆళ్వారు, భగవంతుడు ఒకరి సన్నిధానంలో ఉండి మరొకరు ఆనందించడంలో పరస్పరం పోటీ పడుతున్నారు. ఈ పోటీలో చివరకు భగవంతుడే గెలిచాడు.
తిరువైమోళి 10.10.11 – భగవంతుడు తనివితీరా తన భక్తులతో కలిసి ఆనందిస్తున్నాడు.
భోక్తయైన పరమేశ్వరుడు కుచేలుడిచ్చిన పిడికెడు అటుకులు తిని సంతృప్తుడయ్యాడు. దుర్యోధనుని మర్యాదలు వదలుకొని విదురుని ఇంటచేరి విందు ఆరగించాడు.

శ్రీ శంకరుల గీతావ్యాఖ్యానము (13.22 శ్లోకమునకు) ఆధారంగా ధర్మచక్రము రచయిత ఈ నామాన్ని మన నిత్యజీవనానికి ఆపాదించారు. భగవానుడు అందరిలోనూ అంతర్యామిగా ఉండి అన్నింటికీ సాక్షిగాను, మార్గదర్శకంగాను, అనుభవించేవానిగాను ఉంటాడు.

ఉపద్రష్టానుమంతా చ భర్తా భోక్తా మహేశ్వరః

పరమాత్మేతి చాప్యుక్తో దేహేఽస్మిన్ పురుషః పరః – గీత 13.22

ఈ దేహమునందున్న ఆత్మ వాస్తవముగ పరమాత్మయే. అతడు సాక్షీభూతుడగుటవలన 'ఉపద్రష్ట' యనియు, యథార్థ సమ్మతినిచ్చువాడు అగుటవలన 'అనుమంత' అనియు, అన్నింటిని ధరించి, పోషించువాడగుటవలన 'భర్త'యనియు, జీవరూపములో 'భోక్త' అనియు, బ్రహ్మాదులకు స్వామి యగుట వలన 'మహేశ్వరుడు' అనియు, శుద్ధసచ్చిదానంద ఘనస్వరూపుడగుట వలన 'పరమాత్మ' అనియు పిలువబడుచున్నాడు. (భగవద్గీత నుండి ఉదాహరించిన శ్లోకాలకు అన్నిచోట్లా తెలుగు అనువాదం ఈ పుస్తకంనుండి యథాతథంగా వ్రాశాను: **శ్రీ జయదయాల్ గోయందకా** – శ్రీ మద్భగవద్గీత – తత్వవివేచనీ హిందీ వ్యాఖ్యకు తెలుగు అనువాదము. అనువాదకులు: డా. ఎమ్. కృష్ణమాచార్యులు, డా. గోలి వెంకటరామయ్య .గీతాప్రెస్, గోరఖ్ పూర్ ప్రచురణ.)

తాము అర్జించిన సంపదలను భగవంతునికి అర్పించేవారికి భగవంతుడు భోక్త. అలా ఏదైనా భగవంతునికి అర్పిస్తే మనకు అహంకార మమకారాదులు నశించి, నిజమైన ఆస్వాదనానందము కలుగుతుంది.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – భుజ్ - తినుట. **కాలరూపో హి భగవాన్ కాలక్రమేణ సర్వమ్ భుంక్తే.** కాలరూపుడైన భగవానుడు కాలక్రమంలో సర్వమునూ భుజించును కనుక భోక్త. అగ్ని, సూర్యుడు, కాలుడు (యముడు), ఇలా వేర్వేరు రూపాలలో భగవంతుడు సర్వమునూ అంతమొందించును.

కఠోపనిషత్తు 2.25 – **యస్య బ్రహ్మ చ క్షత్రమ్ చ ఉభే భవత ఓదనః.** ఎవనికైతే బ్రహ్మ మరియు క్షత్రములు (చరాచరములు) అన్నము అవుతాయో....

సముద్రంనుండి పుట్టిన వర్షాలు నదులై తిరిగి సముద్రంలో కలిసినట్లే భగవంతుని సృష్టి తిరిగి భగవంతునిలో లీనమవుతుంది. **ఉత్పాదయతా, రక్షితా, భక్షితా చ భవతి.** కనుక భగవంతుడు భోక్త.

శ్రీ బలదేవ విద్యాభూషణ – భుజ్ - రక్షించుట. **భునక్తి పాలయతి ఇతి భోక్తా.** సదాచారపరులను రక్షించేవాడు భోక్త.

890. సుఖదః

- తన భక్తులకు సమస్త సుఖములను ప్రసాదించువాడు.
- దుర్మార్గుల ఆనందమును తొలగించువాడు.

- తన భక్తులకు అల్పసుఖములను తొలగించి (ద్యాతి-ఖండించుట), వారికి పరమానంద మార్గమును చూపువాడు.
- తన భక్తుల దుఃఖములను హరించువాడు (అ-సుఖ-దః, ద్యాతి - ఖండించుట).
- సకల జీవులకు నీటిని ప్రసాదించువాడు (సుఖమ్ - ఉదకమ్ - నీరు).
- జీవులకు చక్కని శరీరమును ఇచ్చినవాడు.

ఓం సుఖదాయ నమః

49వ శ్లోకము. 460వ నామము. సుఖదః – **సువ్రతః సుముఖః సూక్ష్మః సుఘోషః సుఖదః సుహృత్**
95వ శ్లోకము. 890వ నామము. సుఖదః – **అనంతో హుతభుగ్భోక్తా సుఖదో నైకదోऽగ్రజః**

శ్రీ భట్టుల వ్యాఖ్య –
460వ నామము 'సుఖదః' – సదాచారపరులైనవారికి శాశ్వతమైన సుఖమునిచ్చువాడు సుఖదుడు. సామాన్యమైన ఆనందములే కాక మోక్షమును కూడ ప్రసాదించును.

890వ నామము 'సుఖదః' – ఇంతకుముందు నామములవలెనే ఈ నామమును కూడ శ్రీ భట్టులు జీవుని పరమపదానికి తీసుకొనివెళ్ళే అర్చిరాదిమార్గం పరంగా వ్యాఖ్యానించారు. **అమానవ ముఖేన స్పృష్ట్వా స-వాసనమ్ సంసారముత్సాయామ్ స్వాప్తి సుఖమ్ దదాతి ఇతి సుఖదః**. అర్చిరాదిమార్గం చివరిదశలో అమానవ పురుషుని స్పర్శ కారణంగా చిట్టచివరి విషయవాసనలు కూడా తొలగిపోతాయి. జీవుడు పరమానందమును పొందుతాడు. కనుక భగవంతుడు సుఖదుడు.

అమానవ కర స్పర్శాత్ భవముత్సార్య సత్వరమ్
స్వప్రాప్తి లక్షణ సఖం దదాతి సుఖదశ్చ సః
అతని (అమానవ) కరస్పర్శతో సంసారకరమయిన సూక్ష్మప్రకృతి బంధాన్ని కూడా విడిపించి తన సాయుజ్యము అనే అపారమైన, అవిచ్ఛిన్నమైన సుఖాన్ని ఒసంగుచున్నాడు గనుక భగవానుడు సుఖదుడు. అమానవుడు అంటే విరజానదీ తీరాన ఉండే పరమపావనుడు. ముక్తజీవులను తన చేతితో స్పృశిస్తాడు. దానివల్ల వారు సూక్ష్మశరీరం ధరించి దివ్యరూపం పొందుతారు. (శ్రీకైవల్యసారధి).

ఇందుకు శ్రీ భట్టులు ఛాందోగ్యోపనిషత్తు (5.10.2)నుండి ఉదాహరించారు. **తత్ పురుషః అమానవః స ఏనాన్ బ్రహ్మ గమయతి ఏష దేవయానః పంథా ఇతి.** అక్కడినుండి (చంద్ర, వైద్యుతాదులనుండి) అమానవ పురుషుడు జీవుని పరబ్రహ్మము కడకు తీసికొని పోవును. ఇది దేవయాన మార్గము.

శ్రీ బలదేవ విద్యాభూషణ కూడా ఇంచుమించు ఇదే అర్థం చెప్పారు.
తతో మానవేన స్వ-పార్షదేన ఆనీతాయ విధ్వస్త లింగదేహాయ

స్వ-భక్తాయ స్వ-పార్షద తను లాభరూపమ్ సుఖం దదాతి ఇతి సుఖదః

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు 'సుఖదః' నామమునకు రెండు అర్థాలు చెప్పారు.

సుఖమ్ దదాతి. మంచివారికి ఆనందాన్ని ఇచ్చేవాడు.

సుఖమ్ ద్యాతి. చెడువారి ఆనందాన్ని హరించేవాడు.

ఇవి రెండే గాక శ్రీ శంకరులు **'అసుఖదః'** అనే పాఠాంతరాన్ని కూడా గ్రహించారు. **అసుఖమ్ ద్యాతి.** భక్తుల కష్టాలను హరించేవాడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – **సుఖమ్ ద్యాతి సుఖదః.** భక్తులయొక్క అల్పమైన (సంసారిక) సుఖాలను హరించి, తద్వారా వారిలోని వైరాగ్యమును పెంచి, వారిని శాశ్వతమైన సంతోషంవైపు నడిపించేవాడు సుఖదుడు.

శ్రీ వాసిష్ఠ 'సుఖమ్' అంటే 'ఉదకమ్' అనే అర్థాన్ని తీసుకొన్నారు (నిఘంటు 1.12). ఇందుకు మూలమైన ధాతువు 'ఖను' - అవధారణే - త్రవ్వుట – కావచ్చును. సకల జీవుల మనుగడ కొరకు బావులు, నదులు, చెఱువులు వంటివానిలో నీటిని ప్రసాదించువాడు సుఖదుడు.

శ్రీ వాసిష్ఠ చెప్పిన మరొక అర్థము – **సువ్యవస్థిత ఖాతమ్ చ ఇదమ్ శరీరమ్ జీవేభ్యో దదాతి ఇతి సుఖదః.** 'సుఖము' అనగా శరీరము. అనగా చక్కగా ఏర్పాటు చేయబడిన అఖాతము. ఇలా అస్థికలు, మాంసము, రక్తము వంటివానితో చక్కని శరీరమును సృష్టించి జీవునికి ఇచ్చినవాడు సుఖదుడు.

891. నైకదః

నైకజః

- అనేకమైనవానిని ఇచ్చువాడు. ముక్తజీవునికి అనేకవిధములుగా స్వాగతము చెప్పించువాడు.
- అనేకమార్లు అవతరించినవాడు (నైకజః).
- తులసి, పద్మ వనములలో ఉండేవాడు. శ్రీమహాలక్ష్మికి పతి.

ఓం నైకదాయ నమః

ఓం నైకజాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – న-ఏక-దః – నైకదః. **ఏకమ్ దదాతి ఇతి ఏకదః, తద్విరుద్ధః నైకదః.** ఒకటే ఇచ్చువాడు ఏకదుడు. అలా కాకుండా అనేకములు ఇచ్చువాడు నైకదుడు. అర్చిరాది మార్గంలో ప్రయాణించి పరమపదమును చేరుకొంటున్న ముక్తజీవునికి లభించే వైభవమైన స్వాగత సత్కారాల పరంగా ఈ నామమును శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు.

బ్రహ్మాలంకారదాయిన్యో ముక్తేభ్యశ్చ పరే పదే

దివ్యాశ్చాప్సరసో యస్య నైకద స్స చ కథ్యతే

ముక్తి పొందినవారికి పరమపదమునందు దివ్యాలంకారములు చేయడానికి అనేకమంది అప్సరసాంగనలు కలవాడు నైకదుడు (శ్రీకైవల్య సారధి). ఇందుకు శ్రీ భట్టులు కౌషీతకీ ఉపనిషత్తు (1.4)నుండి ఉదాహరించారు.

తమ్ పంచశతాని అప్సరసః ఉపధావన్తి శతమ్ మాలా హస్తః

శతమ్ అంజనహస్తాః తమ్ బ్రహ్మాలంకారేన అలంకుర్వతి

ఐదువందలు అప్సరసలు ముక్తజీవునికి స్వాగతం చెబుతారు. వారిలో వందమంది చేత పూలమాలలు, మరొక వందమంది చేత సుగంధ ద్రవ్యాలు సిద్ధంగా ఉంటాయి. వారు స్వయంగా ఆ జీవుని బ్రహ్మాలంకారములతో అలంకరిస్తారు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **న ఏకమ్ వస్తు దదాతి, అపి తు స్వ-పర్యన్తాని సర్వాణి వస్తూని దదాతి.** కేవలం ఒక్క వస్తువు మాత్రమే ఇచ్చేవాడు కాడు. అనేక వస్తువులను, చివరకు తనను తాను స్వయంగా ఇచ్చేవాడు నైకదుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **భక్తేభ్యో న ఏకాన్ అర్థాన్ బహూన్ ఏవ కామాన్ చతుర్వర్గ అంతర్వర్తినో దదాతి ఇతి నైకదః.** తన భక్తులకు నాలుగు విధాలైన పురుషార్థములను (ధర్మార్థకామమోక్షములను) ప్రసాదించువాడు నైకదుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు **'నైకజః'** పాఠాన్ని గ్రహించారు. **ధర్మగుప్తయే అసకృత్ జాయమానత్వాత్ నైక-జః.** ధర్మమును రక్షించడంకోసం అనేకమార్లు జన్మించినవాడు, అనగా అవతరించినవాడు నైకజుడు. ఇక్కడ 'జన్మ' అనగా తక్కిన జీవులవలె కర్మఫలమైన జన్మ కాదు. భగవానుడు తన ఇచ్ఛానుసారం అవతరిస్తాడు.

యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత

అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ – గీత 4.7

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్

ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే – గీత 4.8

ఓ భారత! (అర్జున!) ధర్మమునకు హాని కలిగినప్పుడును, అధర్మము పెచ్చుపెరిగి పోవుచున్నప్పుడును నన్ను నేను సృజించుకొందును. అనగా సాకార రూపముతో లోకమున అవతరింతును. సత్పురుషులను పరిరక్షించుటకును, దుష్టులను రూపు మాపుటకును నేను ప్రతి యుగమునందును అవతరించుచుందును.

శ్రీ సత్యసంధ తీర్థ – ఈయన **'నైకజః'** అనే పాఠాన్ని గ్రహించారు. కాని ఆయన చెప్పిన అర్థం పూర్తిగా భిన్నంగా ఉంది. ని (ఉపసర్గ), క-జ – **కే జాయన్తి ఇతి కమలాని** – నీటిలో జన్మించునవి (పద్మములు) కమలములు. ని-కజా – శ్రీమహాలక్ష్మి. నైకజః – శ్రీ మహాలక్ష్మికి పతి.

శ్రీ సత్యసంధ తీర్థ చెప్పిన మరొక అర్థము – 'నికజము' అనగా తులసి, పద్మ వనములు. **నితరామ్ కజాని యస్మిన్ తద్వనమ్ నికజమ్ తత్ర భవో నైకజ ఇతి.** తులసి వనములయందు, పద్మ వనములయందు ఉండేవాడు నైకజుడు. ఇందుకు ఆయన చెప్పిన ప్రమాణము –

తులసీ కాననమ్ యత్ర యత్ర పద్మవనాని చ

వసన్తి వైష్ణవా యత్ర తత్ర సన్నిహితో హరిః

తులసి వనములు, పద్మ వనములు, శ్రీ వైష్ణవులు ఉండేచోట హరి నివసించును.

అనేక అవతారములు ధరించినవాడు 'నైకజుడు' అని కూడా శ్రీ సత్యసంధతీర్థ ఒక అర్థం చెప్పారు.

శ్రీ రఘునాథ తీర్థ మరొక ద్వైత సంప్రదాయ ఆచార్యులు. ఆయన **'అనేకదః'** అనే పాఠాన్ని గ్రహించారు. కాని అందుకు ఆయన చెప్పిన అర్థం **'నైకదః'** అర్థానికి సరిపోతుంది. **అనేకాని బహూని దదాతి ఇతి అనేక-దః.** అనేకములైన వానిని ప్రసాదించువాడు అనేకదుడు.

892. అగ్రజః

- తనముందు నిలచిన ముక్తజీవునిపట్ల ప్రసన్నుడై, శ్రీమహాలక్ష్మీ సమేతుడై, భోగ్యభూతుడై ప్రకాశించేవాడు.
- హిరణ్యగర్భుని రూపమున అందరికంటె ముందుగా జన్మించినవాడు.

ఓం అగ్రజాయ నమః

'అగ్ర' అనగా 'ముందు'. **అగ్రే జాయత ఇతి అగ్రజః.** అందరికంటె ముందుగా ఉన్నవాడు అగ్రజుడు. **పూర్వో యో దేవేభ్యో జాతః, నమో రుచాయ బ్రహ్మయే** (పురుష సూక్తము. యజుర్వేదము 31.20).

శ్రీ భట్టుల వ్యాఖ్య – అగ్రజుడు అనగా ముందుకు వచ్చినవాడు. **ఏవమ్ ప్రాప్తానామ్ ముక్తానామ్ అగ్రే సహ సర్వేశ్వర్యా శ్రియా యథా, పర్యంక విద్యమ్ పరమభోగ్యో జాయతే ఇతి అగ్రజః.** అర్చిరాది మార్గంలో ప్రయాణించి తనవద్దకు వచ్చిన ముక్తజీవుని ఎదురుగా శ్రీమహాలక్ష్మీసమతుడై కరుణతో స్వాగతించేవాడు అగ్రజుడు.

స్వస్తాగ్రే ప్రాప్త ముక్తానాం సర్వైశ్వర్య శ్రియా సహ

యథా పర్యంకవిద్యంచ కరుణానిష్ట చేతసా

తద్భోగ్యో జాయతే యశ్చసోఽగ్రజః పరికీర్తితః

సకల భోగ సంపదలతోను తన ముందు నిలిచిన ముక్తులకోసం కరుణాంతరంగుడై, 'పర్యంకవిద్య'యందు చెప్పినట్లు భోగ్యభూతుడై ప్రకాశించువాడు అగ్రజుడు (శ్రీకైవల్య సారధి).

కౌషీతకీ ఉపనిషత్తు 1.5, 1.6 –

స ఆగచ్ఛతి అమితౌజసమ్ పర్యంకమ్ ఇతి ప్రభృతి

ఉపశ్రీరుపబృంహణమ్ తస్మిన్ బ్రహ్మాస్తే
తమిత్థమ్ విత్ పాదేనైవ అగ్రే ఆరోహతి
తమ్ బ్రహ్మ ఆహ 'కోऽసీతి' ఇతి ప్రభృతి చ
సాయా బ్రహ్మణి చితిః వ్యష్టిః తామ్ చితిమ్ జాయతి
తామ్ వ్యష్టి వ్యాశ్నుతే ఇతి
ఇత్యేవమంతా హి పర్యంకవిద్యా

అమితమైన తేజస్సుతో వెలిగే పర్యంకము (మంచము)వద్దకు ముక్తజీవుడు వెళతాడు. శ్రీమహాలక్ష్మి తన ప్రక్కనుండగా, దివ్య సేవకులు సేవించుచుండగా, దానిపై పరబ్రహ్మము ఆసీనుడై యుంటాడు. ఇలా పరబ్రహ్మమును ధ్యానించిన ముక్తజీవుడు పర్యంకముపైకి ఎక్కుతాడు. నీవెవరవు అని పరబ్రహ్మము ముక్తజీవుని అడుగుతాడు. బ్రహ్మమునందుగల చైతన్యమును అని జీవుడు చెబుతాడు. అప్పుడు ముక్తజీవునికి పర్యంకవిద్య జ్ఞానం లభిస్తుంది. ఇలా అతను బ్రహ్మానందమును అనుభవిస్తాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **అగ్రే జాయత ఇతి అగ్రజః**. హిరణ్యగర్భుని రూపమున మున్ముందుగా జన్మించినవాడు అగ్రజుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ భాగవతం (2.9.9)నుండి ఉదాహరించారు.

తస్మై స్వలోకమ్ భగవాన్ స భాజితః సందర్శయామాస పరం న యత్పరమ్
వ్యాప్తేన సంక్లేశ విమోహ సాధ్వసమ్ స్వ దృష్టవద్భిః అభిష్టుతమ్

బ్రహ్మదేవుడు తన సృష్టికి ముందు దేవమానం ప్రకారం వేయి సంవత్సరాలు ఘోరతపస్సు చేశాడు. భగవానుడు ఆ విధంగా సంపూజితుడై, బ్రహ్మ తపోదీక్షకు సంతోషించి, ఏది పరమశ్రేష్ఠమో, దేనికన్న పరమోత్కృష్టమైనది వేరొకటి లేదో, దేనిని గురించి ఆత్మజ్ఞానులు ధ్యానిస్తారో, ఆ తన లోకాన్ని పరమపదాన్ని వైకుంఠాన్ని సందర్శించే మహాభాగ్యాన్ని అతనికి కలుగజేశాడు.

శ్రీ చిన్మయానంద – అందరికంటె ముందు జన్మించినవాడు అగ్రజుడు. సహజంగా మిగిలినవన్నీ ఆయననుండే జన్మించాయి. ఎవనినుండి సమస్తమూ ఉద్భవిస్తుందో, ఎవనియందు సమస్తమూ నిలిచియుంటుందో, ఎవనిలో సమస్తం లయిస్తుందో అతడే అగ్రజుడు.

893. అనిర్విణ్ణః

- జీవులు సంసారబంధమునుండి బయటపడడానికి తనను ఆశ్రయించకపోయినాగాని విసుగు చెందకుండా సృష్టికార్యం సాగించేవాడు.
- జీవుడు తనను చేరి ముక్తుడైనపుడు భారము తీరినట్లుగా సంతోషించేవాడు.
- పూర్ణకాముడు గనుక నిరాశ పొందనివాడు.

- భక్తుల కోరికలు తీర్చడంలో విసుగు లేనివాడు.

ఓం అనిర్విణ్ణాయ నమః

47వ శ్లోకము. 436వ నామము. అనిర్విణ్ణః – **అనిర్విణ్ణః స్థవిష్ఠోభూః ధర్మయూపో మహామఖః**
95వ శ్లోకము. 893వ నామము. అనిర్విణ్ణః – **అనిర్విణ్ణః సదామర్షీ లోకాధిష్ఠానమద్భుతః**

ని (ఉపసర్గ); విద్ - సత్తాయామ్ - జరుగుట, ఉండుట; విద్ - విచారణే - ఆలోచించుట, భావించుట
అనిర్విణ్ణః - ఏ విధమైన చింతలు, క్లేశములు లేకుండుట.
నిర్వేదమ్ క్షోభమ్ క్లేశమ్ ఆలస్యమ్ వా న ప్రాప్నోతి స అనిర్విణ్ణో విష్ణుః. నిర్వేదము (చింత), క్షోభ, క్లేశము (చిత్త వ్యాకులత), ఆలస్యము (విసుగు, సోమరితనము) వంటివి పొందనివాడు అనిర్విణ్ణుడు. **యో న కదాచిదపి నిర్వేదమ్ (ఖిన్నతమ్) ప్రాప్నోతి స అనిర్విణ్ణః.** ఏ విధమైన ఖిన్నతను (నిర్వేదమును) పొందనివాడు అనిర్విణ్ణుడు. భగవానుడు ఎందుకు నిర్విణ్ణుడు (నిర్వేదము పొందువాడు) కాడో అనే విషయంలో వివిధ వ్యాఖ్యాతల వివరణలలో భేదాలను గమనించవచ్చును.

శ్రీ భట్టుల వ్యాఖ్య –
436వ నామము 'అనిర్విణ్ణః' – జనులు సంసారబద్ధులై, లౌకిక వాంఛా ప్రీతిపరులై, పరమేశ్వరుని అలక్ష్యం చేసినాగాని విసుగు చెందక (అనిర్విణ్ణః - అనలసః - అలసత్వము లేనివాడు) మరల మరల సృష్టికార్యమును కొనసాగించువాడు అనిర్విణ్ణుడు. పంట పండినా పండకపోయినాగాని రైతు మరల మరల విత్తినట్లుగా, తననుండి విముఖులైన జీవులయందుకూడా భక్తి జనించేలా అవకాశం ఇచ్చేవాడు భగవంతుడు అనిర్విణ్ణుడు.

893వ నామము 'అనిర్విణ్ణః' – చింత లేనివాడు అనిర్విణ్ణుడు. 880వ నామము 'విహాయసగతి'నుండి చెప్పిన క్రమంలో ముక్తజీవుడు శ్రీవైకుంఠమునకు వచ్చి తనను చేరినందున భగవంతుడు ఒక భారము తీరినట్లుగా సంతోషించును. ఆ విధంగా ఆయన అనిర్విణ్ణుడు. (అంతవరకూ ఆ జీవునిపట్ల కరుణ కలిగిన భగవంతుడు అతని ముక్తికై చింత పొందియుండును.)
మహతా ప్రనిధానేనహ్యుత్తార్య భవగర్తతః
ప్రాపయ్య చ తమాత్మానం కృతకృత్యశ్చ విజ్వరః
ఈ రకంగా నిరంతరము కృషిచేసి, సంసారసాగరంలో పడి ఉన్నవారిని ఉద్ధరించి, వారిని మోక్షసామ్రాజ్యానికి అభిషిక్తులను కావించి, నిశ్చింతగా ఉండేవాడు అనిర్విణ్ణుడు (శ్రీకైవల్య సారధి).

శ్రీ భట్టులు రామాయణంనుండి ఉదాహరించారు – విభీషణుడిని లంకకు అధిపతిగా పట్టంకట్టి, తన మాట చెల్లించుకొన్నందుకు, బాధ్యత తీరినందుకు శ్రీరాముడు ముదము పొందాడు. **కృతకృత్యస్తదా రామో విజ్వరః ప్రముమోద** (బాలకాండము 1.85).

శ్రీ శంకరుల వ్యాఖ్య –

అవాప్త సర్వకామత్వాత్, అప్రాప్తహేత్యభావాత్

నిర్వేదః అస్య న విద్యత ఇతి అనిర్విణ్ణః

భగవానుడు నిస్పృహ, నిర్వేదము, దుఃఖము మున్నగునవి లేనివాడు. ఆయన అవాప్తకాముడు. పూర్ణుడు. పరిపూర్ణుడు. నిత్యతృప్తుడు. కనుక అనిర్విణ్ణుడు.

న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన

నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి – గీత 3.22

ఓ అర్జున! ఈ ముల్లోకములందును నాకు కర్తవ్యము అనునదియే లేదు. అట్లే పొందదగిన వస్తువులలో ఏదియును నేను పొందనిదియును లేదు. ఐనను నేను కర్మలయందే ప్రవర్తిల్లుచున్నాను.

శ్రీ అనంతకృష్ణశాస్త్రి – భక్తుల కోరికలు తీర్చడంలో భగవంతుడు ఎన్నడూ విసుగు, విముఖత్వము, అలసత్వము పొందడు. కనుక ఆయన అనిర్విణ్ణుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ కూడా ఇదే అర్థం చెప్పారు. **న నిర్విందతి కదాపి స్వజన కామనాపరంపరా పూర్తిషు ఇతి అనిర్విణ్ణః.**

శ్రీ వాసిష్ఠ, శ్రీ రాధాకృష్ణశాస్త్రి – నిర్విణ్ణత (విరక్తి, వింత, విసుగు) అనేది కావలసినది పొందలేనివారికి, పొందినది చాలనివారికి వర్తిస్తుది. ఇవన్నీ పూర్వజన్మ కర్మఫలితాలు. కాని భగవానుడు పూర్ణకాముడు. మార్పు లేనివాడు. జన్మ కర్మ రహితుడు. కనుక ఆయన అనిర్విణ్ణుడు.

894. సదామర్షీ

- ఎంతో సహనము కలవాడు (సదా-మర్షీ). అన్ని విధముల కైంకర్యములను స్వీకరించేవాడు.
- (సత్-ఆ-మర్షీ) సజ్జనులొనరించే అపరాధములపట్ల క్షమాగుణము కలవాడు.
- (సదా-ఆమర్షీ) దుర్మార్గుల కార్యముల పట్ల ఏమాత్రం సహనం లేనివాడు.

ఓం సదామర్షిణే నమః

మృష - తితీక్షాయామ్ - ఓర్పు వహించుట, క్షమించుట.

శ్రీ భట్టుల వ్యాఖ్య – ముక్తజీవుడు శ్రీవైకుంఠాన్ని చేరిన విషయాన్ని ఈ నామము వ్యాఖ్యలో కూడా శ్రీ భట్టులు కొనసాగించారు. భగవంతుడు ఎంతో ఓపికతో ముక్తజీవులు తనకొనరించే సకల కైంకర్యములను స్వీకరిస్తాడు (భగవంతునికి ఆ కైంకర్యము అవుసరం లేకున్నాగానీ సంతోషంతో స్వీకరిస్తాడు.)

సర్వకాలం తత్ప్రభృతి కృత ప్రతికృతం చ సః

మర్షితుమ్ శీలమస్యేతి సదామర్షీతి కీర్తితః

ఆ విధంగా పరమపదము పొందిన తరువాత, పరమేశ్వరుడైన శ్రీమన్నారాయణుడు తమకు చేసిన మహోపకారానికి ప్రతిక్రియగా భక్తులు సమర్పించే వివిధరకాలైన నిత్యకైంకర్యములను (నివేదనలను) స్వీకరించేవాడు సదామర్షి (శ్రీకైవల్యసారధి).

శ్రీ శంకరుల వ్యాఖ్య – సత్-ఆ-మర్షీ – సదామర్షీ. **సతః సాధూన్ అభిముఖ్యేన మృష్యతే క్షమత ఇతి సదామర్షీ.** సాధుజనులు (తెలియక) చేసిన అపరాధములను సదా క్షమించువాడు సదామర్షి. 'సత్' అనగా సాధువులు. 'ఆ' ప్రత్యయము ద్వారా 'అన్ని ప్రక్కల నుండి' అనే అర్థం వస్తుంది (శ్రీమాన్ ఆప్టే నిఘంటువు). 'మర్షీ' అనగా క్షమించువాడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ కూడా ఇదే అర్థం చెప్పారు. **సతః సాధూనా సమంతాత్ మర్షితుమ్ శీలమ్ యస్య ఇతి సదామర్షీ.**

కథంచిత్ ఉపకారేణ కృతేన ఏకేన తుష్యతి

న స్మరతి అపకారాణామ్ శతమపి ఆత్మవత్తయా – రామాయణం. అయోధ్యకాండ 1.11

శ్రీరాముడు తనకు ఇతరులొనర్చిన చిన్న ఉపకారంవల్ల కూడా ఎంతో సంతోషిస్తాడు. తనపట్ల చేసిన అపకారాలను కూడా పట్టించుకొనడు. ఇది ఆయన నైజము.

నాऽక్షస్తృప్యతే భూరిభారః – ఋగ్వేదము 1.164.13 – జగములను నడిపే ఇరుసు ఎంత భారమైనాగాని వేడెక్కదు, విరిగిపోదు.

శ్రీ సత్యసంధతీర్థ ఇందుకు విరుద్ధంగా అర్థం చెప్పారు. 'సదా-ఆమర్షః' అని. **సదా ఆమర్షః కోపో దైత్యేషు అస్య అస్తి ఇతి సదామర్షీ.** దైత్యులపట్ల సదా క్రోధము (ఆసహనము) కలిగినవాడు సదామర్షి. 'ఆ' ప్రత్యమువల్ల విరుద్ధమైన అర్థం వస్తుంది. (గమ్ - వెళ్ళుట, ఆగమ - వచ్చుట, మర్షీ - సహనము కలిగియుండుట, ఆమర్షీ - కోపముగా, సహనము లేకుండా ఉండుట.)

895. లోకాధిష్ఠానమ్

సక లోకములకు ఆధారమైనవాడు.

ఓం లోకాధిష్ఠానాయ నమః

స్థా - గతి నివృత్తౌ - నిలుచుండుట, ఉండుట. అధి - ముఖ్యమైన, ప్రముఖ, ప్రధాన. లోకములు - జగత్తు. **లోకస్య అధిష్ఠానమ్ లోకాధిష్ఠానమ్**. లోకములకు ఆధారము లోకాధిష్ఠానము.

శ్రీ భట్టుల వ్యాఖ్య – ముక్తజీవులు శ్రీవైకుంఠము చేరి భగవత్సాన్నిధ్యాన్ని అనుభవించే విషయం పరంగా ఈ నామాన్ని కూడా శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. భగవంతుని నిత్యవిభూతి కారణంగా ముక్తజీవులు పరమపదంలో శ్రీమన్నారాయణుని సేవించగలుగుచున్నారు. ఆ ఉత్తమ లోకాలకు ఆధారం ఆయనే.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **లోకానామ్ స్వాంతికమ్ ఆగతానామ్ స్వజనానామ్ నిత్యమ్ ఆశ్రయత్వాత్ లోకాధిష్ఠానమ్**. భక్తులు తమ ప్రయాణం చివరిలో చేరుకునే శాశ్వత శాంతిస్థానము శ్రీభగవానుడే.

తిరువైమోళి 3.9.9 – ముందుగా ఆయన మనకు అనేక సంపదలు ఇచ్చాడు. తరువాత మనను శ్రీవైకుంఠమునకు కొనిపోయి 'ఇదే నీ ఇల్లు, తీసుకో' అంటాడు. ఇక వైకుంఠం మనదే.

ఋగ్వేదము 1.164.13 – **తస్మిన్నాథ స్థుర్ భువనాని విశ్వా**.
ఋగ్వేదము 1.164.39 – **ఋచో అక్షరే పరమే వ్యోమాన్ యస్మిన్ దేవా అధి విశ్వే నిషేదుః**.
తైత్తరీయారణ్యకము 10.1.1 – **యస్మిన్నిదమ్ సమ్ చ విచైతి సర్వమ్.**
యజుర్వేదము 17.30 – **యస్మిన్ విశ్వాని భువనాని తస్థుః**.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **తమ్ అనాధారమ్ అధిష్ఠాయ త్రయో లోకాః తిష్ఠన్తి లోకాధిష్ఠానమ్**. ఆయనకు ఆధారము అవుసరం లేదు. లోకములన్నీ ఆయనపై ఆధారపడి ఉన్నాయి.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవానుడు కూర్మ, వరాహ, ఆదిశేషాది అవతారములలో లోకమునకు ఆధారమై యున్నాడు.

896. అద్భుతః

- ఎంతో అద్భుతమైన, ఆశ్చర్యకరమైనవాడు.
- అప్పుడప్పుడూ మనమధ్య అవతరించేవాడు.
- (ఆద్యమ్ - ధాన్యములు) ఆయన కారణంగా ధాన్యములు, ఆహారము లభిస్తున్నాయి.

ఓం అద్భుతాయ నమః

భూ - ఉండుట. ఉనాది సూత్రము (5.1). **అది భువో దుతాచ్** – ప్రకారం 'అద్' అనగా తెలియరానిది, ఎప్పుడైనా హఠాత్తుగా జరిగేది. అద్భుతం అంటే ఆశ్చర్యం కూడాను.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **సర్వదా సర్వైః సర్వథా అనుభవేఽపి అపూర్వత్వాత్ అతి విస్మయనీయః.** మనం (భక్తులు, నిత్య ముక్తులు) ఆయనను ఎల్లప్పుడూ, అందరూ, అన్ని విధాల అనుభవించినాగాని ఆయన తనివి తీరని అద్భుతము. ఉత్తమ లోకాలలోని భక్తులు పరమేశ్వరుని సదా అనుభవిస్తున్నప్పటికీ ఎప్పటికప్పుడు నిత్యనూతనంగా కనుపించేవాడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **విచిత్రైః ప్రతిక్షణమ్ నీతనైః గుణరూప చరిత్రైః తైః తేషామ్ విస్మయ కరణాత్ అద్భుతః.** ముక్తులు ఆయన గుణరూప చరితములను సదా విస్మయంతో వర్ణిస్తుంటారు. ఇలా విచిత్రంగా ప్రతిక్షణం వారిని విస్మయపరచేవాడు అద్భుతము.

పెరియతిరుమొళి 8.1.9 – ఆయనను నేను ఇంతకుముందు ఎక్కడ చూచాను? ఏ దివ్యక్షేత్రంలో చూచాను? లేక ఎక్కడా చూడలేదా?
పెరియ తిరుమొళి 10.10.9 – తల్లీ! చేత దివ్యచక్రాన్ని, బంగారు సారంగ ధనుస్సును ధరించిన అతడెవరో నాకు తెలియరావడంలేదు.
తిరువైమొళి 8.6.10 – శ్రీమన్నారాయణుడు అద్భుతమైన చేష్టలు చేసి ఆనందిస్తాడు. అద్భుత చేష్టలంటే ఏమిటి? ఆయన తన భక్తులకే గాక, శత్రువులకు కూడా సాయం చేస్తాడు. పంది, తాటేలు ఇలా ఎన్నో రూపాలలో అవతరించి భక్తుల నుద్ధరిస్తాడు. ఆయన అనుభవాలతో మనకు తనివి తీరదు. ఆయన వామనుడై వచ్చి, త్రివిక్రముడై మూడు లోకాను అతిక్రమించాడు. కాని నాహృదయంలో నెలకొని ఉన్నాడు. ఇవన్నీ ఆయన అద్భుత చేష్టలు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు భగవానుని అద్భుత లక్షణాన్ని గురించి చెబుతూ ఉపనిషత్తునుండి, గీతనుండి ఉదాహరించారు.

శ్రవణాయాపి బహుభిర్యో న లభ్యః శృణ్వంతోఽపి భవోఽయం న విద్యుః
ఆశ్చర్యోవక్తా కుశలోఽస్య లబ్ధా ఆశ్చర్యో జ్ఞాతా కుశలానుశిష్టః – కఠోపనిషత్తు 2.7
పరమాత్మము ఎలాంటిదంటే దానిని గురించి వినడంవలన అది లభించదు. వినడంవలన అర్థం కాదు. దానిని గురించి తెలిసినవారు, పొందినవారు, జ్ఞానియైన గురువుద్వారా తెలుసుకొన్నవారు అరుదు.

ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేన మాశ్చర్యవద్వదతి తథైవ చాన్యః
ఆశ్చర్యవచ్చైనమన్యః శృణోతి శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్ – గీత 2.29

ఎవరో ఒక మహాపురుషుడు మాత్రమే దీనిని (ఈ ఆత్మను) ఆశ్చర్యకరమైనదానిగా చూచును. మరియొక మహాత్ముడు దీని తత్వమును ఆశ్చర్యకరముగా వర్ణించును. వేరొక పురుషుడు దీనిని ఆశ్చర్యకరమైనదానిగా వినును. ఆ విన్నవారిలో కూడా కొందరు దీనిగురించి ఏమియు ఎఱుగరు.

శ్రీ చిన్మయానంద – భగవంతుడు, ఆయనను గూర్చి తెలిపే గురువు, ఆయనను అర్థం చేసుకొనే శిష్యుడు – అన్నీ అద్భుతాలే.

శ్రీ వాసిష్ఠ – **అద్ - కదాచిత్ భవతి ఇతి అద్భుతమ్.** అప్పుడప్పుడూ ఆయన మనయందు అవతరించుట అద్భుతము. **సన్నాపి అభూతమ్ ఇవ ఇతి అర్థః.** ఆయన మనలో ఉండి కూడ మనలో లేరు అని అర్థము. భగవంతుడు మనందరిలో ఉన్నాగాని ఆ సంగతి తెలియక మనం భగవంతుడు లేనట్లుగా ప్రవర్తిస్తాము. ఇది అద్భుతము.

శ్రీ రఘునాథ తీర్థ – **ఆద్యమ్ - భోగ్యమ్ అన్నాదికమ్ భవతి అస్మాత్ ఇతి అద్భుతః.** ఆద్యము అనగా తినేది (అన్నము, ధాన్యము). భగవంతుని కారణంగా ధాన్యము, ఆహారము లభించుచు జీవుల మనుగడ సాగుచున్నది. ఇలా జరిగేలా చేసేవాడు అద్భుతము.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

సనాత్సనాతనతమః కపిలః కపిరవ్యయః (కపిరప్యయః) |
స్వస్తిదః స్వస్తికృత్ స్వస్తి స్వస్తిభుక్ స్వస్తిదక్షిణః || (96)

897. సనాత్

- ముక్తులు ఆయనను భజించి, దర్శించి, అనుభవింతురు.
- కాలస్వరూపుడు.
- శాశ్వతము, ఆద్యంతరహితము ఐ, సదా అదే సుందరరూపములో ఉండేవాడు.
- భక్తులు సమర్పించినదానిని ఇష్టంగా స్వీకరించేవాడు.

ఓం సనాతే నమః

ఈ నామ వివరణకు రెండు విధాల అర్థాలు చెప్పబడినవి.

(1) సన్ - దానే - ఇచ్చుట, పూజించుట. **సనోతి - దదాతి స్వదర్శనమ్ భక్తేభ్యః ఇతి సనాత్.** భక్తులకు ఆయన తన దర్శనమును అనుగ్రహించును.

(2) అమరకోశములో 'సనా' అనగా 'నిత్య' అనే అర్థం ఉంది. అనగా సనాతనమైన, కాలంతో పతనం కాని, శాశ్వతమైన.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **తేషామ్ సంభజనాత్ సనాత్.** ఆయనను భజించి, దర్శించి ముక్తులందరూ పరిపూర్ణ ఆనందమును పొందుదురు గనుక ఆయన సనాత్.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సనాత్ ఇతి నిపాతః చిరార్థ వచనః.** సనాత్ అనగా పురాతన, చిరకాలమైనది. కాలంతో క్షీణించనిది. ఇది భగవంతుని కాలస్వరూపమును సూచించును. ఇందుకు శ్రీ శంకరులు ఉదాహరించినది –

పరస్య బ్రహ్మణో రూపమ్ పురుషః ప్రథమం ద్విజ

వ్యక్తావ్యక్తే తథైవాన్యే రూపే కాలస్తథాపరమ్ – విష్ణుపురాణము 1.2.15

పరబ్రహ్మముయొక్క మొదటిరూపము పురుషుడు. వ్యక్తావ్యక్తములు తరువాతవి. తరువాతిది సమయము. భగవంతునివలెనే కాలము ఆద్యంతరహితము.

శ్రీ వాసిష్ఠ – **సనాత్ నిత్యః అవికారః ఏకరసః ఇత్యర్థః.** సనాత్ అనగా నిత్యమైన (శాశ్వతమైన)వాడు, మార్పు లేని (స్థిరమైన)వాడు, సదా ఒకే సుందరమైన రూపు కలిగినవాడు. ఋగ్వేదమునుండి ఉదాహరణలు –

2.16.1 – **సనాత్ యువానమసే హవామహే.**

4.20.6 – **సనాదేవ సహసే జాత ఉగ్రః.**

10.55.6 – **ఆ యో మహః శురః సనాత్ అనీడః.**

శ్రీ బలదేవ విద్యాభూషణ – **సనమ్ తద్-దత్తమ్ రస గంధాది అత్తి ఇతి సనాత్.** తన భక్తులు సమర్పించిన ఉపచారములను ప్రేమతో సంతోషముగా స్వీకరించువాడు సనాత్. ఆప్టే నిఘంటువులో 'సన్' పదమునకు ఇచ్చిన ఒక అర్థము – కరుణతో స్వీకరించుట.

శ్రీ కల్కి అవతారము. 1765 కాలపు చిత్రం. వికిపీడియానుండి.

898. సనాతనతమః

- ప్రాచీనులందరిలోకి ప్రాచీనుడు.

- నిత్యమూ అనుభవిస్తున్నప్పటికీ నిత్యనూతనమైనవాడు.

ఓం సనాతనతమాయ నమః

'సనా' - నిత్యమైన, ప్రాచీనమైన. పాణిని సూత్రము (4.3.23) ప్రకారము 'తన' ప్రత్యయము కలిపితే 'ప్రాచీన కాలానికి చెందిన' అనే అర్థం వస్తుంది. దానికి 'తమప్' ప్రత్యయము కలిపితే 'అన్నింటికంటె' అనే భావం కలుస్తుంది. భగవానుడు అన్నింటికంటె ముందునుండి యున్నాడు. మరియు ప్రళయంలో అన్నీ లయమైనాగాని ఆయన మాత్రం అలాగే ఉంటాడు. కనుక ఆయన సనాతనతముడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతుడు అత్యంత ప్రాచీనుడైనప్పటికీ ఆయనను గురించిన అనుభవం ఎప్పుడూ క్రొత్తగానే ఉంటుంది. **పురా అపి నవః పురాణః.** సనా - పురాణ. తన - రూపము, మూర్తి (తను - శరీరము). తమ - అనుభవంలో ఎంతో ఆనందం కూర్చేది. **సదా తనత్వేఽపి తదా తనత్వాత్ నిత్యనూతన భోగ్యః.** ప్రాచీనమూర్తి యైనప్పటికీ అత్యంత నూతనమూర్తివలె మనకు అనుభవం కలుగజేసేవాడు. నిత్యనూతన భోగ్యుడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ కూడా ఇదే అర్థం చప్పారు. **సనాతనానామ్ ముక్తానామ్ అయమ్ అతిశయేన సనాతనతమః. సనాతనత్వేఽపి తేషామ్ తదా-తనత్వాత్ ప్రతీయ ఇత్యర్థః.**

తిరువైమోళి 2.5.4 – నేను ఇంతకుముందు చెప్పినదే మళ్ళీ చెబుతున్నందుకు మన్నించండి. కాని ఎన్ని దినాలు, సంవత్సరాలు, యుగాలు అనుభవించినాగాని నాకు తనివి తీరని నిత్యనూతన అనుభవమది. అందులోని అనంతవైవిధ్యం కారణంగా ప్రతిక్షణం నేను ఆనందంతో పరవశిస్తుంటాను. సదా అది నాకు నూతనానుభవమే. అయితే నా బుద్ధి అభివృద్ధి చెందడంవల్ల నాకేదో క్రొత్త అనుభవం కలుగుతున్నదని అనుకొనవద్దండి. మొదటినుండీ నా బుద్ధి కుశలంగానే ఉన్నది భగవంతుని దయవల్ల. కాని భగవత్సాన్నిధ్యము అనేది పూర్తిగా వేరే తలానికి చెందినది. అందరికీ అంతర్యామి, ప్రభువు అయిన భగవంతుడు చల్లని పచ్చని అందపు కొండలాగా ఉంటాడు. ఆయన కనులు, పాదములు, చేతులు అప్పుడే విరిసిన పద్మాలలా ఉంటాయి. క్షణక్షణానికీ మాధుర్యం పెరుగుతున్నందువలన, ఎంత త్రాగినా తనివితీరని అమృతమే ఆయన.

తిరువైమోళి 2.6.1 – ప్రభూ! నీవు దేవాధిదేవుడవు. జీవితంలో ప్రతిదినం సేవించినాగాని తనివి తీరని అమృతానివి.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సర్వ కారణత్వాత్, విరించ్యాదీనామపి సనాతనానామ్ అతిశయేన సనాతనత్వాత్ సనాతనతమః.** అన్నివిధాలుగా, బ్రహ్మవంటివారికంటే కూడా సనాతనుడు గనుక సనాతనతముడు.

సనాతనమ్ ఏనమ్ ఆహురుతాద్యః స్యాత్ పునార్ణవః
అహోరాత్రే ప్రజాయేతే అన్యో అన్యస్య రూపయోః – అధర్వవేదము 10.8.23

పగలు, రాత్రి ఒకదానిరూపం ఒకటి దాల్చి, మరల మరల వచ్చినట్లు ఆయన ప్రాచీనుడైనా ఎప్పుడూ క్రొత్తగా ఉంటాడు.

899. కపిలః

- కపిలమహాముని అవతారము.
- అందమైన (కపిల) వర్ణము కలవాడు.
- జీవుల జీవనం కొరకు సూర్యుని తెచ్చేవాడు.
- సుగ్రీవ హనుమదాదులచే సేవింపబడినవాడు.

ఓం కపిలాయ నమః

57వ శ్లోకము. 535వ నామము. కపిలాచార్యః – **మహర్షిః కపిలాచార్యః కృతజ్ఞో మేదినీపతిః**
96వ శ్లోకము. 899వ నామము. కపిలః – **సనాత్ సనాతనతమః కపిలః కపిరవ్యయః**
57వ శ్లోకంలోని 'కపిలాచార్యః' నామమును శ్రీ భట్టులు మరియు శ్రీ శంకరులు కూడా కపిలమహాముని అవతారపరంగా వ్యాఖ్యానించారు (శ్రీ భట్టులు 529 నుండి 538వ నామం వరకు కపిలముని పరంగా వ్యాఖ్యానించారు). సాంఖ్యయోగమును బోధించిన శ్రీ కపిలుడు శ్రీమహావిష్ణువుయొక్క అంశావతారము. 96వ శ్లోకంలోని 'కపిలః' నామమును శ్రీ భట్టులు, శ్రీ శంకరులు కూడా 'సుందరమైన రంగు కలవాడు' అన్న అర్థంలో వ్యాఖ్యానించి, పునరుక్తి లేదని నిరూపించారు.

కమ్ - కాంతౌ - కాంతిరిచ్ఛా - కోరుకొనుట. కబ్ర్ - వర్ణే - రంగు కలిగియుండుట. ఉణాదిసూత్రము (1.,55) **'కామేః పశ్చ'** ప్రకారము 'కమ్'లోని 'మ' లేదా 'కబ్ర్' లోని 'బ్ర'లు 'ప'గా మారుతాయి. 'ఇలాచ్' ప్రత్యయము చేరిస్తే 'కపిలః' అనగా ఎరుపురంగు కలవాడు – అన్న అర్థం వస్తుంది (పొగ లేని మంట రంగు).

శ్రీ భట్టుల వ్యాఖ్య –
57వ శ్లోకము. **కపిలాచార్యః** – వేదవిదుడైన శ్రీ కపిలుడు.

96వ శ్లోకము. **కపిలః** – సుందరమైన వర్ణము కలవాడు కపిలుడు. **మధ్యస్త నీల తోయద విద్యుల్లేఖోజ్వల వర్ణః కపిలః.**

విద్యున్మండల మధ్యస్థ నీలమేఘవదుజ్వలః
కపిల స్స స్సమాఖ్యాతః సప్తవర్ణో మహామనుః
మెరుపులతో అలరారే నీలమేఘములాగా మంచి తేజస్సుతో వెలుగొందేవాడు. ఇక్కడ మెరుపులు శ్రీమహాలక్ష్మికి సంకేతము. ఈ నామము సప్తాక్షరీ మంత్రము. గొప్ప విశేషమైనది. ఓం కపిలాయ నమః (శ్రీ కైవల్య సారధి).

శ్రీ శంకరుల వ్యాఖ్య –

57వ శ్లోకము. **మహర్షిః కపిలాచార్యః** – వేదములకు ద్రష్టలైన మునులు మహర్షులు. మహర్షులలో తాను స్వయముగా కపిలాచార్యుడనని శ్రీకృష్ణ భగవానుడు గీత (10.26)లో తెలిపెను. **సిద్ధానాం కపిలో మునిః.** శ్వేతాశ్వరోపనిషత్తు 5.2 – **ఋషిమ్ ప్రసూతమ్ కపిలమ్ మహాన్తమ్.**

96వ శ్లోకము. **కపిలః** – **బడబానలస్య కపిలో వర్ణ ఇతి తద్రూపీ కపిలః.** సముద్రములోని బడబానల స్వరూపుడైనందున భగవంతుడు కపిలుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – కొద్దిపాటి నల్లని ఛాయ కలిగిన బంగారురంగును కపిలవర్ణము అంటారు.

శ్రీ వాసిష్ఠ – 'కపి' అనగా పింగళవర్ణము. **కపిమ్ - సూర్యమ్, లాతి - ఆదత్తే, సర్వస్య జగతః ప్రవర్తనాయ ఇతి కపిలః.** సకల జగత్తును ప్రవర్తింపజేయుటకై సూర్యుని తెచ్చేవాడు కపిలుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – 'కపి' అనగా కోతి. **కపీన్ సుగ్రీవ హనుమదాదీన్ లాతి సేవాయామ్ ఇతి కపిలః.** సుగ్రీవ, హనుమదాదులను తన సేవ నిమిత్తము కలిగినవాడు కపిలుడు.

900. కపిరవ్యయః

కపిః

అవ్యయః

అప్యయః

శ్రీ భట్టులు ఈ నామమును 'కపిరవ్యయః' అనే ఒకే నామముగా పరిగణించారు. శ్రీ శంకరులు 'కపిః', 'అప్యయః' అనే రెండు నామములుగా పరిగణించారు. కొందరు 'కపిః', 'అవ్యయః' అనే రెండు నామములుగా పరిగణించారు.

కపిరవ్యయః

తరగని శాశ్వతమైన ఆనందము పొందేవాడు. ముక్తులతో కలిసి ఆనందించేవాడు.

ఓం కపయే అవ్యయాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – 'అవ్యయము' అనగా తరగనిది. శాశ్వతమైనది. కమ్ - సుఖము. **కమ్ పిబతి, పాతి వా కపిః.** ఆనందమును అనుభవించేవాడు, తన ఆనంద అనుభవమును ఇతరుల కొరకు కాపాడేవాడు 'కపి'. **స్వయమపి తద్-అనుభవ సుఖ నివృత్తిమ్ పాతి పిబతి వా కపిః అవ్యయః.** ముక్తులకొరకు తన తరుగులేని

ఆనందానుభవమును జాగ్రత్త చేసేవాడు 'కపిరవ్యయః'. ముక్తబృందముతో కలిసి శాశ్వతమైన నిత్యానందమును అనుభవించేవాడు. అనగా ముక్తులు నిత్యమైన భగవత్సాన్నిధ్యమును పొంది ఆనందిస్తే, అందుకు ఎంతో సంతోషించేవాడు 'కపిరవ్యయః'.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ కూడా 'కపిరవ్యయః' అనే ఒకే నామంగా పరిగణించారు కాని, 'కపిః', 'అవ్యయః' అనే రెండు గుణముల మిశ్రమంగా ఈ నామమును వివరించారు. **కామ్ - జలమపి పిబతి స్వజనైః స ప్రేమ ఉపహృతమ్ ఇతి కపిః. సదైవ అవ్యయో-నిర్వికార ఇతి అవ్యయః.** ప్రేమతో భక్తులు అర్పించిన జలమునైనా సేవించేవాడు 'కపి'. తరుగు, మార్పు లేనివాడు 'అవ్యయః'. కనుక ఆయన 'కపిరవ్యయః'.

కపిః

- సూర్యునిగా జలములను త్రాగు (ఎండించు)వాడు.
- శ్రీవరాహమూర్తియై భూమిని జలములనుండి ఉద్ధరించినవాడు.
- భక్తితో సమర్పించిన జలమునైనా స్వీకరించువాడు.

ఓం కపయే నమః.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **కమ్ - జలమ్ రశ్మిభిః పిబన్ కపిః, సూర్యః.** సూర్యుని రూపంలో జలములను తన కిరణములచే త్రాగు (ఎండజేయు)వాడు కపి.

శ్రీ శంకరులు చెప్పిన మరొక అర్థము – **కాత్ - తోయాత్ భూమిమ్ అపాత్ ఇతి కపిః వరాహః.** జలములనుండి భూమిని కాపాడిన శ్రీవరాహమూర్తియే కపి. 'క' అనగా నీరు. 'పా' అనగా రక్షించుట. శ్రీ భట్టులు, శ్రీ శంకరులు కూడా 1వ శ్లోకము 102వ నామము 'వృషాకపి' వివరణలో 'కపి' అనగా వరాహావతారమును సూచించునని చెప్పారు. ఇందుకు వారు మహాభారతం శాంతిపర్వము (330.24)నుండి ఉదాహరించారు.

కపిర్వరాహః శ్రేష్టశ్చ ధర్మశ్చ వృష ఉచ్యతే
తస్మాద్ వృషాకపిమ్ ప్రాహ కాశ్యపో మామ్ ప్రజాపతిః

శ్రీ వాసిష్ఠ 'కపిః' అన్న పదానికి మూడు విధాలుగా వ్యుత్పత్తులను చూపారు.
(1) కై - శబ్దే - ధ్వనించుట. (2) కృర్ - విక్షేపే - పారబోయుట, వెదజల్లుట. (3) కన్ - దీప్తి కాంతి గతిషు - వెలుగుట. శ్రీ వాసిష్ఠ 'కపిః' నామమునకు చెప్పిన అర్థములు – **కపిః స్తవః శబ్దరూపః తమ్ పిబతి ఇతి కపిః.** శబ్దరూపములో ఉన్న స్తుతిని భగవంతుడు త్రాగుతాడు (ఆనందంతో స్వీకరిస్తాడు) గనుక ఆయన కపి. **కమ్ - జలమ్, పాతి - పిబతి.** సూర్యునికి అంతర్యామి అయిన భగవానుడు నీటిని హరిస్తాడు గనుక కపి.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **తద్ సేవారూపమ్ కమ్ పిబతి ఇతి కపిః.** భక్తితో సమర్పించిన జలాన్నయినా స్వీకరిస్తాడు గనుక ఆయన కపి.

పత్రమ్ పుష్పమ్ ఫలమ్ తోయమ్ యో మే భక్త్యా ప్రయచ్ఛతి

తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః – గీత 9.26

నిర్మల బుద్ధితో, నిష్కామ భావముతో, పరమ భక్తునిచే సమర్పింపబడిన పత్రమును గాని, పుష్పమును గాని, ఫలమును గాని, జలమును గాని నేను ప్రత్యక్షముగా (స్వయముగా) ప్రీతితో ఆరగింతును.

అవ్యయః

- తనను చేరినవారిని మరల జనన మరణ చక్రములో పడనీయనివాడు.
- తరుగుదల (క్షీణత), నాశనము లేనివాడు. షడ్వికారములు లేనివాడు.
- తన భక్తులనుండి ఎన్నడును ఎడము కానివాడు.

ఓం అవ్యయాయ నమః

ఇంతకుముందు ఈ నామము 2వ శ్లోకంలో 13వ నామంగా ఉంది.

అవ్యయః పురుషః సాక్షీ క్షేత్రజ్ఞో అక్షర ఏవ చ

13వ నామమునకు శ్రీ భట్టులు, శ్రీ శంకరులు చెప్పినవి మొదటి రెండు అర్థములు.

శ్రీ భట్టులు: తనను చేరినవారిని మరల జనన మరణ చక్రములో పడనీయనివాడు.

శ్రీ శంకరులు: తరుగుదల (క్షీణత), నాశనము లేనివాడు. షడ్వికారములు లేనివాడు.

ఇక ఈ 900వ నామమునకు శ్రీ బలదేవ విద్యాభూషణ చెప్పిన అర్థము – **న వ్యేతి తేషామ్ సమాజాత్ ఇతి అవ్యయః.** తన భక్తులనుండి ఎన్నడూ దూరం కానివాడు అవ్యయుడు.

అప్యయః

ప్రళయకాలమునందు సర్వమును తనయందే ఇముడ్చుకొనువాడు.

ఓం అప్యయాయ నమః

అపి - ఉపసర్గ (ఇంకా). అయ్ - వెళ్ళుట. అప+అయ్ - దగ్గరకు వెళ్ళుట, చేర్చుకొనుట, దగ్గర.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **ప్రళయే అస్మిన్ అపియన్తి జగన్తి ఇతి అప్యయః.** ప్రళయకాలమునందు సమస్తమును తనయందే ఇముడ్చుకొనువాడు అప్యయుడు.

శ్రీ వాసిష్ఠ – **అపియన్తి ఇతి అప్యయః, లీయన్తే అస్మిన్ భూతాని ప్రళయకాలే, అతః అప్యయః ఇతి ఉచ్యతే.** మహాప్రళయం జరిగినపుడు జీవజాలమంతా తమ కర్మను తమతో మూటగట్టుకొని ఇతనిలో ప్రవేశిస్తుంది. ఇతడు మాత్రం అలాగే ఉంటాడు. త్రికాలములయందు ఉంటాడు. అందుకే అప్యయుడు.

ఇక్కడికి మొదటి 900 నామములకు వ్యాఖ్య పూర్తి అయ్యింది. హరేకృష్ణ.
ఇక్కడ గమనింపవలసిన ఒక చిన్న విషయం. 69వ నామమునుండి శ్రీ శంకరుల పాఠానికి, శ్రీ భట్టుల పాఠానికి మధ్య నామముల సంఖ్యలో వ్యత్యాసం ప్రారంభమవుతుంది. ఆ వ్యత్యాసం మళ్ళీ ఈ 900వ నామంతో ముగుస్తుంది. అనగా 901వ నామంనుండి శ్రీ శంకరుల పాఠము, శ్రీ భట్టుల పాఠములలో నామములు ఒకే విధంగా ఉంటాయి.

హరే రామ హరే రామ రామ రామ హరే హరే

హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే.

901. స్వస్తిదః

- గొప్ప శుభములను ఇచ్చువాడు.
- దివ్యజ్ఞానమును ఇచ్చువాడు.

ఓం స్వస్తిదాయ నమః

సు (ఉపసర్గ) - దీవెనను సూచించును (ఉనాది సూత్రము 4.180 – 'సావసెః'). అస్ - భువి - ఉండుట. సు - అస్తి - స్వస్తి. **స్వస్తిమ్ దదాతి ఇతి స్వస్తిదః కళ్యాణదః.** మంగళములను ప్రసాదించువాడు 'స్వస్తిదః' (శ్రీ వాసిష్ఠ).

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – అస - గతి దీప్త్యా దానేషు - వెళ్ళుట, ప్రకాశించుట, అంగీకరించుట. **శోభనః అస్తిః గతిః అర్థాత్ జ్ఞానమ్ గమనమ్ ప్రాప్తిః స్వస్తిః, తమ్ దదాతి భక్తేభ్యః ఇతి స్వస్తిదః.** భక్తులకు జ్ఞానమును ప్రసాదించువాడు 'స్వస్తిదః'

శ్రీ భట్టుల వ్యాఖ్య – **ఏవమ్ మహామంగళమ్ దదాతి ఇతి స్వస్తిదః.** ఈ విధముగా ఎల్లరకు మహాశుభములను ప్రసాదించువాడు స్వస్తిదుడు. ఇక్కడ 'మహాశుభము' అనగా శ్రీవైకుంఠమునకు మార్గము చూపే దివ్యజ్ఞానము అని శ్రీ రామానుజన్ వివరించారు. ఇది శ్రీ కృష్ణదత్త భరద్వాజ వివరణకు కూడా సరిపోతుంది.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమోళి 1.7.4 – మోక్షానందమునకు దారి చూపే పరమజ్ఞానమును ప్రసాదించే కాంతిపుంజము.

శ్రీ పెరియాళ్వారు. తిరు 5.2.8 – భగవానుడు గురువుగా వచ్చి నాకు బ్రహ్మోపదేశము చేశాడు. నా మనసులో జ్ఞానపీఠాన్ని అధిరోహించాడు. ఒక్కసారి ఆయన పాదములు నా మనసులో చేరగానే నా సకల కల్మషాలు, లోటుపాట్లు, అజ్ఞానము నశించాయి.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **భక్తానామ్ స్వస్తి మంగళమ్ దదాతి ఇతి స్వస్తిదః**. భక్తులకు శుభములు కలుగజేయువాడు స్వస్తిదుడు.

శ్రీ వాసిష్ఠ చెప్పిన మరొక అర్థము – **ఆత్మ ధారణాయ, అర్థాత్ జీవనాయ జీవన ఉపయోగిని సాధనాని దదాతి స స్వస్తిదః**. జీవుల మనుగడకు అవుసరమైన సాధనాలు ఇచ్చేవాడు స్వస్తిదుడు.

902. స్వస్తికృత్

సమస్త శుభములను, మంగళములను కలిగించేవాడు.

ఓం స్వస్తికృతే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవానుడు 'స్వస్తిదః'గా సకల శుభాలను ఇస్తాడు, మరియు 'స్వస్తికృత్'గా ఆ శుభాలను మనం నిరాటంకంగా అనుభవించే అవకాశం కలిగిస్తాడు. **స్వస్తి భోగాశిషం యః కరోతి స్వస్తికృచ్ఛ సః**. కళ్యాణగుణాలచేత తన భోగానికి విపత్తు రాకుండా చేసేవాడు స్వస్తికృత్. బ్రహ్మజ్ఞానమును ప్రసాదించేవాడు స్వస్తిదుడు, ముక్తులు తన కళ్యాణ గుణాలను అనుభవించేలా తానే స్వయంగా వారికి అందుబాటులోకి వచ్చేవాడు స్వస్తికృత్.

శ్రీ శంకరుల వ్యాఖ్య – భగవానుడు 'స్వస్తిదః'గా భక్తులకు శుభములు ఇవ్వడం మాత్రమే గాక, భక్తులకు మంచిపైనవానిని చేసేవాడు గనుక స్వస్తికృత్.

శ్రీ అనంతకృష్ణశాస్త్రి – భక్తులచే మంచిపనులు చేయించేవాడు స్వస్తికృత్.

శ్రీ చిన్మయానంద – 'కృత్ - ఛేదనే - ఖండించుట' అనే అర్థాన్ని శ్రీ శంకరులు 'కృత్'తో ముగిసే అనేక నామములకు వాడారు. ధర్మము తప్పినవారికి ఆనందములను హరించేవాడు స్వస్తికృత్.

903. స్వస్తి

మంగళ స్వరూపుడు, సుఖనిధానము, పరమానందము.

ఓం స్వస్తినే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **స్వయమేవ మహన్ - మంగళమ్ స్వస్తి.** తానే స్వయముగా మహామంగళ స్వరూపుడైనవాడు స్వస్తి.

శ్రీ విష్ణుసహస్రనామ సత్సంగము (డిల్లీ) వారిచ్చిన అదనపు వివరణ – సమస్త జీవులూ ఐహిక విషయానురక్తులై, భోగలాలసులై జీవించడానికి ఆసక్తి చూపుతాయి. కాని ఇది నిజమైన ఆనందము కాదు. కనుక భక్తులు తనను (భగవంతుని) కోరి, పొంది, నిజమైన ఆనందము అనుభవించేలా చేసేవాడు గనుక స్వస్తి.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **మంగళ స్వరూపమ్ ఆత్మీయమ్ పరమానంద లక్షణమ్ స్వస్తి.** పరమాత్ముడు మంగళ స్వరూపుడు. ఆత్మీయుడు. పరమానందము ఆయన గుణము. కనుక ఆయన స్వస్తి.

శ్రీ తిరుప్పాణాళ్వారు – నా కన్నులు ఆ అమృతమూర్తిని చూచాయి. ఇంక అవి చూపును త్రిప్పుకొనలేవు. మరల దేనినీ చూడనిచ్చగించవు.

సనత్కుమారీయము – **యత్ర న అన్యత్ పశ్యతి, న అన్యత్ విజానాతి, న అన్యత్ శృణోతి, తద్ భూమా.** దేనినుండి కన్నులు మరలవో, మనసు చెదరదో, చెవులు వినకుండా ఉండలేవో అదే పరమానందము. శుభము. దానిని మించినదేదీ లేదు.

భగవంతుని పరమానంద శుభలక్షణములను గురించి ఆళ్వారులు లెక్కలేనన్నిసార్లు వర్ణించారు. భగవానుడు **'పవిత్రాణామ్ పవిత్రమ్', 'మంగళానామ్ చ మంగళమ్', 'మంగళమ్ పరమ్'**.

శ్రీ చిన్మయానంద – సచ్చిదానందము భగవంతుని తత్వము. అశుభములు ఆయన చెంత ఉండజాలవు.

శ్రీ సత్యసంధ తీర్థ – **సు అత్యన్తమ్ అస్తి ఇతి సకల దేశ కాలేషు వర్తత ఇతి స్వస్తి.** సదా, భూత, భవిష్యత్, వర్తమాన కాలములందు ఉండేవాడు స్వస్తి.

904. స్వస్తిభుక్

- మంగళములను కాపాడువాడు.
- మంగళములను, ఆనందమును అనుభవించేవాడు.
- భక్తులచే మంగళములను, ఆనందమును అనుభవింపజేయువాడు.
- భక్తులకు సుఖములనిచ్చేవాడు.

ఓం స్వస్తిభుజే నమః

భుజ్ - పాలనాభ్యవహారయోః - పాలించుట, రక్షించుట, భుజించుట, అనుభవించుట – ఇలా అనేక అర్థాలున్నాయి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భుజ్ - రక్షించుట, పాలించుట. **సర్వమ్ ఏతత్ స్వస్తి భునక్తి - పాలయతి ఇతి స్వస్తిభుక్.** భగవానుడు సకల శుభములను, భక్తులను రక్షించును. భక్తులు మనసులో భగవానుని అనుభవించుట, అందువల్ల పరమానందము పొందుట, తద్వారా అనేక సేవలు చేయుట – ఇవన్నీ కూడా భగవంతుడు రక్షించును.

నిరుక్తి – **పాలనాత్ మంగళస్య ఇవ స్వస్తిభుక్ చ ఇతి గమ్యతే.** మంగళములన్నింటిని కాపాడును గనుక ఆయనను స్వస్తిభుక్ అని కీర్తింతురు.

శ్రీ బలదేవ విద్యాభూషణ కూడా ఇదే అర్థం చెప్పారు. **స్వస్తి - కళ్యాణమ్ భునక్తి - పాలయతి సమ్రుత్యాణామ్ ఇతి స్వస్తిభుక్.**

శ్రీ శంకరుల వ్యాఖ్య – భుజ్ - అనుభవించుట. **తదేవ భునక్త ఇతి స్వస్తిభుక్, భక్తానామ్ మంగళమ్ స్వస్తి భునక్తి ఇతి వా స్వస్తిభుక్.** స్వయముగా మంగళములను అనుభవించువాడు మరియు భక్తులచే మంగళములను అనుభవింపజేయువాడు స్వస్తిభుక్.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **స్వయమ్ స్వస్తి భునక్తే అనుభవతి ఇతి స్వస్తిభుక్.**

శ్రీ సత్యసంధ తీర్థ – **స్వస్తి సుఖమ్ భోజయతి ఇతి స్వస్తిభుక్.** భక్తులచే సుఖములను భుజింప (అనుభవింప) జేయువాడు స్వస్తిభుక్.

905. స్వస్తిదక్షిణః

- తన భక్తులకు మంగళములను దక్షిణగా ఇచ్చువాడు. తనకు కైంకర్యము చేయడానికి దివ్యశరీరము, శక్తి మొదలైనవానిని ఆత్మార్పణ అనే యజ్ఞంలో నిత్యముక్తులైన భక్తులకు దక్షిణగా ఇచ్చేవాడు.
- మంగళ స్వరూపమున వృద్ధిపొందువాడు. శుభదాతయై వర్ధిల్లువాడు.

ఓం స్వస్తిదక్షిణాయ నమః

దక్ష్ - వృద్ధౌ - పెరుగుట. దక్షిణ అనగా బహుమతి, శక్తి, సామర్థ్యము, వృద్ధి పొందుట అనే అర్థాలున్నాయి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – దక్షిణ అనగా యజ్ఞయాగాదులలో పురోహితులకు ఇచ్చే బహుమతి. 'స్వస్తి' అనగా 'మంగళము'ను దక్షిణగా ఇచ్చేవాడు స్వస్తిదక్షిణుడు. **అన్యాదపి స్వ-పరిచర అనుగుణమ్ దివ్య శరీర శక్త్యాది స్వస్తి స్వాత్మ దాన దీర్ఘసత్రే ఋత్విగ్భ్యో దేయా దక్షిణా అస్య ఇతి స్వస్తిదక్షిణః.** భగవానుడు 'దీర్ఘసత్రము' అనే

నిత్యయాగాన్ని నిర్వహిస్తున్నాడట. అందులో నిత్యులు, ముక్తులే ఋత్విక్కులు. భగవంతుడు తనను తాను భక్తుల ఆనందానికై సమర్పించుకోవడమే ఈ యాగంయొక్క ప్రయోజనం. ఇందులో భగవానుడు తనను తాను నిత్యులు, ముక్తుల కొరకు అర్పించుకొంటాడు. అంతే గాకుండా ఆయన నిత్యులు, ముక్తులకు శుద్ధసత్వమయమైన (శాశ్వతమైన, క్షీణత లేని) దివ్యశరీరమును, మరియు శక్తి జ్ఞానాదులను (స్వస్తి) ప్రసాదిస్తాడు. ఈ యాగంలో భగవానుడే యజమాని. ఆయన తన ఋత్విక్కులకు (నిత్యులకు, ముక్తులకు) ఇచ్చేదే దక్షిణ. కనుక ఆయన స్వస్తిదక్షిణుడు.

శక్త్యాద్యాః ప్రకృతిః స్వస్తి స్వాత్మదానం చ దక్షిణా
ఆత్మార్పణాఖ్యయాగే తు యస్యాస్తి స్వస్తిదక్షిణః
తన కైంకర్యము చేయడానికి తగినటువంటి దివ్యశరీరము, శక్తి మొదలైనవి 'స్వస్తి' అనబడుతాయి. వాటిని 'ఆత్మార్పణ' అనే యజ్ఞంలో నిత్య ముక్తులయిన భక్తులకు దక్షిణగా ఇచ్చేవాడు స్వస్తిదక్షిణుడు. (శ్రీకైవల్య సారధి).

శ్రీ బలదేవ విద్యాభూషణ ఇలాంటి అర్థమే చెప్పారు.
స్వ-నిత్యమ్ ధామాదికమ్ కళ్యాణ రూపత్వాత్ స్వస్తి ఇత్యుచ్యతే
సా దక్షిణా స్వ-భక్తి-సత్ర ఋత్విగ్భ్యో దేయమ్ అస్య ఇతి స్వస్తిదక్షిణః
ఈ వ్యాఖ్య ప్రకారము శ్రీవైకుంఠము, మరియు ఆ పరంధామమునకు నిత్యమంగళగుణములు 'స్వస్తి' అనబడుతాయి. వాటిని యజ్ఞంలో దక్షిణగా ఋత్విక్కులకు ఇచ్చేవాడు స్వస్తిదక్షిణుడు.

శ్రీ విష్ణుసహస్రనామ సత్సంగము, ఢిల్లీ – యజ్ఞములు చేసేవారికి భగవంతుడు తనవంతు దక్షిణగా మంగళములు కూర్చును గనుక స్వస్తిదక్షిణుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ కూడా ఇలాంటి అర్థం చెప్పారు. **స్వస్తిభిః ఆశీర్భిః దక్షయతి వర్ధయతి స్వజనానాన్ ఇతి స్వస్తిదక్షిణః.**

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు ఈ నామమునకు మూడు అర్థాలు చెప్పారు.

(1) **స్వస్తిరూపేణ దక్షతే వర్ధతే.** దక్ష - వర్ధిల్లుట. మంగళస్వరూపుడై వర్ధిల్లువాడు. తన భక్తులకు మంగళములిచ్చి గొప్పగా భావించువాడు స్వస్తిదక్షిణుడు.

(2) **స్వస్తి దాతుమ్ సమర్ధ ఇతి వా స్వస్తిదక్షిణః.** దక్షిణ - శక్తి, నైపుణ్యము. మంగళములను ప్రసాదించే శక్తి సామర్థ్యములు కలవాడు స్వస్తిదక్షిణుడు.

(3) **దక్షిణ శబ్ద ఆశుకారిణీ వర్తతే, శీఘ్రమ్ స్వస్తి దాతుమ్ అయమేవ సమర్థ ఇతి స్వస్తిదక్షిణః.** దక్షిణ - వేగంగా, వెంటనే. భక్తులకు వేగంగా, వెంటనే మంగళములను ఈయగలిగినవాడు స్వస్తిదక్షిణుడు.

వీనికి శ్రీ శంకరులు చెప్పిన ప్రమాణములు –

స్మరాదేవ దేవస్య సిద్ధయన్తి సర్వసిద్ధయాః.

స్మృతే సకలకళ్యాణ భాజనమ్ యత్ర జాయతే పురుషః తమ్ అజమ్ నిత్యమ్ వ్రజామి స్మరణమ్ హరిమ్. ఎవనిని స్మరించినంతమాత్రంచేత సకలశుభాలు లభిస్తాయో, అటువంటి నిత్యుడు, శాశ్వతుడు అయిన హరిని శరణు పొందుతున్నాను.

స్మరణాదేవ కృష్ణస్య పాపసంఘాత పంజరమ్ శతధా భేదమ్ ఆయాతి గిరిర్వజ్రహతో యథా. శ్రీకృష్ణపరమాత్ముని స్మరించినంతమాత్రాన పాపరాశి అంతా కూడా (ఇంద్రుని) వజ్రంతో కొట్టబడిన పర్వతంలా ముక్కలై పోతుంది.

శ్రీ చిన్మయానంద – మంగళము అనేది శ్రీమన్నారాయణుని స్వరూపము. ఆయన తన భక్తులను చేరి తన మంగళగుణములను వారికి ప్రసాదించును.

శ్రీ వాసిష్ఠ – **స్వస్తిమ్ దక్షతే వర్ధయతి ఇతి స్వస్తిదక్షిణః వరదహస్తో మంగళహస్త ఇతి.** ఆయన వరదహస్తమే మంగళహస్తము. ఆయన తన భక్తులకు మంగళములను, వరములను ప్రసాదించి మంగళమూర్తిగా వర్ధిల్లును. కనుక స్వస్తిదక్షిణుడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

అరౌద్రః కుండలీ చక్రీ విక్రమ్యూర్జితశాసనః |

శబ్దాతిగః శబ్దసహః శిశిరః శర్వరీకరః || (97)

906. అరౌద్రః

రౌద్రము లేనివాడు. సౌమ్యుడు.

ఓం అరౌద్రే నమః

రుధిర్ - అశ్రువిమోచనే - ఏడ్చుట, అరచుట. రుద్ర - రోదయతి ఇతి రుద్ర - ఇతరులను ఏడ్పించే (బాధించే) లక్షణము. రౌద్రము - రుద్రగుణము, కోపలక్షణము. భగవానుడు రౌద్రుడు కాడు గనుక అరౌద్రుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **పరమైశ్వర్యేఽపి గుణ శీతలిమ్నా అరౌద్రః.** భగవానుడు సర్వేశ్వరుడు. అయినా చల్లనివాడు. కళ్యాణ గుణాఢ్యుడు.

శాంతాకారం భుజగశయనమ్ పద్మనాభం సురేశం

విశ్వాధారం గగనసదృశం మేఘవర్ణం శుభాంగం .....

అనే ధ్యానశ్లోకము భగవానుని శాంతగుణస్తుతితో మొదలవుతుంది. భగవంతుని శాంతగుణంనుండి కరుణ, ప్రేమ ప్రకాశిస్తాయి.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **పరమశాంత సౌమ్య సుందరాకారః.**

శ్రీ వి.వి. రామానుజన్ – భగవంతుడు అనన్య తేజస్సుతో ప్రకాశిస్తున్నాగాని ఆ తేజస్సు భక్తులకు ఏమాత్రం కష్టం కలిగించదు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **అవాప్త సర్వకామత్వేన ద్వేషాదేః అభావాత్ ఇతి అరౌద్రః.** భగవానుడు అవాప్త సర్వకాముడు. అనగా ఆయన కోరుకొనవలసినది ఏమీ లేదు. కామము లేనియెడల ద్వేషము, క్రోధము ఉండవు. కనుక ఆయన అరౌద్రుడు.

రౌద్రము మూడు విధములుగానుండును (1) కర్మరౌద్రము (2) రాగరౌద్రము (3) కోపరౌద్రము. ఈ మూడు రౌద్రములు లేనివాడు శ్రీహరి.

శ్రీ రఘునాధ తీర్థ – **రుదతి అనేన ఇతి రుద్రమ్ - దుఃఖమ్, తజ్జనకత్వేన తత్సంబంధిత్వాత్ రౌద్రమ్ కామక్రోధాది దుఃఖ సాధనమ్, తదస్య నాస్తి ఇతి అరౌద్రః.** కామక్రోధాదులచే దుఃఖము (రుద్రము) జనించును. అలాంటి దుఃఖముతో ఏమాత్రము సంబంధము లేనివాడు గనుక భగవంతుడు అరౌద్రుడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **ఆనందపూర్ణత్వాత్ అరుద్రః ప్రసన్నమూర్తిః.** భగవానుడు పరమానంద ప్రశాంతమూర్తి. అరౌద్రుడు.

907. కుండలీ

- నిత్య దివ్యాభరణములైన కుండలములు ధరించినవాడు.
- సాంఖ్యము (జ్ఞానయోగము), యోగము (కర్మయోగము) అను రెండు కుండలములుగా ధరించినవాడు.
- సూర్యమండల సదృశములైన కుండలములు ధరించినవాడు.

ఓం కుండలినే నమః

కుండలములు అనగా చెవులకు ధరించే ఆభరణములు. కర్ణికా **తాలపత్రమ్ స్యాత్ కుండలమ్ కర్ణవేష్టనమ్** (అమరకోశము 2.10.3)

శ్రీ భట్టుల వ్యాఖ్య – **యథోచిత నిత్య దివ్య భూషణః కుండలీ.** నిత్యదివ్యభూషణములను తనకు తగినట్లుగా ధరించినవాడు కుండలి. ఇక్కడ కుండలములు అనేక ఆభరణములకు సంకేతముగా చెప్పబడినవి. ప్రత్యేకంగా చెప్పాలంటే మకరకుండలములు ధరించినవాడు కుండలి.

శ్రీ భగవద్రామానుజులు శరణాగతి గద్యములో భగవంతుని ఇలా వర్ణించారు. **నిరతిశయ ఔజ్వల్య కిరీట మకుట చూడావతంస మకర కుండల గ్రైవేయక హార కేయూర కటక శ్రీవత్స కౌస్తుభ ముక్త దామోదర పీతాంబర కాంచీగుణ నూపురాది అపరిమిత దివ్యభూషణ!.**

శ్రీ నమ్మాళ్వారు తిరువైమోళి 7.3.10, 8.8.1లో భగవంతుని మకరకుండలముల వర్ణన ఉన్నది. అవి ఎంతో సుందరంగా ప్రకాశిస్తూ కదులుతున్నవి.

శ్రీ శంకరుల వ్యాఖ్య – 'కుండలి' అంటే 'సర్పము' అనే అర్థం కూడా ఉన్నది. **కుండలాకార వపుః అస్య ఇతి కుండలీ.** చుట్టుకొని ఉన్న దేహము కలిగినది కుండలి (ఆమరకోశము వ్యాఖ్యానము). శ్రీ శంకరులు ఈ అర్థం వాడుతూ, **శేష రూప భాక్ కుండలీ** – అని చెప్పారు. ఆదిశేషునిరూపంలో ఉన్నవాడు కుండలి.

కుండలి అంటే కర్ణాభరణం అనే అర్థంలో కూడా శ్రీ శంకరులు మరొక వ్యాఖ్య (రెండు అర్థాలు) చెప్పారు.
(1) సూర్యమండల సదృశములైన కుండలములు ధరించినవాడు కుండలి. ఆయన కుండలములు సూర్యునివలె ప్రకాశిస్తున్నాయి.
(2) సాంఖ్యము (జ్ఞానయోగము), యోగము (కర్మయోగము) అనేవానిని కుండలములుగా చెవులకు ధరించినవాడు కుండలి.
శ్రీ రాధాకృష్ణశాస్త్రి భాగవతం (12.11.12)నుండి ఉదాహరించారు.

బిభర్తి సాంఖ్యమ్ యోగమ్ చ దేవో మకరకుండలే

మౌళిమ్ పదమ్ పరమేష్ఠ్యమ్ సర్వలోకాఽభయంకరమ్

పరమాత్ముడు సాంఖ్యమును, యోగమును తన మకరకుండలములుగా ధరించాడు. బ్రహ్మలోకమే ఆయన కిరీటము.

(శ్రీ పెమ్మరాజు రాజారావు) రాజయోగమున కుండలినీశక్తిని మేల్కొల్పుటవలన పొందబడువాడు పరమాత్మ యగుటచేత 'కుండలీ'యనబడెను.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ –
కుడి - దాహే - దహించుట నుండి 'కుండ్' వచ్చును. కుడి - రక్షణే - రక్షించుట నుండి 'కుండ్' వచ్చును. ఉనాదిసూత్రము (1.104) **'కలస్తుప్తశ్చ'** ప్రకారము కుండ్ + అల - కుండల. **కుండలమ్ దాహో రక్షణమ్ వా, స అస్య అస్తి ఇతి కుండలీ.** దహించెడి, రక్షించెడి గుణము కలిగినది కుండలము. అలాంటి కుండలములు ధరించినవాడు 'కుండలీ'. భగవంతుడు సృష్టించిన సూర్యుడు, అగ్ని – వీనికి దహన గుణము (కాల్చుట), రక్షణ గుణము (జీవ పోషణ) ఉన్నవి. అలాగే భగవంతుడు రక్షణ (సృష్టిపాలన), దహన (లయ) గుణములు కలిగియున్నాడు. కనుక ఆయన కుండలి.

శ్రీ సత్యసంధ తీర్థ – **మకరకుండలవాన్ కుండలీ.**

శ్రీ రఘునాథ తీర్థ – **కుండలమ్ దహనమ్ శత్రూణామ్ అస్మాత్ భవతి ఇతి కుండలీ.** శత్రువులను దహించే (నాశనం చేసే) వాడు కుండలి.

908. చక్రీ

చక్రాయుధమును ధరించినవాడు.

ఓం చక్రిణే నమః

97వ శ్లోకము. 908వ నామము. చక్రీ – **అరౌద్రః కుండలీ చక్రీ విక్రమ్యూర్జిత శాసనః**

107వ శ్లోకము. 995వ నామము. చక్రీ – **శంఖభృన్నందకీ చక్రీ శార్ఙ్గధన్వా గదాధరః**

ఇలాంటిదే మరొక నామము:

45వ శ్లోకము. 417వ నామము. సుదర్శనః – **ఋతుః సుదర్శనః కాలః పరమేష్ఠీ పరిగ్రహః**

శ్రీ చక్రత్తాళ్వారు. 1825 కాలపు చిత్రం. వికీపిడియానుండి

శ్రీ భట్టుల వ్యాఖ్య – **తాదృశః దివ్యాయుధః చక్రీ.** చక్రమువంటి దివ్యాయుధములను ధరించినవాడు చక్రి. ఇంతకుముందు 'కుండలీ' నామములో అనేక దివ్యాభరణములకు సంకేతముగా కుండలములను చెప్పినట్లే ఇప్పుడు అనేక దివ్యాయుధములకు సంకేతముగా చక్రమును చెప్పారు. ఇంకా భగవానుని సౌందర్యము అనేక దివ్యాభరణ దివ్యాయుధములతో ఎలా ప్రకాశిస్తున్నదో శ్రీ భట్టులు వివరించారు. 107వ శ్లోకము 995వ నామము 'చక్రీ' వివరణలో శ్రీ భట్టులు భగవంతుని భక్తరక్షకత్వమును విశేషంగా వివరించారు. ఇలా పునరుక్తి లేకుండా వ్యాఖ్యానించారు.

నిత్య సుదర్శనః స్వభృత్య ప్రతిభట రక్షః అసుర శోణిత కల్మాషిత జ్వాలాంచితమ్ చక్రమపి తథైవ ఇతి చక్రీ (995వ నామము వ్యాఖ్య). భగవానుడు సదా సుదర్శన చక్రమును ధరించియున్నాడు. భగవద్భక్తుల విరోధులైన రాక్షసుల రక్తంతో ఆ చక్రం తడిసియున్నది. మరియు అగ్ని జ్వాలలు వెదజల్లుతూ ఉన్నది.

శరణాగతి గద్యంలో శ్రీ భగవద్రామానుజులు భగవంతుని దివ్యాయుధాలను ఇలా వర్ణించారు. **స్వానురూప అచింత్య శక్తి శంఖ చక్ర గదాऽసి శార్ఙ్గాది అసంఖ్యేయ నిత్య నిరవద్య నిరతిశయ కల్యాణ దివ్యాయుధ!** అని. భగవంతుని దివ్యాయుధముల గురించి దివ్యప్రబంధములలో అనేక ప్రస్తావనలున్నాయి. ఆ చక్రం భగవంతుని ఆభరణము. మరియు సదా భక్తులను కాపాడడానికి సిద్ధంగా ఉన్నది.

శ్రీ వేలుక్కుడ కృష్ణన్. విష్ణు సహస్రనామ ఉపన్యాసము – చక్రము ఎంపెరుమాన్ యొక్క విశేషమైన చిహ్నము.

భాగవతము 8.20.30 – **సుదర్శనమ్ చక్రమ్ అసహ్య తేజ.**

రామాయణము 1.45.22 – **శంఖ చక్ర ధరో హరిః.**

విష్ణుపురాణము 5.30.22 – **నమస్తే చక్రహస్తాయ.**
భగవంతుడు గజేంద్రుని రక్షించడానికి చక్రాన్ని వాడాడు. కృష్ణావతారంలో చక్రాన్ని పలుమార్లు వాడాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సమస్త లోక రక్షణార్థమ్ మనస్తత్వాత్మకమ్ సుదర్శనాఖ్యమ్ చక్రమ్ ధత్తా ఇతి చక్రీ.** సమస్త లోకములను రక్షించుటకై మనస్సు అనే తత్వము కలిగిన, సుదర్శనము అనే పేరు కలిగిన చక్రమును ధరించినవాడు చక్రి. శ్రీ శంకరులు విష్ణుపురాణమునుండి ఉదాహరించారు.

చల స్వరూపమ్ అత్యంత జవేనాంతరితానిలమ్
చక్రరూపమ్ చ మనోధత్తే విష్ణుః కరే స్థితమ్

చలించే స్వభావము కలిగినది, వాయువుకంటె వేగము కలిగినది, మనస్సు తత్వము కలిగినది (అనగా నిలకడ లేనిది, అనగా ఎప్పుడూ తిరుగుతూ సిద్ధంగా ఉన్నది) అయిన చక్రమును విష్ణువు తన చేత ధరించియున్నాడు.

శ్రీ శంకరులు చెప్పిన మరొక వ్యాఖ్య . 107వ శ్లోకములోని 'చక్రీ' నామమునకు – **సంసార చక్రమ్ అస్య ఆజ్ఞయా పరివర్తత ఇతి వా.** సంసారమనే చక్రము ఇతని ఆజ్ఞవల్ల పరిభ్రమించుచున్నది. కనుక ఆయన చక్రి.

శ్రీ బలదేవ విద్యాభూషణ – చక్రము అంటే 'సైన్యము' అనే అర్థం కూడా ఉన్నది. అమరకోశము 2.8.78 – **వరూధినీ బలం సైన్యం చక్రం.** వ్యాఖ్య – **చకతే హన్తి పరబలమ్ ఇతి చక్రమ్.** ఈ అర్థంలో – **చక్రమ్ అపరిమిత సైన్యమ్ అస్య అస్తి ఇతి చక్రీ.** ఆయనకు అపరిమితమైన సైన్యము ఉన్నది గనుక ఆయన చక్రి.

909. విక్రమీ

- గొప్ప పరాక్రమము కలిగినవాడు
- ప్రత్యేకమై, పెద్ద అడుగు (పద విక్షేపము) కలవాడు (త్రివిక్రమావతారములో).
- తన వివిధ అవతారములలో ఎట్టి భేదములును లేనివాడు.
- రక్షించుట అనే విశేషమైన లక్షణము కలవాడు.

ఓం విక్రమిణే నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.
9వ శ్లోకము – 76వ నామము – విక్రమీ – **ఈశ్వరో విక్రమీ ధన్వీ మేధావీ విక్రమః క్రమః**
97వ శ్లోకము – 909వ నామము – విక్రమీ – **అరౌద్రః కుండలీ చక్రీ విక్రమ్యూర్జితశాసనః**
'విక్రమ' అంటే 'పరాక్రమము', 'పెద్ద అడుగు' అనే అర్థాలున్నాయి.

శ్రీ భట్టుల వ్యాఖ్య –

76వ నామము 'విక్రమీ' – **ఇచ్ఛా ప్రతిహంత్రీ ప్రసక్తి పరిపంథి స్వభావమ్ అస్య ఇతి విక్రమీ.** ఆయన ఇచ్ఛకు వ్యతిరేకంగా ఏదీ జరుగనీయని స్వభావం కల పరాక్రమశాలి 'విక్రమీ'.

శ్రీ మద్ శ్రీముష్ణమ్ ఆండవన్ – ఎలాంటి అవరోధాలనైనా తేలికగా తొలగించే 'విశేష క్రమము' కలవాడు 'విక్రమీ'.

శ్రీరాముడు సుగ్రీవునితో ఇలా అన్నాడు –

పిశాచాన్ దానవాన్ యక్షాన్ పృథివ్యాం చైవ రాక్షసాన్

అంగుళ్యమాత్రేణ తాన్ హన్యామ్ ఇచ్ఛన్ హరిగణేశ్వర

ఓ వానరరాజా! నేను తలచుకొంటే పిశాచ దానవ యక్ష రాక్షస గణాలను వేనినైనా వ్రేలికొనతో నాశనం చేయగలను.

తిరువైమోళి 5.10.1 – నీవు జన్మించిన విధము, నీవు పడిన కష్టాలు, నీవు చూపిన మహిమలు, నీ లీలలు, నీవు చేసిన శత్రుసంహార లీల, నీవు పాండవుల ప్రక్కనుండి యుద్ధం చేయించిన తీరు – ఇవేవీ ఎవరికీ అర్థం కావు.

5.10.2 – నప్పిన్ని (నాగ్నజితి)ని పెండ్లాడడంకోసం నీవు ఏడు ఎద్దులను అదుపు చేశావు. పిల్లవానిగా ఉన్నప్పుడే నీవు బకాసురుని నోరు పగలదీసి వధించావు.

5.10.3 – తల్లిగా నటించి విషపు పాలీయబోయిన పూతన ప్రాణములు పీల్చివేశావు. నీ ఎఱ్ఱని చిన్ని పాదంతో శకటాసురుని తన్ని చంపావు.

909వ నామము 'విక్రమీ' – **గాంభీర్యానుకూల విలాసః విక్రమీ.** తన గాంభీర్యము (పరాక్రమము)నకు తగిన దివ్యచేష్టలు కలవాడు విక్రమీ.

శ్రీ పెరియాళ్వారు. తిరు 5.4.6 – నా భగవంతుడా! నీ దివ్య పరాక్రమ లీలలనన్నింటినీ నా మనోఫలకంపై ముద్రించుకొన్నాను. అవి గోడమీద బొమ్మలులా స్పష్టంగా కనుపిస్తున్నాయి.

శ్రీ మద్ శ్రీముష్ణమ్ ఆండవన్, శ్రీ రంగరామానుజ మహాదేశికన్ – తన పరాక్రమమునకు, శౌర్యమునకు తగిన 'విక్రమగతి' కలిగినవాడు 'విక్రమీ'.

తిరుప్పావై 23 – పర్వత గుహలో వర్షాకాలములో చలనములేక పరుండి నిద్రించుచున్న సింహము మేలుకొని తీక్షణముగ చూచి, వాసన వేయు జూలును విదల్చి, అన్నివేపుల దొర్లి, దులుపుకొని, శరీరమును అటునిటు జాపి, గర్జించి, గుహ వెలుపలికి వచ్చునట్లుగా, ఓ అతసీపుష్ప సంకాశా! నీవు నీ అంతఃపురమునుండి అట్లే

వెలుపలికి వేంచేసి, మనోహరము, శ్రేష్ఠము అగు సింహాసనమును అధిష్ఠించి, మేము వచ్చిన కార్యమును పరిశీలించి, కృపచేయ వేడుచున్నాము (చిత్రకవి ఆత్రేయ తెలుగు అనువాదం).

అల ఇల కొలిచిన చరణాలకు మంగళం
ఆ లంకను గూల్చిన అతిబలునకు మంగళం
శకటాసురు కాల్ రాచిన యశస్వికి మంగళం
అసురద్వయమును అణచిన అడుగులకు మంగళం – తిరుప్పావై 24 (చిత్రకవి ఆత్రేయ తెలుగుసేత).

మహాబలిపురంలో శ్రీ త్రివిక్రమావతార శిల్పం. వికీపీడియా చిత్రం.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – క్రమ్ - పాద విక్షేపే - నడచుట, అడుగు వేయుట. **విశిష్ఠః క్రమ ఇతి విక్రమః స అస్య అస్తి ఇతి విక్రమీ.** లేదా, **విశిష్ఠమ్ క్రమణమ్ అస్య అస్తి ఇతి విక్రమీ.** విశిష్టమైన అడుగులు కలవాడు 'విక్రమీ'.
ఋగ్వేదము 1.22.17 – **ఇదమ్ విష్ణుర్విచక్రమే త్రేధా నిదధే పదమ్ స-మూఢామస్య పాగ్ం సురే.**
ఋగ్వేదము 1.154.2 – **యస్యోరుషు త్రిషు విక్రమణేషు అధిక్షియన్తి భువనాని విశ్వా.** ఆయన మూడు పెద్ద అడుగులలో సకల భువనాలు ఇమిడియున్నాయి.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు 'విక్రమ' అనగా 'పదవిక్షేపము' (అడుగు) మరియు 'పరాక్రమము' అనే రెండు అర్థాలనూ కలిపి వ్యాఖ్యానించారు. **విక్రమః పదవిక్షేపః శౌర్యమ్ వా, ద్వయమ్ చ అశేష పురుషేభ్యో విలక్షణమ్ అస్య అస్తి ఇతి విక్రమీ.** విలక్షణములైన (వేరెవరికీ లేని) పదవిక్షేపము మరియు శౌర్యము కలిగినవాడు 'విక్రమీ'.

శ్రీ భగవద్రామానుజులు శరణాగతి గద్యంలో భగవానుని కళ్యాణ గుణాల వర్ణనలో శౌర్య విక్రమాలను కూడా చెప్పారు. **స్వాభావిక అనవతికాతిశయ జ్ఞాన బల ఐశ్వర్య వీర్య శక్తి తేజస్ సౌశీల్య వాత్సల్య మార్దవ ఆర్జవ**

సౌహార్ద సామ్య కారుణ్య మాధుర్య గాంభీర్య ఔదార్య చాతుర్య స్థైర్య ధైర్య శౌర్య పరాక్రమ సత్యకామ సత్యసంకల్ప కృతిత్వ కృతజ్ఞతాది అసంఖ్యేయ కళ్యాణగుణ గణౌఘ మహార్ణవ।.

శ్రీ వేలుక్కడి కృష్ణన్ – భగవంతుడు తన భక్తులకు వారు అడుగకుండానే, అంతులేకుండా, ప్రశ్నించకుండా, ఆలోచించకుండా అనేక వరములు కురిపిస్తాడు. ఈ విషయంలో ఆయన అవధులు లేని, లోతు తెలియని, అనంత మణిసంపన్నమైన సాగరమువంటివాడు. ఇలా అవధులు లేకుండా భక్తులకు వరాలిచ్చేవాడు గనుక ఆయన 'విక్రమీ'.

శ్రీ సత్యసంధ తీర్థ – 'క్రమము' అనగా తారతమ్యము. 'వి' వ్యతిరేకార్థము నిచ్చును. విక్రమ - తారతమ్యము లేకుండుట. **క్రమః తారతమ్యమ్ అస్య అస్తి ఇతి క్రమీ, న క్రమీ విక్రమీ, స్వ అవతారేషు తారతమ్య రహిత ఇతి విక్రమీ.** తన అవతారములందు తారతమ్యము లేనివాడు 'విక్రమీ'. ఆయన మానవరూపంలో అవతరించినా, వరాహరూపంలో అవతరించినా గాని ఆయన పరిపూర్ణ పరమాత్ముడే. ఆయన గుణములలో కొరవడునదేమీ లేదు. కనుక ఆయన 'విక్రమీ'.

శ్రీ స్వామిదేశికన్. శరణాగతి దీపిక (17వ శ్లోకంలో) దీని ఎంపెరుమాన్ అవతార రహస్యముగా వర్ణించారు.

శ్రీ రఘునాథ తీర్థ – క్రమ - పని, వృత్తి, కార్యము. **విశిష్టః క్రమః వ్యాపారః ఇతి విక్రమీ.** విశిష్టమైన వ్యాపారము (పని) కలిగినవాడు 'విక్రమీ'. జగన్నాథుడైన భగవానుడు నిరంతరం తన సృష్టిపోషణ గురించి నిమగ్నుడైయుండును. ఇది ఆయనకు మాత్రమే వర్తిస్తుంది.

910. ఊర్జితశాసనః

- ఎవరూ ఉల్లంఘింపజాలని ఆజ్ఞలనిచ్చువాడు.
- శ్రుతి, స్మృతులే తన ఆజ్ఞలుగా కలవాడు.

ఓం ఊర్జితశాసనాయ నమః

ఉర్జ్ - బల ప్రాణనయోః - బలపరచుట, జీవించుట. ఊర్జిత - బలమైన, తిరుగు లేని. శాస్ - అనుశిష్టౌ - బోధించుట, పాలించుట, సరిచేయుట. **అనుశాసనమ్ - ఆజ్ఞానువర్తనమ్ యస్య స ఊర్జిత శాసనః విష్ణుః అనతిక్రమణీయ నియమః.** ఉల్లంఘింపరాని శాసనము చేయువాడు అయిన విష్ణువు ఊర్జితశాసనుడు. ఆయన నియమములు అతిక్రమింపరానివి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **విరించి పురందరాది అలంఘ్యాజ్ఞః ఊర్జిత శాసనః.** బ్రహ్మేంద్రాదులు కూడా భగవంతుని ఆజ్ఞను ఉల్లంఘింపజాలరు గనుక భగవంతుడు ఊర్జిత శాసనుడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **విధి రుద్రాది అలంఘ్య ఆజ్ఞత్వాత్ ఊర్జిత శాసనః.**

శ్రీ తిరుమళిశయాళ్వారు. నాన్ముగన్ తిరువంతాడి 38 – భగవానుని అభీష్టానికి విరుద్ధంగా దేవతలెవరూ కూడా కనీసం వ్రేలు కూడా ఎత్తలేరు.

భీషాద్ వాతః పవతే, భీషోదేతి సూర్యః
భీషాదగ్నిశ్చేంద్రశ్చ మృత్యుర్ధ్వాతి పంచమేతి – తైత్తరీయోపనిషత్తు
ఆయనంటే ఉన్న భయంవల్లనే వాయువు వీస్తుంది. సూర్యుడు ఉదయిస్తాడు. అగ్ని, ఇంద్రులు తమ పనులు చేస్తారు. ఐదవవాడైన యముడు పరుగులు తీస్తారు.

ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి
సూర్యచంద్రమసౌ విధృతౌ తిష్ఠతః
ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి
గార్గి ద్యావా పృథివ్యౌ విధృతే తిష్ఠతః – బృహదారణ్యకోపనిషత్తు
యాజ్ఞవల్క్యుడు ఇలా అన్నాడు. ఓ గార్గీ, ఆయనయొక్క తిరుగులేని శాశనంవల్లనే బ్రహ్మ, సూర్య, చంద్రాదులు తమ తమ స్థానాలలో ఉన్నారు. భూమి, ఆకాశము తమ తమ స్థానాలలో నిలిచియున్నాయి.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **శ్రుతి స్మృతి లక్షణమ్ ఊర్జితమ్ శాసనమ్ అస్య ఇతి ఊర్జిత శాసనః.** శ్రుతులును, స్మృతులును భగవానునియొక్క బలమైన శాసనములు. కనుక ఆయన ఊర్జిత శాసనుడు. ఇందుకు శ్రీ శంకరులు చెప్పిన ప్రమాణము –

శ్రుతి స్మృతి మమైవాऽజ్ఞే యస్తే ఉల్లంఘ్య వర్తతే
ఆజ్ఞాచ్ఛేధి మమ ద్వేషీ మద్భక్తోऽపి న వైష్ణవః
శ్రుతులు, స్మృతులు నా ఆజ్ఞలు. వానిని ఉల్లంఘించినవాడు నాకు శత్రువు. అటువంటివాడు నా భక్తుడైనా గాని నిజమైన వైష్ణవుడు కాదు.

శ్రీ చిన్మయానంద – భగవంతుని శాసనమునకు మినహాయింపులు లేవు. నిబంధనలు లేవు.

911. శబ్దాతిగః

మాటలకు అందనివాడు. వాక్కుచేత గాని, మనసుచేత గాని చెప్పరానివాడు.

ఓం శబ్దాతిగాయ నమః

శబ్దమ్ అతిగచ్ఛతి - వాచమ్ అతిక్రమ్య వర్తతే ఇతి శబ్దాతిగః. మాటలకు అతీమైనవాడు 'శబ్దాతిగః'.

శ్రీ భట్టుల వ్యాఖ్య –

అనంత జిహ్వేన అనంతేన, అనంతశాఖైః ఆమ్నాయైః

సాక్షాత్ సరస్వత్యా చ దురుదారహ మహిమా శబ్దాతిగః

అనంతమైన నాల్కలున్న అనంతుని (వేయి నాల్కలున్న ఆదిశేషుని) చేత గాని, అనంత శాఖలున్న వేదములవలన గాని, సాక్షాత్తు సరస్వతిచేత గాని వర్ణింప వీలుగానివాడు. అనంత కళ్యాణగుణ సంపన్నుడు. వానిలో కొద్ది భాగాన్ని మాత్రమే భీష్ముడు శ్రీవిష్ణుసహస్రనామంలో కీర్తించాడు.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమోళి 2.5.8 – ఆయన శక్తి, సౌందర్యము, గుణములు, వైభవములు, లీలలు అనంతములు. ఆయన మెడలో తులసిమాలయే ఆయన పరమేశ్వరత్వానికి ఋజువు. నేను అనుభవించిన విషయాన్ని మాటలలో ఎలా చెప్పను? ఆయన మహత్వాన్ని మాటలలో చెప్పగలవారెవరైనా ఉంటే ప్రయత్నించండి.

తిరువైమోళి 8.5.4 – నీ కరుణార్ద్రమైన, తేనెలూరే, సమ్మోహనపరచే కన్నులు నా మనస్సును నింపివేశాయి. పాలకడలి మధ్యలో నీవు పవళించిన సుందరదృశ్యాన్ని తలచుకొన్నపుడెల్లా నేను ఆనందపరవశుడనౌతాను. ఈ అనుభవాలను నేను మాటలలో చెప్పలేను.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **శబ్దప్రవృత్తి హేతునామ్ జాత్యాదీనామ్ అసంభవాత్ శబ్దేన వక్తుమ్ శబ్దాతిగః**. ఆయనను మాటలలో వర్ణించడానికి అసాధ్యము. కనుక భగవంతుడు 'శబ్దాతిగః'. ఇందుకు శ్రీ శంకరులు తైత్తరీయోపనిషత్తునుండి, విష్ణుపురాణమునుండి ఉదాహరించారు.

తైత్తరీయోపనిషత్తు 2.3 – **యతో వాచే నివర్తన్తే, అప్రాప్య మనసా సహ.** ఆయనను వర్ణింపజాలక మాటలు వెనుదిరుగుతాయి. ఆయన మనసుకు అందరాడు.

విష్ణుపురాణము 1.17.22 – **న శబ్ద గోచరో యస్య యోగి ధ్యేయమ్ పరంపదమ్**. మాటలకందని ఆయన పరమపదమును యోగులు ధ్యానింతురు.

శ్రీ చిన్మయానంద – వేదములు సత్యమును నిర్వచింపలేవు. వివరింపలేవు. కేవలం సత్యంవైపు చూపెడతాయి. శాశ్వతమైన పరమసత్యము వేదములకు అతీతమైనది. మనసు, బుద్ధిలకు అందజాలనిది.

912నుండి 945వరకు నామములను శ్రీ భట్టులు గజేంద్రమోక్షము పరంగా వ్యాఖ్యానించారు.

912. శబ్దసహః

- ఆర్తనాదమును ఆలకించువాడు. అస్పష్టమైన పిలుపు (గజేంద్రుని మొర)ను కూడా సహించువాడు.
- (శబ్దములు) వేదముల అర్థాన్ని అంగీకరించువాడు. వేదములయొక్క తాత్పర్యము, వేదసారము తానే అయినవాడు.

ఓం శబ్దసహాయ నమః

శప్ - ఆక్రోశే - బాధతో అరచుట, తిట్టుట. ఉణాది సూత్రము (4.97) '**శాసపిభ్యామ్ దదానౌ**' ప్రకారము 'శప్'కు 'దన్' ప్రత్యయము చేరిస్తే 'శబ్ద' అవుతుంది. అనగా ఆక్రోశించుట. సహ్ - మర్షణే - సహించుట.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు ఈ నామమును గజేంద్రుని ఆర్తనాదము పరంగా వ్యాఖ్యానించారు. పశుపక్ష్యాదులు స్పష్టంగా మాట్లాడలేవు గనుక వాని పిలుపు అస్పష్టమైనది. **అస్పష్ట శబ్దానామ్ తిరశ్చామపి ఆర్తశబ్దమ్ అతి భారమివ సహతే ఇతి శబ్దసహః**. అస్పష్టంగా ఉన్న (గజేంద్రుని) ఆర్తనాదమును విని ఆ పిలుపును పెద్ద భారంగా (ఎంతో ముఖ్యమైన బాధ్యతగా) స్వీకరించినవాడు శబ్దసహుడు. అందుకే ఆయన సిరికిం జెప్పక, శంఖచక్రయుగముం జేదోయి సంధింపక, గజేంద్రుని కుయ్యాలించి, సంరంభంతో, గజప్రాణావనోత్సాహియై వేంచేసెను. ఆ గజేంద్రుని నోటనున్న ఒక పూవు చాలును అతని భక్తి తెలపడానికి.

అతిధారమివాऽస్పష్టం తిరశ్చాం శబ్దమానూర్తిజం
సహతే యః శబ్దసహః వస్వర్ణో మనురుత్తమ

పశుపక్ష్యాదుల భాష స్పష్టంగా ఉండదు. అందుచేత సామాన్య మానవుడికి అది తెలియదు. అటువంటి భాషను కూడా ఆలకించువాడు శబ్దసహుడు. ఈ నామము అష్టాక్షరి. ఉత్తమమైనది. ఓం శబ్దసహాయ నమః. (శ్రీ కైవల్యసారధి).

శ్రీ పోతన భాగవతము. గజేంద్రుని ఆర్తనాదము.

లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె, బ్రాణంబులున్
రావుల్ దప్పెను, మూర్ఛ వచ్చె, దనువున్ డస్సెన్, శ్రమంబయ్యెడిన్,
నీవే తప్ప నితఃపరం బెఱుగ, మన్నింపందగున్ దీనునిన్,
రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!

వినుదట జీవుల మాటలు
చనుదట చనరానిచోట్ల శరణార్థుల కో
యనుదట పిలిచిన సర్వము
గనుదట సందేహమయ్యె గరుణావార్ధీ!

ఓ కమలాప్త! యోవరద! యో ప్రతిపక్ష విపక్షదూర! కు
య్యో కవి యోగివంద్య! సుగుణోత్తమ! యో శరణాగతామరా
నోకహ! యో మునీశ్వర మనోహర! యో విపులప్రభావ! రా
వే కరుణింపవే తలపవే శరణార్థిని నన్ను గావవే.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – శబ్దము అంటే మంచి మాట కావచ్చును, చెడు మాట కావచ్చును. శ్రీ వాసిష్ఠ ఈ నామంలో 'శబ్ద' అంటే 'తిట్లు' అనే అర్థం తీసుకొన్నారు. **క్షమా విభూష సకలస్య లోకే, సర్వమ్ క్షమావాన్ సహతే క్షమాయామ్.** భగవానుని క్షమాగుణం కారణంగానే శత్రువుల తిట్లు కూడా భరిస్తాడు గనుక ఆయన 'శబ్దసహః'. శ్రీరాముని '**క్షమయా పథ్వీ సమః**' అని వర్ణించారు. భగవంతుని ఈ క్షమాగుణమే విష్ణుభక్తులలో సాత్వికగుణంగా ప్రస్ఫుటమౌతుంది.

శ్రీ సత్యసంధ యతిరాజ – **భృగ్వాది భక్తకృత తర్జనరూప శబ్దమ్ సహత ఇతి శబ్దసహః.** భృగువు వంటి భక్తులు చేసి అవమానములను (దూషణములను) సహించినవాడు శబ్దసహుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సర్వే వేదాః తాత్పర్యేణ తమేవ వదన్తి ఇతి శబ్దసహః.** సకల వేదములు సారముగా ఆయననే చెప్పును గనుక ఆయన శబ్దసహుడు.

సర్వస్య చాహం హృదిసన్నివిష్టో మత్తః స్మృతి జ్ఞాన మపోహనం చ
వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో వేదాంతకృద్వేదవిదేవ చాహమ్ – గీత 15.15
సమస్త ప్రాణుల హృదయములలో అంతర్యామిగా ఉన్నవాడను నేనే. నానుండియే స్మృతి, జ్ఞానము, అపోహనము (సందేహమును తొలగించుట) కలుగుచున్నవి. వేదముల ద్వారా తెలిసికొనదగినవాడను నేనే. వేదాంతకర్తను, వేదజ్ఞుడను కూడా నేనే.

శ్రీ చిన్మయానంద – వేదములద్వారా తనను ప్రకటించే అవకాశం కల్పించినవాడు 'శబ్దసహః'

913. శిశిరః

- (గజేంద్రుని కాపాడడానికి) అతి వేగంగా వచ్చినవాడు.
- తన భక్తుల తాపత్రయములను చల్లార్చేవాడు.

ఓం శిశిరాయ నమః

శశ - ప్లుత గతౌ - దూకుట, గెంతుట. ఉణాది సూత్రము (1.5.3) ప్రకారము 'శశ'కు 'కిరచ్' ప్రత్యయం చేరిస్తే 'శిశిరః' పదం వస్తుంది. **శశతి, శీఘ్రమ్ ఉత్పుల్య గచ్ఛతి ఇత శిశిరః.** వేగంగా దూకుతూ వెళ్లేవాడు శిశిరుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **ఆర్త శబ్ద శ్రవణానంతరమ్ అతి త్వరయా గతః శిశిరః.** గజేంద్రుని ఆర్తనాదము విని అతి త్వరగా అతనిని రక్షించడానికి పరుగులు తీసినవాడు శిశరుడు. ఇందుకు శ్రీ భట్టులు ఉదాహరించినది – **శ్రుత్వా చక్రగదాధరః, సాన్నిధ్యమ్ కల్పయామాస తస్మిన్ సరసి.** గజేంద్రుని ఆర్తనాదం వినగానే శ్రీమన్నారాయణుడు శంఖచక్రగదాధారియై అతివేగంతో ఆ సరసువద్దకు వచ్చాడు.

ఈ ఘట్టాన్ని అనేకులు వ్యాఖ్యాతలు, కవులు వివిధాలుగా, రమణీయంగా వర్ణించారు. భగవంతుడు శ్రీమహాలక్ష్మి అమ్మవారికి కూడా చెప్పలేదట. గరుడుని వేగం చాలదని తానే గరుడుని చేత ధరించి సరస్సువద్దకు వెళ్ళాడట.

తిరుమొళి 2.3.9 – గరుడునిపై వేంచేసి, చక్రాయుధంతో మొసలిని పరిమార్చి, గజేంద్రుని రక్షించినవాడు.

శిఱియ తిరుమడల్ – నారాయణా! మణివణ్ణా! అనంత శయనా! నా ఇక్కట్లను తొగించు. అని గజేంద్రుడు మొరపెట్టుకొనగానే భగవానుడు మొసలిపై కోపించి, సరస్సువద్దకు పరుగులు తీసి, చక్రంతో మొసలిని రెండుగా ఖండించి, గజేంద్రుని కాపాడాడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **శశతి, ద్రుతమ్ గచ్ఛతి స్వజనానామ్ అవనాయ ఇతి శిశిరః**. తన భక్తులను రక్షించడానికి అతివేగంగా వెళ్లేవాడు శిశిరుడు.

శ్రీ పోతన భాగవతము – భగవానుని తొందరపాటు.

అల వైకుంఠ పురంబులో నగరిలో నామూల సౌధంబు దా
పల మందార వనాంతరామృత సరః ప్రాంతేందుకాంతోపలో
త్పల పర్యంక రమావినోది యగు నాపన్న ప్రసన్నుండు వి
హ్వల నాగేంద్రము 'పాహి పాహి' యన గుయ్యాలించి సంరంభియై

సిరికిం జెప్పడు శంఖ చక్ర యుగముంజేదోయి సంధింపడే
పరివారంబును జీర డభ్రగపతిం బన్నింప డాకర్ణికాం
తర ధమ్మిల్లము జక్క నొత్తడు వివాదప్రోద్ధిత శ్రీ కుచో
పరి చేలాంచలమైన వీడడు గజ ప్రాణావనోత్సాహియై.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **శిశిరము అంటే చల్లని ఋతువు. శ్రీ శంకరులు ఈ అర్థం తీసుకొన్నారు. తాపత్రయాభి తప్తానామ్ విశ్రమ స్థానత్వాత్ శిశిరః**. తాపత్రయములను చల్లార్చేవాడు శిశిరుడు. తాపములు మూడు విధములు.

(1) ఆధ్యాత్మిక తాపములు – దైవముచే కలుగజేయబడేవి.

(2) అధిభౌతిక తాపములు – అగ్ని, వరద, భూకంపం వంటివి.

(3) అధిదైవిక తాపములు – అలసత్వము, కపటము, అశ్రద్ధ వంటివి.

ఈ మూడు రకాల తాపములను చల్లబరచేవాడు శిశిరుడు.

శ్రీ చిన్మయానంద – సంసారం అనే అగ్నిలో కాలుతున్నవారికి చల్లని విశ్రాంతి స్థలము శిశిరుడు.

శ్రీ వాసిష్ఠ 'వేగంగా వెళ్ళుట', 'చల్లని ఋతువు' అనే రెండు అర్థాలనూ కలిపారు. సకాలంలో ఋతువులు మారుస్తూ జీవుల మనుగడకు ఆధారమైనవాడు శిశిరుడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **దృష్టామాత్రః తేషామ్ సంతాపమ్ నివర్తయతి ఇతి శిశిరః.** భగవంతుని దర్శనమాత్రముననే భక్తుల సంతాపములు, కష్టములు దూరమగును గనుక ఆయన శిశిరుడు.

914. శర్వరీకరః

- ఆర్తులను రక్షించడానికి, దుష్టులను శిక్షించడానికి చేత పంచాయుధములను ధరించినవాడు.
- సంసారులకు మాయను (చీకటిని) కలిగించేవాడు. జ్ఞానులకు మాయ ఆవరించకుండా చేస్తాడు.
- అందరకు విశ్రాంతి సమయముగా రాత్రిని కలిగించేవాడు.
- రాత్రి సమయంలో చల్లని చంద్రకిరణాల రూపంలో ప్రకాశించేవాడు.
- తన శత్రువులకు వినాశనం కలిగించేవాడు.

ఓం శర్వరీకరాయ నమః

శృ - హింసాయామ్ - బాధించుట, ఖండించుట, చంపుట. శ + ష్వరచ్ (ప్రత్యయము) - శర్వరి (ఉణాది సూత్రము 2.122). కరః - చేత ఆయుధములు ధరించినవాడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు గజేంద్రమోక్షము పరంగా వ్యాఖ్యను కొనసాగించారు. **హింసాపర విదారిణీ పంచాయుధీ కరే అస్య ఇతి శర్వరీకరః.** భగవానుడు గజేంద్రుని కాపాడడానికి వచ్చినపుడు ఆయన శర్వరీకరుడు. పంచాయుధములనగా పాంచజన్యము (శంఖము), సుదర్శనము (చక్రము), కౌమోదకి (గద), శార్ఙ్గము (ధనుస్సు), నందకము (ఖడ్గము).

శ్రీ పోతన భాగవతము – శ్రీమహావిష్ణువు వేంచేసిన విధము

ఇట్లు భక్తజనపాలన పరాయణుండును, నిఖిల జంతు హృదయారవింద సదన సంస్థితుండును నగు నారాయణుండు, కరికులేంద్ర విజ్ఞాపిత నానావిధ దీనాలాపంబు లాకర్ణించి, లక్ష్మీకాంతా వినోదంబులం దనివి సాలించి, సంభ్రమించి, దిశలు నిరీక్షించి, గజేంద్ర రక్షాపరత్వంబు నంగీకరించి, నిజ పరికరంబును మరల నవధరించి, గగనంబున కుద్గమించి, వేంచేయు నప్పుడు

తనవెంటన్ సిరి, లచ్చి వెంట నవరోధవ్రాతమున్, దాని వె
న్కను బక్షీంద్రుడు, వాని పొంతను ధను: కౌమోదకీ శంఖ చ

క్ర నికాయంబును, నారదుండు, ధ్వజినీకాంతుండు దా వచ్చిరొ
య్యన వైకుంఠపురంబునం గలుగువారాబాలగోపాలమున్.

తదనంతరంబ ముఖారవింద మకరంద బిందుసందోహ పరిష్యందమానానంద దిందిందిర యగు
నయ్యిందిరాదేవి, గోవింద కరారవింద సమాకృష్యమాణ సంవాద చేలాంచలయై పోవుచు.

తన వేంచేయు పదంబు పేర్కొన డనాథ స్త్రీ జనాలాపముల్
వినెనో, మ్రుచ్చులు మ్రుచ్చిలించిరో ఖలుల్ వేద ప్రపంచంబులన్,
దనుజానీకము దేవతానగరిపై దండెత్తెనో, భక్తులం
గని చక్రాయుధుడు డేడి చూపుడని దిక్కారించిరో దుర్జనుల్.

అని వితర్కించుచు.....
వినువీధిం జనుదేర గాంచి రమరుల్ విష్ణున్ సురారాతి జీ
వనసంపత్తి నిరాకరిష్ణు గరుణావర్ధిష్ణు యోగీంద్ర హృ
ద్వన వర్తిష్ణు సహిష్ణు భక్తజనబృంద ప్రాభవాలంకరి
ష్ణు నవోడోల్లస దిందిరా పరిచరిష్ణున్ జిష్ణు రోచిష్ణున్.

ఇట్లు పొడగని
చనుదెంచెన్ ఘనుడల్లవాడె, హరిపజ్జం గంటిరే లక్ష్మి? శం
ఖ నినాదం బదె, చక్ర మల్లదె, భుజంగధ్వంసియున్ వాడె క్ర
న్నన నేతెంచె నటంచు వేల్పులు నమోనారాయణాయేతి ని
స్వనులై మ్రొక్కిరి మింట హస్తిదురవస్థావక్రికిం జక్రికిన్.

శ్రీ శంకరుల వ్యాఖ్య – (అమరకోశ వ్యాఖ్యానము. **శ్వణాయామ్ చక్షూంసి ఇతి శర్వరీ**. జీవుల చూపును మూసివేసేది శర్వరి.) శ్రీ శంకరులు 'శర్వరి' అనగా 'రాత్రి' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. రాత్రిని కలుగజేసేవాడు శర్వరీకరుడు. అంధకారము అజ్ఞానమును సూచించును. సాంసారిక జీవులకు ఆత్మజ్ఞానము అంధకారమయము (అందరానిది, కానరానిది) అయిన శర్వరి. మరియు జ్ఞానులకు సంసారమే ఒక చీకటి (వెళ్ళరానిది, కోరరానిది). ఈ రకంగా శ్రీమన్నారాయణుడు శర్వరీకరుడు. సంసారులకు అవిద్యను కమ్ముకునేలా చేసి తన తత్వాన్ని వారికి తెలియనీయడు. ఆయనే జ్ఞానులకు మాయ ఆవరించకుండా చేస్తాడు. ఇందుకు శ్రీ శంకరులు గీత (2.69)నుండి ఉదాహరించారు.

యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః

నిత్యజ్ఞానస్వరూప పరమానందప్రాప్తియందు స్థితప్రజ్ఞుడైన యోగి మేల్కొనియుండును. అది ఇతర ప్రాణులు అన్నింటికి రాత్రితో సమానము. నశ్వరమైన ప్రాపంచిక సుఖప్రాప్తికై ప్రాకులాడుచు ప్రాణులన్నియును మేల్కొనియుండును. అది పరమాత్మ తత్వమునెఱిగిన మునికి (మనన శీలునకు) రాత్రితో సమానము. కాబట్టి సంసారులు అజ్ఞానంతో నిద్రపోయో కాలము, యోగి జ్ఞానసముపార్జనకు మేల్కొని ఉండే కాలము ఒకటే. అందుచేతనే పరమేశ్వరుడు సంసారులకు అజ్ఞానము, యోగులకు జ్ఞానము ఇస్తాడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – పగలు రజోగుణమును (క్రియాతత్పరతను), రాత్రి సమయం తమోగుణమును (కార్యహీనతను) సూచించును. ఈ పగలు రాత్రి మార్పులు మన జీవితమునకు గొప్ప సదుపాయములు. అన్ని సమస్యలు విస్మరించి మనం రాత్రివేళ విశ్రాంతి పొందవచ్చును. జ్ఞానికి పగటిసమయంలో కూడా (రాత్రివంటి) ప్రశాంతత లభిస్తుంది. కాని అజ్ఞానికి రాత్రి మాత్రమే ఆ ప్రశాంతత లభిస్తుంది. ఇలా విశ్రాంతికి అవకాశం కల్పించేవాడు శర్వరీకరుడు (శర్వరి-రాత్రి).

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **శర్వరీ నిశా లోకవిశ్రామదాయిన్, తస్య కరః సంపాదకః ఇతి శర్వరీకరః.** అందరికీ విశ్రాంతి సమయంగా రాత్రిని కలిగించేవాడు శర్వరీకరుడు.

శ్రీ సత్యసంధ తీర్థ – శర్వరి - రాత్రి. కరః - కిరణములు. **శర్వాయామ్ - రాత్రౌ, కరః - కిరణా యస్య చంద్రార్గత రూపేణ ఇతి శర్వరీకరః.** రాత్రివేళల వెన్నెల అనే చల్లని చంద్రకిరణాల రూపంలో ప్రకాశించేవాడు శర్వరీకరుడు.

శ్రీ రఘునాథ తీర్థ – శర్వరి - హింస, నాశనము. కరః - చేయువాడు. **శర్వరీ - హింసా, తమ్ కరోతి ఇతి శర్వరీకరః.** తన శత్రువులకు నాశనం కలిగించేవాడు శర్వరీకరుడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.
(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

శ్రీ తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు – శ్రీ వేంకటేశ్వర వచనములు

గరుడధ్వజా! యేమని చెప్పెడిది నీ ప్రభావంబు? నీ నాభి కమలమునం బుట్టెనట విరించి మీ మహిమం దెలియ శక్తుండు గాడట! నానా వేదంబుల నీ మహిమలు చెప్పునట; నీ మూర్తి కడ గుఱుతుం గానవట! రవిచంద్రులు నీ నయనంబులట; నీయపార తేజో మహిమంబు లెఱుంగలేరట! ఇంద్రాది దేవతలు నీ యాజ్ఞాధారులట; యొక్కొక్కమాఱును నీతో గినిసి నిన్నెదిరించలేక నీ శరణంబు వేడుకొందురట! పంచమహాభూతంబులు నీ ప్రకృతిగుణంబులట; నీ స్వభావంబు అట్టివి యని తెలుపజాలవట! సముద్రంబు నీ పాన్పట; నీ గుణంబుల లోతెఱుంగవట! మునులు భవదీయ స్వరూప సూచక వాదులట; నీ మాయ దాటనోపరట! చరాచర జగత్తు నీ సృష్టియట; నిన్నుం జూపి చెప్పనోపదట! నా శక్తియెంత? నేనెంత? నే నీ శ్రీపాదంబులు గతియని యుండగా నీవే దయదలంచెదవు గాక! శ్రీ వేంకటేశ్వరా!

అక్రూరః పేశలో దక్షో దక్షిణః క్షమిణాం వరః |

విద్వత్తమో వీతభయః పుణ్యశ్రవణకీర్తనః || (98)

915. అక్రూరః

- క్రూరుడు కానివాడు (గజేంద్రుని రక్షించుటలో).

- అవాప్తకాముడగుట చేత క్రోధము లేనివాడు. కనుక క్రౌర్యము లేనివాడు.

ఓం అక్రూరాయ నమః

కృత్ - ఛేదనే - ఖండించుట. ఉణాది సూత్రము (2.21) '**కృతేచ్ఛః క్రూ చ**' ప్రకారము కృత్ + రక్ (ప్రత్యయము) నుండి 'క్రూరః' వచ్చును. క్రూరుడు కానివాడు అక్రూరుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతునిలో క్రూరత లేదు. తనపట్ల ఎంతో అపరాధం చేసిన రావణుడు యుద్ధంలో అలసిపోయినపుడు రాఘవుడు రావణుని సంహరించలేదు. విశ్రాంతి తీసికొని మరునాడు రమ్మని యుద్ధరంగంనుండి పంపివేశాడు.

ఇక గజేంద్ర సంరక్షణ విషయంలో – **గజ పరిజిగీర్షయా కరస్థైరపి ఆయుధైః గ్రాహమపి ఝుటితి అకృత్తవాన్ అక్రూరః.** భగవంతుడు ఆయుధాలు కలిగి ఉన్నప్పటికీ, వెంటనే మొసలిని చంపలేదు. ముందుగా గజరాజును, మొసలిని కూడా ఒడ్డుకు లాగాడు. అప్పటికీ మొసలి తన పట్టును వీడనందున భగవంతుడు తన చక్రాన్ని మొసలిపై ప్రయోగించాడు. అది కూడా క్రౌర్యం లేకుండా దానిని ఒక్కసారి ఖండించాడు. శ్రీ భట్టులు ఉదాహరించిన శ్లోకము –

గ్రాహగ్రస్తమ్ గజేంద్రమ్ చ తం గ్రాహమ్ చ జలాశయాత్

ఉజ్జహార అప్రమేయాత్మా తరసా మధుసూదనః

అప్రమేయాత్ముడైన మధుసూదనుడు మొసలి నోట చిక్కిన గజేంద్రుని, మరియు మొసలిని జలాశయంనుండి పైకెత్తాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **అవాప్త సమస్త కామత్వాత్ కామ అభావాదేవ, తస్మాత్ క్రౌర్యమ్ అస్య న అస్తి ఇతి అక్రూరః.** భగవానుడు అవాప్త కాముడు. అన్ని కోరికలూ తీరినవాడు గనుక ఆయనకు ఇంక కోరికలు ఉండవు. కోరికలు లేనిచోట క్రోధము, క్రౌర్యము ఉండవు. కనుక ఆయన అక్రూరుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – హిరణ్యకశిపుని వధ సమయంలో భగవంతుడు కోపాన్ని తెచ్చిపెట్టుకున్నాడు. ప్రహ్లాదుని చూడగానే కరుణాప్రేమమూర్తి అయ్యాడు. శుద్ధసత్వమూర్తి అయిన శ్రీనారసింహుడు క్రూరుడు కానేరడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **పాండవ క్లేశ కారకమ్ దుర్వాసమ్ న కృతవాన్ ఇతి అక్రూరః.** పాండవులకు వనవాస సమయంలో దుర్వాసుడు క్లేశం కలిగించాడు (ద్రౌపది అక్షయపాత్రను తొలిచివేసిన తరువాత దుర్వాసుడు తన శిష్యగణంతో భోజనానికై వెళ్ళాడు). అయినాగాని దూర్వాసుని శిక్షించనివాడు అక్రూరుడు.

శ్రీ పోతన భాగవతము – శ్రీమహావిష్ణువు మకరిని సంహరించిన విధము.

అయ్యవసరంబున గుంజరేంద్రపాలన పారవశ్యంబున దేవతానమస్కారంబు లంగీకరింపక, మనస్సమాన సంచారుండై, పోయి పోయి, కొంతదూరంబున శింశుమార చక్రంబునుంబోలె గురు మకర కుళీర మీన మిథునంబై, కిన్న రేంద్రుని భాండాగారంబునుంబోలె స్వచ్ఛ వర కచ్ఛపంబై, భాగ్యవంతుని భాగధేయంబునుం బోలె సరాగ జీవనంబై, వైకుంఠపురంబునుంబోలె శంఖ చక్ర కమలాలంకృతంబై, సంసారచక్రంబునుంబోలె ద్వంద్వ సంకుల పంక సంకీర్ణంబై యొప్పు నప్పంకజాకరంబుఁ బొడగని.

గజేంద్రుని రక్షణ – 1910 కాలపు చిత్రం. వికిపీడియానుండి

కరుణాసింధుడు శౌరి వారిచరమున్ ఖండింపగా బంపె స
త్వరితాకంపిత భూమిచక్రము మహోద్యద్విస్ఫులింగ చ్ఛటా
పరిభూతాంబుర శుక్రమున్ బహువిధ బ్రహ్మాండభాండ చ్ఛటాం
తర నిర్వక్రము బాలితాఖిల సుధాంధ శ్చక్రముం జక్రమున్.

ఇట్లు పంచిన.
అంభోజాకర మధ్య నూతన నళిన్యాలింగన క్రీడనా
రంభుండైన వెలుంగుఱేని చెలు వారన్ వచ్చి నీటన్ గుభుల్
గుంభ ధ్వానముతో గొలంకువు గలంకం బొందగా జొచ్చి దు
ష్టాంభోవర్తి వసించు చక్కటికి డాయంబోయి హృద్వేగమై.

భీమంబై తల ద్రుంచి ప్రాణముల బాపెం జక్ర మాశు క్రియన్
హేమక్ష్మాధర దేహముం జకితవన్యేభేంద్ర సందోహముం

గామ క్రోధన గేహమున్ గరటి రక్త స్రావ గాహంబు ని
స్సీమోత్సాహము వీత దాహము జయశ్రీ మోహమున్ గ్రాహమున్.

ఇట్లు నిమిష స్పర్శనంబున సుదర్శనంబు మకరి తల ద్రుంచు నవసరంబున.

మకర మొకటి రవి జొచ్చెను
మకరము మఱియొకటి ధనదు మాటున డాగెన్;
మకరాలయమున దిరిగెడు
మకరంబులు కూర్మరాజు మఱువున కరిగెన్.

తమముం బాసిన రోహిణీ విభుక్రియన్ దర్పించి సంసారదు:
ఖము వీడ్కొన్న విరక్త చిత్తుని గతిన్ గ్రాహంబు పట్టూడ్చి, పా
దము లల్లార్చి, కరేణుకావిభుడు సౌందర్యంబుతో నొప్పె, సం
భ్రమదాశాకరిణీ కరోజ్ఝిత సుధాంభస్స్నాన విశ్రాంతుడై.

పూరించెన్ హరి పాంచజన్యము గృపాంభోరాశి సౌజన్యమున్
భూరిధ్వాన చలాచలీకృత మహాభూత ప్రచైతన్యమున్
సారోదారసిత ప్రభాచకిత పర్జన్యాది రాజన్యమున్
దూరీభూత విపన్నదైన్యమును, నిర్ధూతద్విషత్సైన్యమున్.

మెరసెన్ నిర్జరదుందుభుల్, జలరుహామోదంబులై వాయువుల్
దిరిగెన్ బువ్వుల వాన జల్లు గురిసెన్, దేవాంగనా లాస్యముల్
పరగెన్, దిక్కులయందు జీవజయశబ్దధ్వానముల్ నిండె, సా
గర ముప్పొంగె దరంగ చుంబిత నభోగంగా ముఖాంభోజమై.

916. పేశలః

- మనోహరమైన రూపము గలవాడు.
- మృదుమధుర స్వభావముగల కారుణ్యమూర్తి.
- సృష్టిని అనేక విధాలుగా విభజించినవాడు.
- రుద్రుడు ఆయనపట్ల భక్తుడు.

ఓం పేశలాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **సంభ్రమాత్ ఆయుధాయుధ స్రగ్ భూషాంబర రమణీయః పేశలః**

త్వరాతిశయతః ప్రప్త స్రగ్భూషాంబర సుందరః

గజేంద్ర రక్షా సమయే యోఽసౌ పేశల స్మృతః

గజేంద్రుని రక్షించే సంరంభంలో త్వరిత గతిన వెళుతున్న శ్రీమహావిష్ణువు ధరించిన ఆభరణాలు, పూలమాలలు, వస్త్రాలు అన్నీ చెదిరిపోయి ఉన్నాయి. అలాంటి స్థితిలో అతిసుందరంగా, మనోహరంగా ఉన్నందున ఆయన పేశలుడు. (శ్రీకైవల్యసారధి)

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమోళి 3.5.1 – కొలనులో తామరపూవు తెంచుతున్న గజేంద్రుడు మొసలి పట్టులో చిక్కాడు. అలాంటి గజేంద్రుని వద్దకు నల్లని మేఘంలా ఉన్న శ్రీకృష్ణుడు భక్తవరదుడై వడివడిగా వచ్చాడు.

గజేంద్రుని రక్షణకు త్వరపడుతున్న భగవంతునికీ, 'పేశలః' నామమునకూ సంబంధం ఏమిటి? ఇందుకు శ్రీ కృష్ణన్ చెప్పిన వివరణ – ఆపన్నుడైన తన భక్తుని రక్షించడానికి శ్రీదేవుడు వడివడిగా వస్తున్నాడు. తన భక్తుని కాపాడడంలో ఆయనకు ఎంతో సంతోషం ఉన్నది. మరియు ఆ వేగంలో ఆయన వస్త్రాభరణాలు చెదిరి ఉన్నాయి. భగవంతుని సాన్నిధ్యంవలన ఆ వస్త్రాభరణాలకు అందం వస్తున్నది (వస్త్రాభరణాల వలన ఆయనకు అందం రాదు).

శ్రీ పోతన భాగవతము

వినువీధిం జనుదేర గాంచి రమరుల్ విష్ణున్ సురారాతి జీ
వన సంపత్తి నిరాకరిష్ణు గరుణావర్ధిష్ణు యోగీంద్ర హృ
ద్వన వర్తిష్ణు సహిష్ణు భక్తజనబృంద ప్రాభవాలంకరి
ష్ణు నవోద్యోల్లస దిందిరా పరిచరిష్ణున్ జిష్ణు రోచిష్ణున్.

ఇట్లు పొడగని
చనుదెంచెన్ ఘనుడల్లవాడె, హరిపజ్జం గంటిరే లక్ష్మి? శం
ఖ నినాదం బదె, చక్ర మల్లదె, భుజంగధ్వంసియున్ వాడె క్ర
న్నన నేతెంచె నటంచు వేల్పులు నమో నారాయణాయేతి ని
స్వనులై మ్రొక్కిరి మింట హస్తి దురవస్థావక్రికిం జక్రికిన్.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **కర్మణా, మనసా, వాచా, వపుషా చ శోభనత్వాత్ పేశలః.** భగవానుని చేతలు, మనస్సు, మాటలు, రూపము అన్నీ రమణీయమైనవి గనుక ఆయన పేశలుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – పూవువలె సుతిమెత్తని, కరుణాపూరితమైన హృదయము, మాటలు, చేతలు కలవాడు పేశలుడు.

శ్రీ చిన్మయానంద – భగవానుడు అనంత దయార్ద్రమూర్తి. ఆయన హృదయం భక్తులయెడ ప్రేమ, సౌకుమార్యంతో పొంగి పొరలుతున్నది. భక్తులు ఆయన రక్షణ కొరకు మ్రొక్కగానే ఆయన వారిని ఐహిక బంధాలనుండి విముక్తులను చేస్తాడు.

శ్రీ వాసిష్ఠ – పిశ్ - అవయవే - ఏర్పడుట. **పింశతి, అవయమ్ కరోతి, ఇతి పేశలః.** భగవంతుడు సృష్టిని అనేక భాగాలుగా విభజించాడు. ఉదాహరణకు శరీరాన్ని అవయవాలుగా విభజించాడు. నక్షత్ర మండలమును అనేక గ్రహ నక్షత్రాదులుగా విభజించాడు. కాలమును క్షణాలు, నిముషాలు, ఘంటలు, దినాలు, సంవత్సరాలుగా విభజించాడు. కనుక ఆయన పేశలుడు.

శ్రీ సత్యసంధ తీర్థ – ప-ఈశ-ల - పేశల. **ఈశమ్ - రుద్రమ్, లాతి - భక్తత్వేన గృహ్ణాతి, ఇతి ఈశలః, పాతి ఇతి పః, పశ్చ అసౌ ఈశలశ్చ ఇతి పేశలః.** రుద్రుని తనకు భక్తునిగా కలిగినవాడు మరియు ఆయనను రక్షించువాడు పేశలుడు.

917. దక్షః

- దుష్ట శక్తులను వేగంగా రూపుమాపువాడు.
- గజేంద్రుని రక్షణ కొఱకు త్వరితగతిని వచ్చినవాడు (దక్ష్ - శీఘ్రార్థే).
- గజేంద్రుని రక్షణ కొఱకు త్వరితగతిని వచ్చే శక్తి కలిగినవాడు (దక్ష్ - శక్తిశాలీ).
- విశ్వరూపంలో ప్రవృద్ధుడైనవాడు (దక్ష్ - పెరుగుట).
- సృష్టి, పాలన, లయము కార్యములలో నిపుణుడు అయినవాడు (దక్ష్ - నైపుణ్యము).
- శత్రువులను నాశనం చేసేవాడు (దక్ష్ - హింసనయోః)

ఓం దక్షాయ నమః

45వ శ్లోకము. 424వ నామము. దక్షః – **ఉగ్రః సంవత్సరో దక్షో విశ్రామో విశ్వదక్షిణః**

98వ శ్లోకము. 917వ నామము. దక్షః – **అక్రూరః పేశలో దక్షో దక్షిణః క్షమిణాంవరః**

'దక్ష' అంటే పెరుగుట, వేగముగా పని చేయుట, వృద్ధి చెందుట, శక్తి కలిగియుండుట, బాధించుట వంటి అర్థాలున్నాయి.

శ్రీ భట్టుల వ్యాఖ్య –

45వ శ్లోకం. 424వ నామము. **దక్షః** – ఈ నామమును శ్రీ భట్టులు శ్రీ కల్క్యవతారము పరంగా వ్యాఖ్యానించారు. **దస్యు వధే దక్షతే - శీఘ్రకారీ ఇతి దక్షః.** అతి వేగంగా దుష్టులను సంహరించేవాడు దక్షుడు. కల్కి.

ఈ నామమునకు శ్రీ శంకరులు చెప్పిన ఒక అర్థం – **సర్వ కర్మాణి క్షిప్రమ్ కరోతి వా దక్షః.** అన్ని పనులూ అతి వేగంగా చేసేవాడు దక్షుడు. అందుకే భగవంతుని గుణగణాల వర్ణనలో 'సంకల్పమాత్రేణ' అనే విశేషం తరచు కన్పిస్తుంది.

98వ శ్లోకం. 917వ నామము. **దక్షః – క్షిప్రమ్ ఆగంతా దక్షః.** గజేంద్రుని పిలుపు విని అతి వేగంగా వచ్చినవాడు దక్షుడు. 'దక్ష' అనగా 'శీఘ్రకారీ' అన్న భావాన్ని పెక్కు అనువాదకులు గ్రహించారు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **స్మృతిమాత్రః త్వరయా గతవాన్ ఇతి దక్షః.** భక్తులు స్మరించినంతనే వెంటనే వచ్చేవాడు దక్షుడు.

శ్రీ కృష్ణత్త భరద్వాజ కూడా ఇదే అర్థం చెప్పారు. **దక్షతే - శీఘ్రతామ్ కురుతే స్వజన అవనే ఇతి దక్షః.** 913వ నామము 'శిశిరః'కు, మరియు 917వ నామము 'దక్షః'కు కూడా శ్రీ భట్టులు 'గజేంద్రుని ఆర్తనాదం విని వేగంగా వచ్చినవాడు'అనే అర్థమే చెప్పారు. అయితే (1) రెండు అర్థాలు ఒకటి అయినా, నామములు వేరు గనుక పునరుక్తి దోషం లేదు. (2) శ్రీ శంకరులు కూడా 917, 918 నామములు 'దక్షః' మరియు 'దక్షిణః' కు ఒకే విధమైన అర్థం చెప్పారు. ఇక్కడ కూడా నామములు వేరు గనుక పునరుక్తి దోషం లేదు. (3) శ్రీ భట్టుల వ్యాఖ్యలో ఉన్న స్వల్ప అంతరాన్ని శ్రీ మద్ శ్రీముష్ణమ్ ఆండవన్ ఇలా వివరించారు. దక్షః – వేగంగా రావడానికి తగిన శక్తి సామర్థ్యములు కలవాడు. శిశిరః – వేగంగా వచ్చినవాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య
45వ శ్లోకములో **'దక్షః'** – దక్ష - వృద్ధి చెందుట. **జగద్రూపేణ వర్ధమానత్వాత్ దక్షః.** సకల జగత్తు రూపంలో వర్ధిల్లువాడు దక్షుడు.

98వ శ్లోకములో **'దక్షః'** – **ప్రవృద్ధః శక్తః శీఘ్రకారీ చ దక్షః.** వృద్ధి, శక్తి, వేగము అనే లక్షణములున్నవాడు దక్షుడు. సమర్థత, ప్రతిభ, కార్యనిర్వహణ చాతుర్యము, శక్తి సంపద, శీఘ్రకారిత్వము, పట్టుదల, అప్రమత్తత మున్నగు దివ్య లక్షణములు కలవాడు దక్షుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – **శీఘ్రకారీ చ దక్షః, త్రయమ్ చైతాత్ పరస్మిన్ నియతియమ్ ఇతి దక్షః.** తన సృష్టియందు నైపుణ్యము కలవాడు దక్షుడు.
శ్రీ చిన్మయానంద – సృష్టి, పాలన, లయము అనే కార్యములను నియమంగా, నైపుణ్యంగా, సమయబద్ధంగా చేసేవాడు దక్షుడు.

శ్రీ సత్యసంధ తీర్థ – దక్ష్ - హింసాయామ్ - బాధించుట. **శత్రూణామ్ హన్తా దక్షః.** శత్రువులను నాశనం చేసేవాడు దక్షుడు.

సంస్కృత వ్యాఖ్యానాలను ఇతర భాషలలోనికి అనువదించడంలోను, మరింత వివరించడంలోను వచ్చే సమస్యలు, తద్వారా ఉత్పన్నమయ్యే భావభేదాలు ఇక్కడ 'శిశిరః', 'దక్షః' నామములలో (913, 917 నామములలో) గమనించవచ్చును.

సంస్కృతంలో శ్రీ భట్టుల వ్యాఖ్యానం ఇలా ఉంది.
(913) శిశిరః – **ఆర్త శబ్ద శ్రవణానంతరమ్ అతిత్వరయా గతః శిశిరః** (శాశ - ప్లుతగతౌ, సాన్నిధ్యమ్ కల్పయామాస తస్మిన్ సారసి).
(917) దక్షః – **క్షిప్రమ్ ఆగన్తా దక్షః.**

913వ నామంలోను, 917వ నామంలోను కూడా శ్రీ భట్టులు భగవానుని 'త్వరితగతి'ని స్తుతిస్తున్నారని అనుకోవచ్చును. అయితే ఈ రెండు నామముల అర్థాలలో ఉన్న స్వల్ప భేదాన్ని శ్రీమద్ శ్రీముష్ణమ్ ఆండవన్ ఇలా చెప్పారు (శ్రీ భట్టుల వ్యాఖ్యకు ఆయన వివరణ).
(913) శిశిరః – మొసలి నోట చిక్కిన గజేంద్రుని వద్దకు అతివేగంగా వచ్చినవాడు (శీఘ్రకారీ).
(917) దక్షః – అతివేగంగా గజేంద్రుని వద్దకు రావడానికి సామర్థ్యము కలవాడు (శక్తిశాలీ).
ఇలా చూస్తే శ్రీ భట్టుల వ్యాఖ్యానంలో పునరుక్తి లేదు. 425వ నామమును కూడా శ్రీ భట్టులు 'వేగంగా' అనే అర్థంలో చెప్పారు కాని అది శ్రీ కల్క్యవతార పరంగా.

శ్రీ శంకరులు ఈ 'శిశిరః', 'దక్షః' నామములకు పూర్తిగా భిన్నమైన వ్యాఖ్యలు చెప్పారు గనుక పునరుక్తి సమస్య అసలు లేదు.
శిశిరః – (చల్లని ఋతువు) **తాపత్రయ అభితప్తానామ్ విశ్రమ స్థానత్వాత్ శిశిరః.** తాపత్రయము వలన తప్తులనవారికి చల్లని ఆశ్రయము.
దక్షః – **ప్రవృద్ధః, శక్తః, శీఘ్రకారీ చ.** వృద్ధి,శక్తి, వేగము అనే లక్షణములు కలవాడు.

918. దక్షిణః

- ప్రసన్నత, ప్రేమ, శరణాగత వాత్సల్యము అనే గుణములున్నవాడు.
- అంతటా వ్యాపించినవాడు.
- ప్రళయకాలంలో సర్వమునూ నాశనం చేయువాడు.
- ఎంతో దాతృగుణము, దాక్షిణ్యము, దయ గలవాడు.
- వేగం కలవాడు. నిపుణుడు.

ఓం దక్షిణాయ నమః

ఇంతకు ముందు నామము 'దక్షః' మరియు ఈ నామము 'దక్షిణః' ఒకే శబ్దంనుండి వచ్చాయి.

దక్ష్ - వృద్ధౌ, శీఘ్రార్థే - పెరుగుట, త్వరపడుట. ఉణాది సూత్రము (2.50) **'ద్రు దక్షిభ్యామ్ ఇనన్'** ప్రకారము 'దక్ష్' శబ్దానికి 'ఇనన్' ప్రత్యయం చేరిస్తే 'దక్షిణ' పదం వస్తుంది. సిద్ధాంత కౌముదిలో 'దక్షిణః' పదానికి ఇచ్చిన అర్థం. **దక్షతే వర్ధతే శీఘ్రకారీ భవతి వా స దక్షిణః, సరళో వామభాగః పరతంత్రోऽనువర్తనమ్.** (సరళ స్వభావము. నిజాయితీ, మర్యాద, వినయము). 'దక్ష' మరియు 'దక్షిణ' పదాల అర్థం - నైపుణ్యత, త్వరగా రావడం, వేగంగా కార్యాచరణ చేయడం. ఇవే కాకుండా (శ్రీ ఆప్టే నిఘంటువు ప్రకారం) ప్రసన్న, ఆహ్లాద స్వభావం, మృదువర్తన అనే అర్థాలు కూడా ఉన్నాయి. కనుక 'దక్షిణ' అంటే త్వరగా వచ్చేవాడు, నాశనం చేసేవాడు, సరళ స్వభావం కలవాడు, భక్తులను వర్ధిల్లజేసేవాడు అనే అర్థాలను చెప్పవచ్చును.

శ్రీ భట్టులు 'మృదు స్వభావం కలిగిన, కరుణాపూరితమైన' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. **తథా ఆగత్య, ధిఙ్మామ్, దూరగతోऽహమ్ త్వామ్, ఇతి సాంత్వనైః, గజేంద్రస్య అనుకూలః దక్షిణః.** భగవానుడు పరుగు పరుగున గజేంద్రుని వద్దకు రావడమే కాదు. వచ్చి, అయ్యో, నేను సమీపంలో లేకపోయానే – అని సాంత్వనవచనాలు పలికి గజేంద్రుని ఓదార్చాడు. ఇందుకు శ్రీభట్టులు విష్ణుధర్మము (69.83 నుండి ఉదాహరించారు.

ప్రీతిమాన్ పుండరీకాక్షః శరణాగత వత్సలః
భజన్తమ్ గజరాజానమ్ మధురమ్ మధుసూదనః – విష్ణుధర్మము 69.83
శరణాగత వత్సలుడు, పుండరీకాక్షుడు అయిన మధుసూదనుడు తనను భజించిన గజేంద్రునిపట్ల ప్రసన్నుడయ్యాడు.

శ్రీమద్ శ్రీముష్ణమ్ ఆండవన్ ఈ నామము భగవానుని దాక్షిణ్యమును, సౌశీల్యమును, వినయమును, సౌహార్దతను సూచించేదిగా వర్ణించారు. అఖిలాండకోటి బ్రహ్మాండకోటికి సర్వేశ్వరుడైన శ్రీమహావిష్ణువు ఒక జంతువుపట్ల ప్రసన్నుడై తన ఆలస్యానికి చింతిస్తూ సాంత్వన వచనాలు పలికాడు.

శ్రీ కృష్ణన్ ఈ ఘట్టాన్ని ఇంకా మధురంగా వర్ణించారు. భగవానుడు గజరాజు చెంత మోకరిల్లి అతని గాయాలను పరీక్షించాడు. తన దివ్య తిరుమేని పైని ఉత్తరీయాన్ని తీసి, ఊది, గజరాజు కాలికి కట్టి, ఉపశమనం కలిగించాడు. అంతే కాక తన ఆలస్యానికి చింతిస్తూ సాంత్వన వచనాలు పలికాడు. శరణాగత వాత్సల్యతకు ఇంతకంటే మరేమి ఉదాహరణ కావాలి?

రామాయణం యుద్ధకాండ (19.7)లో విభీషణుడు శరణు జొచ్చినపుడు శ్రీరాముడు **'వచసా సాంత్వయిత్వైనమ్ లోచనాభ్యామ్ పిబన్నివ'** – తన సాంత్వన వచనాలతోను, మరియు కన్నులతోను విభీషణుని త్రాగుతున్నట్లు (కటాక్ష వీక్షణాలతో తడిపినట్లు) ఉన్నాడట.

శ్రీ పోతన భాగవతము

'సంసార దుఃఖమును వీడ్కొన్న విరక్త చిత్తుని గతి' కరేణుకా విభుడు సౌందర్యముతో నొప్పెను. హరి 'దూరీభూత విపన్న దైన్యమగు' పాంచజన్యమును పూరించెను.

నిడుద యగు కేల గజమును
మడువున వెడలంగ దిగిచి మదజల రేఖల్
దుడుచుచు మెల్లన పుణుకుచు
నుడిపెన్ విష్ణుండు దు:ఖ ముర్వీనాథా!

శ్రీ హరి కర సంస్పర్శను
దేహము దాహంబు మాని ధృతి గరిణీ సం
దోహంబును దాను గజపతి
మోహన ఘీంకార శబ్దములతో నొప్పెన్.

కరమున మెల్లన నివురుచు
గర మనురాగమున మెఱసి కలయం బడుచుం
గరి హరికతమున బ్రతుకుచు
గర పీడన మాచరించె గరిణుల మరలన్.

శ్రీ శంకరుల వ్యాఖ్య –

శ్రీ శంకరులు ఇంతకు ముందు నామము 'దక్షః' కు చెప్పిన అర్థము – **ప్రవృద్ధః శక్తః శీఘ్రకారీ చ దక్షః.** వృద్ధి, శక్తి, వేగము అనే లక్షణములున్నవాడు దక్షుడు. సమర్థత, ప్రతిభ, కార్యనిర్వహణ చాతుర్యము, శక్తి సంపద, శీఘ్రకారిత్వము, పట్టుదల, అప్రమత్తత మున్నగు దివ్య లక్షణములు కలవాడు దక్షుడు.

ఇంతకుముందు నామము 'దక్షః' మరియు ఈ 'దక్షిణః' నామములకు ఒకే అర్థమున్నాగాని పునరుక్తి లేదని శ్రీ శంకరులు స్పష్టంగా చెప్పారు. ఎందుకంటే అర్థం ఒకటే అయినా నామములు వేరు. శ్రీ వేదవ్యాసుడు భగవానుని దక్షత గుణమును రెండు నామములలో ప్రస్తుతించాడు. **దక్షిణః శబ్దస్యాపి దక్ష ఏవ అర్థః, శబ్ద భేదాత్ న పునరుక్త్యమ్.**

అయితే శ్రీ శంకరులు ఈ 'దక్షిణః' నామమునకు మరొక అర్థాన్ని కూడా చెప్పారు. దక్ష - గతి హింసనయోః - వెళ్ళుట, (చంపుట) బాధించుట అనే అర్థాల ప్రకారం, **అథవా గచ్ఛతి హింసతి ఇతి వా దక్షః (దక్షిణః).** అంతటా వ్యాపించియుండేవాడు, ప్రళయకాలంలో అంతనూ అంతం చేసేవాడు దక్షుడు (దక్షిణుడు) అని కొందరు అనువాదకులు ఈ వ్యాఖ్యను వివరించారు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **దంశతి దుర్యోధన ఉద్యమమ్ ఇతి దక్షిణః.** దుర్యోధనుని పురోగతిని నాశనం చేసినవాడు దక్షిణుడు.

శ్రీ పెమ్మరాజు రాజారావు – దక్షిణలనగా యజ్ఞ యాగ వ్రతానుష్ఠాదులు పూర్తియైన యజమానుడు వానిని నిర్వర్తించిన ఋత్విక్కులకు, పురోహితులకు ఇచ్చునట్టి కానుకలు, ధన కనక వస్త్రాదులు, వివిధ సత్కారాలు. ఇవి అన్నియును భగవానుని తృప్తి కొరకు చేయు ఆరాధనమే అగుటవలన భగవానుడు 'దక్షిణః' అను నామమున ఆరాధ్యుడగుచున్నాడని భావన. మరియు భగవానుడు తననాశ్రయించిన భక్తులకు వారి వారి యర్హతలనుబట్టి దక్షిణలను (భూ, ధన, గృహ, పుత్ర, సుఖ భోగాదులను) ఇచ్చుచుండువాడు గాన దక్షిణ శబ్దముతో కీర్తింపబడుచున్నాడని భావము. 96వ శ్లోకము 905వ నామము 'స్వస్తిదక్షిణః' ఈ భావంలో వ్యాఖ్యానింపబడినది. ఇది భగవానుని దాక్షిణ్యగుణమును సూచించును.

పై భావమే శ్రీ చిన్మయానంద వివరణలో ఉన్నది.

శ్రీ వాసిష్ఠ – **క్షిప్రమ్ ఆగచ్ఛతి ఆహూత, ఆగత్య చ సంతుష్టో ముక్త హస్తమ్ దదాతి ఇతి ఉదారః స దక్షిణ ఉచ్యతే.** ఆర్తనాదము విన్నపుడు భగవానుడు త్వరత్వరగా వస్తాడు. వచ్చి వరములనిచ్చే ఉదారుడు. అలా ఆయన మనోహరంగా ఉంటాడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ –
(1) **దక్షయతి వర్ధయతి ఇతి దక్షిణః.** తన భక్తులను వర్ధిల్లజేసేవాడు దక్షిణుడు (దక్షిణ - అభివృద్ధి).
(2) **విశ్వరంగే ఉదారతమో నాయకః.** సమస్త జగత్తులోను అత్యంత ఔదార్యం కలిగిన భగవానుడు దక్షిణుడు. (అమరకోశము 3.1.8. దక్షిణ - సరళ, ఉదారౌ చ)

919. క్షమిణాంవరః

- తన భక్తులను రక్షించడంలో అందరికంటె ముందుండేవాడు. భక్తరక్షణకై ఎంతో ఆతురత కలిగినవాడు.
- భూమి, తదితర బ్రహ్మాండముల భారమును మోసేవారిలో శ్రేష్ఠుడు.
- అత్యధిక శక్తిశాలి.
- భక్తుల అపరాధములను మన్నించేవాడు. శ్రేష్ఠమైన క్షమాగుణం కలిగినవాడు.

ఓం క్షమిణాంవరాయ నమః

క్షమ్ - సహనే - సహించుట, ఓర్చుకొనుట. వృణ్ - వరణే - ఏరుకొనుట, శ్రేష్ఠమైన. క్షమిణాంవరః - ఓర్పుగలవారిలో ఉత్తముడు. **సహనశీలాయామ్, క్షమావతామ్ మధ్యే వరః - శ్రేష్ఠః ఇత్యర్థః.** క్షమ అంటే శక్తిగల,

సమర్థమైన అనే అర్థాలు కూడా ఉన్నాయి. మరియు క్షమ అంటే సహనము, క్షమాగుణము అనేవి సాధారణంగా తెలిసిన అర్థాలు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **తద్ దర్శనేన ధృతాత్మా, అభవత్ తత్ర దేవేశః.** భగవానుడు గజేంద్రుని మొర విని పరుగు పరుగున వచ్చాడు. ఆయన మనసు కల్లోలంగా ఉంది. గజేంద్రుని రక్షించడంలోని జాప్యాన్ని ఆయన తాళలేకపోయాడు. వచ్చి, గజేంద్రుని చూచిన తరువాత ఆయన మనసు కుదుటపడింది. భక్తుల రక్షణకై భగవంతుడెంత ఆతురుడో ఇక్కడ తెలుస్తుంది. ఇలా భక్తరక్షణలో ఆయన శ్రేష్ఠుడు. క్షమిణాంవరుడు.

ఇలాగే సుగ్రీవుడు తొందరపాటులో రావణునిపై లంఘించి మల్లయుద్ధం చేసినపుడు, సుగ్రీవుడు తిరిగివచ్చేదాకా రాముడు ఎంతో ఆతురపడ్డాడు. తనవారి రక్షణకై భగవంతుడు ఇంత శ్రద్ధ చూపిస్తాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు మూడు అర్థాలను చెప్పారు.
క్షమవతామ్ యోగినామ్ ఇతి క్షమిణాంవరః. క్షమాగుణము కలిగిన యోగులందరిలో శ్రేష్ఠుడు క్షమిణాంవరుడు.

పృథివ్యాదీనామ్ భారధారకాణామ్ శ్రేష్ఠ ఇతి క్షమిణాంవరః. భారమును ధరించే భూమివంటివానిలో శ్రేష్ఠుడు క్షమిణాంవరుడు.

క్షమిణాః శక్తిః, అయం తు సర్వ శక్తిమత్వాత్ సకలాః క్రియాః కర్తుమ్ క్షమత ఇతి వా క్షమిణాంవరః. 'క్షమిణా' అనగా శక్తి కలిగినవారు. పరమేశ్వరుడు సర్వశక్తిమంతుడు గనుక క్షమిణాంవరుడు.

శ్రీ శంకరులు రామాయణము (1.1.8)నుండి ఉదాహరించారు. శ్రీరాముడు **'క్షమయా పృథ్వీ సమః'**.

శ్రీ చిన్మయానంద – జీవుల అనేకానేక పాపములను క్షమించుటలో భగవానుడు ఎంతో సహనము కలవాడు. హిరణ్యాక్ష, హిరణ్యకశిపు, రావణాదులకు కూడా సన్మార్గంలో నడవడానికి ఆయన ఎంతో అవకాశం ఇచ్చాడు. చివరకు స్వయంగా దర్శనమిచ్చి, వారిని అంతం చేసి, వారికి పరమపదాన్ని చేరే అవకాశమిచ్చాడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ కూడా ఇలాంటి అర్థమే చెప్పారు. **క్షమితుమ్ సోఢుమ్ భక్త అపరాధాన్ శీలమ్ యేషామ్ తే క్షమిణః, తేషామ్ వరః ఇతి క్షమిణామ్ వరః.**

భగవానుని సహన (క్షమా) గుణానికి మరొక ఉదాహరణ – ఆయన శ్రీరామావతారంలో సీతమ్మతో కలిసి పెక్కు కష్టాలను సహించాడు. ఇంకా భృగుమహర్షి తన వక్షస్థలంపై తన్నినా కోపగించుకొనలేదు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – వనవాస సమయంలో పాండవులను కష్టపెట్టిన దూర్వాసుని శ్రీకృష్ణుడు క్షమించాడు. కాకాసుర వృత్తాంతంలో శ్రీరాముడు కాకాసురుని కొద్దిశిక్షతో వదిలివేశాడు. సీతమ్మతల్లి రాక్షసుని

తలను శ్రీరాముని పాదములవైపు ఉండేలా చేసి అతని క్షమకు అవకాశం కల్పించింది. భగవానుని క్షమాగుణం అసమానమైనది. మాటలలో చెప్పరానిది.

920. విద్వత్తమః

- ఆర్తుల, భక్తుల దుఃఖాన్ని నివారించడం బాగా తెలిసినవాడు.
- సర్వవిద్యా పారంగతుడు. ఆయనకు తెలియనిది ఏదీ లేదు.

ఓం విద్వత్తమాయ నమః

విదన్తి ఇతి విద్వాంసో జ్ఞానినః, తేషు అతిశయేన శ్రేష్ఠః సర్వజ్ఞాత్ ఇతి విద్వత్తమ విష్ణుః. తెలిసినవారు విద్వాంసులు. అలాంటి జ్ఞానులలో శ్రేష్ఠుడు, సర్వజ్ఞుడు గనుక విష్ణువు విద్వత్తముడు. సకల జ్ఞానము, వేదాదులు ఆయన నుండియే ఉద్భవించినవి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు గజేంద్రమోక్షము పరంగా తమ వ్యాఖ్యను కొనసాగించారు. **తచ్చికిత్సా యామ్ విద్వత్తమః.** భగవానుడు గజేంద్రుని వద్దకు వచ్చి మొసలిని చంపాడు. తరువాత గజేంద్రుని ఆర్తిని నివారించడానికి ఏమి చేయాలో ఆయనకు తెలుసును. ఆయన గజేంద్రుని సాంత్వన వచనాలతో ఓదార్చాడు. చేతులతో నిమిరాడు. భగవానుని దర్శనమే గజేంద్రునికి అతిపెద్ద చికిత్స.

భగవానుని భక్త వాత్సల్యము, భక్తుల క్షేమం పట్ల ఆయనకున్న ఆతురత శ్రీ భట్టుల వ్యాఖ్యలో మరల మరల కనుపిస్తాయి. భగవంతుని ఈ గుణమాధుర్యమును శ్రీ భట్టులు చెప్పిన తీరు మాటలలో వివరింపలేనిది. దానిని అనుభవింపవలయును.

శ్రీమద్ శ్రీముష్ణమ్ ఆండవన్ – భగవానుడు వైద్యులందరియందు శ్రేష్ఠుడు. వేయి సంవత్సరములు మకరి నోట బాధపడిన గజరాజుకేమి చికిత్స చేయాలో భగవంతునికి తెలియును. కనుక ఆయన విద్వత్తముడు.

శ్రీ భట్టులు విష్ణుధర్మము (69.89)నుండి ఉదాహరించారు. **ఏవముక్త్వా కురుశ్రేష్ఠ! గజేంద్రమ్ మధుసూదనః స్పర్శయామాస హస్తేన.....**భగవానుని దివ్యకరస్పర్శయే గజేంద్రునికి అత్యుత్తమ ఔషధము. అది సకలాపన్నహరము. పాపహరము. భగవానుని ఎర్రని పెదవులనుండి వచ్చిన మాటలు, గాలి గజేంద్రునికి సర్వవిధములు సాంత్వన కూర్చెను.

శ్రీ వేలుక్కుడి కృష్ణన్ మరొక ఉదాహరణ ఇచ్చారు. జనస్థానంలో శ్రీరాముడు ఖరదూషణాదులను, పదునాల్గువేలమంది రాక్షసులను నాశనం చేసి గాయాలతో తిరిగి వచ్చినపుడు సీతమ్మ తల్లి చేసిన దివ్యవైద్యము – ఆయనను ఆమె ప్రేమతో కౌగిలించుకున్నది. సకల వైద్యములకును నిలయమైన శ్రీమహాలక్ష్మియే ఆమె.

తమ్ దృష్ట్వా శత్రుహన్తారమ్ మహర్షిణామ్ సుఖావహమ్

బభూవ హృష్టా వైదేహీ భర్తారమ్ పరిషస్వజే

మహర్షులను పీడించే రాక్షసులను వధించి రాముడు మహర్షులకు సుఖం కలుగజేశాడు. తన భర్తయైన ఆ రాముని చూచి వైదేహి ఎంతో సంతోషించి అతనిని ఆలింగనం చేసుకొన్నది.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **అథ గజేంద్ర ఉద్ధారకతామ్ సూచయన్ ఆహస్వైక శరణ్యస్య గజేంద్రస్య విపద్ వినాశే అతి నిపుణత్వాత్ విద్వత్తమః**. గజేంద్రుని శరణాగతిని స్వీకరించి, ఎంతో నిపుణతతో అతని విపత్తును తొలగించినవాడు విద్వత్తముడు.

శ్రీ భట్టుల వ్యాఖ్యను శ్రీ రాధాకృష్ణ శాస్త్రి మరింత విస్తారంగా చెప్పారు. భక్తుల సకల సమస్యలను పరిష్కరించడం తెలిసినవాడు విద్వత్తముడు.

శ్రీ పోతన భాగవతము

నిడుద యగు కేల గజమును
మడువున వెడలంగఁ దిగిచి మదజలరేఖల్
దుడుచుచు మెల్లన పుణుకుచు
నుడిపెన్ విష్ణుండు దుఃఖ ముర్వీనాథా!

శ్రీహరి కర సంస్పర్శను
దేహము దాహంబు మాని ధృతిఁ గరిణీ సం
దోహమును దాను గజపతి
మోహన ఘీంకారశబ్దములతో నొప్పెన్.

కరమున మెల్లన నివురుచుఁ
గర మనురాగమున మెఱసి కలయంబడుచున్
గరి హరికతమున బ్రతుకుచుఁ
గరపీడన మాచరించెఁ గరిణుల మరలన్.

శ్రీ శంకరుల వ్యాఖ్య –

నిరస్తాతిశయమ్ జ్ఞానమ్ సర్వదా సర్వ గోచారమ్

అస్య ఇతి అస్తి, న ఇతరేషామ్ ఇతి విద్వత్తమః

భగవంతుడు మాత్రమే సర్వవిద్యా పారంగతుడు. సర్వ శాస్త్రనిధి. సకల శ్రుతి సాగరుడు. సకల విద్యలును, యోగములును, కళలును ఆయననుండియే జనించినవి కనుక ఆయన విద్వత్తముడు.

శ్రీ వాసిష్ఠ – సృష్టికి ముందు, తరువాత, మరియు భవిష్యత్తులోను సమస్తమూ తెలిసినవాడు భగవంతుడే. వేరెవరూ కాదు.

921. వీతభయః

- ఆయన కారణంగా భక్తుల భయం దూరమౌతుంది. గజేంద్రుని భయాన్ని పారద్రోలినవాడు ఆయన.
- సర్వభయరహితుడు.

ఓం వీతభయాయ నమః

వి - విశేషేణ, ఇతమ్ - గతమ్, భయమ్ - భీతిః, యస్య ఇతి వీతభయః. ఆయననుండి భయం దూరమౌతుంది. ఆయన ఎలాంటి భయమూ లేనివాడు. శ్రీ శంకరులు, మరియు ఆయన వ్యాఖ్యను అనుసరించినవారు ఈ అర్థం ఇచ్చారు.

వీతమ్ భయమ్ యస్మాత్ స వీతభయః. ఆయన కారణంగా భక్తుల భయాలు తొలగుతాయి. ఈ విధమైన భక్తవాత్సల్యతను శ్రీ భట్టులు తమ వ్యాఖ్యలో పొందుపరచారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **తత్ సమాగతమ్ తుముల ఉపలంభాత్ వీతమ్ భయమ్ గజేంద్రస్య ఇతి వీతభయః.** భగవానుడు సంరంభంతో రావడం చూసి గజేంద్రుని భయం మాయమయ్యింది.

శ్రీ వేలుక్కుడి కృష్ణన్ – తాను తెంపిన తామరపూవు సకాలంలో భగవంతునికి సమర్పింపలేకపోతానేమోనని గజేంద్రుని భయం. కనుక భగవానుని రాక చూచి అతని భయం తొలగింది.

శ్రీ వి.వి. రామానుజన్ – గజేంద్రుడు మొరపెట్టుకొన్నాడు. కనుక సకాలంలో భగవంతుడు రాకపోతే భగవంతుని ఆశ్రితరక్షా గుణమునకు వంక వస్తుంది. ఇదే గజేంద్రుని భయం. భగవానుని రాకతో తొలగినది ఆ భయం.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **వీతమ్ - వినష్టమ్ గజేంద్రస్య గ్రాహాత్ భయమ్ యేన స వీతభయః.** ఎవని కారణంగా గజేంద్రునికి మొసలివల్ల కలిగిన భయం తొలగిందో అతడు 'వీతభయః'.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **వీతమ్ - విగతమ్, భయమ్ సాంసారికమ్ సంసార లక్షణమ్ వా అస్య ఇతి వీతభయః, సర్వేశ్వరత్వాత్ నిత్యముక్తత్వాత్ చ.** భగవంతునికి సంసారభయం లేదు. ఆయన సర్వేశ్వరుడు. నిత్యముక్తుడు. కనుక ఆయనకు ఏ విధములైన భయములు వర్తించవు. ఆయన సర్వభయరహితుడు. వీతభయుడు.

శ్రీ సత్యసంధ తీర్థ (ద్వైతాచార్యులు) – **భయః శూన్యః వీతభయః.** భయము లేనివాడు వీతభయుడు.

శ్రీ రఘునాధ తీర్థ (ద్వైతాచార్యులు) – **భక్తేభ్యో వీతమ్ - విగతమ్ భయమ్ యస్మాత్ సః వీతభయః.** భక్తులకు భయం లేకుండా చేసేవాడు వీతభయుడు.

శ్రీ పోతన భాగవతము – గజరాజును కాచిన గోవిందుని శ్రీమహాలక్ష్మి ఇట్లు స్తుతించెను.

అరవింద మందిర యగు నయ్యిందిరాదేవి మందస్మిత చంద్రికా వదనారవింద యగుచు ముకుందున కిట్లనియె.

దీనుల కుయ్యాలింపను
దీనుల రక్షింప మేలు దీవనఁ బొందన్
దీనావన! నీ కొప్పును
దీనపరాధీన! దేవదేవ! మహేశా!

922. పుణ్య శ్రవణ కీర్తనః

శ్రీహరిని గురించిన స్మరణ, చింతన, కీర్తన, అర్చన, ధ్యాన, శ్రవణాదులు సమస్త పాపములను నశింపజేసి మహాపుణ్యమను ప్రసాదించును.

ఓం పుణ్య శ్రవణ కీర్తనాయనమః

పుణ్య - పావతే, పూయతే వా అనేన ఇతి పుణ్యమ్. పవిత్రము చేయునది పుణ్యము. **పుణ్యమ్ - పవిత్రీకరణమ్, నామ్నామ్ శ్రవణమ్ కీర్తనమ్ చ యస్య స పుణ్య శ్రవణ కీర్తనః.** ఎవని నామములు విన్నా, అన్నా గాని, పుణ్యము లభించునో ఆయన పుణ్యశ్రవణకీర్తనుడు. **యస్య విష్ణోర్నామ్నామ్ అన్యతః శ్రవణమ్, తథా స్వముఖతః ఉచ్చార్య కీర్తనమ్, ఇత్యుభయతా పవిత్రీకరణమ్ భవతి, స ఏతన్నామ్నామ్ అభిధీయతే.**

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు గజేంద్రమోక్షము పరంగా వ్యాఖ్యను కొనసాగించారు. గజేంద్రుని మోక్షము కథను విన్నా, చెప్పినా గాని పాపములు హరించును గనుక ఆయన పుణ్యశ్రవణకీర్తనుడు.

గజేంద్ర మోక్షణం శ్రుత్వా సద్య పాపాత్ప్రముచ్యతే
యస్మాత్తత్కీర్తనం పుణ్యం శ్రవణం చేతి స స్మృతః
ద్వాదశార్ణో మనుశ్రేష్ఠః పుణ్యశ్రవణకీర్తనః

గజేంద్రమోక్షణము కథను విన్నట్లైతే పాపాలన్నీ పటాపంచలయిపోతాయి. కాబట్టి దీనిని విన్నా చదివినా పుణ్యముగానే పరిగణిస్తాడు శ్రీమన్నారాయణుడు. ఈ నామము ద్వాదశాక్షరీ మహామంత్రము. ఉత్తమోత్తమమైనది. ఓం పుణ్యశ్రవణకీర్తనాయ నమః. (శ్రీకైవల్య సారధి).

శ్రీ భట్టులు విష్ణుధర్మము (69.79)నుండి ఉదాహరించారు.

శ్రుతేన హి కురుశ్రేష్ఠ! స్మృతేన కథితేన వా
గజేంద్ర మోక్షణైవ సద్యః పాపాత్ విముచ్యతే

అర్జునా! ఈ గజేంద్ర మోక్షము వృత్తాంతమును విన్నా, స్మరించినా, చెప్పినా గాని ఆ వ్యక్తికి సమస్త పాపములు నశించును.

శ్రీమద్ శ్రీముష్ణమ్ ఆండవన్ – భగవంతుని నామములు, గాథలు వినదగినవి. కీర్తింపదగినవి. వానివలన పాపములు నశించును. అందువలననే గజేంద్ర మోక్షమును చెప్పే ఈ శ్లోకమును ప్రతినిత్యం ఉదయం మనం అనుసంధానం (అర్థంతో సహా మననం) చేస్తాము.

గ్రాహమ్ గ్రస్తే గజంద్రే సరభసమ్ తార్క్ష్యమ్
ఆరుహ్య ధావన్ వ్యాఘూర్ణన్ మాల్య భూషా
వసన్ పరికరో మేఘ గంభీర ఘోషః
విభ్రాణో రధాంగమ్ శరమసిమ్ అభయం శంఖ చాపౌ చ
ఖేటౌ హస్తైః కౌమోదకీమ్ అపి
అవతు హరిరసావంహసామ్ సంహతేర్ణః

(ఈ శ్లోకము శ్రీమద్ అళగియ సింగర్ ఆహ్నిక గ్రంధంలో లభించింది.) మొసలి నోట చిక్కిన గజేంద్రుని మొర విని భగవానుడు సంరంభంతో గరుడునిపైనెక్కి వేగిరంగా వచ్చాడు. ఆయన వస్త్ర భూషణాదులు చెల్లాచెదురై ఉన్నాయి. ఆయన వస్తుంటే గంభీర మేఘ ధ్వని వినిపిస్తున్నది. ఆయన చేత శంఖ, ఖడ్గ, చాప, గదాది ఆయుధాలు సిద్ధంగా ఉన్నాయి. ఈ వృత్తాంతాన్ని అనుసంధానం చేస్తే గాని, విన్నా గాని, చెప్పినా గాని వారికి భగవంతుని రక్షణ తప్పక లభిస్తుంది.

శ్రీ బలదేవ విద్యాభూషణ కూడా ఇదే అర్థం చెప్పారు. **పాపహారి గజేంద్ర సంబంధి శ్రవణాదిత్వాత్ పుణ్యశ్రవణకీర్తనః.**

శ్రీ పోతన భాగవతము - అని చెప్పి శుక యోగీంద్రుండిట్లనియె.
నరనాథ! నీకును నాచేత వివరింపఁ బడిన యీ కృష్ణానుభావమైన
గజరాజ మోక్షణ కథ వినువారికి యశము లిచ్చును గల్మషాపహంబు
దుస్స్వప్ననాశంబు దుఃఖసంహారంబుఁ బ్రొద్దుల మేల్కాంచి పూతవృత్తి
నిత్యంబుఁ పఠియించు నిర్మలాత్మకులైన విప్రులకును బహువిభవ మమరు.

సంపదలు గల్గుఁ బీడలు శాంతిఁ బొందు సుఖము సిద్ధించు వర్ధిల్లు శోభనములు
మోక్ష మఱచేతిదై యుండు ముదము చేరు ననుచు విష్ణుండు ప్రీతుఁడై యానతిచ్చె.

(పై నామములలోని శ్రీ పోతన భాగవతము పద్యములు ఆంధ్ర భారతి (**http://www.andhrabharati.com**) మరియు తెలుగు వికిసోర్సు నుండి కాపీ చేయబడినవి. – కా.సు. బాబు).

శ్రీ శంకరుల వ్యాఖ్య – **పుణ్యమ్ పుణ్యకరమ్ శ్రవణమ్ కీర్తనమ్ చ అస్య ఇతి పుణ్యశ్రవణకీర్తనః**. ఎవని నామము విన్నా, కీర్తించినా పుణ్యం లభిస్తుందో అతడు పుణ్యశ్రవణకీర్తనుడు.

శ్రీ శంకరులు, శ్రీ వాసిష్ఠ ఈ ఫలశ్రుతి శ్లోకమును ఉదాహరించారు.

య ఇదం శ్రుణుయాన్నిత్యం యశ్చాపి పరికీర్తయేత్

నాऽశుభం ప్రాప్నుయాత్ కించిత్ సోऽముత్రేహ, చ మానవః

పరమ మంగళకరములగు ఈ సహస్ర నామములను శ్రద్ధగా శ్రవణము చేయునట్టి గాని, కీర్తనము చేయునట్టి గాని మానవులకు ఇహలోకమునందును, పరలోకమునందును ఎట్టి అశుభములును కలుగవు (శ్రీ పెమ్మరాజు రాజారావు).

శ్రీ చిన్మయానంద – కీర్తనము అంటే యాంత్రికంగా వల్లెవేయడం కాదు. భగవానుని వైభవాన్ని మననం చేయాలి. భగవంతునికిష్టమైన పనులయెడ నిమగ్నమవ్వాలి. మనసా వాచా కర్మణా ప్రతిక్షణం భగవత్సాన్నిధ్యాన్ని అనుభవించాలి. అటువంటి భక్తుని జీవితమే పూజ, అఖండ కీర్తన, ఆనంద ప్రేమమయము.

శ్రీ వాసిష్ఠ ఈ నామము సారాంశముగా చెప్పిన శ్లోకము –

యస్యాతి నామ్నామ్ శ్రవణమ్ పవిత్రమ్ సంకీర్తనమ్ చాప్యమలం హి తస్య

సోऽనంత నామా భగవాన్ హి విష్ణుః, స్వనామభిర్విశ్వమిదమ్ పునాతి.

విష్ణుభగవానుని నామములు విన్నా, కీర్తించినా గాని దోషములు హరించి పవిత్రత చేకూరును. ఆయన (అనంత కళ్యాణ గుణములను తెలిపే) అనంత నామములు జగత్తును పావనం చేస్తున్నాయి.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

శ్రీ అన్నమయ్య కీర్తన

నీకథామృతము నిరతసేవన నాకు | చేకొనుట సకల సంసేవనంబటుగాన |

ఇదియే మంత్రరాజము నాకు నే ప్రొద్దు | ఇదియే వేద సంహిత పాఠము |
ఇదియె బహుశాస్త్ర మెల్ల చదువుటనాకు | ఇదియె సంధ్య నాకిదియె జపమటుగాన ||

ఇదియె బ్రహ్మవిద్యోపదేశము నాకు | ఇదియె దుఃఖవిరహిత మార్గము |
ఇదియె భవ రోగరహిత భేషజమునాకు | ఇదియె ఉపనిషద్వాక్య పద్ధతి ||

ఇదియె దాన ఫలమీ జాలినది నాకు | ఇదియె తలప పరహిత మార్గము |
ఇదియె తిరువేంకటేశ నీసంస్మరణ- | మిదియె ఇదియె యిన్నియును నటుగాన ||

ఉత్తారణో దుష్కృతిహా పుణ్యో దుఃస్వప్ననాశనః |
వీరహా రక్షణస్సంతో జీవనః పర్యవస్థితః || (99)

923. ఉత్తారణః

- ఉద్ధరించువాడు. దరిజేర్చువాడు.

ఓం ఉత్తారణాయ నమః

ఉ (ఉపసర్గ) - తీవ్రంగా, తృ - ప్లవన సంతరణయోః - దాటుట, ఈదుట. **ఉత్తారయతి ఇతి ఉత్తారణః.** చక్కగా దాటించువాడు ఉత్తారణుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు గజేంద్రమోక్షము పరంగా వ్యాఖ్యను కొనసాగించారు. **తౌ సరసో ఉత్తారితవాన్.** వానినిద్దరిని (గజేంద్రుని, మొసలిని) నీటినుండి లేవనెత్తినవాడు. ఇక్కడ శ్రీ భట్టులు 'తౌ' పదమును ప్రయోగంచుట గమనించదగిన విషయము. భగవానుడు ఇద్దరినీ రక్షించాడు. మొసలిబారినుండి ఏనుగును, శాపంనుండి మొసలిని రక్షించాడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ కూడా ఇదే అర్థం చెప్పారు. **సరోవరాత్ గజేంద్రమ్ ఉత్తారయామాస ఇతి ఉత్తారణః.**

ఇతర వ్యాఖ్యాతలు భగవంతుడు భక్తులను సంసారసాగరంనుండి లేవనెత్తడం పరంగా అర్థం చెప్పారు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సంసార సాగరాత్ ఉత్తారయతి ఇతి ఉత్తారణః.** తన్నాశ్రయించిన భక్తులను మాధవుడు భయంకరమైన మృత్యుసంసార సాగరమునుండి ఉద్ధరించును గనుక ఉత్తారణుడు అయ్యాడు.

శ్రీ చిన్మయానంద – మనం శరీరం, మనస్సు, బుద్ధిల ద్వారా మనచుట్టూ జరిగే భౌతికమైన మార్పులను మనకు ఆపాదించుకుంటాము. సకల జీవులను ప్రకాశింపజేసే మనలోని చైతన్యమును భగవన్ముఖం చేస్తే మనం ఈ మార్పులకు అతీతంగా నిశ్చల నిర్మల పరమానంద జరామరణరహిత స్థితిని సాధింపవచ్చును. కనుక శ్రీమన్నారాయణుడు ఉత్తారణుడు.

శ్రీ వాసిష్ఠ – **భవార్తి సంతప్తానామ్ భవచ్చరణ ఆగంతానామ్ ఉత్తితీర్షూణామ్ ఉత్తారణో నావికో నావేవ ఇత్యర్థః.** సంసార తాపంనుండి రక్షణ కావాలని అనుకుంటే భగవంతుని ఆశ్రయించాలి. అప్పుడు ప్రయాణికులను పడవలో నది దాటించే నావికునిలా భగవంతుడు తన భక్తులను సంసారసాగరం దాటిస్తాడు.

శ్రీ సత్యసంధ తీర్థ ఈ నామమును సన్యాసులకు సుఖాన్నిచ్చే ప్రణవమంత్రము పరంగా వ్యాఖ్యానించారు. **ఉత్కృష్టః తారః ప్రణవో యేషామ్ త ఉత్తారాః సన్న్యాసినః తేషామ్ సుఖమ్ యస్మాత్ స ఉత్తారణః.**

924. దుష్కృతిహా

- దుష్కార్యములు చేయువారిని నాశనము చేయువాడు. భాగవతులను బాధించేవారిని నాశనం చేయువాడు.
- శరణాగతులైనవారి పాపములను నశింపజేయువాడు.

ఓం దుష్కృతఘ్నే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు ఈ నామమును గజేంద్రమోక్షము పరంగా వ్యాఖ్యానించారు. భగవత్కైంకర్య కార్యక్రమంలో ఉన్న గజేంద్రునికి అపకారం తలపెట్టిన మొసలిని సంహరించినవాడు 'దుష్కృతిహా'. **గ్రాహం విదారయామాస యస్మాత్ దుష్కృతిహా చ సః.** ఈ వ్యాఖ్యకు కూడా శ్రీ భట్టులు విష్ణుధర్మము (69)నుండి ఉదాహరించారు. **స్థలస్థం దారయామాస గ్రాహం చక్రేణ మాధవః.** తీరము చేరిన మొసలిని మాధవుడు తన చక్రాయుధముతో చీల్చివేశాడు.

శ్రీ పోతన భాగవతము

భీమంబై తలఁ ద్రుంచి ప్రాణములఁ బాపెం జక్ర మాశుక్రియన్
హేమక్ష్మాధర దేహముం జకిత వన్యేభేంద్ర సందోహమున్
గామ క్రోధన గేహమున్ గరటి రక్తస్రావ గాహంబు ని
స్సీమోత్సాహము వీతదాహము జయశ్రీమోహమున్ గ్రాహమున్

భగవంతుని ఈ గుణమే గీత (4.8)లో స్తుతింపబడింది.

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే

సత్పురుషులను పరిరక్షించుటకును, దుష్టులను రూపుమాపుటకును, ధర్మమును సుస్థిరమొనర్చుటకును నేను ప్రతియగమునందును అవతరించుచుందును.

శ్రీ బలదేవ విద్యాభూషణ కూడా ఇలానే అర్థం చెప్పారు. భాగవతునిపట్ల అపచారమొనర్చినవానిని హతము చేసినవాడు 'దుష్కృతిహా'. **దుష్కృతిమ్ గ్రాహమ్ హతవాన్ ఇతిదుష్కృతిహా.**

ఆండాళ్. తిరుప్పావై 13 – బకాసురుని నోటిని చీల్చిన శ్రీకృష్ణుని, దుష్టరావణుని పది తలలను గిల్లిపారవేసిన శ్రీరాముని నామమును గానము చేయుచు పోయి మన తోడిపిల్లలందరును వ్రతక్షేత్రమును చేరినారు.

శ్రీ వేళుక్కుడి కృష్ణన్ – భాగవతులపట్ల చేసే అపచారములు భగవంతునికి అత్యంతకోపం తెప్పిస్తాయి. శ్రీరామావతారంలోను, శ్రీనృసింహావతారంలోను ఈ గుణాన్ని స్పష్టంగా చూడవచ్చును. పూజారులు శ్రీ తిరుప్పాణాళ్వారు పట్ల అపచారం చేసినపుడు శ్రీరంగనాధుడు తన కోపాన్ని ప్రదర్శించాడు. భాగవతాపచారము అన్నింటికంటె పెద్ద పాపము. అది ఎప్పుడూ చేయరానిది.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **దుష్కృతిః పాపసంజ్ఞితః హన్తి ఇతి దుష్కృతిహా. యే పాపకారిణః తాన్ హన్తి ఇతి వా.** పాపములను నాశనము చేయువాడు లేదా పాపులను నాశనము చేయువాడు 'దుష్కృతిహా'.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవానుడే కాదు. భగవంతుని నామము కూడా పాపములనుండి మనలను కాపాడును. కురుసభలో దుర్యోధనాదులచేత ద్రౌపది పరాభవింపబడినపుడు ఆమె శ్రీకృష్ణుని ప్రార్థించినది. అప్పుడు కృష్ణుడక్కడికి రావడానికి ముందే కృష్ణనామము ద్రౌపదిని రక్షించినది. అని శ్రీకృష్ణుడు రుక్మిణితో చెప్పాడు. తీవ్రమైన పాపులను నాశనం చేయడమే కాక, తెలియక చేసిన పాపములు పరిహారమయ్యేలాగ భగవంతుడు అవకాశమిస్తాడు.

శ్రీ చిన్మయానంద – ఎవరైనా విషయలోలురై దష్కార్యములు చేసినపుడు, ఆ పనుల వాసనలు వారితో ఉండి మళ్ళీ మళ్ళీ అలాంటి పనులకు ప్రేరేపిస్తాయి. మనసును శ్రీమన్నారాయణునిపట్ల లగ్నం చేసినట్లయితే అలాంటి వాసనలు నశిస్తాయి. కనుక నారాయణుడు 'దుష్కృతిహా'.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **దుష్కృతిః హన్తి ప్రపన్నానామ్ ఇతి దుష్కృతిహా**. ప్రపన్నుల పాపములను నాశనం చేసేవాడు 'దుష్కృతిహా'.

925. పుణ్యః

- పవిత్రము చేయువాడు.
- పుణ్యకార్యములు ఆచరించుటయందు శ్రేష్ఠుడు.

వసంతోత్సవం. ఉభయదేవేరులతో శోభిల్లుతున్న శ్రీ మలయప్ప స్వామి. వికిపీడియా చిత్రం.

ఓం పుణ్యాయ నమః

73వ శ్లోకము. 692వ నామము. పుణ్యః – **పూర్ణః పూరయితా పుణ్యః పుణ్యకీర్తిః అనామయః**

99వ శ్లోకము. 925వ నామము. పుణ్యః – **ఉత్తారణో దుష్కృతిహా పుణ్యో దుస్స్వప్ననాశనః**

పు - పావనే - పవిత్రము చేయుట. పుణ్ - శుభకర్మాణి - మంగళ కార్యములయందు.

శ్రీ భట్టుల వ్యాఖ్య –

692వ నామము. **పుణ్యః** – పావనము చేయువాడు 'పుణ్యః'. అతి నీచులైన పాపులు కూడా భగవన్నామస్మరణం చేసి పవిత్రులయ్యే అవకాశం కలిగించినవాడు 'పుణ్యః'.

925వ నామము. **పుణ్యః** – భగవంతుడు తన భక్తులను ఉద్ధరించిన గజేంద్రమోక్షాది ఉదంతాలను మననం చేసుకొన్నంతమాత్రాన మనం పరిశుద్ధులమౌతాము.

కీర్త్యాస్మదాదీనపియో గజేంద్ర త్రాణ రూపయా

పుణ్యస్సస్యాత్సునాతీతి షడర్ణః పావనత్వతః

గజేంద్రమోక్షము అనబడే ఈ కీర్తిచేత మనలను కూడా పాపరహితులుగా చేయువాడు 'పుణ్యః'. ఈ నామము షడక్షరీమంత్రము. పాపనాశకరి. ఓం పుణ్యాయ నమః. (శ్రీకైవల్య సారధి).

శ్రీ శంకరుల వ్యాఖ్య –

692వ నామము. **పుణ్యః** – భగవంతుని స్మరించినంత మాత్రమున కల్మషములు నశించును గనుక భగవంతుడు 'పుణ్యః'.

925వ నామము. **పుణ్యః** – శ్రుతి, స్మృతుల బోధనల ద్వారా పుణ్యమార్గములను ఉపదేశించినవాడు 'పుణ్యః'.

శ్రీ బలదేవ విద్యాభూషణ – కంసునివంటి దుర్మార్గులను నాశనం చేసినవాడు 'పుణ్యః'.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – ఏ విధమైన లోపములు, అధర్మములు లేనివాడు మరియు పవిత్రము చేయవాడు 'పుణ్యః'. భగవంతుడు సూర్యుని రూపంలో తాను స్వయంగా పవిత్రుడు అగుటయే గాక, అన్నింటిని పవిత్రము చేయుచున్నాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ, శ్రీ కృష్ణదత్త భరద్వాజ – స్వయముగా శుభకర్మలు ఆచరించేవాడు 'పుణ్యః'.

శ్రీ పోతన భాగవతము

అని మఱియు, నప్పరమేశ్వరుండిట్లని యానతిచ్చె. ఎవ్వరేనియు నపరరాత్రంబున మేల్కాంచి, సమాహిత మనస్కులై, శ్వేతద్వీపంబును, నాకుం బ్రియంబైన సుధాసాగరంబును, హేమనగరంబును, నిగ్గిరికందర కాననంబులను, వేత్ర కీచక వేణులతా గుల్మ సురపాదపంబులను, ఏనును బ్రహ్మయు ఫాలలోచనుండును నివసించి యుండు నక్కొండశిఖరంబులను, కౌమోదకీ కౌస్తుభ సుదర్శన పాంచజన్యంబులను, శ్రీదేవిని, శేష గరుడ వాసుకి ప్రహ్లాద నారదాది ఋషులను, మత్స్య కూర్మ వరాహాద్యవతారంబులను, దదవతార కృత కార్యంబులను, సూర్య సోమ పావకులనుఁ, బ్రణవంబును, ధర్మ తప స్సత్యంబులను, వేదంబును, వేదాంగంబులను, శాస్త్రంబులను, గో భూసుర సాధు పతివ్రతాజనంబులను, జంద్రకాశ్యపజాయా సముదయంబును, గౌరీ గంగా సరస్వతీ కాళిందీ సునందా ప్రముఖ పుణ్యతరంగిణీ నిచయంబును, నమరులను, నమరతరువులను, నైరావతంబును, నమృతంబును, ధ్రువుని, బ్రహ్మర్షి నివహంబును, బుణ్యశ్లోకులైన మానవులను, సమాహిత చిత్తులై తలంచువారలకుఁ బ్రాణావసానకాలంబున మదీయంబగు విమలగతి నిత్తు. అని హృషీకేశుండు నిర్దేశించి, శంఖంబు పూరించి, విహగపరివృఢ వాహనుండై వేంచేసె. విబుధానీకంబు సంతోషించె. అని చెప్పి శుకుండు రాజున కిట్లనియె.

గజరాజ మోక్షణంబును

నిజముగఁ బఠియించునట్టి నియతాత్ములకున్

గజరాజవరదుఁ డిచ్చును

గజతురగ స్యందనములుఁ గైవల్యంబున్.

(పై నామములలోని శ్రీ పోతన భాగవతము పద్యములు ఆంధ్ర భారతి (http://www.andhrabharati.com) మరియు తెలుగు వికిసోర్సు నుండి కాపీ చేయబడినవి. – కా.సు. బాబు).

926. దుస్స్వప్ననాశనః

చెడు కలలను నాశనం చేసేవాడు.

ఓం దుస్స్వప్ననాశనాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – ఇంతకుముందు నామములనువలనే ఈ నామమును కూడా శ్రీ భట్టులు గజేంద్రమోక్షం పరంగా వ్యాఖ్యానించి, అందుకు విష్ణుధర్మమునుండి ఉదాహరించారు.

గజేంద్రమోక్షణాధ్యాయ జాపాద్దుస్స్వప్నజం ఫలం

నాశయత్యం చ యోఽసౌ ఇతి దుస్స్వప్ననాశనః

గజేంద్రమోక్షము అనే అధ్యాయమును భక్తితో పఠించినట్లయితే దుస్వప్నాలు ఒక్కక్షణంలో పటాపంచలౌతాయి గనుక శ్రీహరి దుస్వప్ననాశనుడు. (శ్రీకైవల్యసారధి)

విష్ణుధర్మములో అధ్యాయము ఫలశ్రుతి –

యే మామ్ త్వామ్ చ సరశ్చైవ గ్రాహస్య చ విమోక్షణమ్

యే స్మరిష్యన్తి మనుజాః ప్రయతాః స్థిరబుద్ధయః

దుఃస్వప్నో నశ్యతే తేషామ్ సు-స్వప్నశ్చ భవిష్యతి

సంస్కృతభాగవతములో ఫలశ్రుతి (8.4.14) –

ఏతన్ మహారాజ తవేరితో మయా కృష్ణానుభవో గజరాజ మోక్షణమ్

స్వర్గ్యమ్ యశస్యమ్ కలికల్మషాపహమ్ దుస్స్వప్ననాశనమ్ కురువర్య శృణ్వతామ్

శ్రీ పోతన భాగవతము నుండి సంగ్రహపరచినది – ఓ రాజా! ఈ కృష్ణానుభవమైన గజరాజమోక్షణ కథ వినువారికి యశములిచ్చును. కలికల్మషములపహరించును. దుస్వప్ననాశనమొనర్చును. దుఃఖము సంహరించును. విభవమమరును. సంపదలు కలుగును. పీడలు శాంతించును. సుఖము సిద్ధించును. శోభనములు వర్ధిల్లును. మోక్షము అందివచ్చును. ముదము చేరును. అని విష్ణుడు ప్రీతుడై యానతిచ్చెను.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీహరియొక్క స్మరణ కీర్తనాదులచేత (భవిష్యత్తులో అనర్థములను సూచించు) దుస్స్వప్నములన్నియునునశించును.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవంతుని భక్తులకు ఆపదలు సంభవింపవు. కనుక ఆపదలను సూచించు దుస్వప్నములు కలగవు. భగవంతుని నామమును శ్రద్ధగా ధ్యానించినచో ఏవిధమైన చెడు కలలు రావు.

శ్రీ చిన్మయానంద – పునర్జన్మే అన్నింటికంటె చెడు స్వప్నము. నారాయణ నామస్మరణాదీక్ష పూనినవారికి మనసులో చెడు ఆలోనలు, భయములు, భ్రమలు దరిజేరవు కనుక వారికి దుస్వప్నములు కలుగవు.

శ్రీ వాసిష్ఠ – ప్రార్థనవల్ల చెడు స్వప్నములు తొలగునని వేదములోనున్నది.

అధర్వవేదము 16.6.9 – **జాగ్రద్ దుష్ స్వప్న్యమ్ స్వసే దుష్-స్వప్న్యమ్**.

ఋగ్వేదము 10.86.21 – **పునరేహి వృషాకపే సువితా కల్పయావహై య ఏష స్వప్ననంశనోఽస్తమేషి పథా పునర్-విశ్వమాద్-ఇంద్ర ఉత్తరః.**

శ్రీ పెమ్మరాజు రాజారావు – స్వప్నములనగా మనస్సులోని అంతరాంతరములలో దాగియున్న తృప్తితీరని వాంఛలయొక్కయు, వాసనలయొక్కయు బహిర్గతములగు ఛాయలు మాత్రమే. హరి కీర్తనము సకలవాంఛా వాసనా రాహిత్యము కలిగించి, చిత్తశుద్ధిని ప్రసాదించును. వాస్తవముగా ఆలోచించినచో, జననమరణ జరావ్యాధి దుఃఖభూయిష్టమైన ఈ జన్మమే దుస్వప్నమని బుద్ధిమతులు తలచెదరు. జన్మరాహిత్యమును ప్రసాదించువాడు శ్రీహరియే గాన దుస్వప్ననాశనుడని అర్చనీయుడగుచున్నాడు.

927. వీరహా

- గజేంద్రునకు యమపాశములు తొలగించినవాడు.
- బలవంతులైన రాక్షసులను సంహరించినవాడు.
- వ్యర్థవాదాలు చేసి భక్తుల ధ్యానాన్ని కలతపరచేవారిని (శుష్కపండితులను) నాశనం చేసేవాడు.
- సంసారులు అధర్మమార్గం పట్టకుండా, వారిని మోక్షంవైపు నడిపించేవాడు.
- జీవులకు వివిధ చలనములు కలిగించేవాడు.
- రాక్షస సంహారంలో గరుడుడు, వాయువులు తనకు తోడుగా కలిగినవాడు.
- పునర్జన్మను హరింపజేయువాడు.

ఓం వీరఘ్నే నమః

ఈ నామము 168, 747, 927వ నామములుగా మూడుమార్లు వస్తుంది.

18వ శ్లోకము. 168వ నామము. వీరహా – **వేద్యో వైద్యః సదాయోగీ వీరహా మాధవో మధుః**

79వ శ్లోకము. 747వ నామము. వీరహా – **వీరహా విషమః శూన్యో ఘృతాశీరచలశ్చలః**

99వ శ్లోకము. 927వ నామము. వీరహా – **వీరహా రక్షణస్సంతో జీవనః పర్యవస్థితః**

శ్రీ భట్టుల వ్యాఖ్య – పూతన, శకటాసురుడు వంటి రాక్షసులను సంహరించిన బాలకృష్ణుడు వీరఘ్నుడు.

భాషలో ప్రావీణ్యం కలిగియుండి, తమ పాండిత్యాన్ని వ్యర్థవాదాలకు వినియోగిస్తూ, భక్తుల ధ్యానక్రియను భంగపరచే శుష్కపండితులను నాశనం చేసేవాడు వీరఘ్నుడు.

గజేంద్రునకు యమపాశములను తొలగించినవాడు (మృత్యువునుండి రక్షించినవాడు) 'వీరహా'. **మోక్షయామాస నాగేంద్రమ్ పాశేభ్యః శరణాగతమ్** (విష్ణుధర్మము 69). **వీరం తద్బాధకం మృత్యుం హతవాన్ సః వీరహా.**

శ్రీ శంకరుల వ్యాఖ్య – బలవంతులు మరియు దుష్టులు అయిన రాక్షసులను సంహరించినవాడు 'వీరహా'.

సంసారులు అధర్మమార్గం పట్టకుండా వారిని మోక్షమువైపు నడిపించేవాడు 'వీరహా'.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – అన్ని జంతువులకు చలనం ఇచ్చేవాడు 'వీరహా'.

శ్రీ చిన్మయానంద – జనన మరణ చక్రమును ఛేదించేవాడు 'వీరహా'.

928. రక్షణః

- గజేంద్రుని రక్షించినవాడు.
- ముల్లోకములను రక్షించువాడు.

ఓం రక్షణాయ నమః

రక్ష - పాలనే - కాపాడుట. **రక్షతి - పాలతి సకలమ్ విశ్వమ్ ఇతి రక్షణః**. విశ్వమును రక్షించువాడు రక్షణుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **తమ్ స్పర్శన పరిరంభణ సాంత్వనాదిభిః రక్షితవాన్.** భగవానుడు గజేంద్రుని స్పర్శించి (నిమిరి), కౌగిలించుకొని, సాంత్వన వచనములు పలికి రక్షించాడు. ఇందుకు శ్రీ భట్టులు విష్ణుధర్మమునుండి ఉదాహరించారు.

ఏవముక్త్వా మహారాజ గజేంద్రమ్ మధుసూదనః
స్పర్శయామాస హస్తేన గజమ్ గంధర్వమేవ చ

నిడుదయగు కేల గజమును
మడువున వెడలంగ దిగిచి మదజలరేఖల్
దుడుచుచు మెల్లన పుణుకుచు
నుడిపెన్ విష్ణుండు దుఃఖ ముర్వీనాథా! – శ్రీ పోతన భాగవతము

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సత్వమ్ గుణమ్ అధిష్ఠాయ జగత్రయమ్ రక్షన్ ఇతి రక్షణః**. సత్వగుణమును ధరించి ముల్లోకములను రక్షించువాడు రక్షణుడు.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమోళి 2.2.9 – రక్షించుటయే శ్రీ విష్ణుని గుణము. ఆయన రుద్రునకు, బ్రహ్మకును అంతర్యామియై లయము, సృష్టి కార్యములు చేయుట కూడ రక్షణకే. లయ ద్వారా జీవులకు (కృశించిన దేహములు వదిలించి) ఆయన క్రొత్త శరీరమును ఇస్తాడు. మరియు సృష్టి ద్వారా ఇంద్రియాదులనిచ్చి పరమాత్ముని కొరకు సాధన చేసే అవకాశం కలిగిస్తాడు. ఇలా ఆయన సృష్టి, లయ కార్యములు కూడా రక్షణలో భాగమే.

శ్రీ చిన్మయానంద గీత (4.8)నుండి ఉదాహరించారు.

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్

ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే

ఇక్కడ కూడా 'పరిత్రాణాయ' అనగా 'రక్షించుట కొరకు' అనే పదాన్ని ముందుగా వాడారు. రక్షణయే ఆయనకు ప్రధాన అవతార లక్ష్యము. దుష్టశిక్షణ కూడా అందులో భాగమే.

శ్రీ వాసిష్ఠ భగవానుని రక్షణార్థం పఠించే వేదమంత్రాన్ని ఉదాహరించారు. ఋగ్వేదము 4.3.14 –

రక్షా నో అగ్నే తవ రక్షణేభీ రారక్షాణః సుముఖః ప్రీణానః

ప్రతిష్ఫుట విరుజ వీడ్వహో జహి రక్షో మహిచిద్ వావృధానమ్

929. సంతః

- తన ఆశ్రితులను అనేక విధములుగా వృద్ధిచేయువాడు.
- తన భక్తుల కొరకే ఉన్నవాడు.
- విద్యా వినయ సంపన్నులైన సజ్జనులయందు ఉండేవాడు.
- అంతటా వ్యాపించియున్నవాడు.
- పూజింపబడువాడు.
- జగత్తును చక్కగా విస్తరింపజేయువాడు.

ఓం సంతాయ నమః

ఓం సద్భ్య నమః

సమ్ (ఉపసర్గ). తను - విస్తారే - వ్యాపించుట, పొడిగించుట, ఇచ్చుట (ఆప్టే నిఘంటువు ప్రకారం).

శ్రీ భట్టుల వ్యాఖ్య – **ఆశ్రితాన్ సన్తనోతి (సమ్యక్ తనోతి) ఇతి సన్తః.** తనను ఆశ్రయించినవారు చక్కగా వర్ధిల్లేలాగాను, తన పట్ల ధ్యాసవల్ల సంతోషించేలాగానూ చేయువాడు 'సన్తః'.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **ఏవమ్ గజేంద్రమ్ శరణాగతమ్ సన్తనోతి ఇతి సన్తః.** శరణాగతుడైన గజేంద్రుని వర్ధిల్లజేసినవాడు 'సన్తః'.

శ్రీ వేళుక్కుడి కృష్ణన్ – భగవానుడు మనను తప్పక రక్షించుననే నమ్మకమే మనలను వర్ధిల్లజేయును. ఊరేగింపులో దేవుని ఉత్సవమూర్తి దర్శనము ఉద్దేశ్యం ఇదే.

శ్రీ భట్టులు ఇచ్చిన మరి రెండు వ్యాఖ్యలు –

తేషామ్ అస్తి ఇతి సన్తః. తన భక్తుల కొరకు అండగా ఉండేవాడు 'సన్తః'.

తేభ్య ఇష్టం దత్తవాన్ ఇతి సన్తః. తన భక్తులు కోరుకున్నవి ఇచ్చేవాడు 'సన్తః'

న తే రూపమ్ న చక్రో నాయుధాని న చాస్పదమ్

తథాఽపి పురుషాకారో భక్తానామ్ ప్రకాశసే – జితన్తే స్తోత్రము

నీ దివ్యాత్మ స్వరూపము, నీ దివ్యమంగళ విగ్రహము, నీ ఆయుధాలు, నీ వైకుంఠధామము – అన్నీ నీ కొరకు కాదు. నీ భక్తుల కొరకే (నీవు స్వతంత్రుడవు కావు). అయినా నీవు పరమాత్ముడవై భక్తుల కొరకు ప్రకాశిస్తున్నావు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సన్మార్గవర్తినః సన్తః, తద్రూపేణ విద్యా వినయ వృద్ధయే స ఏవ వర్తత ఇతి సన్తః.** సన్మార్గంలో చరించేవారు సన్తులు అనగా సజ్జనులు. విద్యా వినయాది గుణ సంపదల నభివృద్ధి పరచు సజ్జనులయందున్నవాడుటచేత 'సన్తః' అను శబ్దముచే ఆరాధ్యుడగుచున్నాడు. ఈ నామము బహువచనాంతముగా నిర్దేశింపబడినది. సజ్జన సమాజము కూడ భగవంతుడే (శ్రీ పెమ్మరాజు రాజారావు).

శ్రీ సత్యసంధ తీర్థ – తను - విస్తారే. **సంపూర్ణత్వాత్ తనోతేః వ్యాప్తః.** అంతటా ఉండి, అన్నింటా వ్యాపించినవాడు 'సన్తః'.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – సన్ - సంభక్తౌ - పూజించుట. **సన్యతే ఆరాధ్యతే స్మ ఇతి సన్తః.** ఎవరినైతే ఆరాధిస్తారో, పూజిస్తారో అతడు 'సన్తః'.

శ్రీ వాసిష్ఠ – **సమ్యక్ తనోతి విస్తారయతి జగత్ ఇతి సన్తః.** జగత్తును చక్కగా (క్రమ విధానంలో) విస్తరింపజేయువాడు 'సన్తః'.

930. జీవనః

- మొసలి శాపమును తొలగించి తిరిగి గంధర్వునిగా జీవింపజేసినవాడు.
- ప్రాణరూపంలో ఉండి సకల జీవులను బ్రతికిస్తున్నవాడు.

ఓం జీవనాయ నమః

జీవన్ - ప్రాణ ధారణే - బ్రతుకుట. **జీవయతి - ప్రాణయతి జీవన ఉపయోగ సాధనైః ఇతి జీవనః.** జీవించడానికి అవుసరమైన సాధనములను సమకూర్చి జీవుల జీవనమును నిలిపేవాడు జీవనుడు.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమోళి 2.2.9 – రక్షించుట అనేది భగవంతుని లక్షణము. ప్రళయకాలంలో సమస్తమునూ కబళించడం ఎందుకంటే వారికి పునఃసృష్టిలో క్రొత్త శరీరములు ఇచ్చి రక్షించడం కోసము.

శిథిలమైన శరీరములు బదులు క్రొత్త శరీరం ఇవ్వడం కోసమే ఆయన మృత్యువును కలిగిస్తున్నాడు. భగవానుని సృష్టి, స్థితి, లయ కార్యములన్నీ రక్షణ కొరకే.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **స్వహస్తేన హననాత్ గ్రాహమసి గంధర్వత్వేన జీవయన్ - జీవనః.** భగవంతునిచేత మరణించిన మొసలికి శాపవిమోచనం కలిగి గంధర్వరూపం తిరిగివచ్చింది. ఇలా పునర్జీవనమును ప్రసాదించినవాడు 'జీవనః'. ఇందుకు శ్రీ భట్టులు విష్ణుపురాణము (69)నుండి ఉదాహరించారు.

స హి దేవల శాపేన హూహూః గంధర్వసత్తమః

గ్రాహత్వమ్ అగమత్ కృష్ణాత్ వధమ్ ప్రాప్య దివంగతః

దేవలుడు అనే ఋషి శాపంవలన హూహూ అనే గంధర్వుడు మొసలిగా అయినాడు. శ్రీకృష్ణుని చేత మరణించిన ఆ మొసలి తిరిగి గంధర్వునిగా మారినది.

శ్రీ పోతన భాగవతము

జననాథ! దేవలశాప విముక్తుఁడై పటుతర గ్రాహరూపంబు మాని
ఘనుఁడు హూహూనామ గంధర్వుఁ డప్పుడు తన తొంటి నిర్మలతనువుఁ దాల్చి
హరికి నవ్యయునకు నతిభక్తితో మ్రొక్కి తవిలి కీర్తించి గీతములు వాడి
యా దేవు కృప నొంది యందంద మఱియును వినతశిరస్కుఁడై వేడ్కతోడ

దళితపాపుఁ డగుచుఁ దనలోకమున కేఁగె నపుడు శౌరి కేల నంటఁ దడవ
హస్తిలోకనాథుఁ డజ్ఞానరహితుఁడై విష్ణురూపుఁ డగుచు వెలుఁగుచుండె.

శ్రీ బలదేవ విద్యాభూషణ కూడా ఇదే అర్థం చెప్పారు. **గ్రాహమపి గంధర్వత్వేన జీవతి ఇతి జీవనః.**

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సర్వాః ప్రజాః ప్రాణరూపేణ జీవయతి ఇతి జీవనః.** ప్రాణముల రూపంలో ఉండి శ్రీమన్నారాయణుడే సకల జీవులను జీవింపజేస్తున్నాడు గనుక జీవనుడు.

శ్రీ చిన్మయానంద 'సకల జీవులలోనూ ప్రధాన చైతన్య రూపము' అని చెబుతూ గీత (15.13)నుండి ఉదాహరించారు.

గామావిశ్య చ భూతాని ధారయామ్యహమ్ ఓజసా

పుష్ణామి చౌషధీః సర్వాః సోమో భూత్వా రసాత్మకః

పృథ్వియందు ప్రవేశించి, నేను నా శక్తిద్వారా సకల భూతములను ధరించి, పోషించుచున్నాను. రసస్వరూపుడనై, అనగా అమృతమయుడైన చంద్రుడనై ఓషధులకు, అనగా వనస్పతులకు అన్నింటికిని పుష్టి చేకూర్చుచున్నాను.

931. పర్యవస్థితః

- ప్రక్కన నిలిచియున్నవాడు. గజేంద్రునిచుట్టూ తిరిగి లాలించినవాడు.

- విశ్వమంతా వ్యాపించియున్నవాడు.

ఓం పర్యవస్థితాయ నమః

పరి (ప్రత్యయము) - చుట్టూరా, సమీపంలో. స్థ - గతి నివృత్తౌ - నిలుచుండుట, వేచియుండుట.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **వాత్సల్యాత్ గజేంద్రమ్ పరి - పరితః అవస్థితః ఇతి పర్యవస్థితః.** భగవానుడు వాత్సల్యంతో గజేంద్రుని దగ్గర ఉండి, అతనిని చుట్టుముట్టి యున్నాడు. భగవానుని భక్తవాత్సల్యత విష్ణుధర్మంలో '**ప్రీతిమాన్ పుండరీకాక్షః శరణాగతవత్సలః**' అని చెప్పబడిందని శ్రీ ట్టులు ఉదాహరించారు.

వాత్సల్యాద్యో గజేంద్రంతు పరితో వసనాచ్చ సః

పర్యవస్థితః అఖ్యాతో వస్వర్ణో హ్యమితప్రదః

గజేంద్రునిపట్ల ప్రేమాతిశయములతో ఉండబట్టలేక అతనికి అన్నివైపుల నిలిచి లాలించినవాడు. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. అమిత ఫలాన్నిస్తుంది. ఓం పర్యవస్థితాయ నమః. (శ్రీకైవల్య సారధి).

శ్రీ పోతన భాగవతము

కరమున మెల్లన నివురుచు

గర మనురాగమున మెఱసి కలయం బడుచుం

గరి హరికతమున బ్రతుకుచు

గర పీడన మాచరించె గరిణుల మరలన్.

భక్తులంటే భగవానునకెంత ప్రేమయో ఆళ్వారులు అనేక సందర్భాలలో వర్ణించారు. (తిరువైమోళి 10.10.1, 8.3.6, 1.9 వంటివి) నారాయణుడు ఎంతో ప్రేమతోను, ఇష్టంతోను తన భక్తులలో కలిసిపోతాడు. ఆయన చల్లని నీలమణి దేహంతో భక్తుల మనస్సులను ఆక్రమించి అక్కడే తిష్ట వేస్తాడు. క్రమంగా భక్తుల సర్వేంద్రియాలనూ తన స్వాధీనంలోకి తెచ్చుకుంటాడు.

శ్రీ కృష్ణన్ – గజేంద్రునికి ఎక్కడెక్కడ గాయాలున్నాయో తెలుసుకోవడానికి భగవంతుడు గజేంద్రుని చుట్టూ తిరిగాడు. కనుక ఆయన పర్యవస్థితుడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **వాత్సల్య భరేణ గజేంద్రస్య పరితః స్థితవాత్ పర్యవస్థితః.**

పై వ్యాఖ్యలు ప్రధానంగా భగవానుని భక్తవత్సలతను చెబుతున్నాయి. శ్రీ కృష్ణదత్త భరద్వాజ భక్తుల క్షేమంపట్ల భగవానునకున్న ఆతురతను ప్రధానంగా వ్యాఖ్యానించారు. **పరితో భక్తమ్ అవస్థితః తస్య రక్షాయై**

ఇతి పర్యవస్థితః. భక్తులను రక్షించడంకోసం సదా వారిని చుట్టియుండేవాడు పర్యవస్థితుడు. ఇందుకు శ్రీ భరద్వాజ భాగవతం (1.12.9,10) నుండి ఉదాహరించారు. తల్లిగర్భంలో ఉండగానే పరీక్షిత్తును బ్రహ్మాస్త్రంనుండి భగవంతుడు కాపాడాడు.

క్షతజాక్షమ్ గదాపాణిమ్ ఆత్మనః సర్వతో దిశమ్

పరిభ్రమన్తమ్ ఉల్కాభామ్ భ్రామయన్తమ్ గదాముహుః

అస్త్రతేజః స్వగదయా నీహారమివ గోపతి

విధమన్తమ్ సన్నికర్షే పర్యైక్షత క ఇత్యాసౌ

భగవానుడు క్రోధారుణ నేత్రుడై గదను చేతబట్టి, ఉత్తర గర్భంలోని శిశువు చుట్టూ సుడిగాలిలా తిరుగుతున్నాడు. ఆయన చేత గదాయుధము ప్రజ్వలిస్తూ, మంచును సూర్యకిరణాలు హరించినట్లుగా, బ్రహ్మాస్త్రముయొక్క తేజస్సును హరిస్తున్నది. ఈ పురుషుడెవరు? ఒక్కమారు తన ప్రక్కకు ఎక్కడినుండి వచ్చాడని ఆ శిశువు ఆశ్చర్యముతో పరీక్షించెను.

శ్రీ పోతన భాగవతము – ఉత్తర గర్భాన్ని రక్షించిన శ్రీకృష్ణుని కుంతి ఇలా స్తుతించింది.

శ్రీకృష్ణా! యదుభూషణా! నరసఖా! శృంగార రత్నాకరా!
లోకద్రోహి నరేంద్రవంశ దహనా! లోకేశ్వరా! దేవతా
నీక బ్రాహ్మణ గోగణార్తిహరణా! నిర్వాణ సంధాయకా!
నీకున్ మ్రొక్కెద ద్రుంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ!

శ్రీ శంకరుల వ్యాఖ్య – **పరితః సర్వతో విశ్వమ్ వ్యాప్య ఇతి పర్యవస్థితః.** విశ్వమంతా వ్యాపించియుండేవాడు పర్యవస్థితుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి నారాయణసూక్తమునుండి ఉదాహరించారు. నారాయణుడు అంతటా లోపల, బయట కూడ వ్యాపించియున్నాడు. **అంతర్బహిశ్చ తత్సర్వమ్ వ్యాప్య నారాయణః స్థితః.**

శ్రీ వాసిష్ఠ కూడా ఇదే అర్థం చెప్పారు. **పరితః - సర్వత ఊర్ధ్వ, అధః, తిర్యక్ చ అవస్థితః ఇతి పర్యవస్థితః.**

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

అనంతరూపోऽనంతశ్రీర్జితమన్యుర్భయాపహః |

చతురశ్రో గభీరాత్మా విదిశో వ్యాదిశో దిశః || (100)

932. అనన్తరూపః

- అనంతములైన (లెక్క లేనన్ని) రూపములు ధరించువాడు.

- అంతము లేని (క్షయించని, నాశనము లేని) రూపము గలవాడు.

- వర్ణింపనలవిగాని, అన్ని దిశలా అంతు లేకుండా వ్యాపించిన రూపము గలవాడు.

ఓం అనన్తరూపాయ నమః

ఈ నామమును మూడు విధములుగా వివరింపవచ్చును.

(1) తన అనేక అవతారములు మరియు వ్యూహములు మరియు విభవములు ద్వారా లెక్కలేనన్ని రూపములు గలవాడు.

(2) వర్ణింప వీలుగాని, సమస్త దిశలందు అంతులేకుండా వ్యాపించిన రూపము గలవాడు. ఇది భగవానుని విశ్వరూపమును సూచించును.

(3) అంతము లేని, అనగా ఎన్నడూ క్షీణించని, నశించని, ఏ విధమైన మార్పులు లేని శాశ్వతమైన రూపము గలవాడు.

అనంతాని రూపాని యస్య సః అనంతరూపః. అనంతమైన రూపములు గలవాడు అనంతరూపుడు.

భగవానుని అనేక అవతారములగురించి ఆయనయే గీత (4.8)లో చెప్పాడు.

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్

ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే

సత్పురుషులను పరిరక్షించుటకును, దుష్టులను రూపు మాపుటకును, ధర్మమును సుస్థిరమొనర్చుటకును నేను ప్రతియుగమునందును అవతరించుచుందును.

ఇక్కడ భగవదవతారములకు మూడు కారణములు చెప్పినాగాని, వానిలో 'భక్తులను రక్షించుట' ముఖ్య కారణము. మిగిలిన రెండు కారణాలు తద్వారా సంభవించేవి. గజేంద్ర రక్షణార్థం ఆయన దర్శనమిచ్చిన రూపం ఆయన అనంతరూపాలలో ఒక్కటి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **ఈదృశీ సద్యః సంపాద్యాని అనంతాని రూపాణి అస్య ఇతి అనంతరూపః.** సంకల్పానుసారం, అవసరాన్నిబట్టి, నేరుగా ఈ విధంగా అనంతములైన రూపములు ధరించినవాడు అనంతరూపుడు.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమోళి 1.3.2 – అవసరాన్నిబట్టి భగవానుడు సరళమైన అనేక రూపములలో అవతరించాడు. ఈ అవతారాలలో ఆయన సమస్త కళ్యాణగుణ సంపన్నుడు. భక్తులకు మోక్షానుభవాన్ని ఇచ్చువాడు. ఆయా రూపాలలో భక్తులకు అందివచ్చినవాడు మరియు తన భక్తుల శత్రువులకు అందరానివాడు. అవతార ప్రయోజనం కొరకు ఆయన చేప, పంది, అర్ధమృగము (నరసింహము) – ఇలా ఏ రూపాన్నైనా ధరిస్తాడు.

తిరువైమోళి 2.5.6 – క్షీరసాగరంలో ఆదిశేషునిపై శయనించిన స్వామి అన్నివిధాలా అనంతసంపన్నుడు. ఆయనను అలంకరించిన దివ్యాభరణాలకు అంతులేదు. ఆయన నామములు అనంతములు. కొన్ని ఆయన శౌర్యమును, కొన్ని ఇతర కళ్యాణగుణములను సూచించును. ఆయన దివ్యప్రకాశ రూపములు పర, వ్యూహాది రూపములకంటె భిన్నమైనవి మరియు అనంతమైనవి. గాన, ధ్యాన, దర్శన, శ్రవణాది అనేక మాధ్యముల ద్వారా ఆయనను అనుభవించవచ్చును. అనంతునిపై శయనించిన ఆయన రూపాది సకల కళ్యాణగుణములలోను అనంతుడే.

శ్రీ కృష్ణన్ – భగవానుడు పర, వ్యూహ, విభవ, అర్చావతారములలో అనంతరూపములు కలిగియున్నాడు. రామ, కృష్ణాది విభవావతారములు, అనేకములైన అర్చావతారములు, అనేకములైన అంతర్యామి రూపములు, ఇలా అన్నీ భక్తుల రక్షణకు ఉద్దేశించినవే.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **అనంతాని రూపాణి అస్య విశ్వప్రపంచ రూపేణ స్థితస్య ఇతి అనంతరూపః.** ఈ నామరూపాత్మకమైన అనంత విశ్వమంతా ఆ అనంతుని రూపములే గనుక ఆయన అనంతరూపుడు అను శబ్దమున వాచ్యుడగుచున్నాడు (శ్రీ పెమ్మరాజు రాజారావు).

శ్రీ కృష్ణదత్త రద్వాజ – **అనంతమ్ శాశ్వతమ్ రూపమ్ అస్య ఇతి అనంతరూపః.** ఆయన రూపములు అంతులేనివి మాత్రమే కాదు. శాశ్వతములైనవి కూడాను. అనగా వానికి క్షయము లేదు. కాలముతో

అంతరించవు. మరియు ప్రత్యేక లక్ష్యము కొరకు సంభవించిన (రామ, కృష్ణాది) విభవావతారములు కూడా మనకు శాశ్వతముగా అనుభవింప వీలు కలిగినవి.

శ్రీ సత్యసంధ తీర్థ కూడా 'అనంత' అనగా 'శాశ్వత' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. **అ-నాశాని రూపాణి యస్య స అనంతరూపః.** నాశనము లేని రూపములు కలిగినవాడు అనంతరూపుడు.

శ్రీ రాధాకృష్ణ శాస్త్రి – భగవానుని రూపము అన్నిదిశలా, అన్నియెడలా అంతము లేనిది. ఇది ఆయన విశ్వరూపమును సూచించును.

కైవల్యోపనిషత్తు – **అచింత్యమ్ అవ్యక్తమ్ అనంతరూపమ్**. మనసుకు అందనిది, మాటలకు అందనిది, అన్నియెడలా అంతము లేనిది.

ఋగ్వేదము 10.81.3, యజుర్వేదము 17.19 –

విశ్వతశ్చక్షురుత విశ్వతోముఖో విశ్వతో బాహురుత విశ్వతస్పాత్
సం-బాహుభ్యాంధమతి సంపతత్రైర్ద్యావా భూమీ జనయన్ దేవేకః
అన్నియెడలా కన్నులు కలిగినవాడు, అన్నియెడలా ముఖములు (నోళ్ళు), కాళ్ళు, చేతులు కలిగినవాడు ఒక్కడే దేవుడు. ఆయనే తన చేతులతో భూమ్యాకాశములను సృష్టించి నిలిపియుంచుచున్నాడు.

అనేక బాహూదరవక్త్రనేత్రమ్ పశ్యామి త్వాం సర్వతోఽనంతరూపమ్
నాంతం న మధ్యం న పునస్తవాదిం పశ్యామి విశ్వేశ విశ్వరూప – గీత 11.16
ఓ విశ్వేశ్వర! విశ్వరూప! నీ బాహువులు, ఉదరములు, ముఖములు, నేత్రములు అసంఖ్యాకములు. నీ అనంతరూపము సర్వతోముఖముగ విలసిల్లుచున్నది. నీవు ఆదిమధ్యాంతరహితుడవు. మహత్వపూర్ణమైన నీ దివ్యరూపమునకు ఆదిమధ్యాంతములను తెలిసికొనలేకున్నాను.

933. అనన్తశ్రీః

- అనంతమైన (లెక్కలేనన్ని) ఐశ్వర్య విభూతులు (సంపద, యశస్సు, శక్తి వంటివి) కలవాడు.
- ఎన్నడూ తరుగని ఐశ్వర్య విభూతులు కలవాడు.

ఓం అనన్తశ్రియే నమః.

శ్రీమద్ శ్రీముష్ణమ్ ఆండవన్ – **అనంతాః శ్రియః యస్య సః అనంతశ్రీః.** అంతులేని, లెక్క లేని ఐశ్వర్యము కలవాడు 'అనంతశ్రీ'. ఈ సంపదలతో ఆయన ఏమి చేస్తాడు? భక్తులు కోరినవన్నీ ఇస్తాడు, ఆఖరుకు తనను తానే భక్తులకు ప్రసాదిస్తాడు. గజేంద్రుని ఉదంతంలో ఆయన మొసలికి శాపవిమోచనం కలిగించి గంధర్వునిగా

స్వర్గాన్నిచ్చాడు. గజేంద్రునికి శ్రీవైకుంఠప్రాప్తిని కలుగజేశాడు. ఇలా అందరికీ ఇవ్వడానికున్న అంతులేని సంపద 'అనంతశ్రీ' నామములో చెప్పబడింది.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **తేభ్యో దేయాః స్వ-ప్రాప్తి-పర్యంతః అనంతాః శ్రియోఽపి అస్య ఇతి అనంతశ్రీః.** భక్తులకు ఇవ్వడానికి, చివరకు తనను తానే ఇచ్చేయడానికి అంతులేని 'శ్రీ'లు కలవాడు అనంతశ్రీ. ఇందుకు శ్రీ భట్టులు విష్ణుధర్మము (69)నుండి ఉదాహరించారు. **తతో దివ్య వపోర్భూత్వా హస్తిరాత్ పరమం పదమ్ జగామ.** అప్పుడు దివ్య శరీరము ధరించి గజేంద్రుడు పరమపదమునకేగెను.

దేయాః స్వప్రాప్తి పర్యంతాః శ్రియోఽనంతాశ్చ నిత్యశః
ప్రసన్నేభ్యో యస్య సంతి సోఽనంతశ్రీరితిస్మృతః.
తన భక్తులకు ఇవ్వడం కోసం అనంతమైన సంపదలు కలవాడు. భక్తులకు తనను తాను సమర్పించుకోవడానికి కూడాసిద్ధపడేవాడు (శ్రీకైవల్య సారధి).

శ్రీ వి.వి. రామానుజన్ – భగవంతుని విభూతులు రెండు విధములు. ప్రాపంచికములైనవి లీలా విభూతులు. శ్రీవైకుంఠములోనివి నిత్యవిభూతులు. ఇవి రెండూ కూడా కేవలం భక్తుల కొరకే. భగవంతుడు సుసంపన్నుడైన మహాపురుషుడు (సెల్వార్ పెరియార్), అని శ్రీ ఆండాళ్ నాచియార్ తిరుమోళి (10.10)లో వర్ణించింది. సంపదలో పెరిగిన పిల్లవాడని శ్రీకృష్ణుని శ్రీ పెరియాళ్వారు వర్ణించారు (2.8.8).

శ్రీ తిరుమంగయాళ్వారు. పెరియతిరుమొళి 7.7.1 – సిరిసంపదలకు దేవతయైన లక్ష్మికి ఐశ్వర్యమెవరు? సకల దేవతలకు దేవుడైనవాడే.

కః శ్రీః శ్రియః పరమసత్త్వ సమాశ్రయః
కః పుండరీక నయనః పురుషోత్తమః కః
కస్యాయౌతాయుట శత ఏక కలాంశక అంశే విశ్వమ్
విచిత్ర చితచిత్ ప్రవిభాగవృత్తమ్ – శ్రీ ఆళవందార్. స్తోత్తరరత్నము 12
లక్ష్మీదేవికే 'శ్రీ' అయిన దేవుడెవ్వరు? పరమ సత్వగుణమునకు మూర్తీభవించిన స్వరూపమెవ్వడు? సకల పురుషులకు పరమపురుషుడైన దేవుడెవ్వడు? ఆ పద్మములవంటి కనులు కలిగిన దేవుని శక్తిలో కించిన్మాత్రము చేతనే చేతనాచేతనామయమైన ఈ సకల విశ్వముయొక్క సృష్టి, పాలన, లయము జరుగుచున్నవి (ఆ దేవుడు శ్రీమన్నారాయణుడే).

శ్రీ శకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు 'శ్రీ' అనగా 'శక్తి' అన్న అర్థంలో వ్యాఖ్యానించారు. **అనంత - అపరిమిత, శ్రీః - పరాశక్తిః అస్య ఇతి అనంతశ్రీః.** పరిమితులు లేని పరాశక్తులకు నిలయమైనవాడు అనంతశ్రీ. ఇందుకు

శ్రీ శంకరులు శ్రుతినుండి ఉదాహరించారు. **పరా అస్య శక్తి వివిధైశ్చ శ్రూయతే** (శ్వేతాశ్వరోపనిషత్తు 6.8). ఆయన పరాశక్తి వివిధములుగా చెప్పబడును.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ 'అనంత' అనగా 'నాశనము లేని' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. **అనంతా - అవినాశినీ శ్రీః - శోభా సంపత్ యస్య ఇతి అనంతశ్రీః.** శాశ్వతమైన సంపద, సౌందర్యము కలవాడు అనంతశ్రీ.

శ్రీ సత్యసంధ తీర్థ కూడా ఇదే అర్థం చెప్పారు. **అనంతా - నాశరహితా, శ్రీః అవరూపశ్రీః యస్య స అనంతశ్రీః.**

శ్రీ చిన్మయానంద – శక్తి మూడు విధములు. ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి. ఈ శక్తులన్నీ భగవానునినుండి ఉద్భవించును.

934. జితమన్యుః

కోపమును జయించినవాడు.

ఓం జితమన్యవే నమః

జీ - జయే, అభిభవేచ - జయించుట. మన్ - జ్ఞానే - తెలిసికొనుట, ఆలోచించుట. ఉణాది సూత్రము (3.20) ప్రకారము 'మన్'కు 'యుచ్' ప్రత్యయము చేరిస్తే 'మన్యుః' వస్తుంది. దాని అర్థం కోపము, కష్టము, త్యాగము. 'జితామన్యుః' అనగా కోపమును జయించినవాడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు గజేంద్రమోక్షము వృత్తాంతము పరంగా వ్యాఖ్యను కొనసాగించారు. తనపట్ల శరణాగతుడైన గజేంద్రుని పట్టి బాధిస్తున్న మొసలివంటి జలకీటకం పట్ల ఆయనకు కోపం లేదు. కనుకనే మొసలిని ఇంకా శపించకుండా శాపవిమోచనం కలిగించాడు.

గజేంద్ర ద్వేషిణో యే చ కీటకాద్యాః జలవాసినః
యస్తేషు మన్యం జితవాన్ జితమన్యుః స కథ్యతే

ఆ మడుగులో ఉన్న గజేంద్రునియందు ద్వేషంతో ఉన్న మొసలి మొదలైన కీటకములపై కోపమును జయించినవాడు జితమన్యుడు (శ్రీకైవల్య సారధి).

భగవంతుని జితమన్యతకు మరొక దృష్టాంతము భృగుమహర్షి వృత్తాంతము. భృగువు తన వక్షస్థలంపై తన్నినా గాని భగవానుడు కోపం ధరించకుండా భృగువు పట్ల వినయంతో ప్రవర్తించి, పాదసేవ చేసి, అలా భృగువుయొక్క అహంకారాన్ని అణచివేశాడు.

కోపమును అదుపులో పెట్టులొనకపోతే ఏమవుతుందో భగవానుడు గీత (2.62, 63)లో చెప్పాడు –

ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూపజాయతే

సంగాత్ సంజాయతే కామః కామాత్ క్రోధోऽభిజాయతే.

విషయచింతన చేయు పురుషునకు ఆ విషయములందు ఆసక్తి ఏర్పడును. ఆసక్తివలన ఆ విషయములను పొందుటకై కోరికలు కలుగును. ఆ కోరికలు తీరనప్పుడు క్రోధము కలుగును.

క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతివిభ్రమః

స్మృతిభ్రంశాత్ బుద్ధినాశో బుద్ధినాశాత్ ప్రణస్యతి

అట్టి క్రోధము వలన వ్యామోహము కలుగును. దాని ప్రభావమున స్మృతి ఛిన్నాభిన్నమగును. స్మృతి భ్రష్టము అయినందున బుద్ధి అనగా జ్ఞానశక్తి నశించును. బుద్ధినాశము వలన మనుష్యుడు తన స్థితినుండి పతనమగును.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – కొన్నిమార్లు భగవానుడు కోపమును ధరించును. ఇది కేవలం అపరాధులను శిక్షించడానికి ఒక ఆయుధం మాత్రమే. ఆ కోపము భగవంతుని బుద్ధిని ఏమాత్రం ప్రభావితం చేయదు. సాగరాన్ని దాటే ఉపాయం తెలుపమని శ్రీరాముడు సముద్రం వడ్డున దీక్షలో కూర్చున్నాడు. సాగరునినుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో రాముడు కోపగించి సాగరంపై బాణాన్ని ఎక్కుపెట్టాడు.
మరొక వృత్తాంతము . యుద్ధంలో రాముడు హనుమంతుని భుజాలపై కూర్చుని యుద్ధం చేస్తున్నాడు. రావణుని బాణాలు హనుమంతుని తీవ్రంగా గాయపరచాయి. రక్తసిక్తమైన హనుమ దేహాన్ని చూసి రాముడు 'కోపమా, నన్నావహించు' అన కోపము పూనాడు. నిజానికి కోపం ఎప్పుడూ భగవంతుని అధీనంలో ఉంటుంది. దుష్టులను శిక్షించడానికి, భక్తులను రక్షించడానికి భగవంతుడు కోపాన్ని ధరిస్తాడు.

వినమ్య ధనుర్భీమమ్ తూణ్యోశ్చోధృత్యసాయకాన్

క్రోధమాహారయత్ తీవ్రమ్ వధార్థమ్ సర్వరక్షసామ్ – రామాయణం 3.24.33

రాక్షసులనందరినీ వధించడం కోసం రాముడు తన గొప్ప ధనుస్సు వంచి, బాణాన్ని ఎక్కుపెట్టి, క్రోధాన్ని ధరించాడు.

49వ శ్లోకములోని 463వ నామము '**జితక్రోధః**' కూడా ఇంచుమించు ఇదే అర్థాన్ని కలిగిఉంది. మన్యు, కోపము, క్రోధము అనే ఈ మూడు పదాలమధ్య ఉన్న స్వల్ప వ్యత్యాసాన్ని శ్రీ శాస్త్రి వివరించారు. 'మన్యు' అనగా బయటకు కనిపించని కోపం మనస్సులోనే ఇమిడి ఉంటుంది. 'కోపం' అనగా కనులు ఎర్రబడడం వంటి ముఖలక్షణాలు కనిపిస్తాయి. 'క్రోధం' అనగా కోపాన్ని తెలిపే మాటలు, చేతలు వెలివడుతాయి. భగవానుడు అవుసరార్థం ఈ మూడు దశలలోని ఏదో ఒక కోపాన్ని పూనుతాడు కాని అది ఎప్పుడూ ఆయన అధీనంలోనే ఉంటుంది. కనుక ఆయన 'జితామన్యుః'.

463వ నామము 'జితాక్రోధః' ను శ్రీ భట్టులు 'ఇతరులలోని క్రోధాన్ని జయించినవాడు' అని వ్యాఖ్యానించారు. ('తన క్రోధాన్ని జయించినవాడు' అని కాదు). మోహిని రూపంలో అసురులకు అమృతం అందకుండా చేసినపుడు ఆ రాక్షసులు కోపగించడం బదులుగా ఆమె అందాన్ని చూసి సమ్మోహితులయ్యారు.

తిరుమల వసంతోత్సవంలో శ్రీ సీతారామ లక్ష్మణులు మరియు హనుమంతుడు. వికిపీడియా చిత్రాలు.

రావణ వధ అనంతరము రాముడు విభీషణుని పిలిచి రావణుని దహనసంస్కారాలు చేయమని చెప్పాడు. రావణుని మరణంతో అతనితో వైరం అంతరించిందట.

మరణాంతాని వైర్యాణి నివృత్తమ్ నః ప్రయోజనమ్
క్రియతామ్ అస్య సంస్కారో మమాప్యేష యథా తవ

యుద్ధకాండ 59.147 – **కోపస్య వాసామ్ ఏ ఇవాన్.** రాముడు తీవ్రమైన కోపాన్ని ధరించి రావణునిపై భీకరంగా యుద్ధం చేశాడు. అలసిపోయిన రావణుని చూసి, సేదదీరి మరునాడు రమ్మని పంపేశాడు.

తస్మాత్ పరిశ్రాంత ఇవ వ్యవస్య న త్వామ్ శరైర్మృత్యువశమ్ నయామీ – 59.153
గచ్ఛానుజానామి రణార్ది తస్త్వం ప్రవిశ్య రాత్రించర రాజా లంకామ్
అస్వాస్య నిర్యాహి రథీ చ ధన్వీ తదా బలం ద్రక్ష్యసి మే రథస్తః – 59.154

శ్రీ వాసిష్ఠ – మనకంటె బలవంతులు శక్తివంతులు అయినవారితో వైరం ఉంటే కోపం వస్తుంది. భగవంతునికంటే బలవంతులెవరూ లేరు. కనుక ఆయనకు కోపం వచ్చే పరిస్థితి లేదు.

935. భయాపహః

- (సంసార) భయమును తొలగించేవాడు.

ఓం భయాపహాయ నమః

భయ - భయము. అపహన్ - చంపుట, నాశనము చేయుట ("హ"). భయ అపహః - భయమును నాశనము చేయువాడు. పాణిని సూత్రము (3.2.49) 'ఆశీషి హనః' ప్రకారము 'డ' ప్రత్యయము చేరినపుడు 'ఆశీర్వపూరకముగా నాశనము చేయుట' అనే అర్థం వస్తుంది (అతడు మన భయమును హరించుగాక).

హ - చంపుట, నాశనము చేయుట ('హన్' నుండి). పాణిని సూత్రము (3.2.50) 'అపె క్లేశ తమసో' ప్రకారము 'హన్' తరువాత 'డ' ప్రత్యయము వస్తే, మరియు ముందుగా 'అప్' వస్తే, 'క్లేశాపహః' అనే అర్థం వస్తుంది. 'భయాపహః' అంటే భయమును, బాధను, చీకటిని తొలగించేవాడు అని అర్థము.

89వ శ్లోకము, 838వ నామము '**భయనాశనః**' కూడా ఇలాంటి అర్థాన్నే కలిగివుంది.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **అస్మాదాదీనామపి స్వ-వాత్సల్యేన తాదృశ అనాథత్వ భయమ్ వధ్యాత్ ఇతి ఆశంసనర్థః.** ఆయన వాత్సల్యము కారణంగా దిక్కు లేదనుకొనే అనాథలు కూడా భగవంతుడు తమను కాపాడునని విశ్వసింపవచ్చును. శ్రీ భట్టులు ఉదాహరించినది – **భయేమహతి మగ్నాన్చ త్రాతి నిత్యమ్ జనార్దనః.** గొప్ప (సంసార) భయంలో మునిగి ఉన్నవారిని జనార్దనుడు రక్షించును.

అనాథత్వ భయం హన్తి వాత్సల్యేన మాదృశామ్
భయాపహ స్సమాఖ్యాతః వస్వర్ణో మనురుత్తమః
అనాథలకు కూడా అమితమైన వాత్సల్యంతో తానే దిక్కై నిలిచి, భయాన్ని పోగొట్టేవాడు. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. శ్రేష్టమైనది. ఓం భయాపహాయ నమః (శ్రీకైవల్య సారధి).

భగవంతుని రక్షణయందు మహావిశ్వాసము కలిగి ఉండవలెనని ఈ నామము బోధించుచున్నది.

శ్రీ పెరియాళ్వారు. తిరుమొళి 4.4.9 – శ్రీ నరసింహదేవుని మనం (రక్షణ కొరకు) నమ్ముకొనవచ్చును.
శ్రీ పెరియాళ్వారు. 5.1.9 – భక్తులను రక్షించడానికి ఆయనను నమ్ముకుంటే చాలును. ఆయన చక్రం చేతబట్టి వచ్చి గజేంద్రుని రక్షించాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **భయమ్ సంసారజమ్ పుంసామ్ అపఘ్నమ్ భయాపహః.** తన భక్తులకు సంసార భయమును నాశనము చేయువాడు 'భయాపహః'.

89వ శ్లోకంలోని 'భయనాశనః' నామమునకు శ్రీ శంకరుల వ్యాఖ్య – ధర్మమార్గంలో చరించేవారికి భయం లేకుండా చేసేవాడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – ఏదైనా సమస్య ఎదురైనపుడు భయం కలుగుతుంది. చాలామార్లు ఆ సమస్యకంటే భయంయొక్క తీవ్రత, ప్రభావం ఎక్కువగా ఉంటాయి. భగవానుని నమ్ముకున్నవారికి భయం ఉండదు. నిజమైన భక్తుడు సుఖదుఃఖాలను ఒకేవిధంగా చూస్తాడు.
గీత 2.38 – **సుఖ దుఃఖ సమే కృత్వా.**
గీత 2.56 – **దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగత స్పృహః.**

శ్రీ కృష్ణన్ – భగవంతుడు గజేంద్రుని భయాన్ని మాత్రమే పోగొట్టలేదు. మొసలికి శాపభయాన్ని పోగొట్టాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ 'భయావహః' అనే పాఠాన్ని గ్రహించారు. కాని ఆయన చెప్పిన అర్థం మాత్రం 'భయాపహః' అన్న నామము అర్థానికి సరిపోతుంది. (అవహన్ - పోగొట్టుట, పడగొట్టుట.)

936. చతురశ్రః

- అన్ని విషయములలోను నైపుణ్యము (చాతుర్యము) కలవాడు.
- అందరిపట్ల సమన్యాయము కలవాడు. వారి వారి కర్మానుసారము ఫలములు ప్రసాదించువాడు.
- ఎవరినైతే కోర్కెలు కోరుతామో అతడు.
- నాలుగు దిశలందు వ్యాపించినవాడు.
- జ్ఞానులైనవారిచే అర్చింపబడువాడు.

ఓం చతురశ్రాయ నమః

చతుర - నాలుగు సంఖ్య. అశ్ర, అశ్రి - మూల, కోణము. చతురశ్రము అనగా రేఖాగణితములో చతురస్రము. ఇందులో అన్ని భుజములు, కోణములు సమానముగా నుండును. కనుక 'చతురశ్రుడు' అనగా అందరి పట్ల సమన్యాయము కలవాడు అని కొందరి వ్యాఖ్య. 'చతుర' అనగా నిపుణత (చాతుర్యము) కల్గిన అనే అర్థం కూడా ఉంది. 'చతురశ్రః' అనగా అన్నింటి యందును నైపుణ్యము కలిగిన అని కొందరు వివరించారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – 'చతురశ్రః' అనగా అన్ని విధముల చాతుర్యము కలవాడు అన్న అర్థంలో శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. యుక్తములైన పనులు చేసినవాడు చతురుడు.

శ్రీమద్ ఆండవన్ వివరణ – భగవానుడు అన్ని సందర్భములలోను భక్తులను ఉద్ధరించడానికి యుక్తమైన అన్ని పనులు చేస్తాడు. గజేంద్ర మోక్షము సందర్భములో ఆయన మొసలిని శాపం బారినుంచి విముక్తుని చేశాడు. గజేంద్రుడు త్రుంచిన పూవును భగవత్కైంకర్యము చేసే అవకాశం కలిగించి సత్ఫలము ప్రసాదించాడు. భక్తులు మొరపెట్టుకుంటే తాను రయమున వచ్చి వారిని కాపాడుతానని నిరూపించాడు. తాను వైకుంఠమునుండే మొసలిని శిక్షించగలడు కాని ఆయన అలా చేయలేదు. ఉన్నపళంగా వైకుంఠంనుండి ఒక్కమారు గజరాజు, మొసలి ఉన్న సరస్సువద్దకు వచ్చాడు. ఆభరణాలన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయి. **గర్జతే గజాయ జగామ.** మరియు ఆయన క్షుద్రజలకీటకమైన మొసలిపై క్రోధాన్ని తెచ్చిపెట్టుకున్నాడు. ఇవన్నీ ఆయన భక్తవాత్సల్యతకు, భక్తులను రక్షించే గుణానికి యుక్తమైనవి.

శ్రీ వేళుక్కుడి కృష్ణన్ భగవానుని 'చాతుర్యం' గురించి చెబుతూ రామాయణంలోని వాలి వధ సంఘటనను ఉదాహరించారు. ముందుగా వాలి రాముని అధర్మపరుడని తూలనాడాడు. కాని రాముని వివరణ విన్న తరువాత శ్రీరాముని ధర్మగుణాన్ని కీర్తించాడు. భగవానుని చాతుర్యమునకు ఇది మరొక ఉదాహరణ.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **న్యాయ సమవేతః చతురశ్రః.** అందరియందును సమానముగా వర్తించువాడు. జీవులకు వారవారి కర్మానుసారముగా ఫలములను ప్రసాదించువాడు. కనుక అలంకారికముగా 'చతురశ్ర' అని కీర్తింపబడును.

శ్రీ అనంతకృష్ణశాస్త్రి 'చతుర' అనగా 'నాలుగు' అన్న అర్థంలో భగవానుని నాలుగు విధాల రక్షణను చెప్పారు.

- ధర్మార్థకామమోక్షములనే పురుషార్థములను జీవులకు వారి కర్మానుసారము ప్రసాదించువాడు.
- ఆహవనీయము, గార్హపత్యము, దక్షిణము మరియు (నాల్గవది?) అనే నాలుగు విధాలైన యాగాగ్నుల రూపంలో ఉన్నవాడు.
- గర్భమునుండి, అండమునుండి, స్వేదమునుండి, భూమినుండి – ఇలా నాలుగు విధములుగా జన్మించే జీవుల మనుగడకు ఆధారమైనవాడు.
- ఆర్తులు, జిజ్ఞాసులు, అర్థార్థులు, జ్ఞానులు అనే నాలుగు విధములైన భక్తులను రక్షించేవాడు.
- నాలుగు వేదముల శిరస్సులు (ఉపనిషత్తులు) ద్వారా తెలియవచ్చేవాడు.
- ఆయన ఆజ్ఞ జగత్తులో నాలుగు దిశలందు పాలింపబడుతుంది.

శ్రీ వాసిష్ఠ – చద్ - యాచనే - అడుగుట. 'చద్'కు 'ఉరన్' అనే ప్రత్యయం చేరిస్తే ఉణాదిసూత్రము (5.58) 'చతేరురన్' ప్రకారం 'చతుర్' అనే పదం వస్తుంది. **చతతి చత్యతే వా ఇతి చతుర్.** ఏదైనా అడిగేవాడు లేదా ఆయనను మనం ఏమైనా కోరుతాము.

శ్రీ వాసిష్ఠ చెప్పిన మరో రెండు అర్థాలు –
అశ్ - వ్యాప్తౌ సంఘాతే చ - వ్యాపించుట, ప్రోగుపడుట. అశ్ - భోజనే - తినుట.

చతస్రో దిశో అశ్నుతే చతురశ్రః. నాలుగు దిశలందు వ్యాపించినవాడు చతురశ్రుడు.
చతసృషు దిక్షు స్థితానామ్ ప్రాణినామ్ భోజనస్య దాతా ఇతి విష్ణుః. నాలుగు దిశలలో ఉన్న జీవులకు ఆహారమును ప్రసాదించు విష్ణువే చతురశ్రుడు.

శ్రీకృష్ణదత్త భరద్వాజ – **చతుర్భిః శ్రీయతే - సేవ్యతే ఇతి చతురశ్రః.** ఆయన గొప్పతనము నెరిగినవారు ఆయనను పూజింతురు గనుక ఆయన చతురశ్రుడు.

937. గభీరాత్మా

- గంభీరమైన స్వభావము కలవాడు.
- అన్నింటి ప్రాప్తికి, చలనమునకు కారణమైనవాడు.

ఓం గభీరాత్మనే నమః

ఉణాది సూత్రము 4.35 గభీర గంభీరౌ. గమ్ - గతౌ - వెళ్ళుట. 'గమ్'కు 'ఇరన్' ప్రతయయము చేర్చినపుడు 'మ్' శబ్దము 'భ్' శబ్దముగా మారుతుంది. అలా 'గభీర' పదం వస్తుంది. 'గభీర', 'గంభీర' పదాల అర్థం ఒకటే. అమరకోంలో 'నిమ్నమ్ గంభీరమ్' అని ఉంది. 'గభీరాత్మా' లో 'ఆత్మ' అంటే స్వరూపము లేదా స్వభావము.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **అన్యేషామ్ చతుర్ముఖ ముఖానామప్రధృష్య గాంభీర్యః గభీరాత్మా.** బ్రహ్మాదులకు కూడా తెలియరాని గంభీరమైన (లోతైన) స్వభావము కలవాడు గభీరాత్మ.

ధాత్రాదీనా మప్రధృష్యం గాంభీర్యం యస్య విద్యతే
గభీరాత్మా స విజ్ఞేయః పస్తార్ణో మనురుత్తమః
బ్రహ్మాదులకు కూడా నిర్ణయించలేని గాంభీర్యము కలవాడు. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. శ్రేష్ఠమైనది. ఓం గభీరాత్మనే నమః. (శ్రీ కైవల్యసారధి).

శ్రీమద్ శ్రీముష్ణమ్ ఆండవన్ – ఆయన స్వభావము ఎంత లోతైనదంటే దానిని ఎవరూ కల్లోలపరచలేరు.

శ్రీ కృష్ణన్ – శ్రీపాద తీర్థము (గంగ)ను శిరస్సుపై ధరించిన శివుడు, జ్ఞానులలో ఉత్తముడైన బ్రహ్మ కూడా చిరకాలం తపస్సు చెసినా ఆయన నిజస్వరూపమును, స్వభావమును తెలిసికొనలేరు.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమోళి 1.1.8 – బ్రహ్మకు తను సృష్టించినవాని గురించి తెలుసు కాని తనకంటె ముందువాని గురించి తెలియదు.

తిరువైమోలి 7.71 – బ్రహ్మ, శివుడు, ఇంద్రుడు వంటివారిని మనం సామాన్యమైన నేత్రాలతో చూడలేము. అలాగే వారు కూడా నా కృష్ణభగవానుని చూడలేరు.

నాన్ముగమ్ తిరువన్ 73 – ప్రళయసమయంలో జగత్తును మ్రింగివేసి, సృష్టిసమయంలో వానిని వెలిగ్రక్కిన ఎంపెరుమాన్ గంభీరతను మనం అర్థంచేసుకొనలేము. ఎనిమిది కళ్ళ (నాల్గు ముఖాల) బ్రహ్మకు, నీలకంఠుడైన శివునికి కూడా కూడా ఆయనను అందుకొనే సులభమార్గం (చరమశ్లోకం) తెలియదు.

సముద్ర ఇవ గాంభీర్యే – అని శ్రీరాముని వాల్మీకి మహర్షి వర్ణించాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **ఆత్మా స్వరూపమ్ చిత్తమ్ వా గభీరమ్ పరిచ్ఛేత్తుమశక్యమ్ అస్య ఇతి గభీరాత్మా.** ఎవని నిజస్వరూపము, చిత్తము అందరానంత గంభీరమో అతడు గభీరాత్మ. ఆయన సాగరమువలె మహా గంభీరుడు. ఆయన నెవ్వరూ కల్లోలపరచలేరు. విశ్వమంతా వ్యాపించియున్న ఆయన వైశిష్ట్యము, వైభవము, గంభీరతలను ఎవరూ మనసుతో ఊహింపలేరు. మాటలలో చెప్పలేరు.

శ్రీ వాసిష్ఠ – గమ్ - గతౌ - వెళ్ళుట. **గచ్ఛతి గమ్యతే - ప్రాప్యతే అనేన.** ఆయన కారణంగా సమస్తము ప్రాప్తించును. **గచ్ఛతి - ప్రాప్నువన్తి, ధ్యాయన్తి, ప్రార్థయన్తే వా స గభీరః.** అందరూ ఎవరిని పొందడానికి ధ్యానము, ప్రార్థన చేస్తారో ఆయన గభీరుడు.

గచ్ఛతి గమనశీలః. అన్నింటిలోను చలనము కలిగించేవాడు గభీరాత్మ. ఆయన స్థావరములైన వృక్షాదులయందు కూడ మరణము, క్షీణత వంటి ప్రక్రియలద్వారా చలనము కలిగించేవాడు.

938. విదిశః

- అనంతములైన ఆయన తత్వము, రూపములు, గుణములు అన్ని దిశలందును వ్యాపించియున్నవి.
- అన్ని దిశలనుండి ఆయన అందివచ్చును.
- విశేష దాతృత్వము కలవాడు. యోగ్యతలనుబట్టి ఫలములను ప్రసాదించువాడు.
- (విద్ - తెలియుట) జ్ఞానులకు ఆనంద కారణము.
- శాస్త్రములను వివరముగా తెలియజేసినవాడు.
- అంతటా, అన్నింటా, అన్నిదిశలా వ్యాపించియున్నవాడు.

ఓం విదిశాయ నమః

ఈ నామము 'విదిశః', మరియు తరువాతి రెండు నామములు 'వ్యాదిశః', 'దిశః'లు 'దిశ్' అనే ధాతువును కలిగియున్నవి. 'దిశ్' అంటే దిక్కు, ఆజ్ఞ, దానము, సమర్పణ వంటి అర్థాలున్నాయి. 'వి' అనే ఉపసర్గకు 'వివిధ' అని అర్థం వస్తుంది. దిశ్ - అతిసర్జనే - దానమిచ్చుట, అంగీకరించుట.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **తేషమ్ వినయ గద్గద స్తుతి గిరామ్ అస్య దూరే వివిధా దిశాః దేసాః ఇతి విదిశః.** ఆయన మాటలకు, దేనికీ అందనివాడు. ఆయన తత్వము, స్వరూపము, గుణములు అన్నీ అనంతములై అన్నియెడల వ్యాపించియున్నవి. ఆయన కళ్యాణగుణములన్నీ ఆయనను స్తుతించే దేవతలకు కూడా తెలియవు.

వినయాద్గద్గద స్తోత్ర ధాత్రీనామ్ విశేషః

దూరేశ్య వివిధా దేశాః విదిశః పరికీర్తితః

వినయంతో, తత్పరతతో, గద్గద స్తోత్రంతో ఆయనను స్తుతించే బ్రహ్మాదులకు కూడా అగోచరుడు 'విదిశః'. (శ్రీకైవల్య సారధి).

పెరియ తిరుమొళి 1.7.8 – చతుర్ముఖుడైన బ్రహ్మ మరియు శివుడు తమ నాలుకలు అరిగిపోయేలా ఆయనను స్తుతిస్తారు. (ఆయినా ఆయన వారికి తన దర్శనమివ్వడు. కాని ప్రహ్లాదునివంటి భక్తుల ఎదుట ప్రత్యక్షమవుతాడు).

తిరువైమోళి 2.7.12 – అనేక యుగాలలో సృష్టింపబడిన బ్రహ్మ శివాదులు దామోదరుని శరీరములే. వారికి కూడా ఆయన సంపూర్ణ మహత్యము తెలియదు. కాని అవుసరమైనపుడు అలాంటి దేవదేవుడు వారిని రక్షిస్తాడు. గజేంద్రుని ఆర్తనాదం విని పరుగున వచ్చి కాపాడాడు.

శ్రీమద్ శ్రీముష్ణమ్ ఆండవన్ – **వివిధాః దిశాదేశః యస్య స విదిశః.** ఎక్కడెక్కడినుండైనా, ఏ దిక్కునుండైనా భగవానుని పిలిచి ఆయనను పొందవచ్చును.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **వివిధాని ఫలాని అధికారిభ్యో విశేషేణ దిశతి ఇతి విదిశః.** (దిశ్ - అతిసర్జనే - ప్రసాదించుట). విశేష దాతృత్వము కలవాడు. వివిధ ఫలములకు అధికారము (యోగ్యత) కలవారికి వారి వారి కర్మానుసారము ఫలములనిచ్చేవాడు 'విదిశః'.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ కూడా ఇదే అర్థం చెప్పారు. **విశేషేణ దిశతి - దదాతి భక్తేభ్యః అభీష్టమ్ ఇతి విదిశః.** భక్తుల అభీష్టములను విశేషంగా సిద్ధింపజేసేవాడు 'విదిశః'. శ్రీ చిన్మయానంద కూడా ఇదే అర్థం చెప్పారు.

శ్రీ వాసిష్ఠ – భగవానుడు అంతటా అన్నిదిశలా అన్నింటా వ్యాపించియున్నాడని, ఆయన లేని చోటు లేదని ఈ నామము సూచించును.

శ్రీ సత్యసంధ తీర్థ – (విది-శః) విద్ - తెలియుట. శమ్ - సుఖమ్. విదిశీ – జ్ఞానిని, **శమ్ - సుఖమ్ యస్మాత్ స విదిశః.** (బ్రహ్మ) జ్ఞానము తెలిసినవారి ఆనందమునకు కారణము 'విదిశః'.

శ్రీ రఘునాధ తీర్థ – **వి - అతిశయేన దిశతి - ఉపదిశతి ఇతి విదిశః. అతిశయేన యజ్ఞక్రియా ప్రకారాన్ ఉపదిశతి ఇతి విదిశః.** చక్కగా యజ్ఞ యాగాది కార్యములను తెలియజేయు (ఉపదేశించు)వాడు 'విదిశః'. ఈ అర్థమును శాస్త్రముల జ్ఞానమునకు కూడ అన్వయించవచ్చును. శాస్తములను, విధులను చక్కగా తెలియజేసినవాడు 'విదిశః'.

939. వ్యాదిశః

- వివిధ దేవతలను ఆయా పదవులలో నియమించినవాడు.
- భక్తులకు వారి కర్మానుసారము తగు ఫలములనిచ్చువాడు.
- ఇంద్రాది దేవతలకును తగు ఆదేశములిచ్చువాడు.

ఓం వ్యాదిశాయ నమః

వ్యాదిశ్ - పంచుట, నియమించుట, ఆజ్ఞాపించుట. ఆదేశ - ఆదేశము. ఈ రెండు శబ్దములపైనను ఈ నామమును వివరించారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **తేషామ్ అభిమతమ్ తత్తత్ పదమ్ అతిసృజతి ఇతి వ్యాదిశః.** వారిని (అనగా బ్రహ్మ, రుద్రాదులను, ఇంతకుముందు నామములో చెప్పినట్లు) ఆయా పదములయందు తగు స్థాయిని కల్పించువాడు 'వ్యాదిశః'.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమోళి 5.2.8 – జనులు వారి వారి అభిరుచుల ప్రకారం పూజించుకునేందుకు వీలుగా భగవంతుడు తన శరీరంనుండి అన్యదేవతలను సృజించాడు. వారికి యథోచిత పదవులు కల్పించాడు. భక్తులు ఆయా దేవతలకు సమర్పించినవి కూడా కడకు ఆయనకే చేరతాయి.

శ్రీమద్ శ్రీముష్ణమ్ ఆండవన్ – **విశేషేణ ఆదిశతి ఇతి వ్యాదిశః.** వివిధ దేవతలకు తగు ఆదేశములు, ఫలములు కూర్చువాడు 'వ్యాదిశః'.

శ్రీ కృష్ణన్ – భగవానుడు ఒకే కార్యంలో అందరికీ తగు ఫలములు ఎలా ప్రసాదిస్తాడో చెబుతూ శ్రీ కృష్ణన్ గజేంద్రమోక్షమునుండి, వామనావతారమునుండి ఉదాహరించారు. (శ్రీ భట్టుల వ్యాఖ్యను శ్రీ కృష్ణన్ కొంత భిన్నంగా వివరించారు.) **తత్తత్ అభిమత దేశమ్ సృజతి ఇతి వ్యాదిశః.** తన భక్తులు కోరిన కోర్కెలు వారి అభిమతముల ప్రకారము తీర్చేవాడు 'వ్యాదిశః'.

గజేంద్రమోక్షంలో గజేంద్రునికి భగవత్కైంకర్య భాగ్యం లభించింది. తాను తెంచిన పూవును శ్రీమహావిష్ణువు పాదములవద్ద సమర్పించగలిగాడు. మొసలికి శాపంనుండి విముక్తి లభించింది. భగవానుడు భక్తజన సంరక్షకుడనే విషయం స్పష్టంగా ప్రకటితమైనది. మరియు వృత్తాంతమును విన్నా గాని, స్మరించినా గాని

మనకు పాపములు తొలగి, కష్టములు తొలగి, శుభములు చేకూరుతాయి. అలా అందరికీ వారి వారి అభిమతములు సిద్ధించాయి.

ఇక వామనావతారంలో భగవానుడు అదితి కోర్కెను, ఇంద్రుని కోర్కెను తీర్చి సంతోషించాడు. ఇంద్రునికి రాజ్యం లభించింది. శ్రీమహావిష్ణువుకు దానమిచ్చిన భాగ్యం బలికి దక్కింది. సమస్త లోకములకు శ్రీనివాసుని పదములను పూజించే అవకాశం ఒనగూడింది (బ్రహ్మ కడిగిన పాదము, బ్రహ్మము తానైన పాదము). ఈ వృత్తాంతమును తనివితీరా గానం చేసే భాగ్యం ఆళ్వారులకు లభించింది. ఆయన సకల జగత్పతి అని శాస్త్రములో చెప్పిన విషయం నిరూపణమయ్యింది.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – దిశ్ - అతిసర్జనే - ఇచ్చుట, దానము చేయుట. **వివిధమ్ ఆసమంతాథ్ దిశతి - దదాతి ఇతి వ్యాదిశః.** అన్ని దిశల భక్తులకు అనేక ఫలములు కూర్చిఆడు 'వ్యాదిశః'.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **వివిధామ్ ఆజ్ఞామ్ శక్రాదీనామ్ కుర్వన్ వ్యాదిశః.** ఇంద్రాది సమస్త దేవతలను ఘనముగా శాసించి వారి వారి కర్తవ్యములను సక్రమముగా నిర్వర్తింపజేయువాడు వ్యాదిశః.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **విశేషేణ ఆదిశతి - ఆజ్ఞాపయతి ఇతి వ్యాదిశః.** విశేషముగా ఆజ్ఞాపించువాడు 'వ్యాదిశః'. ఇక్కడ 'విశేషముగా' అనగా ఆయన జగత్ప్రభువు గనుక ఆయన ఆజ్ఞకు తిరుగు లేదు. అది అందరి ఆజ్ఞలవంటిది కాదు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **వివిధాన్ అధికారాన్ తస్య ఆదిశతి - ఆజ్ఞాపయతి అధికారిణి తస్మిన్ ఏవమ్ ఏవ ఉచితమితి భవః.** తగు విధముగా వివిధ దేవతలను ఆజ్ఞాపించువాడు 'వ్యాదిశః'.

శ్రీ చిన్మయానంద – భగవంతుని ఆజ్ఞలు అందరి ఆజ్ఞలవంటివి కావు. ప్రాకృతిక శక్తులు, దేవతలు, దేవుళ్ళు అందరూ ఆయన ఆజ్ఞానుసారము వర్తిస్తారు.

940. దిశః

- (బ్రహ్మాది దేవతలను తమ తమ కార్యములయందు) ఆజ్ఞాపించువాడు.
- వేదముల రూపములో సమస్త వైదిక కర్మల ఫలములను ఇచ్చువాడు. యుక్తాయుక్తములను తెలియజేయువాడు.

ఓం దిశాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – బ్రహ్మాది దేవతలను తమ తమ స్థానములు, విధుల గురించి ఆజ్ఞాపించువాడు దిశ. ఇక్కడ శ్రీ భట్టులు 'దిశ్' అనగా 'ఆజ్ఞ' అనే అర్థాన్ని వాడారు. న **తాన్ గజేంద్రత్వాత్ అంతరంగీ కరోతి, కిన్తు**

ఆజ్ఞాపయతితి దిశః. భగవంతుడు గజేంద్రునివంటి ప్రపన్నులను వాత్సల్యంతో తన అంతరంగికులుగా చేసుకుంటాడు. కాని బ్రహ్మాది దేవతలకు తగు స్థానములనిచ్చి వారిని ఆజ్ఞాపిస్తాడు కనుక ఆయన దిశ.

ధాత్రాదీన్ సర్వకృత్యేషు స్వాజ్ఞావయతి యస్సదా
దిశస్సతు సమాఖ్యాతః సప్తార్ణో మనురుత్తమ

బ్రహ్మాదులకు అర్హమైన స్థానాలిచ్చి, వారిని తన ఆజ్ఞానువర్తులుగా చేయువాడు దిశ. ఈ నామము సప్తాక్షరి. ఉత్తమమైనది. ఓం దిశాయ నమః. గజేంద్రుని మోక్షము చూసి ఇంద్రాది దేవతలంతా బ్రహ్మను ముందు నిలబెట్టి శ్రీమన్నారాయణునికి నమస్కరించారు. తమకు కూడా మోక్షాన్ని ప్రసాదిస్తాడేమో? అని వారి ఆశ. కాని వారికి మోక్షమివ్వలేదు. (శ్రీ కైవల్య సారధి).

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సమస్తానామ్ కర్మణామ్ ఫలాని వేదాత్మనా దిశః.** ఈ వ్యాఖ్యను అనువాదకులు రెండు రకాలుగా వివరించారు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – (దిశ్ - చూపుట) భగవానుడు వేదముల రూపములో ఏది మంచి, ఏది చెడువంటి విషయాలను తెలియజేయును గనుక దిశ.

శ్రీ టి.ఎస్. కృష్ణమూర్తి – (దిశ్ - అతిసర్జనే - ఇచ్చుట, దానము చేయుట) వేదముల రూపములో భగవంతుడు వివిధ కర్మల ఫలములను ప్రసాదించును.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **దిశతి - దదాతి కర్మఫలమ్ ఇతి దిశః.** కర్మఫలములను ఇచ్చువాడు దిశ.

శ్రీ చిన్మయానంద – నారాయణుడు శ్రుతుల రూపంలో ఆత్మజ్ఞానమును ప్రసాదించును. జ్ఞానము నిచ్చువాడు దిశ.

శ్రీ రఘునాథ తీర్థ – **దిశ్యతే - భక్తైః పృచ్ఛయతేతి దిశః.** భక్తులు ఆయనను గురించి తెలుసుకోవాలని అడుగుతుంటారు గనుక ఆయన దిశ.

938, 939, 940 నామములు **విదిశః, వ్యాదిశః, దిశః** – ఈ మూడు నామములు ఒకే ధాతువు ఆధారంగా వివరింపబడినాయి. అయితే వాటిలో పునరుక్తి లేకుండా వ్యాఖ్యాతలు ఎలా వ్యాఖ్యానించారో పరిశీలిస్తే ఆసక్తికరంగా ఉంటుంది.

<u>శ్రీ భట్టుల వ్యాఖ్యలు</u>

విదిశః – భగవంతుని తత్వము, స్వరూపములు, గుణములు అన్ని దిక్కులందు వ్యాపించియున్నవి (దిశ - దిక్కు).

వ్యాదిశః – భగవంతుడు వివిధ దేవతలను వివిధ పదములయందు నియమించెను (వ్యాదిశ్ - నియమించుట).

దిశః – భగవంతుడు సమస్త దేవతలను ఆజ్ఞాపించును (దిశ్ - ఆజ్ఞాపించుట).

శ్రీ శంకరుల వ్యాఖ్యలు

విదిశః – కర్మానుసారము జీవులకు తగు ఫలములు ఇచ్చువాడు (దిశతి - దదాతి. దిశ్ - దానము).

వ్యాదిశః – ఇంద్రాదులకు వారి విధుల ప్రకారము ఆదేశములు ఇచ్చువాడు.

దిశః – వైదిక కర్మలకు తగు ఫలములిచ్చు వేదస్వరూపుడు.

శ్రీ సత్యసంధ తీర్థ వ్యాఖ్యలు

విదిశః – బ్రహ్మ జ్ఞానులకు పరమానందమును ఇచ్చువాడు (విద్ - తెలియుట, జ్ఞానుల గురించి).

వ్యాదిశః – విశేషమైన ఆదేశములు ఇచ్చువాడు (అంతా ఆయన ఆజ్ఞానువర్తులే).

దిశః – ధర్మమును గురించిన జ్ఞానమును దృష్టాంతముల ద్వారా తెలియజేయువాడు (**ధర్మజ్ఞాన అతిదేశనాత్ దిశః**).

శ్రీ సత్యదేవో వాసిష్ఠ వ్యాఖ్యలు

విదిశః – అంతటా, అన్నిటా, అన్ని దిక్కులా వ్యాపించినవాడు.

వ్యాదిశః – అన్నియెడలా వివిధ ఫలములను ఇచ్చువాడు.

దిశః – వేదోక్తులద్వారా మంచి చెడులను ఉపదేశించినవాడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

శ్రీ మేప్పత్తూర్ నారాయణ భట్టాత్రి ప్రణీత

శ్రీమన్నారాయణీయమ్

21వ సర్గ – జంబూద్వీపాదులలో భగవదారాధన

మూల వ్యాఖ్యాత: శ్రీ స్వామి తపస్యానంద

అనుసృజన: శ్రీ తాడేపల్లి పతంజలి

(శ్రీరామకృష్ణమఠం, మైలాపూర్, చెన్నై ప్రచురణ)

మధ్యేద్భవే భువ ఇలావృతనామ్ని వర్షే
గౌరీప్రధాన-వనితాజన-మాత్రభాజి
శర్వేణ మంత్రనుతిభిః సముపాస్యమానం
సంకర్షణాత్మక-మధీశ్వర సంశ్రయే త్వామ్ (1)

భూమండలానికి మధ్యన ఇలావృతమనే ప్రాంతం ఉంది. ఆ ప్రాంతంలో గౌరీదేవి నాయకురాలిగా స్త్రీలు మాత్రమే నివసిస్తూ ఉంటారు. అక్కడ వెలసిన శివుడు (అర్ధ నారీశ్వరుడు) నిన్ను వేదమంత్రాల, స్తోత్రాలతో సేవిస్తున్నాడు. అట్టి నీ సంకర్షణ రూపాన్ని నేను ఆశ్రయిస్తాను.

భద్రాశ్వనామక ఇలావృతపూర్వవర్షే
భద్రశ్రవోభిః ఋషిభిః పరిణూయమానమ్
కల్పాన్తగూఢ-నిగమోద్ధరణ-ప్రవీణం
ధ్యాయామి దేవ హయశీర్షతనుం భవన్తమ్ (2)

ఇలావృతానికి తూర్పున భద్రాశ్వమనే వర్షం (భూఖండం) ఉంది. అక్కడ భద్రశ్రవసులు అనే ఋషులు జలప్రళయంలో (కల్పాంతంలో) మునిగిన వేదరాశిని ఉద్ధరించిన హయగ్రీవరూపంలోని నిన్ను విశేషంగా స్తుతిస్తూ ఉంటారు. అట్టి హయగ్రీవరూపాన్ని నేను ధ్యానిస్తున్నాను.

ధ్యాయామి దక్షిణగతే హరివర్షవర్షే
ప్రహ్లాదముఖ్య పురుషైః పరిషేవ్యమాణమ్
ఉత్తుంగశాన్త-ధవలాకృతి-మేకశుద్ధ-
జ్ఞానప్రదం నరహరిం భగవన్ భవన్తమ్ (3)

ఓ భగవాన్! ఇలావృతానికి దక్షిణాన హరివర్షమనే ప్రాంతం ఉంది. ప్రహ్లాదుడు మొదలైన మహాపురుషులు సేవించే శాంతప్రవృత్తితో, తెల్లని రంగులో, శుద్ధజ్ఞానాన్ని ప్రసాదించే నీ నరసింహాకృతి అక్కడ వెలసి ఉంది. అట్టి నీ రూపాన్ని నేను ధ్యానిస్తున్నాను.

వర్షే ప్రతీచి లలితాత్మని కేతుమూలే
లీలావిశేష-లలితాస్మిత శోభనాంగమ్
లక్ష్మ్యా ప్రజాపతిసుతైశ్చ నిషేవ్యమాణం
తస్యాః ప్రియాయ ధృతకామతనుం భజే త్వామ్ (4)

ఇలావృతానికి పశ్చిమాన కేతుమాల అనే ప్రాంతం ఉంది. ఆ ప్రాంతంలో లీలావిలాస లలిత మందహాస రూపుడవైన నిన్ను లక్ష్మి, ప్రజాపతి పుత్రులు (బ్రహ్మ మానస పుత్రులైన సనక సనందనాదులు) సదా సేవిస్తూ ఉంటారు. మహాలక్ష్మి ప్రత్యర్థం మన్మథ స్వరూపం దాల్చిన నిన్ను, ఓ దేవా! నేను కూడా సేవిస్తాను.

రమ్యేऽప్యుదీచి ఖలు రమ్యకనామ్ని వర్షే
తద్వర్షనాథ-మనువర్య-సపర్యమాణమ్
భక్తైకవత్సల-మమత్సరహృత్సు భాన్తం
మత్స్యాకృతిం భువననాథ భజే భవన్తమ్ (5)

ఇలావృతానికి ఉత్తరప్రాంతానగల రమ్యకమనే ప్రదేశానికి అధిపతి వైవస్వతమనువు. అక్కడ నువ్వు మత్స్యరూపంలో కొలువై ఆ మనువు సేవలు అందుకొంటూ ఉంటావు. పరిశుద్ధుల హృదయాలలో ప్రకాశిస్తూ, భక్తులను అనుగ్రహిస్తున్న ఓ భువననాథా! నేను నిన్ను సదా సేవిస్తూంటాను.

వర్షం హిరణ్మయసమాహ్వయ-మౌత్తరాహ-
మాసీన-మద్రిధృతి-కర్మఠ-కామఠాంగమ్
సంసేవతే పితృగణప్రవరోऽర్యమా యం
తం త్వాం భజామి భగవన్ పరచిన్మయాత్మన్ (6)

ఆ రమ్యకానికి ఉత్తరభాగంలో హిరణ్మయమనే ప్రదేశంలో నువ్వు మందరపర్వతాన్ని అలవోకగా మోసిన కూర్మరూపం దాల్చి కొలువై ఉన్నావు. పితృగణాలలో ఉత్కృష్టుడైన ఆర్యముడు సదా సర్వవేళలా నిన్ను

అక్కడ కొలుచుచున్నాడు. విశుద్ధజ్ఞానస్వరూపుడవైన నిన్ను, ఓ భగవాన్, నేను కూడా ఆ రూపంలోని నిన్ను సేవిస్తాను.

కించోత్తరేషు కురుషు ప్రియయా ధరణ్యా
సంసేవితో మహితమన్త్ర-నుతిప్రభేదైః
దంష్ట్రాగ్రఘృష్ట-ఘనపృష్టగరిష్ఠవర్ష్మా
త్వం పాహి విజ్ఞనుత-యజ్ఞవరాహమూర్తే (7)

ఉత్తర కురుభూములలో నీ దేవియైన భూదేవి సేవిస్తూండగా, మహిమతో కూడుకొన్న మంత్రాలతో, వివిధ స్తుతులతో కొనియాడబడుతున్న నీ యజ్ఞవరాహ రూపపు దంష్ట్రాగ్రం మేఘాలను సైతం చూర్ణం చేయగల ఉన్నతమైనది. అటువంటి నీ రూపాన్ని సేవించే నన్ను పరిరక్షించు.

యామ్యాం దిశం భజతి కింపురుషాఖ్యవర్షే
సంసేవితో హనుమతా దృఢభక్తిభాజా
సీతాభిరామ-పరమాద్భుత-రూపశాలీ
రామాత్మకః-పరిలసన్ పరిపాహి విష్ణో (8)

ఓ విష్ణుమూర్తీ! దక్షిణ దిశలోనున్న కింపురుష సీమలో అద్భుతమైనదీ, సీతాదేవికి ప్రమోదం కలిగించేదీ అయిన శ్రీరాముని రూపంలో విరాజిల్లుతున్నావు. అక్కడ దృఢభక్తితో హనుమంతుడు నిన్ను సేవిస్తున్నాడు. అట్టి శ్రీరామ రూపు దాల్చిన నువ్వు నన్ను రక్షించు.

శ్రీనారదేన సహ భారతఖణ్డముఖ్యై-
స్త్వం సాంఖ్యయోగనుతిభిః సముపాస్యమానః
ఆకల్పకాలమిహ సాధుజనాభిరక్షీ
నారాయణో నరసఖః పరిపాహి భూమన్ (9)

ఓ ప్రభూ! భరతఖండంలో నువ్వు నరునకు సఖుడైన నారాయణునిగా అవతరించావు. అక్క సాధుజనాన్ని రక్షించడానికి కల్పాంతందాకా ఉంటావు. సాంఖ్యయోగతత్వ ప్రతిపాదకాలైన స్తోత్రాలతో నారదాది మహామునులు స్తుతిస్తూ నిన్ను సేవిస్తుంటారు. అట్టి నువ్వు నన్ను కాపాడు.

ప్లాక్షేऽర్కరూపమయి శాల్మల ఇందురూపం
ద్వీపే భజన్తి కుశనామని వహ్నిరూపమ్
క్రౌంచేऽమ్బురూపమథ వాయుమయం చ శాకే
త్వాం బ్రహ్మరూపమయి పుష్కరనామ్ని లోకా (10)

ఓ దేవా! ప్లక్షద్వీపంలో సూర్యుని రూపంలో, శాల్మలద్వీపంలో చంద్రుని రూపంలో, కుశద్వీపంలో అగ్నిరూపంలో, క్రౌంచద్వీపంలో జలరూపంలో, శాకద్వీపంలో వాయురూపంలో, పుష్కరద్వీపంలో బ్రహ్మరూపునిగా జనులు నిన్ను సేవిస్తూన్నారు.

సర్వైర్ధ్రువాదిభి-రుడుప్రకారై-ర్గ్రహైశ్చ
పుచ్ఛాదికేష్వవయవే-ష్వభికల్ప్యమానైః
త్వం శింశుమారవపుషా మహతాముపాస్యః
సన్ధ్యాసు రున్ధి నరకం మమ సిన్ధుశాయిన్ (11)

పాలసముద్రంలో పవళించిన దేవా! మహనీయులునిన్ను శింశుమారమనే గొప్ప చేపగా భావించి, ఆ శరీరంలోని అవయవాలందు అశ్వనీ మొలైన నక్షత్రాలను, మీనం మేషం ఇత్యాదులైన రాశులను, ధ్రువ మొదలైన మండలాలను, సూర్యాది గ్రహాలను కల్పించుకొని సదా త్రిసంధ్యలలో సేవిస్తూ, తరిస్తున్నారు. అట్టి నువ్వు నా నరకబాధలను తొలగించు,

పాతాలమూలభువి శేషతనుం భవన్తం
లోలైకకుణ్డలవిరాజి-సహస్రశీర్ష్ణమ్
నీలామ్బరం ధృతహలం భుజగాంగనాభి-
ర్జుష్టం భజే హర గదాన్ గురుగేహనాథ (12)

ఓ దేవా! గురువాయూరు పురాధీశా! పాతాళంలో నువ్వే అయిన ఆదిశేషుడు ప్రకాశిస్తున్నాడు. వేయి పడగలతో, ఒక కుండలంతో, నీలాంబరంతో, చేత నాగలి రూపంలోని ఆయుధంతో నాగకాంతలు సేవిస్తూండగా నువ్వు విరాజిల్లుతున్నావు. అట్టి నీ ఆదిశేషమూర్తిని నేనుకూడా సేవిస్తాను. నా రోగాలను బాపు!

శ్రీ మేప్పత్తూర్ నారాయణ భట్టాత్రి ప్రణీత **శ్రీమన్నారాయణీయమ్**
21వ సర్గ – జంబూద్వీపాదులలో భగవదారాధన

మూల వ్యాఖ్యాత: శ్రీ స్వామి తపస్యానంద. అనుసృజన: శ్రీ తాడేపల్లి పతంజలి
(శ్రీరామకృష్ణమఠం, మైలాపూర్, చెన్నై ప్రచురణ)

కాపీహక్కులు: శ్రీరామకృష్ణమఠం, చెన్నై